# ఆరతి సాయిబాబా

## (పదచ్ఛేద అన్వయ టీకా తాత్పర్య వ్యాఖ్యాన సహితం)




రచన

పీసపాటి రామమూర్తిశాస్త్రి

సహాయకులు

డా॥ ఓరుగంటి ప్రసాద్

# ఆరతి సాయిబాబా

(పదచ్ఛేద అన్వయ టీకా తాత్పర్య వ్యాఖ్యాన సహితం)

✤

ప్రథమ ముద్రణ
ఆక్టోబర్ 2025

✤

మూల్యం : నిష్ఠ – సబూరి

✤

ప్రతులకు :
"మన ద్వారకామాయి"
ఆకెళ్ళ కృష్ణ చైతన్య
1-67/13, శివ శంకర్ కాలనీ,
మీరుపేట్, హైదరాబాద్ 500097
తెలంగాణ రాష్ట్రం
Mob : 7893000288

✤

బుక్ మేకింగ్
అంకుష్ గ్రాఫిక్స్
ఫోన్: 9912929078

✤

ముద్రణ :
గాయత్రి గ్రాఫిక్స్
ఫోన్: 9849372314

# కృతజ్ఞతలు

1. సాయినాథునికి
2. శ్రీ పీసపాటి రామమూర్తి శాస్త్రి గారికి
3. నా శ్రీమతి అనంతలక్ష్మీ సత్యవతి గారికి
4. శ్రీ చిల్లర కృష్ణమూర్తి గారికి
5. శ్రీ హోరతుల భాను గారికి
6. చక్కగా డి.టి.పి చేసిన శ్రీమతి ప్రత్తి ప్రవీణ గారికి (7842912234)
7. శ్రీ ఆకెళ్ళ కృష్ణ చైతన్య గారికి (మన ద్వారకామాయి)

ఇట్లు
సాయి రేణువ
**డా॥ ఓరుగంటి ప్రసాద్**

ఆరతి సాయిబాబా

ఓం శ్రీ సాయినాథాయ నమః

# ఆరతి సాయిబాబా - 1

## ఉపోద్ఘాతం

'ఆరతి' లేక 'హారతి' అనే రెండు మాటలకూ ఒకే అర్ధం ఉంది. ఇవి రెండూ దైవ కార్యాల్లో చేసే మంగళ హారతికి సంబంధించినవే. సంస్కృత పదమైన ఆరాత్రికం అనేదాన్నే ఇవి సూచిస్తాయి. దీన్నే మహా నీరాజనం అని కూడా అంటారు. దీనికి వైదిక సంబంధమైన అగ్ని కార్యాలను తెల్పే యజ్ఞాలు మూలమని చెప్పవచ్చు.

ఆరతి అన్నది ఒక ప్రత్యేకమైన భావవ్యక్తీకరణ కార్యక్రమం. దీన్లో పరోపకారం, కృతజ్ఞత, ప్రార్ధన లేక కోరిక ఆధ్యాత్మిక ప్రేమ మొదలైన భావాలు వ్యక్తమవుతూ ఉంటాయి. అన్నింటి కంటె ఎక్కువ లాభాన్ని ఇచ్చేది ఆరతి అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆరతి జరుగుతున్నప్పుడు అంతరాత్మ పరమాత్మతో ఐక్యం కావడానికి మనకు తెలియకుండానే పునాది పడుతూ ఉంటుంది. ఇది ఒక ఆధ్యాత్మిక రహస్యం. దైవంతో మనిషి వేసుకునే ముడి అంటే బాగా అర్ధమవుతుంది. దీనివల్ల మనలో సహజంగా ఉండే అహంకారం అణుగుతూ ఉంటుంది. ఈ ఒదుగుదల ప్రక్రియ చేసే ఉపకారం అంతా ఇంతాకాదు. ఇది మనిషిని విధేయుడిగా తయారు చేస్తుంది. సమాజంలో మనిషికున్న అధికారంగాని పరపతిగాని, బలంకాని ఈ స్వభావం ముందు ఓడిపోవల్సిందే. ఇంకో ముఖ్యమైన ఉపకారం ఆరతి వల్ల చాటుగా మనకు కలిగేదేమిటంటే మనకు తెలియకుండానే ప్రాపంచిక విషయాలపట్ల, కోరికల పట్ల వ్యామోహం తగ్గడం, ఒక దీపం తాను వెలుగుతూ చీకట్లను పారద్రోలినట్లుగా, మనలో నిద్రాణంగా ఉన్న అప్రమత్తత అనబడే కాపలాదారు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి మనల్ని ప్రాపంచిక విషవలయంలో చిక్కుకోకుండా రక్షిస్తూ ఉంటాడు.

భారతీయ సంస్కృతి ఆరతి కార్యక్రమాన్ని ఒక్క భగవంతుడి విషయానికే కాకుండా, మనిషి మనుగడకు సంబంధించిన ప్రతి విషయానికీ వర్తించేటట్లు

చేసింది. మనుషులు ఉపయోగించే ప్రతి నూతన వస్తువుకూ ఆరితి ఇవ్వడం పరిపాటి అయిపోయింది. దానివల్ల దైవశక్తి ఆ వస్తువులో ప్రవేశించి శుభం కలిగేటట్లు చేస్తుందని వారి విశ్వాసం. అలాగే పాంచ భౌతికమైన శరీరాన్ని ప్రసాదించిన భూతశక్తులు ఆకాశం, వాయువు, అగ్ని, నీరు భూమికి కూడా ఆరతులు సమర్పించడం ఆచారంగా ఉంది.

ఈ ఆరతి సంస్కృతి గురించి చాలా విషయాలు శ్రీ సాయిలీలా పత్రిక (జూలై- ఆగస్టు 1996 నుండి, మే-జూన్ 1997)లో ప్రచురించబడ్డాయి.

ఆరతి పాటలు పదే పదే గట్టిగా పాడుతూ ఉండడం అన్నది ఉచ్ఛ్వాస నిశ్వాసాల కార్యక్రమం ఒకటే కాదు. జాగ్రత్తగా పరిశీలిస్తే అది చక్కటి ప్రాణాయామ ప్రక్రియను అలవాటు చేస్తుంది. ఉదాహరణకి పంచారతి పాడేటప్పుడు 'ఓ దేవా! మా హృదయాల్లో వెలుగుతున్న భక్తి అనే ప్రకాశం ద్వారా నీకు ఈ కాకడ ఆరతి సమర్పించుకుంటున్నాము. ఈ ఆరతి ద్వారా మా యొక్క పంచప్రాణాలను ఆహుతి చేస్తున్నాము. ఇంకా మా అహంకారాన్ని వత్తులుగా మార్చి ఆరతి సమర్పించుకుంటున్నాము అని అర్థం వస్తుంది. ఇది సిద్ధాంతపరంగా మంచి ఆలోచన అయినప్పటికీ, దీనిలో దాగివున్న రహస్యమైన పారిభాషిక విషయాన్ని హృదయస్థం చేసుకుని ఆచరిస్తే తప్ప ఫలితం సులువుగా దొరికేదికాదు. మరి శాస్త్రరీత్యా ఇదే సత్యమైతే సాంప్రదాయంలో ఇన్ని రకాల ఆరతి పాటలు జన బాహుళ్యంలో ఎలా చొచ్చుకుపోగలిగాయన్న ప్రశ్న ఉదయించ వచ్చు. అదీకాక భక్తతుకారం వంటి మహానుభావులు ప్రజలందరి అవుసరాలను దృష్టిలో పెట్టుకుని వీటిని రచించారు కాబట్టి ఆరతి పాటల ప్రక్రియ సులువుగా ఫలితాన్ని చూపెడుతుందని ఇంకొక వాదన కూడా ఉంది. ఈ వాదనకు ఆధారం కూడా వేదంలోనే చెప్పబడిందని అంటారు. ఇది వేదశాస్త్ర ప్రకారం చేసే స్వాధ్యాయం క్రిందకు వస్తుంది. ఎలాగంటే 'ప్రాణాగ్ని హోత్రం' అన్న యజ్ఞక్రియ ప్రతి మనిషిలోనూ అంతర్గతంగా జరుగుతూ ఉంటుంది. అయితే ఎడ తెగకుండా చేసే ఆరతి మూలంగా ఉచ్చారణ శబ్దం ప్రాణాగ్ని హోత్రంలో ఆహుతి అవుతూ ఉంటుంది. దీనికి తోడుగా అంతంలేని శ్వాసక్రియా పూర్వక విశేషం కూడా ఆ అగ్నిహోత్రంలోనే పడుతూ ఉంటుంది. ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పవల్సి వుంది. ఏ మనిషైనా మాట్లాడుతున్నంతసేపు

ఊపిరి తీసుకోలేడు. అప్పుడు ఏం జరుగుతోంది? ఊపిరి వాక్కులో కలిసిపోతోంది. అంటే, మనిషి తనకి తెలియకుండానే ఊపిరిని వాక్కు అనే క్రియకు త్యాగం చేస్తున్నాడని అర్థం. అలాగే ఊపిరి తీస్తున్నంతసేపూ మాట కూడా రాదు. ఇక్కడ వాక్కును శ్వాస క్రియకు త్యాగం చేస్తున్నాడని అర్థం. ఈ రెండు రకాల అర్పణలను ఎవరూ సాధారణంగా ఆపలేరు. నడుస్తున్నా, పడుకొని వున్నా ఈ త్యాగం జరుగుతూనే ఉంటుంది.

దీన్ని లోతుగా అర్థం చేసుకోగల్గితే ఇక యజ్ఞమనీ, హోమమనీ ప్రత్యేకంగా చేసేది ఏముంటుంది? అనిపిస్తుంది. కాని దీంట్లో ఒక రహస్యం ఇమిడి ఉంది. వైదిక యజ్ఞమూల స్వరూపాన్ని అర్థంచేసుకుని పదే పదే గుర్తుపెట్టుకుంటూ ఉంటే హవన క్రియల అంతరార్థం బోధపడుతుంది. దానివల్ల స్థూలంగా మానవజీవితంలో నిర్మాణాత్మకమైన కార్యాచరణ అమలుపరచే నేర్పరితనం లభిస్తుంది. కాబట్టి అటువంటి జ్ఞప్తి లోపించిన నాడు మన మాటలన్నీ ఉదాప్రయాసతో కూడిన ఊపిరులే అయిపోతాయి. దీన్నే సామెతగా బూడిదలో పోసిన పన్నీరని చెప్పుకుంటూ ఉంటారు. దీనిబట్టి అర్థమవుతున్నదేమిటంటే, మాట-ఊపిరి చర్యలను గమనిస్తూ ఉంటే సర్వసాధారణ మాటలు కాని చర్యలు కాని పవిత్ర యజ్ఞక్రియగా మారుతూ ఉంటుంది. అందువల్లనే వేదఘోష యాంత్రికంగా వల్లె వేసినా జ్ఞప్తిని బట్టి ఫలితం ప్రవాహ రూపంగా పొందుతూ ఉంటారు.

ఆరతి ఒక మాత రూపంలో కూడా ఆరాధింపబడుతూ ఉంటుంది. దుష్టశక్తులను తరమి కొట్టడం దాని ముఖ్య లక్షణం. వేదకాలం నుండీ ఈ ఆచారం అమలులో వుంది. మనిషిలో దాగివున్న అరిషడ్వర్గాలనే ఆరు శత్రువులు (కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు) శక్తిని నిర్వీర్యం చేస్తూ వుంటాయి. ఆరతి రూపంలో అగ్ని దేముడు బాహ్యంగానూ, అంతరంగంలోనూ ప్రభావం చూపే దుష్టశక్తుల్ని పోగొడతాడని నమ్ముతూ ఉంటారు. అంతేకాకుండా పూజా సమయంలో భక్తుల విన్నపాల్ని భగవంతుడికి చేరవేసే బాధ్యత కూడా అగ్నిదేముడే వహిస్తూ ఉంటాడు. అందుకే ఆరతిని కళ్ళకు అద్దుకుని అగ్నిదేముడికి కృతజ్ఞతా పూర్వక నమస్కారం చేస్తూవుంటారు. ఈ ఆరతి భక్తియోగంలో చాలా ప్రసిద్ధి పొందింది. నిజానికి ఇది ఒకప్పుడు ఒక సాధారణ ఆచారంగా ఉండేది.

కాలక్రమేణా భక్తితత్వం పరాకాష్టకు చేరుకోగానే ఇదే ఆచారం భక్తివేడుకగా రూపాంతరం చెంది, ఆధ్యాత్మికంగా బలం పుంజుకుని ఉప్పొంగిన పారవశ్యంతో ఐకమత్యం అనే భావనను గట్టి చేస్తోంది.

భక్తితత్వానికి చెందిన అధ్యయన విభాగంలోని పండితులందరూ ఆరతి సాంప్రదాయాన్ని ప్రముఖంగా తీర్చిదిద్దారు. దీని ద్వారా భక్తిపారవశ్యతలో కొంతసేపు తరించడమే వారి ప్రధాన ఉద్దేశ్యం అయివుంది. భక్తియోగాన్ని అనుష్టానంగా పెట్టుకున్న సాధకులు ఆధ్యాత్మికతలోని అద్వైత తత్త్వభాగాన్ని మధింపు చేస్తూ కూర్పోక, సాంప్రదాయక అలవాట్లను పటిష్టం చేసుకుంటూ ముఖ్యంగా కులమత ప్రసక్తి తగలనటువంటి విధానాల్ని పాటించడం అందరికీ మంచిదన్న నిశ్చియానికి వచ్చారు. దాన్లో భాగంగానే ఆరతి ప్రముఖపాత్ర వహించింది. ఇది వేద సాంప్రదాయాన్ని అమలు చేస్తున్నట్లే ఉంటుంది. ఇంకా వ్యక్తిగతంగా ఎవరి ఇళ్ళల్లో వాళ్లు ఆనందంగా ఆచరించవచ్చు. మధ్యవర్తులు గాని, పురోహితులు గాని ఉండాలి అన్న ఆవశ్యకత ఏమీ వుండదు. ఇంకోపద్ధతి గూడ చాలా సులువుగా ఉండి ఎక్కువ శ్రమ లేకుండాగూడ వుంటుంది. భాషా పరంగా కూడా పెద్ద పాండిత్యమేమీ అవుసరం పడదు. భక్తియోగాన్ని అనుష్టించే వారందరకూ ఆరతి కార్యక్రమం పెద్ద దిక్కుగా ఉంటుంది. వేద సాంప్రదాయాన్ని ఎక్కడా వదిలిపెట్టకుండా పాటిస్తున్నామనే సంతృప్తి కలగచేస్తుంది. ముఖ్యంగా వేదాల్లో చెప్పబడిన పరమ పురుషుడు తమ ఇష్టదైవంగా ఎదురుగా కనపడుతున్న భావన కల్గుతుంది. అటువంటి ఇష్టదైవానికి ఆరతి సమర్పిస్తున్నామని, ఇంకా ఆరతి పళ్ళెంలో కనపడే అగ్నిజ్వాల వేదపరమైన అగ్ని దేవుని ప్రతి రూపమని తలుచుకుని ఆనందిస్తారు. ముఖ్యంగా ఈ రకమైన భావన 'పంచారతి' సమర్పణలో చోటు చేసుకుంటుంది. ఆరతి పాట పాడే వ్యక్తి నోటి వెంట వచ్చే మంత్రోచ్చారణ యొక్క అర్ధం గుర్తు తెచ్చుకుంటూ వుంటే పళ్ళెంలో కనపడే అగ్నిరూపం సాధారణ జ్యోతి కాదని పరమ పురుషునికి భక్తితో సమర్పించే అగ్నిహోత్రమని తెలుస్తుంది. తనలోని అరిషడ్వర్గాలు ఆ అగ్నిహోత్రంలో పడి ఆహుతి అగుతున్నట్లుగాను, తన ఇష్టదైవం ద్వారా పవిత్రత తనలోనికి ప్రవేశిస్తున్నట్లుగానూ కనపడుతుంది.

**అర్థయుక్తమైన ఆరాధన :**

ఆరతిపాట పాడేటప్పుడు నిదానమే ప్రదానమన్న సూత్రాన్ని అమలు చెయ్యాలి. ఇంకా ముందుగానే ఆ పాటల ఆంతర్యం వొంట పట్టించుకుని ఉండాలి. అటువంటప్పుడే ఆరతి సమర్పణ అర్థయుక్తమైన ఆరాధనగా మారుతుంది. రఘు వంశమనే మహాకావ్యాన్ని ప్రారంభించే ముందు, మహాకవి కాళిదాసు "వాగర్థావివసమ్పృక్తౌ వాగర్థ ప్రతి పత్తయే జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ" అంటాడు. అంటే 'పదాలను, వాటి అర్థాలను సరిగా అర్థం చేసుకోవడంలో నాకు మార్గనిర్దేశం చేయడానికి, ఒక పదమూ దాని భావమూ ఏ విధంగా కలిసి వుంటాయో ఆ విధంగానే కలిసి వున్నటువంటి పార్వతీ పరమేశ్వరులను పూజిస్తున్నాను' అని అర్థం.

అయితే ఇటువంటి శాస్త్రీయపరమైన విశ్లేషణ అందరూ చేయగలరా? అన్నది ప్రధానమైన ప్రశ్న. అందుకే మధ్య భారతావనికి చెందిన సంత్ మహాశయులు చాలామంది వ్యవహారిక భాషలో సలువుగా అర్థమయ్యేలాగ కీర్తనలు రచించి జనానికి అందుబాటులో ఉంచారు. ప్రజలు మూఢనమ్మకాల బారినిపడకుండా భగవంతుణ్ని ఆరాధించడానికి ఇవి బాగా తోడ్పడ్డాయి.

**శ్రీ సాయిబాబా ఆరతి మొదటి ప్రకాశం :**

బాబా ఆరతి ఎప్పుడు ఉదయించిందో ఖచ్చితంగా చెప్పడానికి తగిన ఆధారాలు, సాయి సాహిత్యం మొత్తం వెదికినా దొరకవనే చెప్పాలి. అక్కడా ఇక్కడా కనపడే ఆశరేపే చిన్న చిన్న సంగతులు కూడా గజిబిజిగా అసంబద్ధంగా ఉన్నాయనే అనుకోవాలి. అయినప్పటికీ దొరికిన సమాచారాన్నిబట్టి ఒక ఊహాజనితమైన అభిప్రాయానికి రావచ్చు అనిపిస్తోంది.

**బీజావస్థలోని సాయి ఆరాధన :**

ఫలానా సమయంలో ఫలానావ్యక్తుల వల్ల ఆరతి వంటి కార్యక్రమాల మొదలు జరిగింద నడం ఒక చారిత్రాత్మికమైన భ్రాంతి అవ్వొచ్చు. అస్సలు ఈ సాంప్రదాయానికి మూలాలు ఎక్కడనో అక్కడ ఉండి తీరాలి. శ్రీసాయిబాబా సామూహిక ఆరాధనాక్రమంలో క్రమంతప్పక ఆరతి ఇవ్వడమన్న సాంప్రదాయం

ఒక క్రొత్త నియమానికి దారితీసింది. శ్రీసాయిబాబా షిరిడీలో కనపడిన కాలం నుండి జనులందరూ ఆయన్ను ఒక మహాత్ముడుగానే చూసేవారు. వారిలో హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు వున్నారు. రోజురోజుకూ సాయిబాబా మహాత్యం పెరుగుతూ ఉంటే ఆరాధించేవారి సంఖ్య గూడా పెరుగుతూ ఉండేది. వారందరిలో హిందువులే ఎక్కువగా కనపడేవారు. హిందూత్వం ప్రకారం ఒక దివ్యమైన పవిత్రమైన యోగి కనపడితే వంగి పాదాభి వందనం చెయ్యడం ఒక ఆచారంగా వుండేది. అది వారి వినయవిధేయతలకు అద్దంపట్టేది. బాబా కూడా 'పవిత్రత' అన్న మాటకు విలువ యిచ్చేవారు. నిజం చెప్పాలంటే పవిత్రత అన్న విత్తనమే సాయి ఆరాధన అన్న మహావృక్షానికి పువ్వులుగా కాయలుగా పళ్ళుగా మారడం మొదలయ్యింది. చివరికది భావవ్యక్తికరణకు దారి తీసింది.

## ఆచారకాండ అంటే ఏమిటి?

సాధారణంగా ఆచారమన్నది మతానికి, సంస్కృతికి ఆలవాలమై ఉంటుంది. ఒక పవిత్ర భావపరంపర వర్థిల్లడానికి ఒక ప్రత్యేకత కల్గిన ఆచారం ఉద్భవిస్తూ ఉంటుంది. సాయిబాబాను ఒక పవిత్రమైన యోగిపుంగవుడిగా జనం కీర్తిస్తూ ఉండేవారు. దానిని ఆయన అడ్డుకోలేదు అంటే జనుల అభీష్టాన్ని ఆదరించేవారని చెప్పాలి. వారి ఆదరణే భక్తుల్ని మరింత దగ్గరకు చేర్చేది. రక రకాల పద్ధతుల్లో జరిగే సాయి ఆరాధన రానురాను ఒక క్రమ పద్ధతిలో మారి ఆచారకాండగా స్థిరపడింది.

## సాయిభక్తి ప్రత్యేకత :

ఇంతవరకూ చెప్పింది భక్తి, ఆరాధన, ఆచారము అన్న మాటల గురించి ఒక సర్వ సాధారణ విషయంగా చూడవచ్చు. అయితే ఇక నుండి సాయిభక్తి ప్రత్యేకత మీద శ్రద్ధ పెట్టబడుతోందని తెలుసుకోవాలి. అసలు సాయిబాబాయే ఒక అసాధారణమైన సాధువు. దైవీకరణ అని ఒక మాట ఉంది. అంటే అర్థం ఎదుట కనపబడే వ్యక్తిలో కాని, మూర్తిలో కాని దైవత్వం అంచనా వేసి ఆరాధించడమనే ఒక ప్రత్యేక కార్యక్రమం. కాని సాయిబాబా విషయంలో

ఈ సూత్రం పని చేయదనే చెప్పాలి. ఎందుకంటే ఇదే సూత్రం వ్యతిరేకదిశలో పనిచేస్తూ వుంటుంది. అంటే అర్థం, సాయిబాబాలో కనపడే దైవశక్తి సంబంధమైన విషయాలు మనుష్యుల్ని కాస్త తికమక పెడుతూ ఒక అంచనాకు రానివ్వవు. దానివల్ల ఏం జరుగుతుందంటే దివ్యత్వ ఆరోపణకు శ్రమ పడకుండా ఉన్న పాటున బాబాయే మహాపురుషుడుగా గోచరింపబడుతూ ఉంటారు. ఆశ్చర్యకరమైన, అపురూపమైన లెక్క కట్టలేని ఆయన దివ్యశక్తులు నిరపాయమైన ప్రభావాన్ని కల్గిస్తూ చూచేవారి హృదయపులోతుల్ని తాకి సాయిబాబాను తమ గుండెల్లో ప్రతిష్టాపన చేసుకుని ఆరాధనా భావాన్ని ఏప్రయత్నం లేకుండానే కల్గిస్తూ ఉంటాయి. దానివల్ల తన్మయత్వంతో నిండిన దివ్యానుభవం సారభూతమై పేరుకుని చెక్కు చెదరని గుర్తింపును, జ్ఞానాన్ని ప్రేరేపిస్తుంది. ఈ అనుభవమే శ్రీసాయి సంస్కృతి లేక సాయి భక్తితత్వానికి అంకురార్పణ చేసి, ఆధ్యాత్మిక మార్గాన్ని సుగమం చేసి సాయి మహిమను తనివిదీరా ఆశ్వాదించేటట్లు కృషి చేస్తుంది.

### సాయి ఆరాధనకు మొట్టమొదటి సారథి :

చాంద్‌భాయ్‌పాటిల్ అనే మహాశయుడు సాయి పూజకు మొట్టమొదటి పూజారిగా ఎన్నుకోబడ్డాడు. శ్రీసాయిబాబా దివ్యశక్తిని, దయను అనుభవానికి తెచ్చుకునే భాగ్యం అతడికి దక్కింది. ఇతడు సాయి ఆరాధనకు ముస్లింమత సాంప్రదాయాన్ని ఎంచుకున్నాడు. మరి హిందూ మత సాంప్రదాయంలో పూజలు నిర్వహించే బాధ్యత, ఖండోబా ఆలయ పూజారి మహల్సాపతికి అప్పజెప్పబడింది. బాబా కంఠ భాగానికి గంధం పూత మహల్సాపతే పెట్టేవాడు. గంధం సాధారణంగా నుదుటను పూసుకోవడం మహారాష్ట్ర ఆలయాల్లో ఒక సాంప్రదాయంగా ఉంది. ఈ గంధం ముద్దను ప్రసాదంగా భావించేవారు. అప్పట్లో బాబా కూడ ఈ పవిత్రమైన ఆచారాన్ని అనుమతిస్తూ వుండేవారు. దీని తరువాత బాబాపై మహల్సాపతికున్న భక్తి ప్రపత్తులు బాగా పెరిగాయి. ఖండోబా ఆలయంలో ఎలా పూజలు జరిపేవాడో అదేరీతిగా బాబాకూ చెయ్యడం ప్రారంభించాడు. అయితే ఎక్కడికక్కడ బాబా అనుమతించిన మేరకే చేయగలిగేవాడు.

ఆరతి సాయిబాబా

**డేంగ్లె భక్తి భావన :**

మహల్సాపతిలాగే ఇంకొక భక్తుడున్నాడు. అతడి పేరు నానాసాహెబ్. ఇతడికే సీతారాం డేంగ్లె అని ఇంకోమారు పేరుంది. ఇతడు జాలినిమగాంకు చెందిన భూకామందు. సాయి పూజ చేద్దామని కోరుకునేవాడు. కాని బాబా దానికి ఒప్పుకునేవారు కాదు. నీకంత పూజ చేయ్యాలనిపిస్తే, అదిగో ఆ మసీదు స్తంభానికి చెయ్యి అనేవారు. అదే బాబా ఆజ్ఞగా పాటించి డేంగ్లె, స్తంబానికే పూజ చేసాడు. కాని అది అతని తృప్తినివ్వలేదు. ఇక బాబాకి ఎలా చెప్పాలని ఆలోచించి, దగ్గుభాయి అనే భక్తుడి ద్వారా బాబాకు పూజ చెయ్యడం మొదలుపెట్టాడు. దీనికి బాబా కోపం పడేవారు కాదు. డేంగ్లెకు ఎంతో ఆనందమనిపించింది. ఇదంతా బాబా దయ అనుకొనేవాడు.

కొంతకాలంపోయిన తరువాత నానాసాహెబ్ చందోర్కర్ కొడుకు బాపురావు చందోర్కర్ కూడా మహల్సాపతిలాగే చందనం బాబా నుదటన రాసే అదృష్టాన్ని పొందాడు. ఈ రకమైన సాంప్రదాయం అక్కడక్కడ చిన్నచిన్న మార్పులతో సుమారు **1909** వరకూ సాగింది. మహారాష్ట్రంలో ఇది ఇంకా కొన్నిచోట్ల అనగా సాధుసంతులకు పూజలు చేసే పద్దతి ఉండేదని చెప్పవల్సి వస్తుంది. ఎందుకంటే ఆ సాధువులను భగవత్ స్వరూపాలుగానే కొలుస్తూ ఉండేవారు. అయితే శ్రీసాయి బాబా విషయంలో ఇదే సాంప్రదాయం మరింత గుర్తింపు తెచ్చుకుంది. కారణం, ఆయన ప్రదర్శించే లీలలు ఆశ్చర్యాన్ని కలిగించడమే అని చెప్పాలి. బాబా ఆకర్షణకు లోబడని వారు ఉండేవారు కాదు. ఒక చిత్రమేమిటంటే, ఎంతోమందికి ఆయన భగవంతుడిగా కనపడుతున్నా, ఇంకా ఎంతోమంది ఆయనకు భక్తి భావంతో పూజా పురస్కారాలు సమర్పించు కుంటున్నా, ఆ కార్యక్రమాలు ఏవీ చాలాకాలంవరకూ బయటకు వ్యాప్తి జరగలేదు. సాయివ్యవస్థ అనేది ఏదీ నిర్మించబడలేదు. అంటే బాబా ఒక పరిమిత భాగంలోనే ఉండిపోయారు అనవల్సివచ్చేది. దీనికి కొంత కారణము బాబాకు స్వయంగా ఇష్టం లేకపోవడమే. ఇంకొకటి హిందూ ముస్లిముల మధ్య ఐక్యత లోపించడం. **1897**లో అందరూకల్సి 'ఉరుసు' ఉత్సవం చెయ్యడానికి సంకల్పించారు. ఉరుసు ఉత్సవం అంటే దర్గాల వద్ద భక్తులు జరుపుకొనే పండగ. దీనికి బాబా కూడా ఒప్పుకున్నారు. దీనికి గోపాలరావు గుండు అనే భక్తుడి ఆలోచనే

కారణం. అయితే బాబా ఈ పండగను శ్రీరామ నవమి పండగతోబాటు కలిసి చెయ్యాలని ఆజ్ఞాపించారు. ఇలాగే చందనోత్సవం కూడా జరిగేది. ఈ పండగలన్నింటిలోనూ బాబా హిందూ ముస్లిం సమైఖ్యతకు పాటుపడుతూ ఉండేవారని తెలిసేది. 1918 అక్టోబరు నెలలో బాబా సమాధి చెందడం కూడా విజయదశమి పండగ సందర్భంలోనే అయింది.

ఈ పండగలన్నీ ఒక ఎత్తు, ఆరతి సాంప్రదాయం ప్రసిద్ది చెందడం ఇంకొక ఎత్తు అయి చాలా ప్రఖ్యాతి పొందింది. సాయి ఆరతులు ఎలా ప్రారంభమయ్యాయి? మొదటి కారణం ఎవరు? అన్నవి ప్రధానమైన ప్రశ్నలు. సాయిబాబాకు బాగా దగ్గర భక్తులు, బాబాను ప్రార్థించి ఈ ఆరతి సాంప్రదాయాన్ని మొదలుపెట్టి ఉండవొచ్చు అన్నది ఒక ఊహ.

ఇటువంటి ఊహ ఎప్పుడైతే కలిగిందో వెంటనే స్ఫురణకు వచ్చే మహానుభావుడు శ్రీ కె.జె.భీష్మ. ఈయన పూర్తి పేరు కృష్ణారావు జోగేశ్వర్ భీష్మ. అయితే ఈయన బాబాను స్తుతిస్తూ కొన్ని శ్లోకాలు రచించి బాబాచేత ఆశీర్వాదం పొందడం, ఆ తరువాత ఆశ్లోకాలన్నీ 'సాయినాథ సగుణోపాసన' పేరుతో పుస్తక రూపం క్రింద ప్రచురించడం జరిగింది. అంత మాత్రమే కాని ఆరతుల ప్రారంభం మాత్రం కె.జె.భీష్మ ద్వారా జరిగిందనడం సత్య దూరమైన విషయం అని తెలుస్తోంది. స్వామి సాయి శరణానంద 1911 నుండి 1918 వరకూ బాబాతో కలిసి వుండేవారు. అంతకు పూర్వం నుండీ బాబా ఆరాధన చేసే వాళ్ళల్లో ముఖ్యులు  మహల్సాపతి ఒకరు, ఇంకొకరు నానాసాహెబ్ చందోర్కర్ కొడుకు మహదేవ్. ఆతరువాతనే ఆరతి సాంప్రదాయం కూడా మూడు రకాలుగా ప్రారంభం అయ్యింది. చావడిలో ఉదయం కాకడ ఆరతి, రాత్రి శేజ్ ఆరతి ఇచ్చేవారు. ద్వారకామాయిలో మాత్రం మధ్యాహ్న ఆరతి ఇచ్చేవారు. బాబా లెండీబాగ్ నుండి తిరిగి వచ్చిన తరువాత 1909 నుండీ మధ్యాహ్న ఆరతి ప్రారంభ మయ్యింది. మర్నాడు ఉదయం బాబా కాకడ ఆరతి ఇచ్చిన తరువాతనే ద్వారకామాయికి తిరిగి వచ్చేవారు. ఈ విధంగా ప్రతిరోజు మధ్యాహ్న ఆరతి, రోజు విడిచి రోజు కాకడ శేజ్ ఆరతులు జరిగేవి. చాలాకాలం తరువాత సాయంకాలం సూర్యాస్తమయ సమయంలో దూప్ ఆరతి కూడా మొదలయ్యింది.

## ఆరతి సాయిబాబా

సాయినాధులు భౌతిక శరీరంతో ఉన్నప్పుడే ఆరతిని సమర్పించే అదృష్టం దొరికిన మహానుభావులు తాత్యాసాహెబ్ నూల్కర్, మేఘాశ్యామ్, బాపుసాహెబ్ జోగ్‌లు. ముఖ్యంగా నూల్కర్ మహాశయుడు మొట్టమొదటిసారిగా బాబాకు ఆరతి సమర్పించాడు.

ఈయన పండరిపురంలో సబ్ జడ్జిగా పనిచేస్తూ ఉండేవాడు. శ్రీసాయిబాబా గురించి తెల్పినది నానా సాహెబ్ చందోర్కర్. ఈయన కూడా ప్రభుత్వ ఉద్యోగే. 1909లో నూల్కర్, నానాసాహెబ్‌తో కల్సి షిరిడికి వచ్చి, సాయిబాబాను చూడగానే ఏదో తెలియని ఆనందం పొందాడు.

### ఆరతి సాంప్రదాయాన్ని ప్రారంభించింది నూల్కరే :

ప్రభుత్వ ఉద్యోగం తరువాత షిరిడీలోనే నివశించాలని నిశ్చయానికి వచ్చాడు. అదే విధంగా సాయిబాబానే సద్గురువుగా ఎంచుకుని షిరిడీలోనే వుంటూ 1911లో దేహాన్ని విడిచి పెట్టాడు. నూల్కర్‌లాగే చాలామందికి సాయిబాబా ఆరతి సమర్పించాలని కోరుకుంటూ ఉంటారు. నిజానికి సాయిబాబాకు స్వంతంగా ఆరతి స్వీకరిద్దామన్న ఆలోచన ఉండేదికాదు. ఆ కారణం చేత ఎవ్వరినీ అందుకు ప్రోత్సహించేవారు కాదు. కాని భక్తుల విన్నపాలు కాదనలేక ఒప్పుకున్నారు. ఇది ఏ పరిస్థితిలో జరిగిందో ఖచ్చితంగా చెప్పడానికి తగిన ఆధారాలు కనపడలేదు. కాని ఊహకు తట్టేది నూల్కర్ ప్రోద్బలమే అని తెలుస్తోంది. నూల్కర్‌కు బాబాపై నున్న అపార ప్రేమను కాదన లేకపోయారు. ఇలా బాబా దగ్గర నుండి అనుమతి వచ్చిందో లేదో భక్తులు ఇకవచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోలేదు. ఆరతి సమర్పణ నెమ్మనెమ్మదిగా మొదలై ప్రఘాడమైన సాంప్రదాయంగా మారిపోయింది. తాత్యాసాహెబ్ నూల్కర్ ఆరతికి ప్రధాన పూజారిగా ఎన్నుకోబడ్డాడు. అది తన జీవితంలో దొరికిన అత్యుత్తమ భగవదారాధనగా హృదయంలో స్థిరపరుచుకున్నాడు.

సాయి ఆరతులు ప్రారంభించినట్లే, తాత్యాసాహెబ్ నూల్కర్, గురు పూర్ణిమ పండగను కూడా జరపాలని నిశ్చయించుకున్నాడు. ఆషాడ శుద్ద పూర్ణిమనే గురుపూర్ణిమ అనీ వ్యాసపూర్ణిమ అనీ పిలుస్తారు. నూల్కరు ప్రవేశపెట్టిన ఈ సాప్రదాయం కూడ షిరిడీలో బాగా ప్రఖ్యాతి పొందింది. ఈ విషయం

గురించి సాయిబాబాకు దగ్గర శిష్యుడు శ్రీ హె.వి.సాథే ఇలా అన్నాడు."బాబాకు ఆరతి సమర్పణ మామ్మోలు రోజుల్లోనే మొదలైంది. కాని అప్పట్లో గురుపూర్ణిమ ప్రత్యేకత ఉండేది కాదు. కాని ఒకసారి బాబాయే, మా మామగారైన దాదాకేల్కార్‌కు కబురుపెట్టి, నీకు తెలీదా ఈ రోజు గురుపూజ చేస్తారని? పూజా సామాన్లు తెచ్చి గురుపూజ చెయ్యి అన్నారు". ఆవిధంగా గురుపూజ ప్రారంభమైంది.

అయితే పాఠకులకి ఇక్కడ ఒక సందేహం రావచ్చు. గురుపూర్ణిమ నాడు చేసే గురుపూజ బాబాయే పై ప్రకారంగా మొదలు పెట్టారేమో? నూల్కార్ కాదేమో అనిపిస్తుంది. కాని శ్రీసాయిలీలా పత్రికలో ఇంకోవిధంగా వ్రాసి ఉంది. అదేమిటంటే తాత్యాసాహెబ్ నూల్కార్, నానాసాహెబ్ చందోర్కర్‌కు వ్రాసిన ఉత్తరం యదాతథంగా సాయిలీలా పత్రికలో ముద్రించారు. అయితే ఆ ఉత్తరం ఏరోజు వ్రాయబడిందో చెప్పలేదు. దాని సారాంశమేమిటంటే "ఒక రోజు శనివారం నేను పడుకుని లేచి, ఆరె! ఈ రోజు గురుపూజాదినం కదా! అని గుర్తు తెచ్చుకుని స్నానాలు చేసిన తరువాత పూజా సామగ్రి పట్టుకుని బయలుదేరాను. అయితే బాబా బిక్షకు వెళ్ళి వచ్చిన తరువాతనే పూజ మొదలు పెట్టాలి. అలాగే బాబా మమ్మల్ని పూజ యదావిధిగా చెయ్యమన్నారు. పూజ చేస్తున్నప్పుడే ఆయనకు సమర్పించిన దక్షణనంతటినీ తిరిగి ఇచ్చేసారు. ఆ తరువాత బాబా, రాధాకృష్ణమాయికి, దాదాకేల్కార్‌కు కబురుపెట్టి రమ్మనమని చెప్పారు. రాధాకృష్ణమాయి పూజాసామగ్రిని దాదాకేల్కార్ ద్వారా పంపించింది.

ఈ ఉత్తరం చదివితే ఏం తెలుస్తోందంటే, కొంతమంది భక్తులకు గురుపూర్ణిమ విశిష్టత గురించి తెలుసు. ఆ కారణంచేత వారు బాబాను ఎలాగో ఒకలాగ ఒప్పించి పూజకు అనుమతి సంపాదించారు. ఆ తరువాతనే బాబా, దాదాకేల్కార్‌కు కబురుపెట్టారు. ఆ ఉత్తరంలో కనబడే కొన్ని పదాలు, 'మాకు అనుమతి దొరికింది', 'బాబా ఒప్పుకున్నారు', 'శాంతంగా ఉన్నారు' ఏం సూచిస్తూ ఉన్నాయి? బాబా చివరకు తనకు గురుపూజ చేయించుకునే ఇష్టం లేకపోయినా, బలవంతంగా 'సరే' అన్నారని తెలుస్తోంది.

1911లో నూల్కార్ ఆకస్మికంగా అనారోగ్యం పాలయ్యాడు. అదిచివరకు అతడి ప్రాణాలను హరించింది. మరణ సమయంలో అతడి నాలుక బాబా

నామజపం చేస్తోంది. అతడి చెవులు బాబా భజన వింటున్నాయి. అతడి అన్నవాహిక బాబా పాదతీర్థంతో తడిసింది. తాత్యా సాహెబ్ నూల్కర్ మరణవార్త బాబాకు తెలిసింది. విచార వదనంతో ఇలా అన్నారు, ఓహ్! మన తాత్యాబా మనకంటే ముందే వెళ్ళిపోయాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? నేను కూడా వెళ్ళాలి. మరి ఈ మశీదు ఎందుకు? ఈ షిరిడి ఎందుకు? తాత్యాబా చాలా మంచివాడు. నామాట వినేవాడు. అతడి జీవిత లక్ష్యం నెరవేరడానికి నేను సహాయం చేసాను. ఇంక అతడు తిరిగి జన్మించనవుసరం లేదు.

ఇక్కడ నూల్కర్ జన్మరాహిత్యానికి కారణం చూపెడుతున్నారు. బాబాకు ఇచ్చిన ఆరతి విధానంలో నూల్కర్ చూపెట్టిన భక్తి ప్రపత్తులు అమోఘంగా ఉండేవి. ఆరతి దీపాల పళ్ళెం పట్టుకుని పాటలు పాడుతూ బాబా ముందు నిలబడి చక్రాకారంలో త్రిప్పుతూ ఉన్నప్పుడే అతడి సంచిత కర్మలన్నీ (భూతకాలపు కర్మలు) వాసనా సహితంగా దగ్ధమైపోతూ ఉండేవి. ఇక ప్రారబ్ధం (వర్తమానపు కర్మలు) ఈ జన్మలోనే అనుభవపూర్వకంగా ఖర్చు అయిపోయేవి. ఆగామి (భవిష్యత్ కర్మలు) కర్మలకు అవకాశమే లేకుండా బాబాకు ఇచ్చిన ఆరతి రూప చక్రవలయం కాపాడుతూ ఉండేది. ఇంత పెద్ద రక్షణ బాబా నుండి నూల్కర్ పొందగల్గడమే అతనికి మరు జన్మ లేకుండా చేసింది.

తాత్యాసాహెబ్ నూల్కర్ పేరు షిరిడి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. ఆరతి సాంప్రదాయాన్ని మొట్టమొదటిగా ప్రవేశపెట్టిన ఘనత నూల్కర్‌కు దక్కింది. అందుకే అతడు ఆరతి సాంప్రదాయ వ్యవస్థాపకుడుగా కీర్తి గడించాడు. ఈ సందర్భంలోనే నూల్కర్‌కు సంబంధించిన ఇంకొక విషయం చెప్పుకోవాలి. అతడు పండరిపురంలో సబ్‌జడ్జిగా ప్రభుత్వ ద్యోగం చేస్తున్నప్పుడు పండరి విఠలనాథుడి యొక్క ఆరతి హక్కుల గురించి న్యాయస్థానంలో వాదోపవాదాలు జరిగాయి. ఆ దావాపై నూల్కర్ ఒక జడ్జిగా తన తీర్పును ఇచ్చాడు. దాని తరువాత ఉద్యోగ విరమణ చేసి షిరిడికి వచ్చాసాడు. షిరిడీలో కూడా అదేవ్యక్తి బాబా ఆరతుల గురించి తపనపడి, ఆ సాంప్రదాయానికి శ్రీకారం చుట్టడం చెప్పుకోదగ్గ విషయంగా మారింది.

తాత్యాసాహెబ్ నూల్కర్ మరణానంతరం బాబాకు ఆరతులు సమర్పించే బాధ్యత తీసుకున్న భక్తుడి పేరు మేఘాశ్యామ్. ఇతడు ఒక బీద బ్రాహ్మణ

కుటుంబం నుంచి వచ్చాడు. బాబా ఆరతులను తనదైన శైలిలో బాబాతో సహా అందరినీ కూడా అబ్బురపరిచే విధంగా ఇస్తూ ఉండేవాడు. శ్రీసాయి శరణానంద మేఘా పద్దతిని బాగా మెచ్చుకునేవాడు. మేఘా పెద్ద గెడ్డం, జడలు కట్టిన జుట్టు, మంచి శరీర సౌష్టవంతో కనపడేవాడు. ఆరతి ఇచ్చే సమయమంతా ఒంటి కాలిమీదనే నిల్చునేవాడు. క్షణం కూడా కదలకుండా అలా ఆరతి పూర్తి అయ్యేవరకు ఉండేవాడు. మొత్తం ఆరతి అయ్యేంతవరకూ అతడి ఏకాగ్రతతో ఉండడం అందరికీ ఆశ్చర్యం గొలిపించేది.

అటువంటి మేఘా 1912వ సంవత్సరం జనవరి 12న కన్నుమూసాడు. ఎవ్వరైనా చనిపోతే బాబా చాలా తక్కువగా స్పందిస్తారు. కాని నూల్కర్ విషయంలో చాలా బాధపడుతూ కనిపించారు. ఇప్పుడు మేఘా విషయంలో ఇంకా ఎక్కువ బాధని వ్యక్తం చేసారు.ఆ సమయంలో దాదాసాహెబ్ కపర్థే అక్కడే ఉన్నాడు. ఆయన చెప్పిన ప్రకారమైతే బాబా ఇలా అన్నారు. "ఈ రోజు ఎంతో విచారించవల్సిన దినం. కాకాసాహెబ్ దీక్షిత్ వచ్చి, మేఘా తెల్లవారుజామున 4 గం॥లకు చనిపోయాడని చెప్పాడు.

మేఘా తరువాత ఆరతి సాంప్రదాయాన్ని నడిపించినవాడు శకారాం హరి అన్న పేరు కల్గిన బాపుసాహెబ్ జోగ్. సాయిబాబాయే బాపుసాహెబ్‌జోగ్‌ను ఆరతి కార్యక్రమం జరిపించమని ఆజ్ఞాపించారు. బాబా మహాసమాధి చెందేంతవరకూ ఇతడు ఆరతిని క్రమంతప్పకుండా జరిపించాడు. ఎక్కువకాలం అనగా సుమారు ఆరు సంవత్సరాల కాలం జోగ్, బాబాకు ఆరతి ఇచ్చిన అదృష్టవంతుడయ్యాడు.

మొదట్లో ఆరతి సాంప్రదాయాన్ని ప్రారంభించిన ఘనత తాత్యాసాహెబ్ నూల్కర్‌కు దక్కినా, ఆ సాంప్రదాయాన్ని తెరవెనుక నుండి నడిపించింది రాధాకృష్ణమాయి అని చెప్పవల్సి వుంది. రాధాకృష్ణమాయి పవిత్ర ఆత్మస్వ రూపురాలు. ఈమె అసలు పేరు శ్రీమతి సుందరీభాయి క్షీరసాగర్. ఆమె చిన్నతనంలోనే భర్తను కోల్పోయింది. అట్టి దురదృష్టాన్ని దూరం చేసుకోవడానికి గాను ఆమె తన ఇష్టదైవమైన పండిరి విఠలనాధుడుగానున్న శ్రీకృష్ణపరమాత్మకు సేవలర్పిం చడానికి సంకల్పించుకుంది.

అదే ప్రకారం పరమ భక్తిభావనతో ఆమె కొన్ని సంవత్సరాలు పండరిపురంలో ఉంది. తరువాత కొంతకాలానికి షిరిడి సాయిబాబా గురించి తెలిసింది. 1905లో షిరిడీలో కాలు పెట్టింది. అప్పుడు ఆమెకు తోడుగా నానాసాహెబ్ చందోర్కర్ ఉన్నాడు. షిరిడి చేరుకోగానే ఒక అనిర్వచనీయమైన అనుభూతి ఆమెకు కల్గింది. ఆపాదమస్తకం శరీరంలో దైవదత్తమైన కంపన ప్రారంభమైంది. ఇక షిరిడీయే నాకు నివాశయోగ్యమైన స్థలమనీ, సాయిబాబాయే శ్రీకృష్ణపరమాత్మయనీ భావించడం మొదలుపెట్టింది. ఇక ఇతరత్రా ఆలోచనలకు స్వస్తి చెప్పి షిరిడీ గ్రామాన్ని తన స్వంత యిల్లుగా చేసుకుంది. షిరిడీలో చేరిన మొదటి రోజుల్లో రాధాకృష్ణ నామాన్ని ఎప్పుడూ జపిస్తూ చిన్నకృష్ణ విగ్రహం చేత్తో పట్టుకుని తిరిగేది. ఇక అప్పటి నుండి ప్రజలందరూ ఆమెను రాధాకృష్ణమాయి అంటూ పిలిచేవారు. మరాఠీ భాషలో 'ఆయి' అంటే అమ్మ అని అర్థం. ఆకారణం చేత రాధాకృష్ణ ఆయి అంటూ, చివరకు రాధాకృష్ణమాయిగా మారింది. షిరిడీలో ఆమె ప్రవేశించిన తరువాత భక్తితత్త్వం క్రొత్త రూపును దిద్దుకుంది. ఆమె నడిచి వెళ్తూవుంటే భక్తి భావన నిజరూపం దాల్చి తిరగుతోందా? అన్న అనుమానం వచ్చేది.

ఆమె ఉద్దేశ్యంలో సాయి విఠలనాథుడు పండరి విఠలనాథుడే కాబట్టి అక్కడ ఎంత అట్టహాసంగా పూజలందుకుంటున్నాడో, ఇక్కడ కూడ అంత గొప్పగా పూజలందుకోవాలి అనుకొనేది. ఆమె కోరిక ప్రకారంగానే ఆమె బ్రతికున్నంత కాలం సాయిబాబాను అదేరీతిలో ఆరాధిస్తూ ఉండేది. అయితే మొదటి రోజుల్లో మాత్రం ఆమె కల నిజమయ్యేది కాదు. ఎందుకంటే సాయిబాబా ఆమెను ఏదో ఒక కారణంచేత తన దగ్గరగా రాచిచ్చేవారు కాదు. మాయి కొంతకాలం భయం భయంగా గడుపుతూ చాటుమాటుగా బాబాను దర్శిస్తూ వుండేది. కాని అద్భుతమైన తెలివితేటలున్న కారణంచేత షిరిడీలో జరిగే ఉత్సవాలన్నింటిలోనూ అనగా చావడి ఊరేగింపు, శ్రీరామనవమి ఉత్సవాలు, గోపాల బాలోత్సవం, ఇంకా ప్రతిదినం జరిగే ఆరతి కార్యక్రమం మొదలైన వాటన్నింటిలోనూ ఆమె నేర్పరితనం, అజమాయిషీ కొట్టవచ్చినట్లు కనపడుతూ ఉండేది.

శ్రీ కాకాసాహెబ్‌దీక్షిత్, శ్రీసాయి సచ్చరిత్రకు తన అభిప్రాయం వ్రాస్తూ, రాధాకృష్ణమాయి ప్రదర్శించిన సమయస్ఫూర్తికి, షిరిడీ రూపురేఖలు మార్చటంలో ఆమె కనబరిచిన ఉత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ జోహార్లు అర్పించాడు. ఆయన మాటలు ఇలా ఉన్నాయి. “షిరిడీ చాలా తొందరంగా ఒక సంస్థాన దశకు చేరుకుంది. ముఖ్యంగా ఆరతి కార్యక్రమం ఒక రాజ దర్బారులో జరిగే గౌరవప్రదమైన పండలాగ శ్రీసాయి మహరాజ్‌కు ఎంతో సమున్నతమైన భక్తిభావనతో సమర్పించబడుతూ ఉండేది.

రాజఠీవికి తగ్గట్టు సామగ్రి అంతా వచ్చి చేరేది. ఆ సందడిలో బ్యాండుమేళం, గుర్రం పల్లకీ ఇంకా ఒకే రకమైన దుస్తులు ధరించిన పరివారం దండధారులై, భజన బృంధంతో కలిసి ముందు నడుస్తూవుంటే, శ్రీసాయినాథులు చావడికి ఊరేగింపుగా వెళ్ళేవారు. దారి పొడవునా రంగురంగుల రాతి పలకలు పరిచేవారు. చావడి ఇంకా అందంగా తయారు చేసేవారు. అద్దాల దండలు గోడలకి వ్రేల్లాడుతూ మెరుస్తూవుండేవి. ఇంత అందమైన పండగ వాతా వరణాన్ని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దిన ఘనత అంతా రాధాకృష్ణమాయికే దక్కేది. ఆమెను భక్తి కళాశాలకు ఆచార్యరాలుగా అందరూ చూసేవారు.

ఆమె ధనవంతురాలు కాదు. అయినప్పటికీ త్రికరణశుద్ధిగా తన శరీరాన్ని, మనస్సునూ, ప్రాణాన్ని సాయి సేవకు అంకితం చేసిన పరమభక్తాగ్రేసుణ్యురాలు. సాయి దర్బారుకు వచ్చే భక్తుల నుండి సేకరించిన వస్తు సముదాయంతో షిరిడీ సంస్థానాన్ని అభివృద్ధి చేసేది. అనుకోకుండా 35 ఏళ్ళ వయస్సులో వుండగా తన శరీరాన్ని విడిచిపెట్టి బాబాలో లీనమయ్యింది. సుమారు తొమ్మిది సంవత్సరాల కాలం షిరిడీలో నివశించింది. కాని ఇతరులెవ్వరైనా కనీశం పాతిక సంవత్సరాల కాలం షిరిడీలో వున్నప్పటికీ సాధించలేని ఆధ్యాత్మిక ప్రగతిని ఆమె తొమ్మిది సంవత్సరాలలోనే సాధించింది. ఆమె కృషి వల్లనే బాబాకు ఉదయంపూట ఇచ్చే కాకడ ఆరతి, రాత్రిపూట చావడిలో ఇచ్చే శేజ్ ఆరతి బాగా ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయి. ఆమె నేర్పిన ఆరాధనా పద్దతుల వల్ల ఎంతమందికో లాభం చేకూరింది.

అంతేకాక ఇతరత్రా సేవాకార్యక్రమాల్ని కూడా బాగా విస్తృతపరిచింది. ఎంతోమంది స్త్రీలకు మంచి తర్ఫీదు ఇచ్చేది. వాటిల్లో భాగంగానే ద్వారకామాయికి అలికి ముగ్గులు పెట్టడం, గోడలకు రంగులు వెయ్యడం బాబా నడిచే వీధుల్ని బాగా ఊడిచి శుభ్రం చెయ్యడం, చిన్న చిన్న రాళ్ళను ఏరిపారవేయడం, జండాలు కుట్టడం, ధునికి కావల్సిన కర్రలను సేకరించి ముక్కలుగా చేసిపెట్టడం, దారికి ఇరుప్రక్కలా చెట్లను పెంచటం మొదలైన పనులన్నీ జరిగేవి. ఇంకో గొప్ప విశేషమేమిటంటే చాలామంది ధనిక కుటుంబాలకు చెందిన స్త్రీలు గూడా మాయి చేపట్టే బాబా కార్యక్రమాలనన్నింటికి మద్దతు తెల్పి, తమవంతు సాయం చేసి ఆనందించేవారు. 1916లో మాయి మరణించింది. కాకాసాహెబ్ దీక్షిత్ చెప్పినట్లు ఆమె సాయి సంస్థాన్ ఆచార్య పీఠానికి అధ్యక్షురాలిగా వ్యవహరించేది. సాయి ప్రేమభక్తి ఆమె కాలంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించింది అనడంలో ఎట్టి సందేహం లేదు. ఆమె బ్రతుకంతా ప్రేమ భక్తితోనే గడిచింది. అంతేకాని బ్రతకడం కోసం భక్తిని వాడుకునేది కాదు.

## ఆరతి ఖచ్చితంగా ఎప్పుడు మొదలయ్యింది?

శ్రీసాయి సచ్చరిత్ర అధ్యాయం 4, పేజీ 2 లో రాత్రిపూట ఇచ్చే శేజ్ ఆరతి 10-12-1910 నాడు మొదలయ్యింది అని వ్రాసారు. అలాగే అధ్యాయం 37, పేజీ 204లో భక్తులు 10-12- 1909 నుండి చావడిలో బాబాకు పూజలు చేసేవారని కూడా వుంది. అధ్యాయం 4లో కూడా దీనికి సంబంధించిన విషయాన్నే చెప్తూ 10-12-1910 నాడు రెండు సంఘటనలు జరిగా యని వుంది. దాన్లో మొదటిది జి.ఎస్.కపర్డే బాబా అనుమతి తీసుకుని షిరిడి వదిలి వెళ్ళినట్లు, రెండవది దీక్షిత్ వాడా నిర్మాణానికి శంఖు స్థాపన జరిగినట్లుగా వుంది. కాని కపర్డే దినచర్య పుస్తకంలో ఆయనకు షిరిడి వదిలి వెళ్ళడానికి బాబా అనుజ్ఞ 12-12-1910 నాడు దొరికిందని వుంది. కపర్డే మొట్టమొదట షిరిడికి వచ్చినప్పుడు ఎనిమిది రోజులు అనగా 5-12-1910 నుండి 12-12-1910 వరకూ షిరిడీలోనే ఉండిపోయాడు. ఆ దినచర్య పుస్తకంలో ఆరతుల గురించి ఏ మాత్రం వ్రాయలేదు.

**అనిశ్చితమైన ఒక విషయం :**

శ్రీసాయి సచ్చరిత్ర అధ్యాయం 33లో జామ్నేర్ లీల గురించి చెప్పబడింది. 1904- 1905 మధ్యకాలంలో బాబా, రామ్‌గిరిబువా అనే భక్తుడ్ని పిలిచి ఒక ఊదీ పొట్లం, ఆరతి గీతాన్ని నానాసాహెబ్ చందోర్కర్‌కు అందచెయ్యమన్నారు. దీనికి ముందు శ్యామాను పిల్చి మాధవరావు అదకర్ కూర్చిన ఆరతి పాటను ఒక కాగితంపై వ్రాసి రామ్‌గిరి బువాకు ఇవ్వమన్నారు. 1910లో ఆరతి పాడడం ప్రారంభమైతే, మరి అదే ఆరతిని మాధవరావు అదకర్ 1904- 1905 ప్రాంతంలో వ్రాసినట్లు, బాబా దాన్నే ఒక మనిషి ద్వారా నానాసాహెబ్ చందోర్కర్‌కు పంపినట్లు కనబడుతున్నాదే? అన్న సందేహం కలగవచ్చు. నిజానికి బాబా పంపిన ఊదీ వల్ల నానాసాహెబ్ చందోర్కర్ కూతురు మైనతాయికి సుఖ ప్రసవం జరిగి ప్రమాదం నుండి బయటపడింది. ఆ సందర్భంలోనే బాబా, రామ్‌గిరిబువా ద్వారా ఆరతి పాటను చందర్కోర్‌కు పంపారు. ఎందుకు? దాన్ని చందోర్కర్ చదివి తన అభిప్రాయం చెపుతాడని, ఇది బాబా ఉద్దేశ్యమని కొందరు అభిప్రాయపడ్డారు. ఇదిలా వుండగా శ్రీ బి.వి. నరసింహ స్వామీజీగారు వ్రాసిన పుస్తకంలో రామ్‌గిరిబువా ద్వారా శ్రీ కె.జె.భీష్మ వ్రాసిన ఆరతిపాటను నానాసాహెబ్ చందోర్కర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

శ్రీ హేమాదిపంత్ చెప్పిన మాటల ప్రకారం అయితే ఆరతి గీతాలు వ్రాయబడిన కాగితాలు బాబా, చందోర్కర్‌కు పంపించారని, వాటిని పూజ చేసేటప్పుడు చదవమని చెప్పారని వుంది. కాని శ్రీ బి.వి.నరసింహస్వామీజీ, ఆరతిపాటను చదివి చందోర్కర్ తన అభిప్రాయాన్ని తెలియజేయవలసిందిగా బాబా అన్నట్లువుంది. కాని ఈ సంగతి అర్థం కావడం కష్టంగానే ఉంది. ఎందుకంటే బాబావంటి మహానుభావులు ఒకసారి ఆరతి గీతాన్ని విని ఒప్పుకున్న తరువాత, తిరిగి చందోర్కర్ అభిప్రాయాన్ని ఎక్కడైనా అడుగుతారా అని? బాబాను కీర్తిస్తూ ఒక భక్తుడు వ్రాసినదాన్ని, వేరొక భక్తుడి, అభిప్రాయం కోసం బాబా పంపిస్తారా? అన్న సందేహం కూడా వస్తుంది. అదీకాక నానాసాహెబ్ చందోర్కర్ కూతురు మైనతాయిగాని, కొడుకు బాపూరావు చందోర్కర్‌గాని ఈ విషయాన్ని వారి జ్ఞాపకాల్లో ఎక్కడా చెప్పినట్లు కూడా లేదు.

ఈ విధంగా ఆరతి పాటలపై విభిన్న అభిప్రాయాలు వున్నప్పటికీ, మనం ఎవరిదీ తప్పనిగాని, కాదనిగాని అనలేని పరిస్థితి వున్నది. ఒక విషయం నిర్ధారణ చేసుకోవచ్చు. ఏమిటంటే, బాబా అప్పటికున్న విధానం ప్రకారం, ఊదీని మాత్రమే రామ్‌గిరిబువా చేత నానాసాహెబ్ చందోర్కర్‌కు పంపి ఉండవచ్చు. ఇక ఆరతి పాటల విషయానికొస్తే, 1910కి ముందే చాలాకాలం నుండీ భక్తులు బాబాకు పూజలు చేసేటప్పుడు ఆరతి కూడా ఇవ్వాలన్న కోరికతో వున్నట్లున్నూ, దానికొర్రకై వారందరూ అనేకానేక పాటలుగాని, కీర్తనలుగాని సేకరి స్తున్నట్లున్నూ తెలియవస్తోంది. అయితే వీటన్నింటికి బాబా అనుమతి కోసంగాను వారు చాలాకాలం నిరీక్షించినట్లు గూడా తెలియవస్తోంది. అది సుమారు ఐదు సంవత్సరాల కాలం పట్టి వుండవచ్చు. చివరకు బాబా అనుమతి 1910 నాటికి కలిగివుండవచ్చు.

ఈ ప్రకారం మనకు లభించిన సమాచారం విశ్లేషిస్తే బాబా చావడిలో నిద్రించేటప్పుడు శేజ్ ఆరతి ఇచ్చేవారని, తిరిగి ఉదయం మేలుకొనగానే కాకడ ఆరతి ఇచ్చేవారని అర్థమవుతోంది. దీని తరువాత చాలాకాలానికి మశీదులో మధ్యాహ్న ఆరతి, సాయంకాల ఆరతి మొదలయ్యాయి.

**మశీదులో కాకడ ఆరతి శేజ్ ఆరతులు ఎందుకు ఇచ్చేవారు కాదు? :**

ఇదొక ముఖ్య ప్రశ్న చాలామందికి కలుగుతూ ఉండేది. మశీదులో కాకడ ఆరతి శేజ్ ఆరతులు ఇవ్వడానికి బాబా ఎందుకు వొప్పుకునేవారు కాదు? దీనికి సమాధానం బాబా ఎక్కడైనా చెప్పివున్నారా? లేక బాబా తరుపున ఇంకెవ్వరైనా దగ్గర భక్తులు చెప్పివున్నారా? అన్నది తెలియాలి. ఒకవేళ పై రెండు మార్గాల ద్వారా విషయం అవగాహనకు రాకపోతే మూడో మార్గమేదైనా ఉందా? అన్నది కూడా చూడాలి. సాధారణంగా అన్ని రకాల ఆరతులు ఒకే పరమార్థాన్ని తెలియజేస్తూ వుంటాయి. అయితే మధ్యాహ్న లేక సాయంకాల ఆరతులకు మట్టుకు ఒక ప్రత్యేకత వుంది. ఆ రెండింటిలో భావార్థం మంత్ర రూపంగా కాని, స్తోత్ర రూపంగా కాని ఉంటుంది. ఇక కాకడ ఆరతి, శేజ్ ఆరతులు మాత్రం కైంకర్య రూపంగా నడుస్తూ వుంటాయి. కైంకర్యమంటే సేవ అని సాధారణ అర్థం. దీన్లోంచి వచ్చిందే కింకరుడు అన్నమాట కూడ.

ఇవి రెండూ దేవాలయాల్లో జరిగే నిత్య పూజా విధానాల్లో ఒక భాగంగా వున్నాయి. ఇంకా చెప్పాలంటే ఈ రెండు ఆరతులు సిద్ధాంతపరమైన విగ్రహారాధన ప్రక్రియలవడం వల్ల, సనాతన ముస్లిం మతస్థుల అభిప్రాయాలతో ఏకీభవించకుండా వున్నాయి.

ఇక బాబా విషయానికొస్తే, హిందూ ముస్లిం విధానాల రెండింటినీ సమతూకంగా స్వీకరించే స్వభావం కల్గిన మహాపురుషుడుగా కనబడతారు. మార్గాలు రెండుగా వున్నప్పటికీ  పరమార్థం ఒక్కటే అన్న అభిప్రాయాన్ని సర్వులకూ సులువుగా బోధపడేటట్లు చేయగల సమర్థులు. అలా కాకపోతే కాకడ ఆరతి, శేజ్ ఆరతులు మశీదులో జరపటంవల్ల సామాజిక ఐకమత్యం సందడి కలగకుండాపోయేది. దీనికి ముఖ్య కారణం ఆ రెండు ఆరతులూ హిందూ దేవాలయా ల్లోనే జరుగుతూ ఉండేవి. కాబట్టి మశీదులో జరపడానికి బాబా అనుమతి నిరాకరించారు అని చెప్పవచ్చు. ఇంత పవిత్రమైన భావనా వెల్లువలు బాబాకు కలుగకపోతే నష్టపోయేది సమాజమే కదా!

**వాడా ఆరతి :**

పవిత్రమైన ఆరతి సాంప్రదాయంతో ప్రారంభమైనవి కాకడ ఆరతి, శేజ్ ఆరతులు. కాబట్టి ఎక్కడా ఆటంకం రానివ్వకూడదు అన్నది ఒక విశ్వాసం. ఇప్పుడు మశీదులో ఈ సాంప్రదాయాన్ని పాటించడానికి బాబా అంగీకరించలేదు కాబట్టి, భక్తులు ఇక చావడినే ముఖ్య స్థలంగా చేసుకుని బాబా పడుకున్నప్పుడు రోజు విడిచి రోజు రాత్రి శేజ్ ఆరతి ఇచ్చేవారు. బాబా మశీదులో పడుకున్నరోజున, సాధేవాడాలో బాబా చిత్రపఠం పెట్టి అక్కడ ఆరతి ఇస్తూ వుండేవారు. తరువాత కాలంలో దీక్షిత్ వాడా నిర్మాణం జరిగినప్పుడు అక్కడ ఇస్తూవుండే వారు. సాథేవాడాలో ఆరతి కార్యక్రమాలకి బాపు సాహెబ్ జోగ్ పర్యవేక్షకుడిగా వుండేవాడు. 1912లో గురుస్థానం దగ్గర బాబా పాదుకల ప్రతిష్ఠ జరిగిన తరువాత మూడవ ఆరతి అక్కడ ఇవ్వడం మొదలుపెట్టేవారు. దీనికి దీక్షిత్ అనబడే యువకుడ్ని నియమించారు. దీనివల్ల క్రొత్తగా రెండుచోట్ల అనగా ఒకటి సాథేవాడాలోనూ రెండవది గురుస్థానం దగ్గర ఒకేసారి ఆరతులు జరుగుతూ వుండేవి. కాని ఈ రెండు స్థలాలు ఒకే ఆవరణలో వుండడం వల్ల ఇది కాస్త వింతగా కనపడుతూ

వుండేది. ఇదిచూసి ఒకసారి బాబా తమాషాగా ఇలా అన్నారు. అరె! జోగ్ నువ్వు ఆరతి ఇస్తున్నప్పుడు సరిగ్గా నిలబడలేకపోతున్నావు. ఈ దీక్షిత్ అనే కుర్రాడు నిన్ను ఎప్పటికైనా మించిపోతాడు చూడు. "పరిస్థితులు కూడా అలాగే మారాయి. ఆరతులకు వచ్చే జనం కూడా ఎక్కువగా దీక్షిత్ వైపు అనగా గురుస్థానం వైపు వెళ్తూవుండేవారు. జోగ్ ఆరతులిస్తున్న సాథేవాడావైపు చాలా తక్కువమంది వెళ్ళేవారు. అయినప్పటికీ జోగ్ ఆరతి మానేవాడు కాదు. ఒకరున్నా, లేక ఇద్దరున్నా ఆరతి కొనసాగిస్తూ వుండేవాడు.

**సాయి ఆరతులు ఎలా ఉంటాయి? :**

బాబా భౌతిక శరీరధారులై వున్న కాలంలో ఆరతులు ఎలా జరిగాయో మనకు కళ్ళకు కట్టినట్లు శ్రీసాయి సచ్చరిత్రలో విపులంగా చర్చించారు. మధ్యాహ్న భోజన వేళకు కాస్త ముందుగా మశీదులోవున్న గంట మోగేది. దాని అర్థం మధ్యాహ్నపూజ, దాని తరువాత ఆరతి బాబాకు సమర్పించడానికి సిద్ధంగా ఉంది అని తెలియజెయ్యడమే. ఆ గంట శబ్దం వినగానే భక్తులందరూ మశీదుకు చేరుకునేవారు. బాబాకు పూజ మొదలయ్యేది. గంధం, అక్షితలు తయారుగా వుంచే వారు. పెద్ద పండగ వాతావరణం కనపడేది. గంధం అక్షితలుతోబాటు పసుపు కుంకుమ కూడా ఉండేది. బాపూసాహెబ్ జోగ్ పరమభక్తి శ్రద్దలతో ఆరతి ప్రారంభించేవాడు.

మధ్యాహ్న ఆరతిలో స్త్రీలు పురుషులు కూడా పాల్గొనేవారు. స్త్రీలు మశీదులో నిలబడి వుండగా, పురుషులు మశీదు బయట ఆవరణలో నిలబడేవారు. భక్తులందరూ ఏక కంఠస్వరంతో ఆరతి శ్లోకాలు పాడుతుండగా, దానికి అనుబంధంగా తప్పెటలు, తాళాలు, గంటలు మోగిస్తూ ఉండేవారు. బాబా తన స్థానంలో కూర్చొని చిలుము త్రాగుతూ ఉండేవారు. జోగ్ బాబాకు ఎదురుగా నిలబడి కుడిచేత్తో పంచారతి త్రిప్పుతూ వేరొక చేత్తో గంట వాయిస్తూ వుండడం కనబడేది. ఆరతి పూర్తవ్వగానే అందరూ గట్టిగా "శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కి జై" అని కీర్తించేవారు. జోగ్ కర్పూరం వెలిగించి మూడుసార్లు బాబాకు సమర్పించేవాడు. అటుపిమ్మట బాబా ముందు సాష్టాంగ

నమస్కారం చేసి, తీపి పదార్థం నైవేద్యంగా ఇచ్చేవాడు. బాబా తన చేతుల్ని ముందుకు సాచి జోగ్ ఇచ్చిన నైవేద్యాన్ని స్వీకరించేవారు.

మిగిలిన ప్రసాదం అందరకూ పంచిపెట్టేవారు. ప్రేమ భక్తితో మిళితమైన బాబా ఆరతి కార్యక్రమం కళ్ళకు ఇంపుగా జరుగుతూ వుండేది.

**అది జీవంతోనున్న విగ్రహమూర్తి :**

సాయిబాబా వంటి దివ్య మంగళస్వరూపునికి ఇచ్చే ఆరతి ఆయనపై నున్న గౌరవ మర్యాదలకు భక్తులు అందజేసే కృతజ్ఞతాపూర్వక కర్మకాండ మాత్రమే కాక అంతకంటె ఇంకా విలువైనదిగా ఉండేది. వారందరికీ బాబా భగవంతుని ప్రతిరూపంగాను, ఇంకా ఈ భూమ్మీద అందరి కళ్ళకూ ప్రత్యక్షంగా కనపడుతూ నడిచే దేమునిగాను, దైవత్వం పరిపూర్ణంగా నిండుకొన్న ఒక దయాళువుగాను దర్శన మిచ్చేవారు. ముఖ్యంగా ఆరతివేళల్లో ఆయన జీవంతోనున్న విగ్రహ మూర్తిగా గోచరించడం చెప్పుకోదగ్గ ఒక గొప్ప విషయంగా వుండేది. నిజానికి మంగళవాయిద్యాల మధ్య ఆరతి అట్టహాసంగా నడుస్తున్నప్పుడు, బాబా ప్రవర్తన వింతగా వుండేది. ఆ సంబరం తన కోసం చేస్తున్నదిగా ఆయనకు కనపడేదికాదు. ఆయన స్థానంలో పరమశాంతస్వరూపులై కూర్చుని చిలుము త్రాగడంకాని, లేదా దగ్గరగావున్న వారితో ఏదైనా మాట్లాడడం కాని చేస్తూ వుండేవారు. బాబా ముఖ కవళికలు, కదలికలు ఎవ్వరికీ అంతుచిక్కేవి కావు. ఉన్నట్లుండి ఒక్కోసారి ఉగ్రరూపంగా మారిపోతూ వుండేవారు. కొంతమంది భక్తులకైతే ఏక్షణంలోనైనా బాబా ఆరతిని వద్దని అంటారేమో అన్న భయం పీకుతూ వుండేది. ఒక్కోసారి అపరిమిత దయా వర్షాన్ని కురిపించే వారు.

చావడి ఉత్సవం జరిగేటప్పుడు అనుకోకుండా నాట్యం చేస్తూ ఆనందింప చేసేవారు. ఆరతి కార్యక్రమాన్ని సజావుగా నడిపిస్తూనే, మధ్యలో లేచి కట్టలు తెంచుకున్న కోపంతో ఊగి పోతూ, అందరిలోనూ దాగివున్న అంతర్గత శత్రువులైనా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను తిట్టేవారు. ఆ శత్రువులను పేర్లు పెట్టి పిలుస్తున్నట్లు, తన భక్తులైన అప్పాకోటే, తేలిన్, వామన్ తాత్యా మొదలైనవారిని ఉద్దేశించి మాట్లాడుతున్నట్లు వుండేది. ఆ

సందర్భాల్లో బాబా అంతరంగాన్ని గ్రహించిన భక్తులు ఈ విధంగా ప్రార్థన చేసేవారు. ఓ భగవాన్ సాయినాథా! ఈ కాకడ హారతిని మీకు సమర్పించుకుంటూ ప్రార్థన చేస్తున్నాము. దయతో మాలో పెరుగుతున్న అరిషడ్వర్గాలైన కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలను తుదముట్టించేలా మమ్ములను అనుగ్రహించుదేవా'' అని వేడుకునేవారు.

**ఆరతి అనబడే బాబా తత్త్వాగ్ని జ్వాలలు :**

ఆరతి కార్యక్రమం నడుస్తున్నప్పుడు బాబా తనకేమీ అదంతా పట్టదు అన్నట్లు కనపడినా, ఆయన హృదయంలో అపారమైన దయ పొంగిపొర్లుతూ ఉండేది. దయను ఆయన తనదైన శైలిలో బహిర్గతం చేసేవారు. ఆ కారణంచేతనే ఆరతివేళల్లో చాలామంది భక్తులకు బాబా అనుగ్రహం ఒక వరంలాగ కనపడుతూ వుండేది. వారిలో ముఖ్యులు శ్రీ కె.జె.భీష్మ, శ్రీ జి.ఎస్. కపర్దే, శ్రీసాయిన మహరాజ్, శ్రీమేఘా, శ్రీదాసగణు మహరాజ్, శ్రీమాధవ్ అదకర్ మొదలైన వారు.

శ్రీ కె.జె.భీష్మ మాటలు ఇలావున్నాయి. నేను ఆరతి శ్లోకాలు పఠించేటప్పుడు, ఒక శ్లోక భావం ఇలావుంది. అహో! పంచారతి దీప జ్వాలల కాంతిలో సద్గురు సాయినాథులు గొప్ప ప్రకాశవంతంగా దర్శనమిస్తున్నారు. ఆ దీపకాంతి ద్వంద రూపంగా కనపడుతున్న అజ్ఞానమనే చీకట్లను తరిమికొడుతోంది. అహో! దృక్కు, దృశ్యము కలిసి ఏకరూపంగా కనపడుతోంది. నేనూ, నా నీడా ఒకటే కదా అనే సత్యం సాక్షాత్కరిస్తోంది.

శ్రీ జి.ఎస్.కపర్థే తన ఆరతి అనుభవాల్ని దినచర్య పుస్తకంలో వ్రాసి పెట్టుకున్నారు. అవి ఆనాటి సంగతుల్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తున్నాయి. కపర్థే దృష్టిలో ఆరతులు ఎంతో సంస్కారవంతంగా కనపడుతున్నాయి. ఇంకా చెప్పాలంటే ఆసమయంలో బాబా నాకు ఆనంద స్వరూపులుగా కనబడుతున్నారు. అట్టి ఆనంద స్వరూపం నుండి దయ అనబడే వెలుగు అక్కడున్న అందరిపై ప్రసరించడం నాకు స్పష్టంగా కనపడుతోంది. ఆ ప్రసరణలో బాబా దివ్యత్వం సూత్ర మాలికలా మారి అందరి కంఠసీమలను అలంకరిస్తోంది. కపర్థే దినచర్య

పుస్తకంలో **17-1-1912**న జరిగిన ఒక విశేషం చెపుతున్నాడు. "అప్పుడు మేమందరం కాకడ ఆరతి నిమిత్తం చావడికి బయలుదేరాం. కాని మేఘా రాలేదు. అతను ఆరోగ్యం బాగులేక నీరశంగా వున్నాడు. కాబట్టి ఆరతిని బాపూ సాహెబ్ జోగ్ ఇచ్చాడు.'' జోగ్, ఆరతి ఇచ్చిన తరువాత ఇలా అన్నాడు. "బాబా చాలా ప్రసన్నవదనంతో కనపడుతున్నారు. ఆ ముఖంలో నవ్వు ఎంతో దయతో కూడుకుని వుంది. అటువంటి ముఖారవిందం జీవితంలో ఒకసారైనా చూసితీరాలి. దానికోసం గాను ఎన్ని సంవత్సరాలైనా నిరీక్షించక తప్పదు. ఆహా! ఆ దివ్య దర్శనం నాకిప్పుడు కలిగింది. నాలో ఉప్పొంగుతున్న సంతోషం కట్టలు తెంచుకుంటూ ఉంటే నేను బాబా ఎదురుగా ఒక పిచ్చివాడిలా నిలబడివున్నాను.''

అలాగే కపర్డే **7-1-1912** నాటి సంగతి వివరిస్తున్నాడు. "ఈ రోజు ఉదయం నేను కాకడ ఆరతికి హాజరయ్యాను. అక్కడ సాయిన మహరాజ్ వున్నారు. ఆయన ఎంతో ఆనందంగా కనపడుతున్నారు. ఆయనలో దివ్యమైన యోగ లక్షణాలు ప్రస్ఫుటంగా వున్నాయి. అక్కడి దృశ్యం తలుచుకుంటూ నేను రోజంతా పారవశ్యంతో గడిపాను.''

అలాగే **6-1-1912** నాటి విషయం ఇలావుంది. "మేమందరం చావడిలో ఇచ్చే శేజ్ ఆరతికి వెళ్ళాము. ఆరోజు కూడ సాయిన మహరాజ్ అక్కడ ఎంతో ఉత్సాహంతో కనపడ్డారు. ఆయన కొన్ని తత్త్వ సంబంధమైన సంకేతాలను మేఘాకు చూపెట్టారు. అంతేకాక యోగశాస్త్రంలో చెప్పబడిన దృష్టిపాత సంబంధమైన కర్మ రహస్యాలను విప్పి చూపెట్టారు.''

**22-1-1912** నాటి విషయం ఇలావుంది. "ఆరతి కార్యక్రమం ముందు జరిగే పూజలో ఆయన రెండు పువ్వులను, తన రెండు ముక్కు రంధ్రాల్లోనూ ఇరికించారు. ఇంకో రెండు పువ్వులను చెవుల మధ్య పెట్టుకున్నారు. అలాగే తలపై కూడా పువ్వులు పెట్టుకున్నారు. మాధవరావుదేశ్ పాండే నా దృష్టిని అటువైపు త్రిప్పాడు. ఇది దేనికైనా ఒక సూచన అని నాకు అనిపించింది. సాయిన మహరాజ్ ఇదే పద్ధతిని రెండోసారి కూడా చేసి చూపెట్టారు. అదే ప్రకారం **8-3-1912**న మధ్యాహ్న ఆరతి సమయంలో కూడా సాయిన మహరాజ్ తన చేతుల్తో సంజ్ఞలు చేస్తూ ఒక యువకుడి పద్ధతిని అనుకరించారు. అలాగే

నడిచి వెడుతున్న మనిషి తీరును కూడా చూపెట్టారు. ఇదంతా దేనికి సంబంధించినదో నాకు తెలీలేదు.

కాని ఒక విషయం రూఢి అయ్యింది. బాబా మన ఆలోచనా విధానాన్ని తన అద్భుతమైన శైలిలో పదునుపెడుతూ వుంటారు. ఆయన మాటలు, చేష్టలు అర్ధం కావాలంటే మనకు మంచి చతురత అవుసరం ఎంతైనావుంది. రోజు వారీ కార్యక్రమంగా జరిగే ఆరతిని ఒక దివ్యమైన ఆధ్యాత్మిక పండగగాను, భగవంతుని కరుణతో నిండిన ఒక వాహనంగానూ బాబా మార్చివేసారు.

ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. ఆరతి కార్యక్రమం ఎంత గొప్పగా జరుగుతున్నప్పటికీ అప్పుడప్పుడు బాబా దాని విధానాన్ని మలుపు త్రిప్పుతూ ఉండేవారు. అంటే అర్ధం బాబా ఊహను బట్టి ఒక్కోసారి ఆలశ్యంగా మొదలవుతూ వుండేది. ఇంకోసారి తొందరగా ముగించడం కూడా జరిగేది. ఏకారణం చేత ఇలా జరుగుతున్నాదో అని భక్తులు పరిపరి విధాల ఆలోచన్లలో పడేటట్లు చేసేవారు. ఒక ప్రముఖ వ్యక్తి రాకకోసం ఆరతిని మొదలు పెట్టకుండా చేసారని తరువాత అర్ధమయ్యేది.

మొదట్లో ఆరతి శ్లోకాలు ఎక్కువగా చదివేవారు కాదు. ఎందుకంటే బాబాను స్తుతిస్తూ వ్రాసినవి తక్కువగా వుండేవి. అవికూడా దాసగణుమహరాజ్, మాధవరావు అదకర్ వ్రాసినవే చదివేవారు. ఇవి కూడా పూర్వకాలపు మహారాష్ట్ర సంత్‌లు పండిరిపుర విఠల్‌నాథునిపై వ్రాసిన ఆరతిపాటల బాణీలోనే నడిచేవి. ఇలా ఒక సంవత్సరం గడచిన తరువాత ప్రత్యేకంగా ఆరతి పుస్తకం ఒకటి రూపుదిద్దుకుంది. ఇందుకు ముఖ్య కారణం శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ అనే చెప్పాలి. ఈయన నాగపూర్ దగ్గరున్న బోరి అనే గ్రామం నుండి వచ్చేరు. ఈయన ఖపర్థేకు మంచి స్నేహితుడు. ఖపర్థేతో కల్సి 6-12-1911న షిరిడికి వచ్చారు. సాయిబాబాను కలవడానికి ముందు ఈయన సనాతన ధర్మానికి కట్టుబడి జీవనం సాగిస్తున్న ఒక పండితుడు. షిరిడికి రాకపూర్వం ఈయనకు విచిత్రమైన కల వచ్చింది. త్రిపుండాలు నుదుటన ధరించి వైష్ణవ సాంప్రదాయాన్ననుసరించి బట్టలు కట్టుకున్న ఒక గోసాయి దర్శనమిచ్చాడు. అతడు మాట్లాడ కుండా ఒక వార్తా పత్రిక చూపించాడు. దానిమీద సచ్చిదానంద'

అని వ్రాసివుంది. భీష్మ అది చూసి ఏమిటి అని అడిగాడు. దానికి ఆ గోసాయి అదే పేపరులో వున్న ఇంకోపదం చూపెట్టాడు. 'మంత్రమా లేక శిక్షణమా' అనివుంది. భీష్మ ఇంకో ప్రశ్న వేసే లోపలే, ఆ గోసాయి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. ఇదీ కల, భీష్మకు వెంటనే తెలివి వచ్చింది. కాని ఎంత గుర్తు తెచ్చుకున్నా కలలో చూసిన మాటల అర్థం కుదుట పడలేదు. తరువాత కొన్ని సంవత్సరాలకు ఖపర్దే ఆహ్వానం మేరకు షిరిడి వెళ్ళడం జరిగింది. భీష్మను చూడగానే బాబా చేతులు జోడించి నమస్కరిస్తూ 'జై సచ్చిదానంద' అన్నారు. భీష్మ అది చూసి ఉలిక్కి పడ్డాడు. కొన్ని సంవత్సరాల క్రిందట తాను కలలో చూసిన వైష్ణవ గోసాయి చూపెట్టిన పేపరు గుర్తుకొచ్చింది. ఆ గోసాయి సాయిబాబాయేనా? అన్న ప్రశ్న వేసుకున్నాడు. కాని అది ఎలా కుదురుతుంది. కలలో కనపడింది ఒక సాంప్రదాయ బద్ధమైన బ్రాహ్మణ సాదువు. ఇక్కడ కనపడుతున్నది ఒక ముస్లిం ఫకీరు. భీష్మ ఎటూ తెల్చుకో లేకపోయాడు.

ఇంక షిరిడీ గ్రామంలో చాలామంది బ్రాహ్మణ పండితులు కనపడ్డారు. వారందరూ ద్వారకామాయికి వచ్చి బాబాకు నమస్కరించి, బాబా పాదతీర్థాన్ని సేవిస్తున్నారు. వారిలో ఏ కోశాన జంకు కనబడటంలేదు. ఇంతటి వింత చూసిన తరువాత తనలో కల్గిన ప్రశ్నలు అసందర్భమైనవని తేల్చుకున్నాడు.

దీని తరువాత భీష్మకు, బాబా చిలుం త్రాగడం కనిపించింది. బాబా చిలుం త్రాగుతూ, ఆ చిలుం గొట్టాన్ని ప్రక్కనే ఉన్నవారికి అందించారు. అతడు గూడ ఒకసారి పీల్చి ఆ ప్రక్క వాళ్ళకు అందచేసాడు. భీష్మకు ఇదంతా ఒక వింతగా కనపడింది. కాని మనుసులో ఏదో తెలియని సందేహం కలుగుతోంది. ఒక ముస్లిం ఎంగిలి చేసిన చిలుం గొట్టం వేరొకరు తిరిగి నోట్లో పెట్టుకుని ఎలా త్రాగుతున్నారనిపించింది. ఆశ్చర్యంగా, అతడు కూడా బాబా ప్రక్కనే కూర్చుని వున్నాడు. ఇంకో వింత ఏమిటంటే, బాబా ఆ చిలుం గొట్టాన్ని తనకు అందివ్వకుండా ఊరుకోడం.

ఒకరోజు బాబా తన దగ్గరగా కూర్చున్న వారికి చిన్న కథను చెప్పడం ప్రారంభించారు. చెప్తూ చెప్తూ ఒక్కసారి ఆపి తను పీలుస్తున్న చిలుం గొట్టం,

భీష్మకు అందించారు. భీష్మ ఏ మాత్రం సంకోచించకుండ చిలుం త్రాగాడు. అప్పుడు బాబా అన్నారు. చూడండి నేను అనేక చోట్ల తిరిగాను వాటిలో కొండలున్నాయి, పెద్ద పెద్ద పర్వతాలున్నాయి. ఇంకా బొంబాయి వెళ్ళాను. అక్కడి నుండి పూనే వచ్చాను. సతారా, నాగపూర్ కూడా వెళ్ళాను. అయితే అన్ని ప్రాంతాల్లోను నాకు శ్రీరాముడు నిండుగా కనపడుతున్నాడు. కథ ఆపి భీష్మతో కొంచం కోపంగా ఇలా అన్నారు. అరె! అన్ని లడ్డూలు నువ్వే ఎందుకు తిన్నావు? నాకు ఒక్క చిన్న ముక్క కూడా ఇవ్వలేదేం? సరే జరిగిందేదో జరిగింది. ఇప్పుడు నాకు ఐదు లడ్డూలు తెచ్చియ్యి.

బాబా ఇలా అనగానే భీష్మకు కనువిప్పు కలిగినట్లయ్యింది. అంతవరకూ మబ్బుల్లా కమ్ముకుని వున్న తన అజ్ఞానాంధకారం, ఒక్క చిలుం పీల్పుతో పతాపంచలయ్యింది. పరమ వినయంతో బాబా పాదతీర్థం సేవించి, బాబా పాదాలకు తన తల తగిలేటట్లు వంగి నమస్కరించాడు. బాబా కూడ భీష్మ వైపు తిరిగి హృదయపూర్వకంగా ఆశీర్వదించి అతడి తల నిమిరారు. దాంతో ఏదో తెలియని పరవశత్వం భీష్మను నిండుగా ఆవరించింది.

తరువాత భీష్మ తన బసకి చేరుకున్నాడు. కాని బాబా చెప్పిన ఐదు లడ్డూలు ఏమిటా అని ఆలోచించసాగాడు. మరునాటి ఉదయం లేవగానే కొత్త ఆలోచన తట్టింది. వెంటనే కాగితం కలం తీసుకుని శ్లోకం వ్రాయడం మొదలు పెట్టాడు. ఆ మరునాటి ఉదయం కూడా అలాగే జరిగింది. ఆ ప్రకారం భీష్మ కలం నుండి ఒక దివ్యశక్తి ఉద్భవించినట్టై ఐదు శ్లోకాలు తయారయ్యాయి. వెంటనే వెళ్ళి బాబా దర్శనం చేసుకుని ఆ ఐదు శ్లోకాలు బాబాకు సమర్పించాడు. బాబా అడిగిన ఐదు లడ్లు అవే అని రూఢి అయింది. బాబా కూడ వాటిని ఆమోదించి, భీష్మను ఆశీర్వదించారు.

ఆ తరువాత ఐదు శ్లోకాలకు అదనంగా మరికొన్ని శ్లోకాలు కూడా భీష్మ కలం నుండి పుట్టుకొచ్చాయి. భక్తులందరూ వాటిని చదివి మంత్ర ముగ్ధులయ్యారు. ఆ శ్లోకాలనన్నింటిని ఆరతి పాటలకు జతచేసారు. తరువాత భీష్మ 'శ్రీసాయినాథ్ సగుణోపాసన' అనబడే పుస్తకాన్ని ప్రచురించాడు. ఆరతి పాటల తరువాత వీటిని చదివేవారు ఇవన్నీ హిందూ మత సాంప్రదాయాన్న

నుసరించి వచ్చే పురుష సూక్తం, శ్రీసూక్తం, మంత్రపుష్పం, శ్రీలక్ష్మి అష్టోత్తరంతో కలిపి ఉండేవి. ఇవి రోజువారీ పూజా కార్యక్రమాల్లో భక్తులు చదవడానికి వీలుగా వుండేవి. ఈ పుస్తకాలకి కావల్సి ఆర్థిక సహాయాన్ని ఖపర్దే భరించేవాడు. ఇలా **1922** వరకూ జరిగింది. బాబా మహా సమాధి అనంతరం 'శ్రీసాయినాథ్ సగుణోపాసన' షిరిడి సంస్థానానికి బాబా పూజల నిమిత్తం ఒక అధికారిక పుస్తకంగా తీర్మానించబడింది. సంస్థానం వారు **1923** నుండి ఆ పుస్తకానికి కొన్ని మార్పులు, చేర్పులు చేసి షిరిడి ఆరతులు అన్న పేరిట ప్రచురించారు. ఈ పుస్తకంలో మొత్తంగా **30** ఆరతి పాటలున్నాయి. ఈ **30** ఆరతి పాటల్లో **16** పాటలు మాత్రమే సాయిబాబాను స్తుతిస్తూ వ్రాయబడ్డాయి. మిగతావి మహారాష్ట్రకు చెందిన ప్రసిద్ద సంత్ పురుషులు శ్రీతుకారాం మహరాజ్, శ్రీనామ్‌దేవ్ మహరాజ్, సంత్‌జానాబాయి వ్రాసి కూర్చినవి. ఇంకా ఒక్కొక్కటిగా శ్రీ రాంజనార్ధన్ స్వామి, శ్రీరామేశ్వర్ భట్‌లచే కూర్చబడ్డాయి. ఇంకొకటి వేదమంత్రం, మరిరెండు పాటలు సాంప్రదాయ బద్దమైన ప్రార్థనలుగా వున్నాయి.

శ్రీసాయిబాబాపై వ్రాసిన **16** పాటల్లో తొమ్మిదింటిని శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ వ్రాయగా మూడింటిని దాసగణు మహరాజ్ వ్రాసారు. ఇక ఉపాశనీ మహరాజ్, బి.వి.దేవ్, మాధవ్ అదకర్, మోహినీ రాజ్‌లు ఒక్కొక్క పాట వ్రాసారు.

మొత్తం మీద **30** పాటల్లో **25** పాటలు మరాఠీ భాషలో వున్నాయి. రెండు హిందీ భాషలోను, రెండు పాటలు సంస్కృతంలోనూ ఉన్నాయి. చివరగా ఇంకొక పాట సంస్కృత మరాఠీ భాషల సంకలనంగా రూపుదిద్దుకుని ప్రార్థనగా ప్రసిద్దికెక్కింది.

పై విషయాలను మరింత శ్రద్దగా పరిశీలిస్తే ఇలా ఉంటుంది.

బాబాను స్తుతిస్తూ పాడిన **16** పాటల్లో శ్రీ కె.జె.భీష్మ ఈ క్రింద చెప్పబడిన తొమ్మిది పాటలు వ్రాసారు.

1. ఉఠా ఉఠా శ్రీసాయినాథ గురుచరణ కమలదావా (కాకడ ఆరతి)
2. ఘే ఉని పంచారతీ కరూ బాబానీ ఆరతి (కాకడ / మధ్యాహ్న ఆరతులు)

3. కాకడ ఆరతీ కరీతో సాయినాథ దేవా..(కాకడ ఆరతి)
4. ప్రభాత సమయీ నభా శుభ రవి ప్రభాసా కలీ.. (కాకడ ఆరతి)
5. శ్రీసద్గురు బాబా సాయి (కాకడ ఆరతి)
6. ప్రేమేయా అష్టకాశీ...(కాకడ ఆరతి)
7. జయదేవ జయదేవ దత్తా అవధూతా...(మధ్యాహ్న ఆరతి)
8. జై జై సాయినాథా ఆతా...(శేజ్ ఆరతి)
9. ఆతా స్వామీ సుఖే నిద్రా...(శేజ్ ఆరతి)

ఆ ప్రకారం శ్రీసాయిబాబాను స్తుతిస్తూ వ్రాసిన 16 పాటల్లో శ్రీ కె.జె.భీష్మ వ్రాసిన తొమ్మిది పాటలు కాక మిగిలిన ఏడు పాటల్లో దాసగుణు మహరాజ్ మూడు పాటలు వ్రాసారు. అవి ఇలా వున్నాయి.

10. సాయి రహమ్ నజర్ కరనా... (కాకడ ఆరతి)
11. రహమ్ నజర్ కర్, అబ్మోరే సాయి... (కాకడ ఆరతి)
12. షిరిడి మాయే పండరిపూరా... (మధ్యాహ్న దూప్ ఆరతి) తరువాత నాలుగు పాటలు ఈ ప్రకారంగా వున్నాయి.
13. సదా సదాసత్వరూపం చిదానంద కందం..(ఉపాశినీ మహరాజ్) (మధ్యాహ్న ధూప్ ఆరతి)
14. రుసోమమ ప్రియాంబికా... (బి.వి.దేవ్) (ధూప్ ఆరతి)
15. ఆరతి సాయిబాబా సౌఖ్యదాతారజీవ (మాధవ్ అదకర్) (మధ్యాహ్న/ ధూప్ ఆరతి)
16. అనంతా తులాలే కసేరే స్తవావే..(మోహినీ రాజ్) (మధ్యాహ్న/ధూప్ ఆరతి) దీన్నే నమస్కారాష్టకమ్ అని కూడ అంటారు.

శ్రీసాయిబాబా నాలుగు ఆరతుల్లో మొత్తంగా నున్న 30 పాటల్లో 16 పాటలు వ్రాసిన మహాపురుషుల పేర్లు తెలుసుకున్నాం. ఇక 30లో 16 పోగా మిగిలిన 14 పాటలు రచయితల వివరాలు ఇలా వున్నాయి.

సంత్ తుకారం మహరాజ్ వ్రాసిన ఐదు పాటలు ఏవంటే?

1. కాకడ ఆరతి ప్రారంభంలోనే వున్న 'జోడునియా కరచరణీ తేవిలామాధా...

2. కాకడ ఆరతిలో వచ్చే 'భక్తీచియా పోఠీబోధ... కాకడ జ్యోతీ...
3. ఓవాళూ ఆరతీ మాఝూ సద్గురునాథా... (శేజ్ ఆరతి)
4. పాహీ ప్రసాదచీవాట... (శేజ్ ఆరతి)
5. పావలా ప్రసాద ఆతా విఠోనిజావే... (శేజ్ ఆరతి)

వీటినే తుకారాం అభంగాలు అంటారు. పండరినాథుడైన విఠోబాను కీర్తిస్తూ వ్రాసిన ఈ అంభంగాలనే సాయి ఆరతులుగా చేర్చి, ఆ పండరినాధుడే ఈ సాయిబాబా అని భావిస్తూ భక్తులు పరవశం చెందుతూ వుంటారు.

అలాగే నామ్‌దేవ్ మహరాజ్ వ్రాసినవి రెండు పాటలు.

6. ఉఠాపాండురంగా! ఆతాధర్శనద్యా సకళా...(కాకడ ఆరతి)
7. ఉఠాసాధుసంతా! సాధు ఆపులాలేహితా...(కాకడ ఆరతి) అలాగే సంత్ జనాబాయి వ్రాసినవి రెండు పాటలు
8. ఉఠాపాండురంగా (ఆతా) ప్రభాత సమయోపాతలా... (కాకడ ఆరతి)
9. తుజ్‌కాయదేవూసావళ్యా మీ ఖాయా తరీహో.... (కాకడ ఆరతి) పైన చెప్పినవి కాక మిగతా ఆరతి పాటల వివరాలు ఇలా ఉన్నాయి.
10. ఆరతి జ్ఞానరాజా... (శేజ్ ఆరతి) రామజనార్ధన్ స్వామి వ్రాసిన పాట
11. ఆరతి తుకారామ స్వామి... (శేజ్ ఆరతి)
    శ్రీ రామేశ్వర్ భట్ వ్రాసిన పాట
12. మంత్రపుష్పం (హరిః ఓం యజ్ఞేనయజ్ఞమయ జంతదేవాతాని ధర్మాణి... మధ్యాహ్న ఆరతి/ ధూప్ ఆరతి)
13. రెండు సాంప్రదాయక పాటలు
    - ఘాలీనలోటాంగుణ వందీనచరణా... (మధ్యాహ్న ఆరతి)
    - ఐసాయే యీ బా సాయి దిగంబరా... (మధ్యాహ్న ఆరతి/ ధూప్ ఆరతి)
14. ఈ క్రింద చెప్పబడినవి పారంపారిక/ సాంప్రదాయక ప్రార్ధనా శ్లోకాలు, నామసంకీర్తనలు

ఆరతి సాయిబాబా

- సాయినాథ్ గురు మాఝే ఆయీ...
  (కాకడ ఆరతి)
- త్వమేవ మాతాచ పితా త్వమేవ ...
  (మధ్యాహ్న ఆరతి/దూప్ ఆరతి)
- కాయేనవాచా మనసేంద్రియైర్వా...
  (మధ్యాహ్న ఆరతి/దూప్ ఆరతి)
- అచ్యుతం కేశవం రామనారాయణం...
  (మధ్యాహ్న ఆరతి/దూప్ ఆరతి)
- హరే రామ హరే రామ రామ రామ హరే హరే...
  (మధ్యాహ్న ఆరతి/ దూప్ ఆరతి)
- సదా కల్పవృక్షస్యతస్యాదిమూలె...
  (మధ్యాహ్న ఆరతి)
- కరచరణ కృతంవాకాయజం కర్మజంవా...
  (మధ్యాహ్న/దూప్ ఆరతి)

**మేలు కొలుపు గీతాలు :**

కాకడ ఆరతి మొదలవ్వడానికి ముందు శ్రీసాయి మశీదు మందిరంలో మనకు వినిపించేవి మేలుకొలుపు గీతాలు. వీటికి ఎడతెగని ప్రాముఖ్యత ఏర్పడింది. మొదటిది గణపతి ప్రార్ధన. ఉఠా ఉఠా సకల జనవాచేస్మరా గజానన అని మొదలవుతుంది. రెండవది మహోఘనతవహించిన "ఘనశ్యామ సుందరా" అనే గీతం. దీని రచయిత శ్రీ హోనాజీ బాల (1754-1844). మహారాష్ట్ర దేశంలో పేరెన్నిక గన్న మహాకవి శ్రీహోనాజీబాల. ఇక మూడవ గీతం 'ఓం జయ జగదీశ హరే!' అన్నది అశేష జనావళి నోటివెంట ఎడతెగక పాడబడుతూ ఉంటుంది అనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. దీనిని వ్రాసిన మహాకవి శ్రీశ్రద్దారాం ఫిల్లోరి. ఆయన దేహం వదిలిపెట్టి కీర్తిని శేషంగా మిగిల్చిపోయిన మహానుభావుడు.

**బాబాకు ఆరతులు ఇచ్చే పద్ధతి :**

మొదట్లో ద్వారకామాయిలో ఉన్న భక్తతుకారం, జ్ఞానదేవ్ మహరాజ్ చిత్రపటాలకు పండగ రోజుల్లో ఆరతి ఇచ్చేవారు. రాను రాను ఆ పద్ధతిని రాధాకృష్ణమాయి మార్చివేసింది. ప్రతి రోజు నాలుగు ఆరతులు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టింది. దానితో బాటుగ సాయిబాబాకు కూడా నాలుగు ఆరతులు ఇచ్చే పద్ధతి 1910లో నూల్కర్‌తో ప్రవేశపెట్టబడింది.

**అవతార తత్త్వం :**

ఇది శాస్త్రీయమైన ఒక సిద్ధాంతం. దీని ప్రకారం భగవంతుడు అప్పుడప్పుడు మానవుడిగా జన్మిస్తూ వుంటాడు. ఎప్పుడు ధర్మానికి హాని కల్గుతుందో, అలాగే అధర్మం పెరిగిపోతుందో అప్పుడు భగవంతుడు అవతారం తాలుస్తాడిన భగవద్గీత చెబుతోంది. (భగవద్గీత 4-7) శ్రీసాయిబాబా అటువంటి భగవదవతారమే. అనేకానేక సంఘటనల ద్వారా బాబా జీవితం ఇందుకు నిదర్శనంగా ఉండేది. బాబాకు సకల యోగ ప్రక్రియలు తెలుసు. ఉదాహరణకు ప్రతి మూడు రోజులకొకసారి ఊరి వెలుపల బావి దగ్గరకుపోయి తన ప్రేగులను బయటకు తీసి, కడిగి, ఆరపెడుతూ ఉండేవారు. అలాగే మూడు అంగుళాల వెడల్పు ఇరవై రెండున్నర అడుగుల పొడువు కల్గిన గుడ్డపీలికను కడుపులోకి పంపించి అరగంట తరువాత బయటకు లాగే వారు. అలాగే తన శరీరంలోని అవయవాలను వేరు చేసి మశీదులో వేరు వేరు చోట్ల వుంచేవారు.

శ్రీసాయిబాబా భౌతిక శరీరంతో వున్నప్పుడు, ఆరతులు ఇచ్చే అదృష్టం తాత్యాసాహెబ్ నూల్కర్, మేఘాశ్యామ్, బాపు సాహెబ్ జోగ్‌లకు దక్కింది. బాబా ఆరతులకు హాజరయ్యేవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతూ, జాతి, మత కుల సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆరతి కార్యక్రమంలో పాల్గొనేవారు. 1940వ సం॥లో శ్రీ బి.వి.దేవ్ (బాలకృష్ణ విశ్వనాధ దేవ్) రచించిన 'శ్రీగురు ప్రసాద యాచనా దశకం, రుసోమమ ప్రియాంబికా' కూడా దూప్ ఆరతిలో చేర్చారు. ఈ పాటను శ్రీ బి.వి.దేవ్ 7-3-1940 నాడు రచించారు. ఆ రోజు మహా శివరాత్రి, గురువారం అయింది.

## ఆరతి సాయిబాబా

శ్రీసాయినాథులు స్వయంగా ఆరతులను స్వీకరించడమేకాక, వాటి ప్రాముఖ్యతను కూడా చాలాసార్లు నిరూపణ చేసిన సందర్భాలు ఎన్నో వున్నాయి. సుమారు 100 సంవత్సరాల క్రితమే బాబా అన్న మాటలు ఇలావున్నాయి. 'నా ఆరతులు దర్శించడానికి భక్తులు తండోప తండాలుగా, చీమలు బారులు తీరినట్లు వస్తారు'' అని అనేవారు. నిజంగానే బాబా చెప్పినట్లుగా అది ఈనాడు జరుగుతోంది.

బాబా మహాసమాధి చెందిన తరువాత ఒక విచిత్రం జరిగింది. లక్ష్మణ్ మామా జోషికి కలలో కనపడి, నేను మరణించాననుకుని ఇక ఆరతులు ఎందుకు ఇవ్వడం అన్నభావనతో జోగ్ ఆరతి మరిచిపోయినట్లున్నాడు. అంచేత వెంటనే నువ్వు వచ్చి నా పూజ చేసి ఆరతి ఇయ్యి అన్నారుట. ఆ మాటతో జోగ్ పరుగున బాబా సమాధి దగ్గర కొచ్చి ఎంతో ప్రేమతో ఆరతి సమర్పించాడు. ఈ సంఘటన వల్ల, అతడికి కల్గిన కీర్తి ఏమిటంటే, బాబా సమాధి చెందిన తరువాత మొదటగా ఆ సమాదికే ఆరతి ఇచ్చిన భక్తుడుగా జోషి ప్రసిద్ధికెక్కాడు.

శ్రీమాధవ్ అద్‌కర్ 1903వ సం॥లో షిరిడికి వచ్చాడు అతడు గొప్ప ఆసుకవి. దాసగణు మహారాజ్‌తో కల్సి తిరిగేవాడు. 1905లో సాయిబాబాపై ఒక పాట రచించి బాబా మెప్పును పొందిన ధన్యజీవి. ఆ పాటే మధ్యాహ్నం, సాయంకాలం పాడుతున్న ఆరతుల్లో 'ఆరతి సాయి బాబా సౌఖ్యధాతారజీవ' అనబడే గొప్ప పాట. ఈ పాటనే నానాసాహెబ్ చందోర్కర్ కూతురు మైనతాయికి బాబా పంపించారు.

భగవంతుడికి సమర్పించే ఆరతి కార్యక్రమంలో భగవంతుడి తత్త్వం అంతర్లీనంగా ఉంటుంది. దీప జ్యోతిని దైవ ప్రతిమ చుట్టూ ఎలా త్రిప్పుతూ వుంటామో, అదే విధంగా మన దైనందిన కర్తవ్యాలను భగవంతుణ్ని కేంద్రంగా చేసుకొని నిర్వర్తించాలి. భగవంతుడే మన జీవితాలకు, కర్తవ్య కార్యకలాపాలకు కేంద్ర బిందువు అనే విషయాన్ని సదా గుర్తు పెట్టుకున్నట్లయితే, మనోబలం పెరిగి కష్ట నష్టాల్ని తట్టుకునే శక్తి కుదురుతుంది.

కర్పూరం వెలిగితే కనీశం బూడిద కూడా మిగలదు. అదేవిధంగా మనలోని కోరికలు అనబడే కర్పూరాన్ని జ్ఞానమనే అగ్ని చేత నశింపచేస్తే, వాటి జాడ

కూడా మిగలదు. ఇదే విషయాన్ని భగవద్గీత కూడా **(4-37)**లో ఇలా అంటుంది. 'యథైధాంసి సమిద్ధోగ్నిః భస్మసాత్ కురుతే అర్జున జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా!' అర్జునా యజ్ఞ సమిధలను అగ్ని భస్మం చేసినట్లుగా, జ్ఞానమనే అగ్ని సర్వకర్మలను కాల్చి బూడిద చేస్తుంది.

కర్పూరం తనను తాను దహింప చేసుకుని ఆ వెలుగులో భగవంతుణ్ని మనకు గోచరింప చేస్తుంది. అది కర్పూర త్యాగం అవుతుంది. అలాగే సాధకుడు కూడ ముందుగా తన అహంకారాన్ని తానే దగ్ధం చేసుకోగల్గితే భగవంతుడి దిశగా ప్రయాణిస్తున్నట్లే. మనం పాడుతున్న ఆరతి పాట మనికి బాగా అర్ధమైతే ఒక రకమైన అనుభూతికి పరవశిస్తూవుంటాం. ఆ అనుభూతే ఆధ్యాత్మిక సాధనగా మారుతుంది.

ఆరతి పాటల్ని మనం శ్రద్ధగా గమనించినట్లైతే ఒక పరిపూర్ణ జీవన విధానం కనపడు తుంది. జీవిత లక్ష్యం ఏమిటి, బాబా అవతార తత్త్వమేమిటి, అవతార మహత్యం ఏమిటి అన్నవి తెలుస్తాయి. జనన మరణ చక్రభ్రమణమనే సంసారవలయంలో మనం చిక్కుబడివున్నాం. దీనికి కారణం సంసారిక విషయాసక్తి, పూర్వ జన్మవాసనలు, వృత్తులు (Instincts & habits) అని పెద్దలు చెబుతూ వుంటారు. దీని బారి నుండి తప్పించుకోవాలంటే ఆత్మాను సంధానం అవుసరం. అంటే అసత్ ప్రపంచం నుండి విడువడి సత్‌ను ఆశ్రయించడం. దీనికి బాబాలాంటి అవతార పురుషుని అనుగ్రహం మనకు తప్పనిసరిగా కావల్సివుంది. నిజానికి బాబా మనందరి కోసం తన హృదయాన్ని తెరచుకొని కూర్చున్నారు. కనుక ఆయనపట్ల అచంచల భక్తి కలిగేలా మనం వేడుకోవాలి. ఆయన మన అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, మన హృదయా కాశంలో ఆధ్యాత్మిక అనుభూతి వెలిగించి మనలను సర్వ స్వతంత్రులను చేసి అసలు సిసలైన ఆనందమయ జీవితం గడిపేలా చేస్తారు.

ఇక ఆరతిపాటలు పాడుతున్నప్పుడు, ప్రక్క వాయిద్యాలు (రాగతాళాలు) ఎంతో ఉన్నతంగా వినపడుతూ వుంటాయి. చక్కటి రాగయుక్తంగా ఆరతి పాటలు పాడుతూ వుంటే అంతటా ప్రగాఢమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పబడుతుంది.

## ఆరతి సాయిబాబా

మానవ జీవితాన్ని 'దుఃఖాలయం అశాశ్వితం' అని భగవద్గీత (8-15) చెబుతూ వుంటుంది. సంసారిక అనురక్తి నుండి విడివడి స్వతంత్రంగా జీవించడం అనగా ఆత్మజ్ఞానాన్ని సముపార్జించడం ఒక్కటే మనిషికి పరమలక్ష్యమని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మానవ జీవితంలో కొలువుదీరిన దుఃఖాలన్నీ సంసారిక అనురక్తి నుండే పుడుతున్నాయి అన్నది పరమ సత్యం. కాబట్టి 'యోగం: కర్మసు కౌశలం' అని భగవద్గీత (2-50)లో చెప్పినట్లుగా నేర్పరితనంతో కర్మను ఆచరించినట్లైతే, అనగా ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యతా బుద్ధితో మాత్రమే పనిచేసినట్లైతే, ఏ విషయంలోనూ అనురక్తి జన్మించదు. అన్ని విషయాల్లోనూ అనాసక్తిగా మసలుకోవడం అలవాటు అవుతుంది. దానివల్ల సుఖదుఃఖాల పట్ల సమభావం పెంపొంది మధ్యే మార్గం సుగమం అవుతుంది.

ఇప్పుడు ఆరతులు-నైవేద్యం-ధుని గురించి కొన్ని విషయాలు తెల్సుకుందాం.

### ఆరతులు-నైవేద్యం-ధుని :

కాకడ ఆరతికి వెన్నతో కల్పిన పంచదార, మధ్యాహ్న ఆరతికి భోజనమే నైవేద్యంగా ఉంది. అలాగే దూప్ ఆరతికి చపాతీలు, తీపి పదార్థాలు, శేజ్ ఆరతికి చపాతీలు కూర నైవేద్యంగా సమర్పిస్తారు. ఇంకో విశేషమేమిటంటే కాకడ ఆరతికి, మధ్యాహ్న ఆరతికి, శేజ్ ఆరతికి, నైవేద్యం ప్రారంభంలోనే సమర్పిస్తారు. కాని దూప్ ఆరతి విషయంలో మాత్రం, ఆరతి కార్యక్రమం ముగిసిన తరువాత సమాధి మందిరం, గురుస్థాన్, ద్వారకామాయి వద్ద నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా మారింది.

ఈ ప్రకారం ద్వాకామాయికి వచ్చిన నైవేద్యాన్ని, బాబా వారి చిత్రపటానికి ధునికి మధ్య స్థానంలో పెట్టి, దాన్ని రెండు భాగాలు చేసి, మళ్ళీ ఆ రెండింటిలో రెండవ దాన్ని తిరిగి మూడు భాగాలుగా విడగొడతారు.

పై రెండు భాగాల్లో మొదటి భాగాన్ని ధునికి సమర్పిస్తారు. ఇక మూడు భాగాలుగా మారిన దాంట్లోని ఒక భాగం కొళంబలో పెడతారు. రెండో భాగం ద్వారకామాయిలో నిలబడి వున్న భక్తులకు పంచుతారు. ఇక మూడవ భాగాన్ని సమాధి మందిరానికి పట్టుకొస్తారు.

ఇంక ధుని విషయం చెప్పుకుంటే చాలా అద్భుతంగా ఉంటుంది. కాకడ ఆరతి, మధ్యాహ్న ఆరతులకు ముందుగా ధునితో కూడిన ధూపం ద్వారకామాయి నుండి బయలుదేరి సమాధి మందిరానికి తిరిగి అక్కడ నుండి చావడికి చేరుతుంది. అయితే ధూప్ ఆరతి సమయానికి ఈ ధుని ధూపం ఒక్క సమాధి మందిరానికి మాత్రమే వెళుతుంది. శేజ్ ఆరతికి మాత్రం ఈ ధుని ధూపం సమాధి మందిరంలో భూపాళి రాగం వినిపించే వరకు అక్కడే ఉంటుంది.

శ్రీసాయినాథుని అర్చించే విషయాల్లో, ఈ ఆరతులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించు కున్నాయి అన్న విషయంలో ఎవ్వరికి ఎటువంటి సందేహం ఉండనక్కరలేదు. ముఖ్యంగా కాకడ ఆరతి పాటలు అర్ధంచేసుకుంటే హృదయ రంజకంగా ఉంటాయి. ఉదాహరణకి కాకడ ఆరతిలో ఒక చోట శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ ఇలా అంటారు.

**మీ బుడతో భవభయ దోహీ ఉద్దరా ।**
**మీ బుడతో భవభయ దోహీ ఉద్దరా ।**

దీని అర్ధం ఇలా ఉంటుంది. సంసారసాగరంలో పడి కొట్టుకుంటున్న నన్ను దయతో ఉద్దరింపుమా దేవా! అని వేడుకుంటున్నాడు. మనందకీ బాగా పరిచయం ఉన్న దాసరథీ శతకంలో భక్త రామదాసు కూడ ఇలాగే అంటాడు. “అగణిత జన్మ కర్మదురితాంబుధిలో బహుదుఃఖ వీచికల్ తెగిపడ ఈద లేక జగతీధవ! నీ పదభక్తి నావచే తగిలి తరింపగోరితి బదంపడి (కావున) నాదు భయంబు మాన్పవే తగదని చిత్తమందిడక దాశరధీ కరుణాపయోనిధీ!”

అలాగే “గురోవినతి మీ కరీ హృదయమందిరి యాబసా’ ఓ గురుదేవా! నా హృదయమనే ఈ మందిరంలో నివశించు అని మనందరి తరుపున శ్రీ జోగేశ్వర్ భీష్మ ప్రార్ధిస్తున్నాడు.

అలాగే దూప్ ఆరతిలో ‘సదైవ హృదయీా వసో మనసి ధ్యాని సాయి వసో’ అని శ్రీ బి.వి.దేవ్ ప్రార్ధిస్తున్నాడు. సాయిబాబా ఎల్లప్పుడూ నా హృదయ

సీమయందు నివశించుగాక. అలాగే సాయిబాబా నా మనస్సును ఆక్రమించుకుని, నా ఆలోచనా విధానాన్ని సరిచేయుగాక అని దీని అర్థం.

శ్రీ ఉపాసినీ మహరాజ్, సాయి భక్తుల్లో ముఖ్యుడు. ఆయన 6-2-1912లో శ్రీ సాయినాథ్ మహిమ్నస్తోత్రం రచించారు. దీన్లోని రెండు శ్లోకాలు గురుస్థాన్‌లో బాబా వేపచెట్టు క్రింద తపస్సు చేసిన దానికి గుర్తుగా పాలరాయి పాదుకల్లో చెక్కబడ్డాయి. శ్రీసాయినాథ్ మహిమ్న స్తోత్రం చివర్లో వచ్చే 'నమామీశ్వరం సద్గురు సాయినాథం' అన్నది విశ్వవిఖ్యాతమై పోయింది. దీన్లో కపడే 'ఈశ్వర' అన్న పదం భక్తుల్ని సదా పర్యవేక్షంచే శక్తిని వెదజల్లుతూ ఉంటుంది. ఇంక 'గురు' అన్న పదం తత్వాన్ని బోధిస్తూ ఉంటుంది.

అలాగే శ్రీ బాలకృష్ణ విశ్వనాథ్ (బి.వి.దేవ్) రచించిన అద్భుత ఆరతి పాట 'రుసోమమ ప్రియాంబికా, మజవరి పితాహి రుసో....' ఏం చేబుతోంది? తల్లిదండ్రుల దగ్గర నుంచి బంధు వర్గమంతా నన్ను ఈసడించుకున్నా నేనేమీ బాధపడను. కాని ప్రభూ మీరు మాత్రం నన్ను త్రోసి పుచ్చవద్దు. మీ ప్రేమకు నన్ను దూరం చెయ్యవద్దు, అంటోంది.

దీనిబట్టి శ్రీసాయిబాబా ఆరతులకున్న ప్రత్యేకతను మనం సులువుగా అర్థం చేసుకోగలం. మహనీయుల అడుగుజాడల్లో నడిచి మన జీవితాలను ధన్యం చేసుకోవడంకన్న మనకు కావల్సింది ఏముంటుంది.

ఇంతటితో ఆరతి సాయిబాబా గ్రంథం మొదటి భాగం పూర్తి అయ్యింది. ఇక రెండవ భాగంలో సాయినాథుని నాలుగు ఆరతుల గురించి కూలంకషంగా చర్చించుకుందాం.

*ఓం రాజాదిరాజ యోగిరాజ*
*పరబ్రహ్మ శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై*

ఓం శ్రీ సాయినాథాయ నమః

# ఆరతి సాయిబాబా - ॥

## కాకడ ఆరతి-1
## (సంత్ తుకారం)

1. జోడునియాకర చరణీ లేవిలా మాథా
పరి సావీ వినంతీ మార్ఝీ సద్గురు నాథా ॥

2. అసోనసో భావ ఆలో తు ఝియా ఠాయా
కృపాదృష్టీ పాహే మజకడే సద్గురు రాయా ॥

3. అఖండిత అసావే ఐసే వాటతే పాయీ
సాండూనీ సంకోచ ఠావ్ థోడాసా దేయీ॥

4. తుకా హ్మణే దేవా మార్ఝీ వేడీ వాకుడీ
నామే భవపాశా హాతీ ఆపూల్యా తోడీ ॥

⋆ ⋆ ⋆

| | | |
|---|---|---|
| 1. కర జోడునియా | - | రెండు చేతులను జోడించి |
| మార్ఝీ | - | నా యొక్క |
| మాథా | - | నుదుటి భాగాన్ని |
| చరణీ లేవిలా | - | తమ పాదములపై పెట్టి |
| వినంతీ | - | ప్రార్థిస్తున్నాను |
| పరిసావీ | - | నా ప్రార్థన వినండి |

ఓ సద్గురునాథా ! నా రెండు చేతులను జోడించి, నా నుదుటి భాగాన్ని తమ పాదముల పై పెట్టి ప్రార్థిస్తున్నాను. దయచేసి నా ప్రార్థన ఆలకించండి.

| | | |
|---|---|---|
| 2. అసోనసో భావ | - | మీ యందు నిజమైన భక్తి భావము కలదో లేదో తెలియకుండానే, |

| | | |
|---|---|---|
| తుఝియా రాయా | - | మీ యొక్క సన్నిధానమునకు |
| ఆలో | - | వచ్చి చేరితిమి |
| సద్గురు రాయా | - | ఓ సద్గురు నాథా |
| కృపా దృష్టీ | - | దయా దృష్టిని |
| మజకడే | - | మాపై నుంచి |
| పాహే | - | చూడుము |

ఓ సద్గురునాథా! మీ యందు నిజమైన భక్తి భావము కలదో లేదో తెలియకుండానే, మీ యొక్క సన్నిధానమునకు వచ్చి చేరితిమి. తమ దయా దృష్టిని మాపై ప్రసరింప జేసి చూడుడు.

| | | |
|---|---|---|
| 3. సంకోచా | - | సంకోచములనన్నింటిని |
| సాండూనీ | - | వదిలిపెట్టి |
| పాయీ | - | తమ పాదముల చెంత |
| అఖండిత | - | ఎన్నటికీ విడివడని |
| వాటతే | - | భావనతో |
| అసావా ఐసే | - | ఈ విధంగా వుండి పోవాలని కోరుకుంటున్నాను |
| థోడాసా | - | కాస్తంత |
| ఠావ్ | - | విశ్రాంతి స్థలమును |
| దేయీ | - | నాకు ప్రసాదింపుడు |

నాకున్న సంకోచముల నన్నింటిని వదిలిపెట్టి తమ పాదముల చెంత ఎన్నడూ విడివడని భావముతో ఈ విధంగానే వుండిపోవాలని కోరుకుంటున్నాను. దయచేసి కాస్తంత విశ్రాంతి స్థలమును నాకు ప్రసాదింపుడు.

| | | |
|---|---|---|
| 4. తుకాహ్మణే | - | సంత్ తుకారం మహరాజ్ చెప్పేదేమిటంటే |
| దేవా | - | ఓ భగవంతుడా ! |
| మాఝీ | - | మా యొక్క |

| | | |
|---|---|---|
| వేడీవాకుడీ | - | అర్ధం పర్ధం లేని |
| నామే | - | మాటలనూ |
| భవపాశా | - | సంసార బంధములనూ |
| తోడీ | - | తృంచివేయ గల శక్తియుక్తులు |
| ఆపూల్యా హాతీ | - | మీ చేతుల యందే గలవు. |

సంత్ తుకారాం చెప్పేది ఏమిటంటే, ఓ భగవంతుడా! మా యొక్క అర్ధంపర్ధం లేని మాటలనూ, మా సంసార బంధములనూ తృంచి వేయగల శక్తియుక్తులు మీ యందే వున్నాయి.

సంత్ తుకారాం వ్రాసిన కాకడ ఆరతి-1 లో గల ఈ అభంగం యొక్క అర్ధం భావం పాండురంగ విఠలుడిని దృష్టిలో పెట్టుకుని వ్రాసిందే అని చెప్పక తప్పదు. అయితే సద్గురు సాయినాథుల ఆరతి పుస్తకంలో ఈ అభంగం చేర్చబడింది కాబట్టి పండరీనాథ అన్నచోట సద్గురునాథ అన్నారు. అదే ప్రకారం పండరిరాయ అన్న చోట సద్గురురాయ అన్నారు.

మరాఠీ భాషలో రచించబడ్డ ఈ అభంగం ఒక చంధో బద్దమైన రచన. అభంగ్ అన్న పదమే భంగము కానిది అన్న అర్ధాన్ని ఇస్తుంది. అంటే అర్ధ తాత్పర్యాలు ఎక్కడా తేడా లేకుండా సాగుతూ ఉంటాయి. దానికి తోడు దాని అంతరార్ధం గూడ అంతరాయం లేకుండా జీవాత్మ యొక్క ఆర్తిని ప్రకటిస్తూవుంటుంది. ఇక్కడ విశేషమేమిటంటే చక్కటి ప్రాసవరుసలో చదవబడటమే. ఈ పద్దతి పూర్వకాలంవారైన సంత్‌నివృత్తి నాథులు, సంత్ జ్ఞానదేవ్‌లు చేత ప్రారంభించబడి తుకారాం మహాశయుడి కాలానికి మరింత ప్రాచుర్యం పొందింది.

ఈ అభంగం భగవంతుని ప్రేమను పొందడానికి చేసే అమోఘమైన అనుష్టానం అని చెప్పవచ్చు. ఇది ఇతరత్రా విధానాలతో సాధ్యం కాని పని. అంటే అర్ధం, శౌర్య పరాక్రమాలు గాని, తెలివితేటలుగాని, ప్రాపంచిక విషయ పరిజ్ఞానం గాని దీన్ని సాధించలేవు. దైవ దత్తమైన ఈ పాట అంతరార్ధం గ్రహిస్తే మాత్రం భగవంతుని ప్రేమ ఏరకమైన షరతులు లేకుండానే హృదయంలో ప్రవహిస్తుంది.

సంత్ తుకారం మహరాజ్, ఆయన వ్రాసిన అనేకానేక అభంగాల్లో ఇదే విషయం ప్రస్తావనకు తీసుకువచ్చారు. అంతేకాక భగవంతుని ప్రేమను కాని గురువు ప్రేమను కాని పొందని పక్షంలో ఎటువంటి సాధనైనా అడవి కాచిన వెన్నెల అవుతుందనడంలో సందేహం కూడా లేదన్నారు. తుకారాం అడిగిన ప్రశ్న ఏమిటంటే, అస్సలు సాధన ఎవ్వరైనా ఎందుకు చేస్తున్నట్లు ఒక్కోటి గుర్తు పెట్టుకోవాలి. భగవత్ సాక్షాత్కారమన్నది భగవంతుని ప్రేమను రుచి చూస్తేగాని కలగదు.

మహారాష్ట్ర దేశంలో సంత్తుకారాం కాలంలో అనగా 1598 నుండి 1659 మధ్యన ఆయనతో సరితూగే సంత్మహాపురుషులు ఎవ్వరూ లేరేనే చెప్పాలి. అభంగ కవిత్వం వ్రాయ గల్గినవారు ఒక్క తుకారాం ప్రభువులే అని అంతా అనుకుంటూ వుండేవారు. తుకామహ్నా అనగా తుకారాం ఇలా అంటున్నారు అన్న మాట తుకారాం ముద్రగా ప్రజల హృదయాల్లో నాటుకుపోయింది. ఆ మహాత్ముడు వ్రాసిన సుమారు అన్ని అభంగాలు ఇదే మాటతో ముగింపు పలుకుతూ వుంటాయి.

ఇంకొక ముఖ్యమైన విషయమేమిటంటే, మహారాష్ట్ర ప్రజల నాలుక మీద తుకామహ్నా అన్న మాట వేరే అర్థంలో వాడుతూవుంటారు. 'ఇది ఖచ్చితమైన నిజం' అన్న వాడుక మాటకు పర్యాయపదంగా తుకామహ్నా అంటూ వుంటారు. ఇక షిరిడి సాయినాథులకు తుకారాం అభంగాలు అంటే ప్రాణమే. అందుకే షిరిడి ఆరతుల పుస్తకంలో గల పద్నాలుగు ఆరతి పాటల్లో ఐదు పాటలు తుకారాం మహరాజ్ వ్రాసినవే అయివున్నాయి.

కాకడ ఆరతిలో ముందుగా వచ్చే మూడు పాటలు భూపాళి రాగంతో స్వరకల్పన చెయ్యబడ్డాయి. ఇక్కడ భూపాళి రాగం గురించి కొంత తెల్సుకుందాం. భూపాళి అనబడే రాగం కళ్యాణి రాగమాలిక కుటుంబానికి చెందింది. ఇవన్నీ జన్య రాగాలని పిలువబడతాయి. కళ్యాణి కర్ణాటక సంగీతంలో మేళ కర్తరాగం (మాతృ సంగీతస్థాయి). దీన్నే ప్రస్తుతం హిందుస్థానీ సంగీతంలో యమన్ అని పిలుస్తున్నారు. దీన్లో గల అనేక రకాల జన్యరాగాల్లో, మేచ కళ్యాణి అనబడే విభాగం క్రిందకు వస్తుంది ప్రస్తుత భూపాళి రాగం. ఈ రాగంలోని

చాలా పాటలు భక్తిరసంతో తొణికిసలాడుతూ వుంటాయి. కర్ణాటక సంగీతంలో దీన్నే మోహనరాగం అంటారు. పేరును బట్టి కూడ ఇది చాలా గొప్ప రాగంగా తోస్తూ వుంటుంది. భూపాలుడు అంటే మహారాజు అలాగే ఈ రాగం కూడ రాజలక్షణాన్ని కలిగి వుంటుందని అర్థం. ఇదే విషయం సాయినాథుని శరత్‌బాబూజీ కూడ ఇలా విశ్లేషించారు. సాదారణంగా హిందూ దేవాలయాల్లో భగవంతుణ్ణి షోడస ఉపచారాలతో కొలుస్తూ వుంటారు. వాటన్నింటినీ రాజోపచారాలని పిలవడం ఒక ఆనవాయితీ. అదే ప్రకారం మహారాజుల ఆస్థానాల్లో కూడా జరుగుతూ వుంటుంది. మేలు కొలుపు పాటలన్నీ ఎంతో మధురంగా భూపాళి రాగంతో మేళవించి పాడుతూ వుంటారు.



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి -2

## (సంత్ జానాబాయి)

1. ఉఠా పాండురంగా ఆతా ప్రభాత సమయో పాతలా
వైష్ణవాంచా మేళా గరుడపారీ దాటలా ॥

2. గరుడపారా పాసునీ మహా - ద్వారా పర్యంత
సురవరాంచీ మాందీ ఉభీ జోడునియాహాత్ ॥

3. శుక సనకాదిక నారద తుంబుర భక్త్యాంచ్యాకోటీ
త్రిశూల ఢమరూ ఘేఉని ఉభా గిరిజేచా పతీ ॥

4. కలియుగీచా భక్త నామా ఉభా కీర్తనీ
పాఠీమాగే ఉభీ ఢోళా లావునీయా జనీ ॥

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. పాండురంగా | - | ఓ ప్రభో పాండురంగా! |
| ఉఠా | - | లెమ్ము |
| ఆతా | - | ఇప్పుడు |
| ప్రబాత సమయో | - | సూర్యోదయ సమయము |
| పాతలా | - | ఆసన్నమగు చున్నది |
| వైష్ణవాంచా మేళా | - | వైష్ణవ సమూహమంతయు |
| గరుడ పారీ | - | గరుడ స్తంభము వద్దకు |
| దాటలా | - | వచ్చి చేరినది |

ఓ ప్రభో పాండురంగా! ఇప్పుడు సూర్యోదయ సమయము ఆసన్నమగుచున్నది, లెమ్ము. గరుడ స్తంభము వద్దకు శ్రీవైష్ణవ సమూహమంతయు వచ్చి చేరినది.

| | | |
|---|---|---|
| **2.** గరుడ పారా పాసునీ | - | గరుడ స్తంభము నుండి |
| మహాద్వారా పర్యంత | - | నీ యొక్క గర్భగుడి మహా ద్వారము వరకూ |
| సురావరాంచీ | - | దేవతా సమూహము |
| మాందీ | - | అంతయు |
| జోడు నియాహాత్ | - | చేతులు జోడించుకొని |
| ఉభీ | - | నిలబడి వున్నారు |

గరుడ స్తంభము నుండి నీ యొక్క గర్భగుడి మహాద్వారము వరకూ దేవతా సమూహ మంతయు చేతులు జోడించుకొని నిలిచివున్నారు.

| | | |
|---|---|---|
| **3.** శుక సనకాదిక | - | శుకుడు, సనకుడు, సనందనుడు. సనుత్సుజాతుడు, సనత్కుమారుడు మొదలైన మహర్షులందరూ |
| నారద తుంబర | - | నారద మహర్షి, తుంబురుడు మొదలైన |
| భక్త్యాంచ్యా కోటీ | - | భక్త కోటి యావత్తూ |
| త్రిశూల | - | త్రిశూలము |
| ఢమరు | - | ఢమరుకము |
| ఘే ఉని | - | తీసుకొని |
| గిరిజేచ | - | పార్వతీదేవి |
| పతి | - | భర్త అయిన శివమహాదేవుడు |
| ఉభా | - | నిలబడివున్నారు |

ఇంకా శుకమహర్షి, సనక సనందనాదులని పిలువబడే బ్రహ్మమానపుత్రులు నల్గురూ (సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు సనత్కుమారుడు) నారద మహర్షి, తుంబురుడు మొదలైన భక్తకోటి యావత్తూ వచ్చివున్నారు. అంతేకాక పార్వతీదేవి భర్త అయిన శివ మహా దేవుడు త్రిశూలము, ఢమరుకము చేత బట్టుకొని నిలబడివున్నారు.

| | | |
|---|---|---|
| 4. కలియుగీచా | - | ఈ కలియుగంలో పుట్టిన |
| భక్తనామా | - | భక్తాగ్రేసరుదైన నామదేవుడు |
| కీర్తనీ | - | కీర్తించుటకొరకు |
| ఉభా | - | నిలబడివున్నారు |
| పాఠీ మాగే | - | ఆ వెనుకన |
| జనీ | - | భక్తురాలైన ఈ జానాబాయి |
| లావునీయా డోళా | - | నీ మూర్తిపై తదేక దృష్టిపెట్టి |
| ఉభీ | - | నిలుచుని ఉన్నది. |

ఈ కలియుగంలో పుట్టిన భక్తాగ్రేసరుడైన నామదేవుడు మిమ్ము కీర్తిచుట కొరకుగాను నిలబడివున్నారు. ఆయన వెనుకగా భక్తురాలైన ఈ జానాబాయి సైతము నీ మూర్తిపై తదేక దృష్టి పెట్టి నిలుచుని వున్నది.

మహారాష్ట్రలో ప్రముఖంగా చెప్పబడే ఆరతి పాటల్లో ఇది ఒకటి. సంత్ జానాబాయి **1258-1350** కాలం నాటి విదుషీమణి, కవయిత్రి. సంత్‌నామ్‌దేవ్ వద్ద, సంత్ జ్ఞానేశ్వర్ వద్ద శిష్యరికం చేసిన మహానుభావురాలు. చిన్నతనంలో ఆమె తల్లి చనిపోవడంతో తండ్రి ఆమెను పండరిపూర్‌కు తీసుకు వెళ్ళి సంత్‌నామ్‌దేవ్ తండ్రి వద్ద పనిమనిషిగా చేర్చాడు. ఆమె చిన్నతనం నుండి విఠల్ భగవానుని భక్తురాలు. ఎటువంటి విద్యార్హతలు లేనప్పటికీ అభంగ్ రూపంలో అనేక పాటలు వ్రాసింది.

జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్, ఏకనాథ్ మరియు తుకారాంలతోబాటుగ మహారాష్ట్రలోని వార్కారీశాఖకు చెందిన మరాఠీ భాష మాట్లాడే హిందువుల మనస్సుల్లో ఒక గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోగల్గింది. వార్కారీలు పండరినాథుడైన విటోబాను పూజిస్తారు.వారిలో ప్రముఖ సాదుపుంగవులనందరినీ సంత్‌లని పిలుస్తారు. సంత్ అన్నది ఒక బిరుదులాంటిది. సుమారు పదమూడవ శతాబ్దం నుండి వార్కారీ సంప్రదాయం. మహారాష్ట్రలోని హిందూ సంస్కృతిలో ఒక భాగంగా వుంది. ఇది భక్తి ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకెళ్ళింది.

నిజానికి వార్కరీ అంటే యాత్రికుడు అని అర్థం. ఇది సత్పురుషులైన విఠోబా భక్తులం దరికీ ఒక బిరుదుగా వారి వారి పేర్ల ముందు చేర్చబడుతూ వుండేది.

ఈ సందర్భంలో మన తెలుగు నాట 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ వాగ్గేయకారుడు శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులు గురించి కొంత తెలుసుకో వల్సివుంది. ఆయనకు పదకవితా పితామహుడని కూడా పేరుంది. ఈయన శ్రీ వేంకటశ్వరస్వామి వారిపై వేలకొలది కీర్తనలు వ్రాసిన మహానుభావుడు. ఈయన వ్రాసిన కీర్తన ఒకటి, సంత్‌జానాబాయి వ్రాసిన ఆరతి పాట లాగే ఆర్థాన్నిస్తుంది. ఇది మాళవి రాగంలో మిశ్ర చాపుతాళంలో నడుస్తుంది.

**1.** శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షస గర్వసంహర
శరణు వేంకట నాయకా!... శరణు... శరణు...

**2.** కమల ధరుడును కమలమిత్రుడు
కమల శత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలువు కిప్పుడు
కాచినారెచ్చరికయా - శరణు... శరణు...

**3.** అనిమిషేంద్రులు మునులు
దిక్పతులమరకిన్నెర సిద్దులు
ఘనతతో రంభాది కాంతలు
కాచినా రెచ్చరికయా - శరణు... శరణు..

**4.** ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు
నిన్ను గొలువగ వచ్చిరీ
విన్నపము వినవయ్య
తిరుపతి వేంకటాచల నాయకా - శరణు... శరణు..

పరమ భాగవతోత్తముడైన అన్నమయ్య శ్రీ వేంకటాచలపతిని శరణు వేడుకొంటూ కొన్ని హెచ్చరికలు చేస్తున్నాడు. ఎచ్చరిక అంటే సూచన అని

అర్థం. బ్రహ్మదేముడు, సూర్యుడు, చంద్రుడు మొదలగు వారంతా నీ దర్శనం కోసం వస్తున్నారయ్యా చూసుకో ప్రభూ! అలాగే దేవతలు, మునులు, దిక్పాలకులు, కిన్నరలు, సిద్ధులు ఇంకా రంభ, ఊర్వసి, తిలోత్తమ, మేనక మొదలైన అప్సరస స్త్రీ సమూహమంతా నీ దర్శనం కోసం వస్తున్నారయ్యా చూసుకో ప్రభూ అంటున్నాడు.

అలాగే భక్తాగ్రేసరులైన ప్రహ్లాదుడు మొదలైన వారంతా నిన్ను కొలుచుట కోసం తరలి వచ్చేరు సుమా చూసుకో ప్రభూ అంటూ ముందుగానే సూచనలు చేస్తున్నాడు అన్నమయ్య.

అన్నమయ్యకు శతాబ్దకాలం ముందర వున్నటువంటి సంత్‌జానాబాయి పాండురంగ స్వామిని కీర్తిస్తూ వైష్ణవ సమూహమంతా గరుడ స్తంభము వద్ద నిలచివున్నదని దేవతలందరూ నీ దర్శనం కోసం ముకుళితహస్తులై వున్నారని, శుకసనక సనందనాదులు, నారద తుంబురులు, ఇంకా పరమ శివుడు సైతం నీ దర్శనం కాంక్షిస్తూ వచ్చివున్నారని, అలాగే ఈ కలియుగంలో భక్తశిఖామణి అయిన నామదేవుడు నిన్ను కీర్తిస్తూ నిలబడ్డాడని, ఆ మహానుభావుడి వెనకనే, నీ భక్తురాలైన ఈ జానాబాయి కూడ నీ మూర్తిపై తదేక దృష్టి పెట్టి నిలుచున్నదని విన్నపం చేస్తోంది.



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి -3

## (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ)

1. ఉఠా ఉఠా శ్రీసాయినాథ గురు చరణ కమల దావా
ఆదివ్యాధి భవతాపవారునీ తారా జడ జీవా ॥

2. గేలీ తుమ్హా సోడునియా భవ తమరజనీ విలయా
పరి హీ అజ్ఞానాసీ తుమచీ భులవి యోగమాయా॥

3. శక్తి న ఆమ్హా యత్కించితహీ తిజలా సారాయా
తుమ్హీచ తీతే సారుని దావా ముఖజన తారాయా॥

4. భోసాయినాథ మహరాజ భవతిమిర నాశక రవీ
అజ్ఞానీ ఆమ్హీ కితీ తవ వర్ణావీ థోరవీ॥

5. తీవర్ణితా భాగలే బహువదని శేషవిధి కవీ
సకృప హెూఉని మహిమా తుమచా తుమ్హీచ వదదావా॥

6. భక్తమనీ సద్భావ ధరూని జే తుమ్హా అనుసరలే
ఘ్యాయాస్తవ తే దర్శన తుమచే ద్వారి ఉభేలే ॥

7. ధ్యానస్థా తుమ్హాస పాహునీ మన అముచే ధాలే
పరి తద్వచనామృత ప్రాశాయాతే ఆతుర ఝూలే ॥

8. ఉఘడూనీ నేత్రకమలా దీనబంధు రమా కాంతా
పాహిబా కృపా దృష్టి బాలకా జశీ మాతా॥

9 రంజ వీ మధురవాణి హరీ తాప సాయినాథా ॥

10 అమ్హీచ అపులే కార్యస్తవ తుజ కష్టవితో దేవా
సహన కరిశిల తే ఏకునీ ధ్యానీ భేట కృష్ణదావా॥

* * *

## ఆరతి సాయిబాబా

1. శ్రీసాయినాథ గురు - శ్రీ సద్గురు సాయినాథా !
ఉఠా ఉఠా - మేలుకొనుడు మేలుకొనుడు
చరణ కమల దావా - మీ పాద పద్మములను చూపెట్టుడు
ఆధి వ్యాధి - ఆధి వ్యాధులనబడే
భవతాప - సంసారిక బాధలను
వారునీ - పారద్రోలి
జడ జీవ - జడ జీవులమైన
తారా - మమ్మ రక్షించుడు

శ్రీసద్గురు సాయినాథ! మేలుకొనుడు మేలుకొనుడు. మీ యొక్క పాద పద్మములను మాకు చూపెట్టుడు. మమ్ములను పీడించుచున్న ఆధి వ్యాధులనబడే సంసారిక బాధలను పారద్రోలి జడజీవులమైన మమ్మ రక్షించుడు.

యోగమాయ చేత సృష్టించబడ్డ ఈ జీవులనే జడచేతనులని, గుణ దోషనులని సంత్ తులసీదాస్ ఒక దోహాలో ఇలా వర్ణించారు. ప్రత్యక్షంగా కనపడే ఈ సంసారంలోనే నిస్సారమైన రూపంలో అనేక గుణదోషాలున్నాయని, హంస రూపంలో తిరిగే సాధుపుంగవులు మాత్రం గుణదోష వికారాలను వదిలించుకొని మంచి గుణాలను అనగా జీవన్ముక్తులకు సరిపడే గుణాలను మాత్రం దగ్గరుంచుకుంటారు.

2. భవ తమరజనీ - సంసారమనే తమస్సు
తుమ్హా - మిమ్ములను
సోడునియా - వదిలిపెట్టి
గేలీ - పోయినది
విలయా - అదృశ్యమైపోయినది
పరి - కాని
హీ - ఇంకనూ
అజ్ఞానాసీ - అజ్ఞానులను మాత్రం

| | | |
|---|---|---|
| తుమాచీ | - | మీ యొక్క |
| యోగమాయ | - | యోగమాయ |
| భులవి | - | మూర్ఖులుగానే ఉంచుతున్నది. |

బాబా! సంసారమనే తమస్సు మిమ్ములను వదిలిపెట్టిపోయినది. అంతేకాదు అదృశ్యమైపోయినది కూడ. కాని అజ్ఞానులను మాత్రం అది ఇంకనూ మూర్ఖులు గానే ఉంచి వదిలిపెట్టడం లేదు.

| | | |
|---|---|---|
| 3. తిజలా సారాయా | - | యోగమాయను తిరస్కరించేటంత |
| శక్తి | - | శక్తి |
| ఆమ్హానా | - | మాలో లేదు |
| యత్కించి తహీ | - | ఏ కొంచమైననూ లేదు |
| తీతే | - | ఆ సమయంలో |
| తుమ్హీచ | - | మీరొక్కరే |
| సారుని | - | మాయను పోగొట్టి |
| తారాయా | - | మమ్ములను రక్షించుట కొరకు గాను |
| ముఖ | - | మీ యొక్క ముఖమును |
| జన | - | జనులకు |
| దావా | - | చూపెట్టిన వారవుతున్నారు |

బాబా! యోగమాయను తిరస్కరించేటంతటి శక్తి మాలో ఏ కొంచమైననూ లేకుండా పోయినది. అట్టి పరిస్థితుల్లో మీరొక్కరే ఆ మాయను పోగొట్టి మమ్మందరినీ రక్షించుట కొరకు గాను, తమ ముఖమును జనులందరికీ చూపెట్టిన వారవుతున్నారు.

| | | |
|---|---|---|
| 4. భో సాయినాథ్ మహరాజ్ | - | ఓ శ్రీసాయినాథ్ మహరాజ్ |
| భవతిమిర నాశక | - | ఈ ప్రపంచంలోని చీకట్లను పారద్రోలే |
| రవీ | - | సూర్యభగవానుడూ |
| అజ్ఞానీ | - | అజ్ఞానులమైన |

| | | |
|---|---|---|
| అమ్హీ | - | మేము |
| తవ | - | మీయొక్క |
| థోరవీ | - | గొప్పతనమును |
| వర్ణావీ | - | వర్ణించుటకు |
| కితీ | - | ఎంతటి వారము? |

ఓ శ్రీసాయినాథ్ మహరాజ్! ఈ ప్రపంచంలోని చీకట్లను పారద్రోలే శక్తివంతమైన సూర్యభగవానుడుగాని, అజ్ఞానులమైన మేముగాని మీయొక్క గొప్పతనమును వర్ణించుటకు తగినవారము కాదని తాత్పర్యము.

| | | |
|---|---|---|
| 5. తీ | - | తమ మహత్త్యమును |
| వర్ణితా | - | వర్ణించుటకు |
| బహువదనీ | - | అనేక ముఖములు కల్గిన |
| శేష | - | ఆది శేషునకు |
| విధీ | - | బ్రహ్మాదేమునకు |
| భాగలే | - | సాధ్యము కావటం లేదు |
| కవీ | - | కవులకు కూడా సాధ్యము కావటం లేదు. |
| సకృప | - | మాపై మీ కృపను |
| హోఉనీ | - | ప్రసరింపజేసి |
| తుముచా మహిమా | - | మీ యొక్క మహిమను |
| తుమ్హీచ | - | మీరు మాత్రమే |
| వదదావా | - | వర్ణింప సమర్థులు |

బాబా! తమ మహత్త్యమును వర్ణించుటకు అనేక ముఖములు కల్గిన ఆదిశేషునకు గాని, ఆ బ్రహ్మాదేమునకు గాని, కవులకు గాని సాధ్యం కావటం లేదు. మీ కృపను మాపై ప్రసరింప జేసి మీ యొక్క మహిమను మీరు మాత్రమే వర్ణింప సమర్థులుగా వున్నారు.

| | | |
|---|---|---|
| 6. సద్భావ | - | భక్తిని |
| మనీ | - | తమ తమ హృదయాల్లో |
| ధరూని | - | నింపుకుని |
| తుమ్హా | - | మిమ్ములను |
| జే భక్తా | - | ఆయా భక్తులందరూ |
| అనుసరలే | - | స్మరిస్తున్నారు |
| తే | - | వారు |
| తుమచే దర్శన | | |
| ఝ్యాయాస్తవ | - | తమ దర్శనం కొరకు |
| ద్వారి | - | సింహ ద్వారము దగ్గర |
| ఉభేలేలే | - | ఇంకనూ నిలుచునే ఉన్నారు. |

భక్తిని తమతమ హృదయాల్లో నింపుకొని ఆయా భక్తులందరూ మిమ్ములను స్మరిస్తున్నారు. ఇంకనూ తమ దర్శనం కొరకై సింహ ద్వారము దగ్గర నిలుచునే ఉన్నారు.

| | | |
|---|---|---|
| 7. ధ్యానస్థా | - | ధ్యానంలో |
| తుమ్హాసా | - | మిమ్ములను |
| పాహునీ | - | దర్శిస్తున్న |
| అముచే | - | మా యొక్క |
| మన | - | హృదయం |
| ఝాలే | - | తృప్తిని మూట కట్టుకున్నది |
| పరి | - | కాని |
| తే | - | అది |
| త్వద్వచనామృత | - | మీ యొక్క వచనామృతమును గ్రోలుట కొరకై |
| ఆతుర ఝాలే | - | తొందర పడుతున్నది |

## ఆరతి సాయిబాబా

బాబా! ధ్యానంలో మిమ్ములను దర్శిస్తున్న మా హృదయం తృప్తిని అనుభవిస్తున్నది. కాని మీ యొక్క వచనామృతము పానము చేయుటకొరకై ఎంతో తొందరపడుతున్నది.

| | | |
|---|---|---|
| 8. దీనబంధు | - | ఓ అనాథ బాంధవా ! |
| రమా కాంతా | - | ఓ రుక్మిణీ వల్లభా ! |
| బా | - | ఓ ప్రియమైన ప్రభూ ! |
| జశీ | - | ఏవిధంగానైతే |
| మాతా | - | ఒక తల్లి |
| బాలకా | - | తన కొడుకును |
| కృపాదృష్టీ | - | దయతో చూడగలదో |
| నేత్రకమలా | - | కమలములవంటి మీ నేత్రములను |
| ఉఘడూనీ | - | తెరచి |
| పాహి | - | మమ్ములను అట్లే చూడుడు |

ఓ అనాథబాంధవా! ఓ రుక్మిణీ వల్లభా! ఓ ప్రియమైన ప్రభూ! ఏవిధంగానైతే ఒక తల్లి తన కొడుకును దయతో చూడగలదో, అట్లే మీరు కూడ కమలముల వంటి మీ నేత్రములను తెరచి చూడుడు.

| | | |
|---|---|---|
| 9. సాయినాథా | - | ఓ సాయినాథా! |
| రంజవీ | - | తృప్తినిచ్చే |
| మధురవాణీ | - | మనోహరమైన మీ వాక్కులు |
| తాప | - | మా తాపములను |
| హారీ | - | పోగొట్టుచున్నవి |

ఓ సాయినాథ దేవా! తృప్తినిచ్చే మీ మనోహరమైన మాటలు మా తాపములను పోగొట్టుచున్నవి.

| | | |
|---|---|---|
| 10. దేవా | - | ఓ భగవంతుడా ! |
| అమ్హీచ | - | మా అంతట మేమే |
| అపులే | - | మాకు సంబంధించిన |
| కార్యస్తవ | - | పనులలో జాగ్రత్తవహించక |
| తుజ | - | మిమ్ములను |
| కష్టవితో | - | కష్టపెట్టుచున్నాము |
| తే | - | వాటినన్నింటినీ |
| సహన | - | సహించి |
| కరిశిలా ఏకునీ | - | మా బాధలు విని |
| కృష్ణదావా | - | శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ అనబడే నాయొక్క పిలుపును మన్నించి |
| ధావీ బేట్ | - | మాకు రక్షణ కల్పిస్తున్నారు. |

ఓ భగవంతుడైన సాయినాథా! మా అంతట మేమే మాకు సంబంధించిన పనుల్లో జాగ్రత్త వహించక మిమ్ములను కష్టపెడుతున్నాము. ఆ బాధలనన్నింటినీ మీరు విని, సహించి శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ అనబడే నాయొక్క పిలుపును మన్నించి మాకందరకూ రక్షణ కల్పిస్తున్నారు.



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-4

## (సంత్ నామ్‌దేవ్)

1. ఉఠా పాండురంగా ఆతా దర్శన దాసకలా
ఝూలా అరుణోదయ సరళీ నిద్రేచీ వేళా॥

2. సంత్ సాధుమునీ అవఘే ఝూలేతి గోళా
సోడాశేజే సుఖ ఆతా బఘుదా ముఖకమలా ॥

3. రంగమండపీ మహాద్వారీ ఝూలీసే దాటీ
మన ఉతావీళ రూప పహావయా దృష్టీ ॥

4. రాహీ రఖుమాబాయీ తుమ్హా యే ఉ దాదయా
శేజే హాల వూనీ జాగే కరా దేవరాయా ॥

5. గరుడ హనుమంత ఉభే పాహతీవాట
స్వర్గీచే సురవర ఘేఉని ఆలే బోభాట ॥

6. ఝూలే ముక్తద్వార లాభ ఝూలా రోకడా
విష్ణు దాస నామా ఉభా ఘేఉని కాకడా ॥

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. పాండురంగా | - | పండరీనాథుడవైన ఓ ప్రభూ! |
| ఉఠా | - | మేలు కొనుము |
| దర్శన | - | మీ దర్శన భాగ్యము |
| ఆతా | - | ఇప్పుడే |
| సకలా | - | అందరకూ |
| దా | - | కలుగజేయుము |
| అరుణోదయ | - | సూర్యోదయము |

ఝాలా - అయిపోయినది

నిద్రేచీ వేళా - నిదురుపోవు సమయము

సరళీ - దాటిపోయినది

పండరి నాథుడవైన ఓ ప్రభూ పాండురంగా! మేలుకొనుము. మీ యొక్క దర్శన భాగ్యము మాకందరకూ కలుగజేయుము. సూర్యోదయము అయిపోయినది. ఇక నిదురపోవు సమయము దాటి పోయినది.

2. సంత్ - వార్కరీ సంప్రదాయంలోని భక్తశిఖామణులు

సాధు - ప్రాపంచిక జీవనాన్ని త్యజించిన పవిత్ర జీవనులు

మునీ - అంతర్ దృష్టితో పరమాత్మను మననం చేసే మహానుభావులు

అవఘే - మొదలైన వారందరూ

ఝాలేతి గోళా - బృందాలుగా తరలి వచ్చిరి

ఆతా - (ఆ కారణంచేత) ఇప్పుడు

శేజే సుఖా - నిద్రా సుఖమును

సోడా - వదిలించుకొని

ముఖ కమలా - ముఖారవిందమును

బఘుదా - దర్శించుటకు అనుమతించుడు.

వార్కరీ సంప్రదాయంలోని భక్త శిఖామణులు, ప్రాపంచిక జీవనాన్ని త్యజించిన పవిత్ర జీవనులైన సాధుపుంగవులు, అంతర్ దృష్టితో పరమాత్మను మననం చేసే మహానుభావులైన మునులు మొదలగు వారందరూ బృందాలుగా తరలి వచ్చిరి. ఆ కారణంచేత ఇప్పుడు నిద్రా సుఖమును వదిలించుకొని మీ ముఖారవిందమును దర్శించుటకు అనుమతించుడు.

3. రంగమండపీ - రంగమండపము యొక్క

మహాద్వారీ - మహాద్వారము వద్ద

| | | |
|---|---|---|
| ఝాలీసే దాటీ | - | భక్త జన సందోహము బారులు తీరి వున్నారు |
| మన్ | - | మా మనస్సులు |
| రూప్ | - | మీ రూప సౌందర్యమును |
| దృష్టీ | - | మా కంటి యందు |
| పహావయా | - | ప్రతిష్టిత మొనర్చుకొనుటకు |
| ఉతావీళ | - | ఉవ్విళ్ళూరుచున్నవి |

రంగ మండప మహాద్వారము వద్ద భక్తజన సందోహము బారులు తీరివున్నారు. మా మనస్సులు మీ రూప సౌందర్యమును మాకంటి యందు ప్రతిష్టిత మొనర్చుకొనుటకు ఉవ్విళ్ళూరుచున్నవి

| | | |
|---|---|---|
| 4. రఖుమా బాయియా | - | రుక్మిణీదేవి |
| రాహీ | - | రాధామాయి |
| దయా | - | పండరినాథుని దయ |
| తుమ్హా | - | మీపై |
| యే ఉదా | - | ప్రసరించుగాక |
| శేజే | - | నిదుర మంచము నుండి |
| హాల ఉనీ | - | నెమ్మదిగా కదలివచ్చి |
| దేవరాయ | - | అత్యంత ప్రియమైన పండరీనాథుని |
| జాగేకరా | - | దయచేసి మేలుకొలుపరా ! |

ఓ తల్లులారా! రుక్మిణీ దేవీ మరియు రాధామాయీ! పండరినాథుని దయ మీపై ప్రసరించుగాక. నిదుర మంచము నుండి నెమ్మదిగా కదలి వచ్చి, అత్యంత ప్రియమైన పండరి నాథుని దయచేసి మేలుకొలపండి.

ఇక్కడ రాహీ అన్న పేరు రాధాదేవికి చెందింది. నిజానికి రాధాదేవి కూడ కృష్ణునితో పూజలందుకుంటూ వుంటుంది. అలాగే రుక్మిణీదేవి విఠల్ భగవానునితో కలిసి పూజలందు కుంటూ వుంటుంది. మహారాష్ట్రలోని కొన్ని

దేవాలయాల్లో రాహీ మరియు రుక్మిణీ కూడ విఠల్ భగవానునితో కల్సి పూజలందుకుంటూ వుంటారు. విఠల్ భగవానునికి ముగ్గురు రాణులు. ఒకరు రుక్మిణి, రెండవవారు సత్యభామ, మూడవవారు రాహీమాయి (రాధామాయి)

| | | |
|---|---|---|
| 5. గరుడ హనుమంత | - | గరుడుడు మరియు హనుమంతుడు |
| పాహతీ | - | ఎదురు చూస్తూ |
| ఉభే | - | నిలబడి |
| వాట | - | కాచుకొని వున్నారు |
| సురవర | - | దేవతలు |
| స్వర్గీచే | - | స్వర్గము నుండి |
| బోభాట్ | - | పెద్ద పెద్ద నామస్మరణ శబ్దములతో |
| ఘేఉని | - | కూడి వున్నవారై |
| ఆలే | - | వచ్చిరి |

గరుడుడు మరియు హనుమంతుడు మీ దర్శనము కొరకై ఎదురుచూస్తూ నిలబడిాచుకుని వున్నారు. అంతేకాక దేవతలందరూ స్వర్గము నుండి జయలుదేరి పెద్ద పెద్ద నామ స్మరణ శబ్దములు చేస్తూ వచ్చి చేరారు.

| | | |
|---|---|---|
| 6. ముక్త ద్వార | - | ముక్త ద్వారము |
| ఝూలే | - | తెరుచుకొని వున్నది |
| విష్ణుదాస్ | - | విష్ణుదాసుడైన |
| నామా | - | సంత్ నామదేవుడనే నేను |
| రోకడా | - | వెనువెంటనే |
| లాభఝూలా | - | లాభపడితిని |
| కాకడా | - | వస్త్రముతో చేసిన కాకడలు అనబడే నూనెతో తడిసిన వత్తులను |
| ఘేఉని | - | ఆరతిపళ్ళెముతో పట్టుకుని |
| ఉభా | - | నిలుచునివున్నాను |

ముక్త ద్వారము అనబడే మోక్ష మార్గము తెరుచుకొని వున్నది. సంత్ నామదేవుడనే నేను వెనువెంటనే లాభపడితిని. కాకడలు అనబడే వత్తులను వస్త్రముతో చేసి, నూనెలో తడిపి ఆరతి పళ్ళెముతో పట్టుకుని నిలుచున్నాను.

సంత్ నామదేవుడు విఠల్ భగవానుని ఈ విధంగా ప్రార్థిస్తూ అనేక అభంగాలు వ్రాసారు. అంతేకాక ప్రముఖ సాదుపుంగవుల జీవిత చరిత్రలు కూడా వ్రాసారు. ఇవన్నీ విష్ణుదాసడు అనే కలం పేరు కల్గివుండడం ఒక విశేషంగా చెప్పుకుంటూ వుంటారు.

మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పండరిపురం, ఇది చంద్రభాగ నది ఒడ్డున వుంది. ప్రస్తుతం చంద్రభాగ నదినే భీమానది అని పిలుస్తూ వుంటారు. మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన విష్ణుభక్తులు 13 నుండి 17వ శతాబ్దం మధ్యకాలంలో ప్రసిద్ధికెక్కిన జ్ఞానేశ్వర్, నామదేవ్, ఏకనాథ్, తుకారాం, పురందరదాస్, విజయదాస్, గోపాలదాస్, జగన్నాథదాస్ మొదలైన వారందరూ పండరినాథుణ్ని కొలిచి తరించారు.

భారతదేశం మొత్తం మీద భక్తి తత్వానికి మేరు పర్వతంలాంటిది పండరిపురం.మరాఠీ భాషలో ఇటుకను విఠ్ అంటారు. పాండురంగడు ఆ ఇటుక మీద నిలబడి వున్నాడు కాబట్టి విఠలుడయ్యాడని ఒక కథను చెప్పుకుంటూ వుంటారు.



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-5

## (శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ)

1. ఘే ఉనియా పంచారతీ
కరూ బాబాంసీ ఆరతీ కరూ ॥

2. ఉఠా ఉఠా హెూ బాంధవా
ఓవాళూ హ రమాధవ
సాయీ రమాధవ ఓవాళూ హ రమాధవ ॥

3. కరూనియా స్థిరమన పాహూ గంభీర హేధ్యాన
సాయీచే హే ధ్యాన పాహూ గంభీర హే ధ్యాన॥

4. కృష్ణనాథ దత్తసాయి జడో చిత్త తుఝే పాయీ
చిత్త తుఝే పాయీ జడో చిత్త తుఝే పాయీ ॥

* * *

| | | |
|---|---|---|
| 1. పంచారతీ | - | ఐదు వత్తులతో కూడిన ఆరతి పళ్ళెము |
| ఘే ఉనియా | - | పట్టుకుని |
| బాబాంసీ | - | మన దైవమైన బాబాకు |
| ఆరతి | - | ఆరతిని |
| కరో | - | ఇచ్చెదము రండి |

ఓ భక్తులారా! ఐదు వత్తులతో కూడిన ఆరతి పళ్ళెము పట్టుకుని మన దైవమైన బాబాకు కాకడ ఆరతిని సమర్పించెదము రండి.

| | | |
|---|---|---|
| 2. హో | - | ఓ |
| బాంధవా | - | బంధువులారా! |
| ఉఠా ఉఠా | - | మేల్కొనండి మేల్కొనండి |

| | | |
|---|---|---|
| రమాధవా | - | లక్ష్మీదేవికి భర్త అయిన విష్ణుభగవానునకు |
| హా | - | ఈ పంచారతిని |
| ఓవాళూ | - | త్రిప్పుతూ సమర్పించెదము |

ఓ బంధువులారా! మేల్కొనండి మేల్కొనండి. లక్ష్మీదేవికి భర్త అయిన విష్ణు భగవానునకు, ఈ పంచారతిని త్రిప్పుతూ సమర్పించెదము రండి.

| | | |
|---|---|---|
| 3. మన్ | - | మనస్సును |
| స్థిర్ | - | స్థిరముగా |
| కరూనియా | - | చేసుకుని |
| హే | - | ఈ యొక్క |
| గంభీర్ | - | మానసిక అనుభవమైన |
| ధ్యాన్ | - | ధ్యానముపై |
| పాహు | - | అంతర్ దృష్టిని సారించుదుము |

ఓ బంధువులారా! మన మనస్సులను స్థిరముగా చేసుకుని ఆరతి అనబడే ఈ యొక్క మానసిక అనుభవమైన ధ్యానముపై అంతర్ దృష్టిని సారించెదము రండి.

| | | |
|---|---|---|
| 4. కృష్ణనాథా | - | ఓ భగవాన్ శ్రీకృష్ణా |
| దత్తసాయి | - | ఓ దత్తాత్రేయ స్వరూపా సాయినాథా |
| తుఝే | - | తమ దివ్యములైన |
| పాయీ | - | పాదార విందములపై |
| చిత్త | - | నా మనస్సును |
| జడో | - | స్థిరపడునట్లు చేయుడు |

ఓ భగవాన్ శ్రీకృష్ణా! ఓ దత్తాత్రేయ స్వరూపా సాయినాథా! తమ యొక్క దివ్య పాదారవిందములపై నా మనస్సును స్థిరపడుచునట్లు చేయుడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-6

## (శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ)

1. కాకడ ఆరతీ కరీతో సాయినాథ దేవా
చిన్మయ రూప దాఖవీ ఘేఉని బాలక లఘుసేవా॥
కామ క్రోధ మద మత్సర ఆటునీ కాకడా కేలా
వైరాగ్యాచే తూప ఘాలునీ మీ తో భిజవీలా
సాయినాథ గురుభక్తి జ్వలనే తో మీ పేటవిలా
తద్వృత్తీ జారూనీ గురూనే ప్రకాశ పాడీలా
ద్వైత తమా నాసూనీ మిళవీ తత్స్వరూపీ జీవా॥
చిన్మయ రూప దాఖవీ ఘేఉని బాలక లఘు సేవా॥

2. భూఖేచర వ్యాపూనీ అవఘే హృత్కమలీ రాహసీ
తోచి దత్తదేవతు శిరిడీ రాహునీ పావసీ
రాహూనీ యేథే అన్యత్రహి తూ భక్తాంస్తవ ధావసీ
నిసునియా సంకటా దాసా అనుభవ దావిసీ
న కలే త్వల్లీలాహి కోణ్యా దేవా వా మానవా ॥
చిన్మయ రూప దాఖవీ ఘేఉని బాలక లఘు సేవా॥

3. త్వద్యశ దుందుభినే సారే అంబర హే కోందలే
సగుణమూర్తి పాహ్ణ్యా ఆతుర జన శిరిడీ ఆలే
ప్రాశుని త్వద్వచనామృత అముచే దేహభాన హరపలే
సోడునియా దురభిమాన మానస త్వచ్చరణీ వాహిలే
కృపా కరూనియా సాయి మావులే దాసపదరీ ఝ్యావా॥
చిన్మయ రూప దాఖవీ ఘేఉని బాలక లఘు సేవా॥

⋆ ⋆ ⋆

## ఆరతి సాయిబాబా

| | | |
|---|---|---|
| 1. సాయినాథ దేవా | - | భగవానుడవైన శ్రీసాయినాథా! |
| కాకడ ఆరతీ | - | ప్రాతఃకాలమందలి ఈ కాకడ ఆరతిని |
| కరీతో | - | సమర్పించుకుంటున్నాను. |
| బాలక | - | సరైన జ్ఞానము లేని చిన్న పిల్లవాడి వలే |
| లఘు సేవా | - | చేస్తున్న ఈ చిన్న సేవా కార్యక్రమాన్ని |
| ఘే ఉని | - | మన్నించి |
| చిన్మయ రూప | - | మీ సచ్చిదానంద స్వరూపమును |
| దాఖవీ | - | దర్శింపజేయుము |

భగవానుడవైన ఓ శ్రీసాయినాథా! ప్రాతఃకాలమందలి ఈ కాకడ ఆరతిని ఇప్పుడు సమర్పిస్తున్నాను. సరైన జ్ఞానము లేని చిన్న పిల్లవాడి చేష్టతో పోల్చదగిన ఈ చిన్న సేవా కార్యక్రమాన్ని దయతో మన్నించి మీ యొక్క చిన్మయ రూపమును అనగా సత్ చిత్ ఆనంద రూపమును (సచ్చిదానంద రూపమును) మాకు దర్శింపజేయుడు.

| | | |
|---|---|---|
| కామక్రోధ మద మత్సర | - | కామము, క్రోధము మదము అనగా గర్వము, అసూయ మొదలగు చెడు గుణములను |
| ఆటుని | - | మడిచి మెలికలు పెట్టి త్రిప్పి |
| కాకడ కేలా | - | వత్తులు చేసి నూనెలో తడిపి వుంచినట్లుగా |
| వైరాగ్యాచే | - | వైరాగ్యమనే |
| తూప | - | నేతిని |
| ఘాలునీ | - | పాత్రలో నింపి |
| భిజవిలా | - | ఆ చెడు గుణములనే వత్తులను |
| మీ తో | - | నేను తడిపి ఉంచితిని |

కామము, క్రోధము, గర్వము, అసూయ మొదలగు చెడు గుణములను మడిచి మెలికలు పెట్టి త్రిప్పి, వత్తులు చేసి నూనెలో తడిపి ఉంచినట్లుగా,

వైరాగ్యమనే నేతిని పాత్రలో నింపి ఆ చెడు గుణములనే వత్తులను నేను తడిపి ఉంచితిని.

సాయినాథ్ గురుభక్తి

| | | |
|---|---|---|
| జ్వలనే | - | శ్రీసాయినాథ్ గురువులపై గల అఖండ భక్తి అనబడే అగ్ని జ్వాలలో |
| తోమీ | - | నేను ఆ వత్తులను |
| పేటవిలా | - | వెలిగించితిని |
| గురూనే | - | గురుమహరాజ్ కూడ |
| తద్వృత్తీ | - | చెడు వాసనలతో కూడిన వత్తులనే ఆ గుణములనన్నింటినీ |
| జాళునీ | - | దహించివేసి |
| ప్రకాశ | - | జ్ఞానమునే వెలుగును |
| పాడీలా | - | ప్రసాదించిరి |

శ్రీసాయినాథ గురువులపై గల అఖండ భక్తి భావన అనబడే అగ్నిజ్వాలలో ఆ వత్తులను నేను వెలిగించితిని. శ్రీగురు మహరాజ్ కూడ చెడు వాసనలతో కూడిన ఆ వత్తులు అనబడే చెడు గుణములనన్నింటినీ దహించివేసి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించిరి.

| | | |
|---|---|---|
| ద్వైతతమా | - | అజ్ఞానమనే ద్వైత బుద్ధిని |
| నాసునీ | - | నాశనము చేసి |
| జీవి | - | దేహరూపంలో వున్న ఈ జీవుడిని |
| తత్స్వరూపీ | - | సచ్చిదానంద పరమాత్మతో |
| మిళవీ | - | ఐక్యమగునట్లుగా శ్రీసాయినాథ్ గురువుల అనుగ్రహము అందరకూ కలుగుగాక |

అజ్ఞానమనే ద్వైత బుద్ధిని నాశనము చేసి దేహరూపంలో నున్న ఈ జీవుడిని అనగా దేహమే నేననే భ్రమలో పడి మ్రగ్గుతున్న ఈ జీవుడిని సచ్చిదానంద

పరమాత్మతో ఐక్యమగునట్లుగా శ్రీ సాయినాథ్ గురువుల అనుగ్రహము అందరకూ కలుగుగాక.

| | |
|---|---|
| 2. భూఖేచర | - భూలోక స్వర్గలోకములతో సహా |
| అవఘే | - అంతటనూ |
| వ్యాపూనీ | - వ్యాపించి |
| హ్యాత్కమళీ | - ప్రతి హృదయ కమలమునందునూ |
| రాహసీ | - నివశించునది మీరే కదా! |
| తోచీ | - ఆవిధంగా మీరే |
| దత్తదేవతు శిరిడీ | - శిరిడీలో దత్తదేవునిగా |
| రాహునీ | - ఉంటూ |
| పావసి | - భక్తులను అనుగ్రహిస్తున్నారు |

ఓ సాయి ప్రభూ! భూలోక స్వర్గలోకములతో సహా అన్ని లోకములనూ, అంతటనూ వ్యాపించి ప్రతి హృదయకమల క్షేత్రమునందు నివశిస్తున్నది మీరే కదా! ఆవిధంగా మీరే శిరిడీ క్షేత్రంలో దత్తదేవునిగా ఉంటూ భక్తులను అనుగ్రహిస్తున్నారు.

| | |
|---|---|
| యేథే | - ఇక్కడనే |
| రాహున | - ఉంటూనే |
| అన్యత్రాహి | - వేరొక చోట కూడ |
| తూ | - మీరు |
| భక్తాంస్తవ | - భక్తులను రక్షించుటకు గాను |
| ధావసీ | - పరుగు పరుగున వస్తున్నారు |
| దాసా | - భక్తుల యొక్క |
| సంకటా | - అపాయములను |
| నిరసునియా | - తొలగిస్తూ |

| | | |
|---|---|---|
| అనుభవ | - | ప్రత్యక్షంగా అట్టి అనుభవాన్ని వారికి |
| దావిసీ | - | కల్గిస్తున్నారు. |

మీరు ఇక్కడనే ఉంటూ కూడ వేరొకచోట భక్తులను రక్షించుటకుగాను పరుగు పరుగున వస్తున్నారు. ఆ ప్రకారం భక్తులయొక్క అపాయాల్ని తొలగిస్తూ ప్రత్యక్షంగా అట్టి అనుభవాన్ని వారికి కల్గిస్తున్నారు.

| | | |
|---|---|---|
| కోణ్యాదేవా | - | ఏ దేవతలు |
| వా | - | గాని |
| మానవా | - | నరులు గాని |
| త్వల్లీలా హి | - | మీ యొక్క జగన్నాటకమును |
| న కలే | - | అవగాహన చేసుకొనలేరు |

ఏ దేవతలుగాని, నరులుగాని మీ యొక్క జగన్నాటకము నందలి లీలలను అవగాహన చేసుకొనలేరు.

| | | |
|---|---|---|
| 3. సారే అంబర | - | విశాలమైన ఆకాశమంతా |
| త్వ | - | మీ యొక్క |
| ద్యశ | - | కీర్తి అనబడే |
| దుందుభీ వే | - | దుందుభి శబ్దంతో |
| హేకోందలే | - | నిండి ప్రతిధ్వనించు చున్నది |
| జన | - | ప్రజలందరూ |
| సగుణమూర్తి | - | మీ యొక్క సగుణ రూపాన్ని |
| పాహణ్యా | - | దర్శించుట కొరకు |
| ఆతుర | - | ఎంతో ఆత్రంతో |
| శిరిడి ఆలే | - | శిరిడి వచ్చి చేరిరి |

ఈ విశాలమైన ఆకాశమంతా మీయొక్క కీర్తి అనబడే దుందుభి శబ్దంతో నిండి ప్రతి ధ్వనించుచున్నది. ఇక ప్రజలందరూ మీయొక్క సగుణ రూపాన్ని,

అనగా మానవ అవతారాన్ని దర్శించుట కొరకై ఎంతో ఆత్రంతో శిరిడి వచ్చి చేరుతున్నారు.

| | | |
|---|---|---|
| త్వద్వచనామృత | - | మీ వచనామృతమును |
| ప్రాశుని | - | సేవించి |
| అముచే | - | మాకు సంబంధించిన |
| దేహభాన | - | దేహ వాసన లేక దేహాభిమానము |
| హరపలే | - | పోగొట్టు కొనగలిగితిమి |
| దురభిమాన | - | మాకున్న భేదాభిప్రాయములను |
| సోడునియా | - | ప్రక్కన బెట్టి |
| మానస | - | మా మనస్సులను |
| త్వచ్చరణీ | - | మీ పాదముల వద్ద |
| వాహిలే | - | సమర్పించుకొంటున్నాము |
| సాయి మావులే | - | ఓ సాయితల్లీ! |
| దాస | - | మీ దాసుడనైన ఈ భక్తుడను |
| కృపా | - | తమ కృపచే |
| కరూని | - | కరుణించుడు |
| ఝ్యూవా | - | దయచేసి |
| పదరి | - | మీ ఒడిలో చేర్చుకొనుడు |

ఓ సాయిదేవా! అమృతము వంటి మీ మాటలను విని మాకు సంబంధించిన ఈ దేహ వాసన లేక దేహాభిమానమును పోగొట్టు కొనగలిగితిమి. ఇంకనూ మామధ్య గల భేదాభిప్రాయ ములను కూడ ప్రక్కన బెట్టి మా మనస్సులను మీ పాదముల వద్ద నుంచి శరణాగతులము అగుచున్నాము. ఓ సాయితల్లీ! మీ దాసుడనైన ఈ భక్తుడను తమ కృపచే కరుణించుడు. దయచేసి మీ ఒడిలో చేర్చుకొనుడు.

ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-7

## (సంత్ తుకారాం)

**1.** భక్తిచియా పోటీ బోధ కాకడా జ్యోతీ
పంచప్రాణ జీవే భావే ఓవాళూ ఆరతీ॥

**2.** ఓ వాళూ ఆరతీ మా ఝ్యా పండరినాథా
మా ఝ్యా సాయినాథా
దోన్హీ కరజోడూనీ చరణీ ఠేవిలా మాథా॥
కాయ మహిమా వర్ణూ ఆతా సాంగణే కీతీ
కోటీ బ్రహ్మ హత్యా ముఖ పాహతా జాతీ ॥

**3.** రా హీ రఖుమా బాయీ ఉభ్యా దోఘీ దో బాహీ
మయూర పింఛ చామరే ఢాళితి ఠాయీంచే ఠాయీ॥

**4.** తుకాహ్మణే దీప ఘేఉని ఉన్మన తీశోభా
విటేవరీ ఉభా దిసే లావణ్యా గాభా॥
ఓ వాళూ ఆరతీ మా ఝ్యా పండరినాథా
మా ఝ్యా సాయినాథా॥

⭑ ⭑ ⭑

| | | | |
|---|---|---|---|
| 1. | బోధ | - | చక్కటి అవగాహన కల్గించే జ్ఞానంతో |
| | పోటీ | - | ప్రకాశింపబడే |
| | భక్తిచియా | - | భక్తి మార్గం |
| | కాకడ జ్యోతీ | - | కాకడ ఆరతి ద్వారా శోభిల్లుతుంది |
| | జీవేభావే | - | జీవాత్మ |
| | పంచప్రాణ | - | పంచ ప్రాణములతో కల్పి |
| | ఆరతి | - | వెలుగుతున్న ఈ ఆరతిని |
| | ఓవాళూ | - | సమర్పణ బుద్దితో త్రిప్పుటకు అనుమతించుడు |

**ఆరతి సాయిబాబా**

చక్కటి అవగాహన కల్గించే జ్ఞానంతో ప్రకాశించబడుతున్న భక్తి మార్గం ఈ కాకడ ఆరతి ద్వారా మరింత శోభాయమానంగా వెలుగుతూ ఉంటుంది. కాబట్టి జీవాత్మ యొక్క పంచప్రాణములతో కల్పి అనగా ప్రాణ అపాన సమాన ఉదాన వ్యానములుతో కల్పి వెలుగుతున్న ఈ ఆరతిని సమర్పణ బుద్ధితో త్రిప్పుటకు అనుమతించుడు.

| | | |
|---|---|---|
| 2. పండరినాథా | - | ఓ పండరినాథుడా! |
| మా ఝ్యా | - | నా యొక్క |
| ఆరతిని | - | ఆరతి సమర్పణను |
| ఓవాళూ | - | కావిమ్మ |
| సాయినాథా | - | ఓ సాయినాథుడా! |
| మా ఝ్యా | - | నాయొక్క |
| దోన్హి కర | - | రెండు చేతులను |
| జోడూని | - | జోడించి |
| మాథా | - | నా నుదుటి భాగాన్ని |
| చరణీ | - | తమ పాదములపై |
| ఠేవిలా | - | స్థిరపరచితిని |

ఓ పండరినాథుడా! నా యొక్క ఆరతి సమర్పణను అనుమతించుడు. ఓ సాయినాథుడా! నా రెండు చేతులను జోడించి నుదుటి భాగాన్ని తమ పాదములపై స్థిరపరచితిని.

| | | |
|---|---|---|
| ఆతా | - | ఇప్పుడు |
| మహిమా | - | మీ యొక్క మహిమను |
| కాయ | - | ఏమని |
| వర్ణు | - | వర్ణింపగలను |
| కీతీ | - | ఎంతని |

| | | |
|---|---|---|
| సాంగణే | - | చెప్పగలను |
| సాహతాముఖ | - | మీ ముఖ కమలమును చూడగానే |
| కోటీ బ్రహ్మహత్యా | - | అనేక కోట్ల బ్రహ్మ హత్యా పాతకములు కూడ |
| జాతి | - | తుడిచి పెట్టుకునిపోయినవి. |

ఓ పండరినాథుడా! ఇప్పుడు మీ యొక్క మహిమను ఏమని వర్ణింపగలను., ఎంతని చెప్పగలను. మీ ముఖ కమలమును చూడగానే అనేక కోట్ల బ్రహ్మహత్యా పాతకములు కూడా తుడిచి పెట్టుకునిపోయినవి.

| | | |
|---|---|---|
| 3. రాహీ | - | తల్లి అయిన రాధాదేవి |
| రుఖుమాబాయీ | - | తల్లి అయిన రుక్మిణీదేవి |
| దోఘీ | - | ఇద్దరూ కూడా |
| దో బాహీ | - | ఇరు ప్రక్కలా |
| ఉభ్యా | - | నిలబడి |
| మయూరపింఛ | - | నెమలి ఈకల |
| ఛామరే | - | విసిన కర్రలు పట్టుకుని |
| ఢాయించే ఠాయీ | - | ఇటూ అటూ |
| ఢాళితి | - | విసురుచున్నారు |

తల్లి లాంటి రాధాదేవి, తల్లిలాంటి రుక్మిణీదేవి ఇద్దరూ కూడా చెరుప్రక్కలా నిలబడి నెమలి ఈకలు కల్గిన విసిన కర్రలు పట్టుకుని ఇటూ అటూ విసురుచున్నారు.

| | | |
|---|---|---|
| 4. దీపఘేఉని | - | దీపములను చేతపట్టుకుని |
| తుకాహ్మణే | - | సంత్ తుకారాముడు ఇట్లు చెప్పుచున్నాడు |
| లావణ్యాగాబా | - | ముగ్ధమనోహరమైన ఒక సౌందర్యరాశి కేంద్రీ కరించబడి |
| విఠేవరి | - | ఒక ఇటుకపై |

| | | |
|---|---|---|
| ఉభా | - | నిలిచివున్నట్లుగా |
| దిసే | - | కనబడుచున్నది |
| ఉన్మీత | - | అద్వైత సత్యాన్ని దాచుకుని |
| శోభ | - | గంభీరమైన వైభవంతో దర్శనమిస్తున్నది. |

ఆరతి దీపములను చేత పట్టుకుని సంత్‌తుకారాముడు ఇట్లు చెప్పు చున్నాడు. ముగ్ధ మనోహరమైన సౌందర్యరాశి కేంద్రీకరించబడి ఒక ఇటుకపై నిలబడివున్నట్లుగా కనపడుచున్నది. అంతేకాక ఏకమేవా అద్వితీయం బ్రహ్మ అనబడే పరమ సత్యాన్ని తనలో నింపుకొని గంభీరమైన వైభవంతో దర్శన మిస్తున్నది.



ఓం శ్రీ సాయినాథాయనమః

# భజన

**(కాకడ ఆరతి)**

సాయినాథ గురు మాఝే ఆయీ
మజలా ఠావ ద్యావా పాయీ॥
దత్తరాజ గురు మాఝే ఆయీ
మజలా ఠావ ద్యావా పాయీ॥
సాయినాథగురు మాఝే ఆయీ
మజలా ఠావ ద్యావా పాయీ ॥

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై

| | | |
|---|---|---|
| సాయినాథ్ గురు | - | ఓ సాయినాథ గురుదేవా |
| మాఝే | - | మాకు మీరే |
| ఆయీ | - | తల్లి |
| మజలా | - | మాకు |
| పాయీ | - | మీ పాద పద్మముల చెంత |
| ఠావ్ | - | విశ్రాంతిని |
| ద్యావా | - | దయచేసి ప్రసాదింపుడు |
| దత్తరాజగురు | - | ఓ గురు భగవాన్ దత్తా! |
| మాఝే | - | మాకు మీరే |
| ఆయీ | - | తల్లి |
| మజలా | - | మాకు |
| పాయీ | - | మీ పాదపద్మముల చెంత |
| ఠావ్ | - | విశ్రాంతిని |
| ధ్యావా | - | దయచేసి ప్రసాదింపుడు |

## ఆరతి సాయిబాబా

### శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై

రాజులందరికీ మహారాజైన శ్రీసాయినాథ్ సద్గురువుల సత్‌చిత్ ఆనంద మూర్తులు, అనగా ఈ విశ్వమునకంతకూ ఉపాది కారణము, నిమిత్తకారణము అయివున్నారు, సృష్టి స్థితి లయ కారులైన సాయినాథ్ మహారాజుకు ఎల్లప్పుడూ జయమగుగాక.



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-8

## (సంత్ నామదేవ్)

1. ఉఠా సాధుసంత సాదా ఆపులాలే హిత
జాఈల జాఈల హా నరదేహా మగ కైచా భగవంత ॥
2. ఉఠోనియా పహాటే బాబా ఉభా అసేవిటే
చరణతయాచే గోమటే అమృత దృష్టీ అవలోకా ॥
3. ఉఠా ఉఠాహెూ వేగేసీ చలా జాఊయా రావుళాసీ
జళ తీల పాతకాంచ్యా రాశీ కాకడ ఆరతి దేఖిలియా॥
4. జాగేకరా రక్మిణీ వర దేవ ఆహే నిజసురాంత
వేగే లింబలోణ కరా దృష్టి హెూఈల తయాసీ॥
5. దారీ వాజంత్రీ వాజతీ ఢోల్ దమామే గర్జతీ
హోతే అసే కాకడ ఆరతీ మాఝ్యా సద్గురు రాయాచీ॥
6. సింహనాద శంఖభేరి ఆనంద హెూతే మహాద్వారీ
కేశవరాజ విటేవరీ నామాచరణ వందితో ॥

⋆ ⋆ ⋆

| | | | |
|---|---|---|---|
| 1. | సాధు సంత | - | ఓ సాధువులారా! ఓ సత్పురుషులారా! |
| | ఉఠా | - | మేల్కొనండి |
| | ఆపులాలే | - | మీ ఆత్మ ఉద్ధరణ కొరకై |
| | హిత | - | హితమును |
| | సాదా | - | తెలుసుకొనుడు |
| | హానరదేహ | - | ఈ మానవ శరీరము |
| | జాఈల జాఈల | - | ఎప్పటికైనా నశించును నశించును |
| | మగ | - | కాబట్టి |

| | | |
|---|---|---|
| భగవంత | - | భగవద్దర్శనమునకు |
| కైచా | - | ఆస్కారము ఎట్లు కలుగును? |

ఓ సాధువులారా! ఓ సత్పురుషులారా! మేల్కొనండి. మీ యొక్క ఆత్మ ఉద్ధరణకు సంబంధించిన హితమును గ్రహించండి. ప్రస్తుత ఈ మానవ దేహము క్షణికము. ఇది ఎప్పటికైనా నశించును నశించును. అటువంటి పరిస్థితిలో భగవద్దర్శనమునకు అవకాశము ఎట్లు లభించును?

| | | |
|---|---|---|
| 2. ఉఠోనియా పహాటే | - | తెల్లవారుజామున నిద్రలేచారా? |
| విటే | - | ఇటుకపై |
| ఉభా అసే | - | తిన్నగా నిలబడివున్నది |
| బాబా | - | పాండురంగడైన బాబాయే |
| గోమతే | - | ప్రేమ పాత్రమైన |
| తయాచే | - | ఆయనయొక్క |
| చరణ | - | దివ్య చరణములపై |
| అవలోకా | - | తదేక దృష్టి పెట్టుకొనుడు |
| అమృత దృష్టీ | - | ఆయన కరుణారస దృష్టి అమృతమును వర్షిస్తున్నది |

ఓ సాధువులారా! ఓ సత్పురుషులారా! తెల్లవారు జామున నిద్ర లేచారా? ఇటుకపై తిన్నగా నిలబడివున్నది పాండురంగడైన ఆ బాబాయే అని తెలుసుకొనుడు. ప్రేమ పాత్రమైన ఆయన యొక్క దివ్య చరణములపై తదేక దృష్టి పెట్టుకొనుడు. కరుణతో నిండిన ఆయన దృష్టి అమృత వర్షమును కురిపుస్తున్నది గ్రహించండి.

| | | |
|---|---|---|
| 3. హో ! | - | ఓ సోదరులారా! |
| ఉఠా ఉఠా | - | మేల్కొనండి మేల్కొనండి |
| వేగేసీ | - | త్వరత్వరగా |

| | | |
|---|---|---|
| చలా | - | రండి |
| జాఊయా రావుళీసీ | - | అందరం కలిసి దేవాలయానికి పోదాము |
| కాకడ ఆరతి దేఖిలియా | - | కాకడ ఆరతి దర్శనమాత్రము చేత |
| పాత కాంచ్యారాశీ | - | కొండల వంటి మనపాప రాశులను |
| జళతీల | - | దహించివేద్దాము |

ఓ సోదరులారా! మేల్కొనండి మేల్కొనండి. త్వరత్వరగా అందరూ రండి. కాకడ ఆరతి సమయము ఆసన్నమైనది. అందరం కలిసి దేవాలయానికి వెళ్ళుదాము. కాకడ ఆరతి దర్శన మాత్రము చేత కొండలవలె పేరుకుపోయిన మన పాపరాశులను దహించివేద్దాము.

| | | | |
|---|---|---|---|
| 4. | జాగేకరా | - | ఆ ప్రభువును మేలు కొలుపుదము రండు |
| | రుక్మిణీ వరదేవ | - | మన ప్రభువైన రుక్మిణీవల్లభుడు |
| | ఆహే నిజ సురాంత వేగే | - | ఇంకా మగత నిద్రలోనే వున్నాడు |
| | వేగే | - | ఆలశ్యం చెయ్యకుండా తొందరగా రండి |
| | లింబ లోణకరా | - | వేప ఉప్పు ఆవనూని కల్పిన వెన్నను ప్రభువు శరీరానికి పూతగా చేద్దాము |
| | తయాసీ | - | ప్రభువుకు |
| | దృష్టి | - | దోష దృష్టి |
| | హో ఈల | - | సోకే ప్రమాదమున్నది. |

ఓ సోదరులారా ! మన ప్రభువును మేలుకొలుపుదము రండు. ప్రభువైన రుక్మిణీ వల్లభుడు ఇంకా మగత నిద్రలోనే వున్నట్లున్నది. ఆలశ్యం చెయ్యకుండా తొందరగా రండి. వేప ఉప్పు ఆవనూని కల్పిన వెన్నను ప్రభువు శరీరానికి పూతగా సమర్పిద్దాము. ఎందుకంటే ప్రభువుకు దోష దృష్టి సోకే ప్రమాదమున్నది. (అనగా ప్రభువుపై మనకున్న స్మరణ దారి తప్పి ప్రాపంచిక విషయాలపైకి పోయే ప్రమాదమున్నదని అంతరార్థం)

| | | |
|---|---|---|
| 5. దారీ వాజంత్రీ | - | ద్వారం దగ్గర సన్నాయి వాయిద్యాలు |
| వాజతీ | - | మ్రోగుతున్నాయి |
| ఢోల్ | - | డప్పులు శబ్దం చేస్తున్నవి |
| దమామే | - | పెద్ద పెద్ద తోలు వాయిద్యాలు మ్రోగుతున్నవి. |
| గర్జతీ | - | గర్జనలు ఆకాశాన్నంటుతున్నాయి |
| మార్ఝ్యా సద్గురు | | |
| రాయాచీ | - | మన సద్గురువైన సాయినాథుని |
| కాకడ ఆరతి | - | కాకడ ఆరతి సమర్పణ |
| హోతే అసే | - | జరుగుచున్నది |

ఓ సోదరులారా! ద్వారం దగ్గర సన్నాయి వాయిద్యాలు మ్రోగుతూన్నాయి. డప్పులు శబ్ధం వినబడుతోంది. అలాగే పెద్ద పెద్ద తోలు వాయిద్యాలు కూడ మ్రోగుతున్నాయి. ఆ గర్జనలన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. మన సద్గురువైన సాయినాథుని కాకడ ఆరతి సమర్పణ జరుగుచున్నది.

| | | |
|---|---|---|
| 6. సింహనాద | - | గంభీరమైన సింహనాదముల శబ్దాలు |
| శంఖభేరీ | - | శంఖధ్వనులు డోలు వాయిద్యాలమ్రోతలు |
| ఆనంద | - | ఎంతో ఆనందాన్ని నింపుతూ |
| మహాద్వారీ | - | మహాద్వారము దగ్గర |
| హోతే | - | వినబడుతున్నవి |
| కేశవరాజ | - | భగవాన్ కేశవుడు |
| విటేవరీ | - | ఇటుకపై నిలబడివున్నాడు |
| నామా | - | సంత్ నామదేవుడు |
| చరణవందితో | - | ప్రభువు యొక్క పాదపద్మములకు పూజలు చేస్తున్నాడు. |

ఓ సోదరులారా! ప్రధాన ప్రవేశ ద్వారము దగ్గర గంభీరమైన సింహనాదముల శబ్దాలు, శంఖ ధ్వనులు, డోలు వాయిద్యాల మ్రోతలు ఎంతో ఆనందాన్ని నింపుతూ వినబడుతున్నవి. భగవానుడైన కేశవుడు ఇటుకపై నిలబడివున్నాడు.

ఇంక సంత్ నామదేవుడు ప్రభువు యొక్క పాద పద్మములకు పూజలు సలుపుతున్నాడు.

సంత్‌నామదేవ్ గురించి ఇంతకు ముందే కొంత తెలుసుకున్నాం. ఈ అభంగంలో భగవంతుణ్ని సుప్రభాత కీర్తనలతో మేలు కొలుపుతూ వుంటారు. కాకడ అంటేనే 'వత్తి' అని అర్థం. ఈ 'వత్తి' పలచటి నూలు వస్త్రం ముక్కలతో తయారు చేస్తారు. ప్రత్యేకంగా ఇలాంటి వత్తులతో ఉదయాన్నే ఇచ్చే ఆరతిని కాకడ ఆరతి అని పిలుస్తారు. వార్కరీ శాఖకు చెందిన సాధువులు కాకడ ఆరతికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలందరూ తమ తమ ఇష్టదైవాలకు ఉదయాన్నే కాకడ ఆరతి సమర్పించడం అలవాటు చేసుకోమని చెపుతూ వుంటారు.

ఆ ప్రకారంగానే సంత్ నామ్‌దేవ్, ఈ పాటలో ఇలా అంటారు. 'కాకడ ఆరతి జ్యోతిని ఒక్కసారైనా దర్శించండి. ఆ దర్శనం కోట్లాది పాప పంకిలాల్ని నాశనం చేస్తుంది. మీ పడకల నుండి లేచి రండి, శుచిగా మందిరానికి వెళ్ళండి! కాకడ ఆరతి సమర్పణ ప్రతి రోజు జరుగుతూ వుంటే, హృదయం నిర్మలంగా వుంటుంది. అంతేకాక దైవదత్తమైన కృపా విశేషం శుభసూచకంగా పరిణమిస్తుంది. ఈ రకమైన భక్తిపారవశ్యత మన రోజువారీ పనులకు ఎటువంటి ఆటంకం కలగనివ్వదు.

ఉత్తర భారతదేశంలో పద్యము లేక శ్లోకము అనే పదాలు భావకవిత్వానికి పేరెన్నిక గన్నవి. ఇవి స్వరకల్పన చేయబడి సంగీత పరమైన చక్కటి రాగాలతో పాడితే ఎంతో బాగుంటుంది. ఇటువంటి భక్తిపాటలు సామూహికంగా పాడుతూ, చరణాలకి మధ్యలో పల్లవిని జోడిస్తూ ఉండడం ఒక అద్భుతమైన ప్రక్రియగా రూపుదిద్దుకుంది.

ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-9

## (శ్రీసాయినాథ ప్రభాత అష్టకం)

## శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ

1. ప్రభాత సమయీ నభాశుభ రవి ప్రభా ఫాకలీ
స్మరే గురు సదా అశా సమయి త్యాఛళే నాకలీ ॥
హ్మణోనీ కరజోడునీ కరూ ఆతా గురు ప్రార్థనా
సమర్థ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

2. తమా నిరసి భానుహా గురుహి నాసి అజ్ఞానతా
పరంతు గురూచీ కరీ న రవిహీ కధీ సామ్యతా ॥
పున్హా తిమిర జన్మఘే గురు కృపేని అజ్ఞానా
సమర్థ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

3. రవి ప్రగట హోఉని త్వరితఘా లవీ ఆలసా
తసా గురూ హి సోడవీ సకల దుష్కృతీ లాలసా ॥
హరోని అభిమానహీ జడవి త్వత్పదీ భావనా
సమర్థగురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

4. గురూసి ఉపమా దిసే విధి హరీ హరాంచి ఉణీ
కుఠోని మగయే ఇతీ కవని యా ఉగీ పాహుణీ ॥
తుఝీచ ఉపమా తులా బరవి శోభతే సజ్జనా
సమర్ధ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

5. సమాధి ఉతరోనియా గురు చలా మశిదీ కడే
త్వదీయ వచనోక్తితీ మధుర వారితీ సాకడే ॥
అజాతరిపు సద్గురు అఖిల పాతకా భంజనా
సమర్ధ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

6. ఆహో సుసమయాసి యా గురు ఉఠోనియా బైసలే
విలోకుని పదాశ్రితా తదియ ఆపదే నాసిలే ॥
అసా సుహితకారి యా జగతి కోణిహీ అన్యనా
సమర్థ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

7. అసే బహుత శాహణా పరినజ్యా గురూంచీ కృపా
న తస్వహిత త్యా కళే కరి తసే రికామ్యా గపా ॥
జరీ గురుపదా ధరీ సుదృఢ భక్తినే తోమనా
సమర్థ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

8. గురో వినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా
సమస్త జగహే గురుస్వరూప చితసో మానసా ॥
ఘడో సతత సత్కృతీ మతిహి దే జగత్పావనా
సమర్థ గురు సాయినాథ పురవీ మనోవాసనా ॥

★ ★ ★

| | | | |
|---|---|---|---|
| 1. | నబా | - | ఆకాశంలో |
| | ప్రభాత సమయీ | - | సూర్యోదయ వేళ |
| | శుభ | - | శుభ సమయంలో |
| | రవిప్రభా | - | సూర్య కిరణ సమూహమంతా |
| | ఫాకలీ | - | పరుచుకొని ఉన్నది |
| | సదా | - | ఎల్లప్పుడూ |
| | అసాసమయి | - | ఈ వేళల్లో |
| | గురు | - | సద్గురురాయుని |
| | స్మరే | - | ఎవరైతే స్మరణకు తెచ్చుకుంటారో |
| | త్యా | - | అటువంటి వారిని |
| | ఛళే | - | చుట్టుముట్టుకొనివున్న |
| | కలీ | - | కలిభావనలు (చెడు ఆలోచనలు) |

| | | |
|---|---|---|
| న | - | బాధించవు |
| హ్మాణోని | - | అందులకే |
| కరజోడునీ | - | చేతులు జోడించి |
| ఆతా | - | ఇప్పుడు |
| గురుప్రార్ధనా | - | గురువును ప్రార్థించే పని |
| కరూ | - | చేయుడు |
| సమర్ధ గురు | | |
| సాయినాథ | - | సమర్ధ గురు సాయినాథులు |
| మనోవాసనా | - | మన మనస్సునందు గల ఇష్టములను |
| పురవీ | - | పూర్తి చేయుదురు |

ఆకాశంలో సూర్యోదయవేళ శుభసమయంలో సూర్యకిరణ సమూహమంతా పరుచుకొని వున్నది. ఈ సమయాల్లో ఎల్లప్పుడూ సద్గురురాయుని ఎవరైతే స్మరణకు తెచ్చుకుంటారో అటువంటి వారిని చుట్టుకొనివున్న కలిభావనలు ఎన్నటికీ బాధించవు. ఆ కారణంచేత చేతులు జోడించి ఇప్పుడే గురువును ప్రార్థించే పని చేయుడు. సమర్ధ గురు సాయినాథులు మన మనస్సు నందు గల ఇష్టములను పూర్తి చేయుదురు అనగా నెరవేర్చుదురు.

| | | | |
|---|---|---|---|
| 2. | భాను | - | సూర్యభగవానుడు |
| | తమా | - | అంధకారమును |
| | నిరసీ | - | పోగొట్టును |
| | హా | - | అట్లే |
| | గురూహి | - | ఈ గురువు కూడా |
| | అజ్ఞానతా | - | అజ్ఞానమును చీకటిని |
| | నిరసీ | - | పోగొట్టును |
| | పరంతు | - | కాని |

| | | |
|---|---|---|
| రవిహీ | - | ఈ సూర్య భగవానుడు మాత్రం |
| కధీ | - | ఎప్పటికీ |
| సామ్యతా | - | గురువుతో సమానంగా |
| గురూచీ | - | గురువువలె |
| నకరీన | - | చెయ్యలేడు |
| తిమిర | - | సూర్యాస్తసమయంలో అంధకారము |
| పున్హా | - | మరల వ్యాపించును |
| గురుకృపేని | - | కాని గురుకృప వల్ల |
| అజ్ఞాన | - | అజ్ఞానము |
| జన్మ | - | ఈ జన్మమున |
| నఘే | - | తిరిగి ఉదయింపదు |

సూర్య భగవానుడు అంధకారమును పోగొట్టును. అట్లే ఈ గురువు కూడ అజ్ఞానమను చీకటిని పోగొట్టును. కాని ఈ సూర్య భగవానుడు మాత్రం ఎప్పటికీ గురువుతో సమానంగా గురువు వలె చెయ్యలేడు. ఎందుకనగా సూర్యాస్త సమయంలో అంధకారము మరల వ్యాపించును. కాని గురుకృప వలన ఈ జన్మమున అజ్ఞానము తిరిగి ఉదయింపదు. సమర్థ గురు సాయినాథులు మన మనస్సునందు గల ఇష్టములను నెరవేర్చుదురు.

| | | | |
|---|---|---|---|
| 3. | రవి | - | సూర్య భగవానుడు |
| | ప్రగట | - | ప్రకాశమానుడవగానే |
| | హోఁఉని | - | తనశక్తిని |
| | త్వరిత | - | త్వరత్వరగా ప్రవేశపెట్టి |
| | ఆలసా | - | మనుష్యులందు గల సోమరి తనమును |
| | ఘాలవీ | - | పోగొట్టును |
| | తసా | - | ఆ ప్రకారంగానే |

| | | |
|---|---|---|
| గురూహి | - | సద్గురువు కూడా |
| దుష్కృతీలాలసా | - | దుష్ట సంపర్కములను |
| సకల | - | అన్నింటినీ |
| సోడవీ | - | పోగొట్టును |
| అభిమానహీ | - | అహంభావనను |
| హరోని | - | బయటకు పంపించడమే కాక |
| త్వత్పదీ | - | తన పాదముల పట్ల |
| భావనా | - | నిశ్చల భక్తిని |
| జడవీ | - | నెలకొల్పుదురు |

ప్రతి ఉదయం సూర్యభగవానుడు ప్రకాశమానుడవగానే తన శక్తిని వెదజల్లి త్వర త్వరగా మానవులందు గల సోమరితనమును పోగొట్టును. ఆ ప్రకారంగానే సద్గురువు కూడా మనుష్యుల్లో గల దుష్టసంస్కారములను అన్నింటినీ నిర్మూలించి తన పాదపద్మములపై నిశ్చల భక్తిని నెలకొల్పుదురు. సమర్థ సద్గురు సాయినాథులు మన మనస్సునందు గల ఇష్టములను నెరవేర్చుదురు.

| | | |
|---|---|---|
| 4. విధి హరీ హరాంచీ | - | బ్రహ్మవిష్ణు మహేశ్వరులు కూడా |
| గురూసీ | - | గురువుతో |
| ఉపమాదిసే | - | పోల్చి చూసినచో |
| ఉణీ | - | తక్కువగానే కనపడుదురు |
| మగ | - | అటువంటప్పుడు |
| యేఇతి | - | ఈ రకమైన |
| కవణి | - | మిమ్ములను స్తుతించే ఈ కవితా కన్యక |
| కుఠోని | - | ఎక్కడ నుండి వచ్చును |
| యా ఉగీ పాహుణీ | - | బహుసా ఈ కవితా సుందరి ఒక అదృశ్య శక్తి రూపమైన అతిధి అయివుండవచ్చు. |

| | | |
|---|---|---|
| సజ్జనా | - | ఓ పరమ పవిత్ర ఆత్మస్వరూపా! |
| తుర్భీచ | - | మీకు మీరే |
| ఉపమా | - | తగిన ఉపమానము |
| తులా | - | మీసాటి మీరే అనినచో |
| బరవి | - | స్తుతి |
| శోభతే | - | చక్కగా శోభించును |

ఓ పరమ పవిత్ర ఆత్మ స్వరూపా! సముద్రాన్ని సముద్రంతోటే పోల్చాలి గాని మరి ఏ ఇతర జలరాశి అందుకు తగదు గదా. అట్లే సద్గురువు బ్రహ్మవిష్ణుమహేశ్వరులకంటె ఉన్నతుడైనచో త్రిమూర్తులు గూడ తక్కువగానే కనపడుదురు. అటువంటప్పుడు మిమ్ములను స్తుతించే ఈ రకమైన కవితా కన్యక ఎక్కడ నుండి వస్తుంది. బహుసా ఈ కవితాసుందరి ఒక అదృశ్య శక్తి రూపమైన అతిథి అయివుండవచ్చు. కాబట్టి మీకు మీరే తగిన ఉపమానము మీసాటి మీరే అనినచో స్తుతి చక్కగా శోభించును. సమర్థ సద్గురు సాయినాథులు మన మనస్సు నందు గల ఇష్టములను నెరవేర్చుదరు.

| | | | |
|---|---|---|---|
| 5. | గురూ | - | ఓ గురుదేవా! |
| | సమాధి | - | మీ యొక్క తపస్సమాధి నుండి |
| | ఉతరోనియా | - | బయటకు రండి |
| | మశీదీ కడె | - | మశీదు వైపుకు |
| | చలా | - | వెళ్ళుదము రండి |
| | త్వదీయ | - | మీ యొక్క |
| | వచనోక్తి | - | అభయవచనామృతం |
| | మధుర | - | చాలా మధురంగావుంటుంది |
| | తీ | - | అది |
| | సాకడే | - | మా భవ బంధాలను |
| | వారితీ | - | త్రెంచగలదు |

## ఆరతి సాయిబాబా

| | | |
|---|---|---|
| సద్గురు | - | మన సాయినాథ్ సద్గురువులు |
| అజాతరిపు | - | అజాత శత్రువులు అనగా శత్రువులు లేనివారు లేక శత్రువులెవరూ జన్మించనివారు |
| అఖిల పాతకా | - | సర్వపాపములను |
| భంజనా | - | నాశనము చేయుదరు |

ఓ గురుదేవా! దయచేసి మీ యొక్క తపస్సమాధి నుండి బయటకు రండి. మశీదు వైపు పోవుదము రండి. మీ అభయ వచనామృతం చాలా మధురంగా వుంటుంది. అంతేకాక అది మా భవబంధాలను త్రెంచుతుంది. మన సాయినాథ్ సద్గురువులు అజాత శత్రువులు. అనగా ఆయనకు శత్రువు అన్నవారెవ్వరూ అస్సలు పుట్టనే లేదు. ఎప్పటికీ పుట్టరు కూడా. సర్వ పాపములను నాశనము చేయగల శక్తి మన సాయినాథులకుంది. సమర్థ సద్గురు సాయినాథులు మన మనస్సునందు గల ఇష్టములను నెరవేర్చుదురు.

| | | | |
|---|---|---|---|
| 6. | సుసమయాసీ | - | మంగళ ప్రదమైన |
| | అహో | - | ఈరోజున |
| | యా గురు | - | మన సద్గురువులు |
| | ఉఠోనియా | - | తపస్సమాధి నుండి బయటకొచ్చి |
| | బైసలే | - | వారి స్థానంలో ఆసీనులైవున్నారు. |
| | విలోకుని | - | దయకల్గిన చూపులను |
| | తదియ | - | వారివారి |
| | పదాశ్రితా | - | పాదాశ్రితులపై ప్రసరించి |
| | ఆపదే | - | ఆపదలను |
| | నాసిలే | - | పోగొట్టుచున్నారు |
| | అసా | - | ఇటువంటి |
| | సుహితకారి | - | భక్తులకు భద్రతను కల్పించే |
| | యా | - | సద్గురువులు |

| | | |
|---|---|---|
| జగతి | - | ఈ ప్రపంచంలో |
| కోణిహీ | - | ఎవ్వరైనా |
| అన్య | - | ఇంకొకరు |
| నా | - | లేరు |

మంగళప్రదమైన ఈ రోజున మన సద్గురువులు తన తపస్సమాధి నుండి బయటకొచ్చి వారి స్థానంలో ఆసీనులైవున్నారు. దయకల్గిన చూపులను వారి వారి పాదాశ్రితులపై ప్రసరింప జేసి ఆపదలను పోగొట్టుచున్నారు. ఇటువంటి భక్తులకు భద్రతను కల్పించే సద్గురువులు ఈ ప్రపంచంలో ఇంకొకరు ఎవ్వరూ లేరు. సమర్థ సద్గురు సాయినాథులు మన మనస్సునందు గల ఇష్టములను నెరవేర్చుదురు.

| | | | |
|---|---|---|---|
| 7. | జ్యా | - | ఎవ్వరైనా |
| | అసే | - | స్వతహాగా |
| | బహుత | - | మంచి |
| | శ్యాహణా | - | తెలివితేటలు కల్గివుండవచ్చు |
| | పరి | - | కాని |
| | గురూంచి | - | గురువు యొక్క |
| | కృపా | - | దయను |
| | న | - | పొందలేకపోయినచో |
| | తస్వహిత | - | అతడు తన యొక్క పురోగతి మార్గాన్ని |
| | న | - | తెలుసుకొనలేడు |
| | త్యా | - | ఇంకా అతడు తన మార్గదర్శి అయిన గురువును |
| | కళే | - | ఎరుగక |
| | రికామ్యా | - | ఫలితమివ్వని |
| | కరితసే | - | పనుల వలలో చిక్కుకుని |
| | గపా | - | శుష్క సంభాషణలు జరుపుతూ వుంటాడు |

| | | |
|---|---|---|
| తో | - | అతడు |
| మనా | - | తన మనస్సునందు |
| గురుపదా | - | గురు పాదపద్మములను |
| జరీ | - | మాత్రమే |
| భక్తినే | - | భక్తితో |
| సదృఢ ధరీ | - | పట్టుకొని స్థిరంగా ఉన్న ఎడల |

ఎవరికైనా స్వతహా మంచి తెలివితేటలు ఉండి ఉండవచ్చు. కాని అతడు ఒక సద్గురువు యొక్క దయను పొందలేకపోతే మాత్రం తన పురోగతి మార్గం తప్పినవాడవుతాడు. ఇంకా తనకు సరైన మార్గదర్శి ఎవరో తెలియక అంధకారంలో చిక్కుపడి ఫలితమివ్వని పనులు చుట్టు ముట్టి శుష్క సంభాషణలతో కాలక్షేపం చేస్తూ వుంటాడు. అతడు తన మనస్సునందు గురు పాదపద్మములను మాత్రమే భక్తితో స్థిరపరుచుకొని పట్టుకొని వున్న ఎడల సమర్ధ సద్గురు సాయినాథులు తన మనస్సు నందు గల ఇష్టములను నెరవేర్చుదురు.

| | | |
|---|---|---|
| 8. గురో | - | ఓ సద్గురూ! |
| మీ వినతి కరీ | - | నేను విన్నపము చేయుచున్నాను |
| హృదయమందిరీ | - | నా హృదయమనే మందిరమున |
| యా బసా | - | ప్రవేశించి నివశించుడు |
| సమస్త జగహే | - | ఈ సమస్త జగత్తంతయు |
| గురు స్వరుపచీ | - | గురు స్వరూపముగానే వుండును |
| ఠసో | - | ఈ సత్యము |
| మానసా | - | నా మనస్సు నందు గట్టిగా నాటుకొనునట్లు చేయుడు |
| సతత | - | ఎల్లప్పుడూ |
| సత్కృతీ | - | నావల్ల సత్కార్య నిర్వహణ |
| ఘడో | - | జరుగునట్లుగా చేయుడు |

జగత్పావనా - ఓ జగత్పావనుడా!

మతిహి దే - ఇంతటి విజ్ఞానమును నాకు అందజేయుడు

ఓ సద్గురూ! నేను తమకు విన్నపము చేయుచున్నాను. ఎల్లప్పుడూ నా హృదయ మందిరమున ప్రవేశించి నివశించుడు. అట్లయినచో ఈ సమస్త జగత్తంతయు గురు స్వరూపము గనే కనపడుచుండును. ఈ సత్యము నా మనస్సునందు గట్టిగా నాటుకొనునట్లు చేయుడు. ఎల్లప్పుడూ నావల్ల సత్కార్య నిర్వహణ జరుగునట్లుగా చేయుడు. ఓ జగత్పావనుడా ఇంతటి విజ్ఞానమును దయతో నాకు అందజేయుడు. సమర్ధ సద్గురు సాయినాథులు మన మనస్సు నందు గల ఇష్టములను నెరవేర్చుచుందురు.

దీన్లో గల ప్రత్యేకత ఏమిటంటే సద్గురు సాయినాథుల సంపూర్ణ కృప శ్రీ భీష్మకు లభించడమే. ఆ కృపనే అష్టక రూపంలో మనకు అందించారు. కాబట్టి సాయి భక్తులందరికీ శ్రీ భీష్మ రచించిన శ్రీ సాయినాథ ప్రభాత అష్టకం సత్యమైన భగవదనుగ్రహముద్రతో కూడుకున్న అక్షర ప్రసాదంగా భావించవచ్చు.

సుప్రభాత సేవకు పర్యాయ పదమే 'కాకడ ఆరతి'. దీని ద్వారా భగవంతుణ్ని మేలు కొలిపే అవకాశం భక్తుడికి కలుగుతుంది. కాబట్టి శ్రీ సాయిబాబా కాకడ ఆరతి అంటే ఒక గౌరవ ప్రదమైన మేలు కొలుపు ప్రార్ధనగా భావించాలి. అయితే ఇక్కడ సాయి భక్తులకు ఒక ప్రశ్న ఉదయించవచ్చు, బాబా నిజంగా పడుకుంటారా? ఒకవేళ అలా పడుకుని వున్నప్పుడు ఆయన్ను నిద్రలేపడానికి ఈ కాకడ ఆరతి సమర్పించడం సరైన పనేనా? దీనికి ఈవిధంగా జవాబు చెప్పుకోవచ్చు. నిద్ర అనే పదానికున్న అనువంశిక అర్థం చెప్పుకుంటే మాత్రం, బాబా ఎప్పుడూ నిద్రపోరు అని భక్తులు అనుకుంటూ వుంటారు. అలాంటి సందర్భాల్లో ఒకసారి బాబా ఏమన్నారంటే, నేను నా కళ్ళు పూర్తిగా తెరుచుకుని నిద్రపోతూ వుంటాను అన్నారు. ఒకసారి ఒక భక్తుడు భగవాన్ రమణులను కూడా ఇదే ప్రశ్నవేసాడు. భగవాన్! మెలకువగా వుంటూనే నిద్రపోవడం అన్నది సాధ్యమా? దానికి భగవాన్ రమణులు ఇలా అన్నారు. ఇది సాధ్యమైన పనే కాని ఒక్క జ్ఞానికి మాత్రమే ఇది సాధ్యపడుతుంది. అటువంటి వారికి దేహ

భావమనే అహంకారం మాయమవుతుంది.ఇంకా జ్ఞానేంద్రయాలు, కర్మేంద్రియాలు కూడ తమ తమ పన్లుమానుకుని నిశ్చలమైపోతాయి. ఎప్పుడైతే దేహాభిమానమనే అహంకారం గతి తప్పుతుందో, జ్ఞానికి కర్తృత్వబుద్ధి, భోక్తృత్వబుద్ధి నశించి మనస్సు అమనస్కం అవుతుంది. ఆకారణంగా జ్ఞాని నిరంతరం నిద్రావస్థలో వున్నట్టే కనపడతాడు. సాధారణ మనుషులు నిద్రలో మరుపు సహజ సిద్ధంగా వుంటుంది. కాని జ్ఞానికి మాత్రం మరుపన్నది ఎప్పుడూ వుండదు. ఆయన నిరంతరం తన ఆత్మ స్వరూప చింతన చేస్తూనే వుంటాడు. ఈ కారణాల వల్ల జ్ఞాని నిజంగా నిద్రపోతాడా? అంటే లేదు అనే చెప్పాలి. అయితే ఎవరిది నిజమైన నిద్ర? ఎవరైతే నేను ఇప్పుడే నిద్ర నుంచి లేచానని అంటారో వారిది నిజమైన నిద్ర. కాని జ్ఞానిది నిజమైన నిద్ర కాదు. ఎందుకంటే జ్ఞాని మెలకువగా వుంటూనే నిద్రపోగలడు. లేదా నిద్రపోతూనే మెలకువ గానూ వుండగలడు.

అందుకనే శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ అనబడే ఈ కవి బాబాను ఉద్దేశించి నిద్ర నుండి మేలుకొమ్మని అడగటం లేదు. కాని తన సమాధి నుండి మేలుకొమ్మనమని మాత్రమే ప్రార్థిస్తున్నాడు. (సమాధి ఉతరేనియా గురూ)

ఈ సందర్భంలోనే మనం భగవద్గీతలోని రెండవ అధ్యాయం-69వ శ్లోకం గుర్తుకు తెచ్చుకోవల్సిన అవుసరం ఎంతైనా వుంది. ఆ శ్లోకం ఏం చెబుతోంది. యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ యస్యాం జాగర్తి భూతాని సానిశా పశ్యతో మునే॥ సమస్త ప్రాణులకు ఏది రాత్రిగా ఉంటుందో దానియందు సంయమీ అంటే ఇంద్రియ నిగ్రహం కల యోగి మెలుకువగా వుంటాడు. ఇంక దేనియందు ప్రాణులన్నీ మేలుకొని వుంటాయో అది పశ్యతః అంటే పరమాత్మను దర్శిస్తున్న మునికి రాత్రిగా వుంటుంది.

అజ్ఞానులు సహజంగా పరమాత్మ విషయంలో నిదురపోతూ వుంటారు కాబట్టి వారికది రాత్రి. ఇంకా జ్ఞానులు పరమాత్మ విషయంలో జాగరుకులై ఉంటారు. కాబట్టి వారికి అది పగలు. ఇదే సత్యాన్ని సాయినాథులు ఎన్నోసార్లు అనుభవపూర్వకంగా బోధచేస్తూ వచ్చారు.

ఓం శ్రీ సాయినాథాయనమః

# స్రగ్ధర

## (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ)

ప్రేమేయా అష్టకాసీ పఢుని గురువరా ప్రార్థితీజే ప్రభాతీ
త్యాంచీ చిత్తాసి దేతో అఖిల హరూనియా భ్రాంతి మీ నిత్య శాంతీ॥

ఐసే హే సాయినాథే కథుని సుచవిలే జేవి యా బాలకాసీ
తేవీ త్యా కృష్ణపాయీ నముని సవినయే అర్పితో అష్టకాసీ॥
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై

| | | |
|---|---|---|
| జే | - | ఎవ్వరైతే |
| ప్రభాతీ | - | సూర్యోదయ సమయమున |
| గురువరా | - | వారి గురుదేవులను |
| యా అష్టకాసీ | - | ఎనిమిది శ్లోకముల ఈ స్తుతిని |
| ప్రేమే | - | ప్రేమతో |
| పఢుని | - | చదువుతూ |
| ప్రార్థితీ | - | ప్రార్థన చేయుదురో |
| త్యాంచీ | - | వారి యొక్క |
| చిత్తాసీ | - | మానసము నుండి |
| భ్రాంతి | - | మాయను లేక భ్రమను |
| హరూనియా | - | తొలగించి |
| అఖిల | - | సంపూర్ణమైన |
| నిత్య | - | నిత్యమైన |
| శాంతి | - | శాంతిని |
| దేతో | - | కల్గింతును |

| | | |
|---|---|---|
| ఐసే | - | ఈ ప్రకారంగా |
| హే సాయినాథే | - | శ్రీ సాయినాథులు |
| కథుని | - | చెపుతూ |
| సుచవిలే | - | వివరిస్తున్నారు |
| జేవి | - | ఈ ప్రకారంగా |
| యా బాల కాసీ | - | శ్రీకృష్ణజోగేశ్వర్ భీష్మ అనబడే ఈ బాలకునితో |
| తేవీ | - | వారు సెలవిచ్చినట్లుగా |
| త్యా | - | దానిని |
| కృష్ణపాయీ | - | నేను అనబడే శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ |
| నముని | - | గురు పాదముల వద్ద వొంగి నమస్కరించి |
| సవినయే | - | సవినయంగా |
| అర్పితో అష్ట కాసీ | - | ఎనిమిది శ్లోకముల ఈ స్తోత్రమును సమర్పిస్తున్నాను. |

శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మచే రచించబడ్డ ఈ స్రగ్ధర ఒక చందో విశేషం. దీంట్లో 21 అక్షరాలతో కూడిన నాలుగు పంక్తుల చరణంగాను లేక ప్రతి పంక్తి ఏడు అక్షరాలతో కూడిన మూడు భాగాలుగాను విభజించబడింది.

శ్రీ కృష్ణ జోగేశ్వర్ భీష్మ ఇలా అంటున్నారు. ఎవ్వరతే సూర్యోదయ వేళల్లో వారి గురుదేవులను స్మరిస్తూ ఎనిమిది శ్లోకములు గల ఈ స్తుతిని చదువుతూ ప్రార్థన చేస్తారో వారి మనస్సు నుండి భ్రమను తొలగించి సంపూర్ణమైన నిత్యమైన శాంతిని నేను కల్గిస్తాను. ఈ ప్రకారం శ్రీ సాయినాథులు నాకు చెపుతూ వివరిస్తున్నారు. శ్రీ సాయినాథులు శ్రీ కృష్ణ జోగేశ్వర్ భీష్మ అనబడే బాలకునితో చెప్పినట్లుగా దాన్నే నేను తిరిగి మీకు వివరిస్తున్నాను. గురు పాదముల వద్ద వొంగి నమస్కరించి సవినయంగా ఈ స్తోత్ర రత్నాన్ని సమర్పిస్తున్నాను.

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌లకు జయమగుగాక.

ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-10

**(దాసగణు మహరాజ్)**

1. సాయి రహమ్ నజర్ కరనా బచ్చోంకా పాలన కరనా
   జానా తుమ్‌నే జగత్పసారా సబహీ ఝూఠ్ జమానా

2. మై అందాహూం బందా ఆపకా ముఝుకో ప్రభు దిఖలానా

3. దాసగణు కహే అబ్ క్యా బోలా థక్ గయి మేరీ రసనా

☆ ☆ ☆

| | | |
|---|---|---|
| 1. సాయి | - | ఓ సద్గురు సాయినాథా! |
| రహమ్ | - | దయగల |
| నజర్ | - | మీ చూపులను |
| కరనా | - | మా పై ప్రసరించుడు |
| బచ్చోంకా | - | మీ పిల్లలమైన మమ్ము |
| పాలన | - | పాలించి |
| కరనా | - | రక్షించుడు |

ఓ సద్గురు సాయినాథా! దయతో కూడిన మీ చూపులను మాపై ప్రసరింపజేయుడు. మేమందరమూ మీకు పిల్లలము. మీ పిల్లలమైన మమ్ము రక్షించి పాలించుడు.

| | | |
|---|---|---|
| జగత్ పసారా | - | ఇది ద్వైత ప్రపంచమని |
| తుమ్‌నే | - | తమకు |
| జానా | - | తెలుసు కదా! |
| సబహీ | - | ఇదంతా |
| ఝూఠ్ | - | మిథ్యలేక అవాస్తవంతో కూడిన |
| జమానా | - | జగత్తుగా ఉన్నది. |

ఓ సద్గురు సాయినాథా! ఇదంతా ద్వైత ప్రపంచమని అనగా బేధభావాలతో కూడిన ప్రపంచమని తమకు తెలుసు కదా! ఇంకా ఇది మిధ్య లేక అవాస్తవంతో కూడినదని కూడా తమకు తెలుసు కదా!

| | | | |
|---|---|---|---|
| 2. | మై | - | నేను |
| | అంధాహుం | - | గ్రుడ్డివాడిని అయివున్నాను |
| | బందా ఆప్‌కా | - | ఇంకా మీకు బిడ్డను |
| | ముఝుకో | - | నాకు |
| | ప్రభు దిఖలానా | - | దయచేసి భగవంతుణ్ని చూపండి |
| 3. | దాసగణు | - | దాసగణుడు |
| | కహే | - | చెపుతున్నాడు |
| | అబ్ క్యాబోలూ | - | ఇంక నేను ఏమని మాట్లాడగలను |
| | మేరీ రసనా | - | నా యొక్క వాక్ పటిమ |
| | థక్ గయీ | - | శక్తిని కోల్పోయింది |

ఓ సద్దురు సాయినాథా! నేను గ్రుడ్డివాడిని అయివున్నాను. అనగా భగవంతుడి తత్త్వాన్ని గ్రహించలేని పరిస్థితిలో వున్నాను. నేను మీకు బిడ్డను దయచేసి నాకు భగవంతుణ్ని చూపండి.

ఈ ప్రకారం దాసగణు చెపుతూ నేను ఇంక ఏమని మాట్లాడగలను, నా వాక్ శక్తి అంతా క్షీణించింది, సాయినాథ్‌లను స్తుతించి స్తుతించి మాట బొంగురు పోయిందని అని చెబుతున్నాడు.

ఓం శ్రీ సాయినాథాయ నమః

# కాకడ ఆరతి-11

**(దాసగణు మహరాజ్)**

1. రహమ్ నజర్ కరో అబ్ మోరే సాయీ
తుమ బిన నహి ముఝే మాబాప్ భాయీ॥
మై అంధాహూ బందా తుమ్హారా
మైన జానూ అల్లా ఇలాహీ॥
2. ఖాలీ జమానా మైనే గమాయా
సాథీ ఆఖరికా కియాన కోయీ॥
3. అపనే మసజిద్ కా ఝూడూ గనూహై
మాలిక్ హమారే తుమ్ బాబా సాయీ॥

⋆ ⋆ ⋆

| | | |
|---|---|---|
| 1. మోరే సాయి | - | ప్రీతిపాత్రమైన నా సాయినాథా! |
| అబ్ | - | ఇప్పుడు |
| రహమ్ | - | మీ యొక్క దయను |
| నజర్ | - | చూపెట్టుటకు |
| కరో | - | సిద్ధపడుడు |
| తుమ్ బినా | - | మీరు తప్ప |
| ముఝే | - | నాకు |
| మా | - | తల్లిగాని |
| బాప్ | - | తండ్రిగాని |
| బాయీ | - | అన్నదమ్ములు గాని |
| నహీ | - | ఎవ్వరూ లేరు |
| అల్లా ఇలాహి | - | సర్వవ్యాపకమైన ఓ ప్రభూ! |

| | | |
|---|---|---|
| మై అంధాహు | - | నేను గ్రుడ్డివాడిని అనగా భగవంతుని ఉనికి తెలుసుకొనలేని వాడిని అయివున్నాను |
| బందాతుమ్హారా | - | మీ యొక్క బిడ్డను |
| మై నజానూ | - | నాకు భగవంతుని గురించి ఏమీ తెలియదు |

ప్రీతిపాత్రమైన నా సాయినాథా! ఇప్పుడు మీ యొక్క దయను చూపెట్టుటకు సిద్దపడుడు. నాకు మీరు తప్ప తల్లిగాని, తండ్రిగాని, అన్నదమ్ములుగాని ఎవ్వరూ లేరు. సర్వ వ్యాపకమైన ఓ ప్రభూ! నేను గ్రుడ్డివాడిని. అనగా భగవంతుని ఉనికిని గ్రహించలేని అవస్థలో వున్నవాడిని. నేను మీకు బిడ్డను నాకు భగవంతుని గురించి ఏమీ తెలియదు.

| | | |
|---|---|---|
| 2. మైనే | - | నేను |
| ఖాలీ జమానా | - | నా జీవిత కాలాన్ని ఖాళీగా గడిపి |
| గమాయా | - | వ్యర్ధపరుచుకుని వున్నాను |
| ఆఖిరికా | - | జీవితాంతము |
| సాథీ | - | నాతో కలిసివుండే తోడును |
| కియా న కోయీ | - | ఎవ్వరినీ నేను కనుగొనలేకపోయాను |
| 3. బాబా సాయి | - | ఓ సాయినాథా! |
| తుమ | - | మీరు |
| హమారే మాలిక్ | - | మాకు ప్రభువైయున్నారు |
| అపనే | - | మీ యొక్క |
| మసజిద్ కా | - | మశీదును |
| ఝాడూ | - | ఊడిచే ఒక చీపురు వంటివాడు |
| గనూహై | - | ఈ దాసగణుడు |

ఓ సాయినాథా! నేను నా జీవిత కాలాన్నంతా వ్యర్ధంగా గడిపినవాడిని. జీవితాంతము నాతో కలిసివుండే తోడును ఎవ్వరినీ నేను ఇప్పటి వరకూ

పట్టుకొనలేకపోయాను. మీరు మా అందరికీ ప్రభువులైవున్నారు. ఇంక నేను అనబడే ఈ దాసగణుడు మీ మశీదును ఊడిచే ఒక చీపురు వంటి వాడైవున్నాడు.

వ్యాఖ్యానం : 10,11 ఆరతులకు కల్పి వ్రాయబడింది. కాకడ ఆరతి 10,11లో కనపడే దాసగణు మహరాజ్‌గారి జంట పద్యాలు చాలా సుందరంగా కూర్చబడ్డాయి. ఆ కారణం చేత ఆ రెండు పదవిన్యాసాలు మొత్తం షిరిడిసాయి ఆరతుల్లో మఖుటాయమానంగా నిలచిపోయాయి. ఆవేశపూరితమైన ఉత్సాహవంతమైన భావప్రకటన భక్తుడి హృదయాంతరాళం నుండి ఒక్కమారు కళాత్మకంగా ఈ పద్య భాగాల నుండి బయటకు ప్రవహిస్తుంది. ఎవ్వరైతే అర్ధ తాత్పర్యాలను అవగాహన చేసుకుని వీటిని పాడుతారో వారికి స్పష్టమవుతూ ఉంటుంది. ఇది ఒక రకమైన భావానందం. దీనికి ఉదాహరణ కావాలంటే ఇవి చెప్పుకోవచ్చు. అనునిత్యం తన్నతల్లి చెంత నుండే చంటి పిల్లాడికి కలిగే ఆనందం ఇలాంటిదే. ఎప్పుడూ ప్రేమను చూపెట్టే యజమానిని ఆశ్రయించుకొనివున్న ఒక అనుచరుడికి కలిగే ఆనందం కూడా ఇలాంటిదే. అలాగే దయాళువైన సద్గురువు దగ్గర మెలిగే ప్రథమ శిష్యుడికి కలిగే ఆనందం కూడా ఈ కోవకే చెందుతుంది.

బాబా జీవిత చరిత్ర అన్నది ఒక దివ్యశక్తి. ఇంకా చెప్పాలంటే సర్వానికి ప్రాణాధార మైనది. దీనికి కులమత వర్గ ప్రాతిపదికలు ఉండవు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్న మహావాక్యానికి అనుగుణంగా నడుస్తూ ఉంటుంది. అయినప్పటికీ బాబా భౌతిక వేషధారణ మాత్రం, ఒక ముస్లిం ఫకీరుగా ఉంటుంది. చాలామంది శిష్టాచార సంపన్నులకు ఇది మింగుడు పడలేదు. ఆ కోవకు చెందినవారే దాసగణు మహరాజ్, శ్రీ కృష్ణజోగేశ్వర్ భీష్మ మొదలైనవారు. కాని వారే తదనంతర కాలంలో బాబా దివ్యశక్తిని అందిపుచ్చుకుని మహాభక్తులుగా మారి పోయారు. ఈ విషయంలో వారికి కలిగిన అనుభవమే పద్యరూపంలో బయటకు ప్రవహిం చింది. దానికి తగిన పదాలు, అనగా నజర్, రహమ్, మశీద్, అల్లా ఇలాహి మొదలైన అరబిక్ మాటలు ఆ పద్యాల్లో వచ్చి చేరాయి. ఇవన్నీ ఇస్లామిక్ సాంప్రదాయానికి, విశ్వాసానికి సంబంధించినవి.

ఇస్లాం మతం మూలాలు అన్నీకూడా 'షహాద' లేక 'కలిమా' నుండి ఉత్పన్నమైనవే. షహాద లేక కలిమా అంటే విశ్వాసం, సాక్షి లేదా నమ్మకం అని అర్థం. ఇస్లాం మతంలో దేవుడిని 'అల్లాహ్' అంటారు. ఈ అల్లాహ్ ద్వారా అవతరింపబడిన ప్రవక్తను మహమ్మదు అంటారు. ఈ ప్రవక్తపై వ్యక్తపరచే విశ్వాసాన్నే 'షహాద' అంటారు. కలిమయె షహాద అనగా విశ్వాస వచనం. ఇది ఇలా ఉంటుంది. "లా ఇలాహ ఇల్లల్లాహు మహమ్మదుర్ రసూలుల్లాహ్". దీని అర్థం, అల్లాహ్ ఒక్కడే దేముడు. మహమ్మద్ ఆ దేముడుచే అవతరింపబడ్డ ప్రవక్త. ముస్లింలు ఏమంటారంటే ఎవ్వరైనా నమ్మకంతో ఈ విశ్వాస వచనాన్ని ముమ్మారు జపిస్తే ఇక వారు ముస్లిం మతం స్వీకరించినట్లే లెక్క. కాని సూఫీలు చెప్పేది వేరుగా వుంటుంది. సూఫీలంటే ముస్లిం మతంలోనే వేదాంతులు అని చెప్పుకోవచ్చు. వీరి అభిప్రాయంలో అల్లాహ్ ఒక్కడే దేముడు అన్నది ఒక్క అల్లాహ్‌కే తప్ప ఇంకెవ్వరికీ వర్తించదు. అలా అయిన పక్షంలో ఆ అల్లాహ్ యొక్క అస్థిత్వం అనుభవానికి తెచ్చుకుందికే ప్రయత్నం చెయ్యాలని వారంటారు. కాబట్టే బాబా కూడా సూఫీల పరి భాషలోనే మాట్లాడుతూ ఉంటారు. అందుకే 'సబ్‌కామాలిక్ ఏక్' అంటారు. అందుకే దాసగణు తన కవిత్వంలో 'అల్లా హి లాహి' అని అంటారు. అంటే సర్వ వ్యాపకమైన భగవత్ స్వరూపమని అర్థం.

అయితే ఇస్లాము విశ్వాసాలను కాస్త ప్రక్కన పెట్టి అనగా భగవంతుడైన అల్లా యొక్క న్యాయస్థానమే మశీదు అన్న విశ్వాసాన్ని కొంత సడలించి, బాబా తన సంపూర్ణ అవగాహనతో మశీదునే ఒక తల్లి ఒడిగా ఎంచుతూవుంటారు. అందుకే తన నివాశాన్ని మశీదు ఆయి అని పిలుస్తూ, ఇలా అంటారు.

ఎవ్వరైతే తమ సంపూర్ణ నమ్మకాన్ని తల్లిలాంటి ఈ మశీదు ఆయిపై ఉంచుతారో, ఆమె అపార కరుణామూర్తి కాబట్టి, తమ పిల్లలందరినీ సదా రక్షిస్తూవుంటుంది వారికి ఎటువంటి ఆపదలు కలగకుండా కాపాడుతూవుంటుంది. ఒకసారి ఎవ్వరైనా ఆతల్లి ఒడిలో తల దాచుకుంటే, అతడి కష్టాలు పోయినట్లే లెక్క. ఆ తల్లి నీడలో సేదతీరిన వారందరకీ అంతులేని ఆనందం సొంతమవుతుంది.

అందుకే షిరిడి సాయిబాబాకు శిష్యుడై అతి సన్నిహితంగా మెలిగిన దాసగణు సాయి తత్త్వాన్ని జీర్ణించుకున్న వాడయ్యాడు. బాబాను ప్రార్థించి తనపై దయచూపమని వేడుకున్నాడు. (అదే నజర్ మాటకు అర్థం) దాసగణు ఉద్దేశ్యంలో దయచూపటమంటే అప్రమత్తమైన దృష్టి సారించమని కాదు, ప్రేమ పూర్వక దయాదృష్టిని పెట్టమని అర్థం. అది కూడా ఎలా వుండాలంటే, ఒక తల్లికి తన పిల్లాడిపై నుండే రక్షక కవచ ప్రేమతో కూడిన లాలిత్యంలాగ ఉండాలంటాడు. తల్లి ఒడి చేరిన అసహాయుడైన పిల్లడి అనుభవం నుంచి కవి ముందుకు ఉరికి బాబాకు సంపూర్ణ శరణాగతుడై, విధేయుడై బాబా మశీదు ఆవరణను శుభ్రం చేసే ఒక 'చీపురు' గా తనను తాను భావించుకుంటున్నాడు. ఇదొక అద్భుతమైన రూపకాలంకార ధోరణి. ఇంకా ఉత్కృష్టమైన అర్థాలతో నిండిన బావోద్వేగం అని కూడ చెప్పవచ్చు. ఇక్కడ చీపురు గొప్పతనం చెపుతున్నారు. అదే సమయంలో దానిపైగల చిన్న చూపును కూడా నొక్కి వివరిస్తున్నారు. ఏమిటా గొప్పతనం? ఇల్లు శుభ్రం చెయ్యాలంటే చీపురు తప్ప మరేదీ పనికిరాదని అంటారు. సరే పని అయిపోయిన తరువాత దాన్ని చూడ్డానికి కూడా ఇష్టపడరు. దూరంగా ఒక మూలన పడేస్తారు. ఇదంతా దాసగణు మహరాజ్‌కు తెలుసు. అందుకే బాబాను అనేక స్తోత్రాల్లో ఇలా ప్రార్థిస్తూ వచ్చాడు. " బాబా! నన్నొక చీపురుగా వాడుకోండి. విధేయత కల్గిన ఒక పనిముట్టు ననుకోండి. దానికి ప్రాపంచిక వాసనలనే కుళ్ళును తుడిచిపెట్టే శక్తిని ప్రసాదించండి. దానివల్ల ఇంకా నాకు పట్టే అదృష్టం ఎలాంటిదో చెప్పమంటారా? పవిత్రమైన తమరి పాదధూళిని నా వొంటికి రోజూ తగిలించుకునే భాగ్యం పొందుతూ వుంటాను. అంతేకాక తమ భక్తుల పాదధూళిని నావొంటికి రోజూ తగిలించుకునే భాగ్యం పొందుతూవుంటాను. అంతేకాక తమ భక్తుల పాద ధూళిని కూడా రోజూ తాకి, ఆనందిస్తూ వుంటాను.'' ఇదంతా శ్రీ దాసగణు మహరాజ్ మనకి చెప్పే అనుభవ పూర్వకమైన జరిగిన కథలాగ అనిపించటంలేదా?

సాయిబాబా ఆరతి పాటల్లో శ్రీమాధవరావు అడ్కర్ వ్రాసిన గొప్ప పాట ఉంది. ఆరతి సాయిబాబా! సౌఖ్యదాతార జీవ చరణ రజాతలీ, ద్యావా దాసాంవిసాంవా, భకార్తా విసావా (శ్రీ సాయినాథా! నీపవిత్ర పాద రజము

క్రింద మమ్ములను భద్రముగా ఉండనిమ్ము. నీ దాసులైన భక్తులందరూ దానియందు విశ్రాంతి తీసుకునే భాగ్యము కలుగనిమ్ము)

బాబా! మీరు అల్లామాలిక్‌గా భావించన్నట్లైతే మీ భక్తులమైన మాకందరకూ, మీరు మాలిక్ కదా! అని దాసగణు ఎల్లప్పుడూ చెపుతూ వుంటారు. (మాలిక్ హమారా). దాసగణుకు సంబంధించినంతవరకూ, ఆయన చేసే ప్రార్ధన ఆత్మసాక్షాత్కారానికి దారి తియ్యాలని భావిస్తు న్నట్లుగా ఉంటుంది. దీన్ని ఆయన జీవిత పరమార్ధంగా ఎంచుకున్నారు. అందుకే ఎన్నో సంవత్సరాల నుండి ఇది ఆయన యొక్క బలీయమైన ప్రార్ధనగానే కాకుండా, బాబాను తొందరగా తన ఇచ్చను గ్రహించమని వేడుకుంటున్నట్లుగా ఉండేది. బహుసా పూర్వకాలం వారైన సంత్ నామ్‌దేవ్ మొదలైన మహాపురుషుల అనుభవాలు తనకు కూడా కలగాలన్న ఆతృత దాసగణులో స్పష్టంగా కనబడుతూ ఉండేది. కాని జరిగేది ఏమిటంటే బాబా దాసగణు ఆతృత గమనిస్తూనే, తొందరపడకు తొందరపడకు అంటూ ఉండేవారు.

ఒకసారి దాసగణు సహనం సన్నగిల్లింది. బాబా! మీరు ఎంతోకాలం నుండి నా ఆవేదన గ్రహించకుండా కాలం గడిపేస్తున్నారు. ఇప్పుడు చెప్పండి నాకెప్పుడు ఆత్మ దర్శనాన్ని కల్గిస్తారు? బాబా ఇలా అన్నారు. "ఆరె! నువ్వు నన్ను ప్రత్యక్షంగా చూస్తున్నావా, లేదా? చెప్పు. ఇదే భగవత్ సాక్షాత్కారమంటే". బాబా ఇచ్చిన సమాధానం తత్త్వపరిశీలనా మార్గంలో చాలా దూరం ప్రయాణించిన వారికి తప్ప ఇతరులకు అర్ధమయ్యేది కాదు. బాబా మాటలు పసిగట్టిన శ్రీ కాకా సాహెబ్ దీక్షిత్, దాసగణు ఆరతి పాటల్లోని వాక్యం 'ప్రభుదిఖలానా' (భగవంతుణ్ని చూపించండి) అన్న దాన్ని ఈవిధంగా మార్చి చూపెట్టాడు. ఎలాగంటే 'ప్రభుదిఖలానా' బదులుగా 'ప్రభుపద్ దిఖలానా' అంటే బాగుంటుందని అతని ఉద్దేశ్యం. దాని అర్ధమేమిటంటే 'భగవంతుణ్ని చూపండి' అనడానికి బదులు 'భగవంతుడి పాదాలను చూపండి అన్నట్లు అవుతుంది.

అంతేకాక శ్రీ దీక్షిత్ ఇంకో మాట అన్నాడు. కాకడ ఆరతి 11లో ఇలావుంది. "సాథీ ఆఖిర్‌కా కియానకోయీ" అనగా నాకు సరిపడిన శాశ్వితమైన ఆప్తుడిని నేను కనుగొనలేక పోయాను అని అర్ధం. ఈ భావంలో వున్న సాధకుడి

నిస్పృహాయత రూపంలోని నిరాశావాదం గ్రహించిన దీక్షిత్ చిన్న మార్పు చేసాడు. దాన్లో 'కియా' అన్నమాటకు బదులు 'తుమ్‌బినా' చేర్చాడు. అప్పుడది ఇలా అయింది. 'సాథీ ఆఖిర్‌కా తుమ్‌బినా నకోయీ'. అనగా నాకు సరిపడిన శాశ్వితమైన ఆప్తుడిని మీకంటే వేరెవరినీ నేను కనుగొనలేకపోయాను అని మారింది. ఈ మార్పుతో సాధకుడిలో ఇంతకు ముందున్న నిస్పృహాయతతో కూడిన నిరాశావాదానికి బదులు ఆశావాదం వచ్చి చేరడమే కాక ఆతడిలో అనన్య భక్తి భావం పెల్లుబకడం ఒక ముఖ్య విశేషంగా గ్రహించవచ్చు.

ఏదైతే నేమి కాకడ ఆరతిలోని 10,11 జంట పద్యాలు బాబాచేత ఎంతగానో ఆకర్షించబడ్డాయి. లక్ష్మణ్‌భట్ జోషి ఇలా అన్నాడు. నేను అప్పుడు చాలా చిన్నపిల్లడిని, సాయిబాబాను కలుస్తూ ఉండేవాడిని. చావడిలో ఆయనతో బాటు పడుకున్నాను కూడా. మమ్మల్ని తప్ప చావడిలోకి ఇంకెవ్వరినీ రానిచ్చేవారు కాదు. రాత్రిపూట బాబా అప్పుడప్పుడు నన్ను పాడమని అడిగేవారు. దాసగణు పాటలు కాని, తుకారాం పాటలు కాని పాడు అనేవారు. నాకు వాటి అర్థం సరిగ్గా తెలియకపోయినా, గణూ ఏమంటున్నాడో చెప్పు అని బాబా అనగానే నేను నవ్వుతూనే " రహమ్ నజర్‌కర్ అబ్‌మోరే సాయీ" అంటూ పాడేవాడిని. దానికి బాబా ఎంతో ఆనందించేవారు. ఆ పాటలోని తియ్యదనం, బాణీ, బాబా ఇష్టపడుతునారని నాకు తెలిసేది."



ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-12

## (సంత్ జానాబాయి)

1. తుజకాయ దేవూ సావళ్యా మీ ఖాయా తరీ
మీ దుబళీ బటిక నామ్యాచీ జాణ శ్రీహరి॥
ఉచ్ఛిష్ట తులాదేణే హీ గోష్ఠ నాబరీ
తూ జగన్నాథ తుజదేఊ కశీరే భాకరీ॥

2. నకో అంత మదీయ పాహూ సఖ్యా భగవంతా - శ్రీకాంతా
మధ్యాహ్న రాత్ర ఉలటోనీ గేలీ హీ ఆతా ఆణచిత్తా
జా హోఈల తు ఝూరే కాకడ హీ రా ఉళాంతరీ॥

3. అణతీల భక్త నైవేద్యహి నానాపరీ
తుజకాయ దేవూ సావళ్యా మీ ఖాయా తరీ
మీ దుబళీ బటిక నామ్యాచీ జాణ శ్రీహరి॥

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. సావళ్యా | - | నల్లనివాడా ఓ శ్రీకృష్ణా! |
| తుజ | - | నీకు |
| ఖాయాతరీ | - | ఇంకనూ తినడానికి |
| మీ | - | నేను |
| కాయదేవూ | - | ఏమి ఇవ్వగలను |
| మీ | - | నేను |
| నామ్యాచి | - | సంత్‌నామదేవుని దగ్గర పనిచేసే |
| దుబళి | - | ఒక పేద |
| బటిక | - | పనిమనిషిని |
| శ్రీహరి | - | ఓ శ్రీహరి |
| జాణ | - | ఈ విషయము నీకు తెలుసుకదా! |

నల్లనివాడా ఓ శ్రీకృష్ణా! నీకు తినడానికి ఇంకనూ నేను ఏమి ఇవ్వగలను? నీ భక్తుడైన సంత్ నామదేవుని దగ్గర నేను ఒక పేద పనిమనిషిగా బ్రతుకుతున్నాను. ప్రభువైన ఓ శ్రీహరీ నీకు ఈ విషయము బాగా తెలుసు కదా.

| | | |
|---|---|---|
| ఉచ్ఛిష్ఠ | - | ఎంగిలి పడిన ఆహారము |
| తులా | - | నీకు |
| దేణే | - | ఇవ్వడమా? |
| హీ గోష్ఠ | - | ఈ పని |
| నాబరీ | - | మంచిదికాదు |
| తూ | - | నీవు |
| జగన్నాథ | - | జగాని కంతకూ నాథుడవైన ప్రభువు |
| భాకరీ | - | ఈ ఎంగిలి రొట్టిముక్కను |
| కశీరే | - | అయ్యో! ఎట్లు |
| దేఊ | - | నేను ఇవ్వగలను |

నీవు జగానికంతకూ ప్రభువైన వాడవు. అటువంటప్పుడు నేను నా ఎంగిలి రొట్టి ముక్కను అయ్యో! ఎట్లు ఇవ్వగలను. ఎంగిలిపడిన ఆహారము నీకు ఇవ్వడమా? ఈపని అసలు మంచిదికాదు.

| | | |
|---|---|---|
| 2. సఖ్యా | - | ఓ నా సహచరుడా! |
| భగవంతా | - | ఓ ప్రభూ! |
| శ్రీకాంతా | - | ఓ లక్ష్మీపతీ! |
| నకో | - | దయచేసి |
| మదీయ | - | నా యొక్క |
| అంత | - | క్షీణ దశను |
| పాహూ | - | పరీక్షించవద్దు |
| ఆణచిత్తా | - | నీ మనస్సుకు నిజాన్ని తెలియజేస్తున్నాను. |

| | | |
|---|---|---|
| ఆతా | - | ఇప్పుడు |
| మధ్యాహ్న రాత్ర | - | అర్ధరాత్రి సమయము |
| హీ | - | కూడా |
| గేలీ | - | గడచిపోయి |
| ఉలటోని | - | ఉన్నది |
| జా | - | దయచేసి వెళ్ళుము |
| రా ఉళాంతరీ | - | దేవాలయంలో |
| తు ఝూరే | - | ఓ ప్రభూ నీయొక్క |
| కాకడ హీ | - | కాకడ ఆరతి కూడా |
| హో ఈల | - | మొదలు అవబోతున్నది |

ఓ నా సహచరుడా! ఓ ప్రభూ! ఓ లక్ష్మీపతీ! దయచేసి క్షీణిస్తున్న నా శక్తిని పరీక్షించ వద్దు. నీ మనస్సుకు నిజాన్ని తెలియజేస్తున్నాను. ఇప్పుడు అర్ధరాత్రి సమయం కూడా దాటిపోవు తున్నది, దయచేసి ఇక దేవాలయానికి తిరిగి వెళ్ళుము. ఓ ప్రభూ! నీ యొక్క కాకడ ఆరతి కూడా మొదలు అవబోతున్నది.

| | | |
|---|---|---|
| 3. భక్త | - | భక్త జనులందరూ |
| హినానాపరీ | - | వివిద రకాలైన |
| నైవేద్య | - | నివేదన పదార్ధములను |
| అణతీల | - | పట్టుకొని వస్తారు |

ఓ ప్రభూ! భక్త జనులందరూ కాకడ ఆరతిని దృష్టిలో పెట్టుకుని అనేక రకాలైన నివేదన చెయ్యవలసిన పదార్ధములను పట్టుకుని వస్తారు.

ముఖ్యంగా ఈ ఆరతి పాటలో భగవంతుడికి నైవేద్య సమర్పణ అమోఘంగా చర్చకు వచ్చింది. బాబా బోధించేదేమిటంటే మానసిక స్థితి నిశ్చలంగా ఉంచుకొని నైవేద్య సమర్పణ చెయ్యమనేకాక, అట్టి నైవేద్యాన్ని, ఇంకామనందరం భుజించే ఆహారపదార్థాలనన్నింటినీ సమకూర్చేది భగవంతుడు మాత్రమే అని తెలుసుకొనగలగడం. అందుచేత ప్రతి సాయి భక్తుడు అదే రకమైన అవగాహనతో

కాలక్షేపం చెయ్యాలి. భగవంతుడైన బాబాయే ఇదంతా నాకు కల్గచేసారన్న విశ్వాసం రోజు రోజుకీ పెంచుకోవాలి. భగవద్గీతలోని కర్మయోగం (3-12)లో ఇదే చెప్తారు. 'తైః దత్తాన్ అప్రదాయ ఏభ్యఃయః భుంక్తే స్తేన ఏవ సః' అనగా దైవం చేత ఇయ్య బడిన భోగసామగ్రిని, తిరిగి ఆ దైవానికి నైవేద్యపూర్వకంగా సమర్పించనివాడు దొంగయే అవుతున్నాడు.

భగవంతుడికి నైవేద్యం సమర్పించే విషయంలో ఒకసారి భగవాన్ రమణులు ఇలా అన్నారు. నైవేద్యమే భగవంతుడు, భగవంతుడే నైవేద్యం. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే, పంచదార ముద్దతో చేసిన భగవంతుడి బొమ్మకు, అదే పంచదార ముద్దతో చేసిన పదార్థాన్ని నైవేద్యంగా పెడితే ఎలా ఉంటుందో అలాగే సమస్తమూ తన స్వరూపంగానే ఉండే పరమాత్మకు, అదే సమస్తంలో నుండి పుట్టిన భోజన పదార్థాన్ని సమర్పించినట్లుంటుంది, ఈ సందర్భంలోనే సంత్‌జానాబాయి వేరే అభంగంలో అన్నమాటలు ఇలా ఉన్నాయి. "నేను భగవంతుడ్ని తింటాను. భగవంతుడిలోనే నిద్రిస్తాను, భగవంతుడినే ఆశ్వాదిస్తాను, భగవంతుణ్నే భావిస్తాను, భాగవతమే మాట్లాడుతాను, ఆ భగవంతుణ్నే ఇస్తాను, తీసుకుంటాను.'' ఇవి మామ్మోలుగా మాట్లాడే మాటలు కావు, ఒక రకమైన బాగవత అపరోక్షానుభూతిలో మైమరచి ఉన్న సమయంలో నోటి నుండి బయటపడిన అమృతపు వాక్కులు. భగవద్గీత తొమ్మిదవ అధ్యాయం శ్లోకం 27లో భగవానుడే స్వయంగా ఇలా అంటాడు. "యత్కరోషి ఏది చేస్తావో, యదశ్నాసి ఏది తింటావో, యజ్జు హోషి ఏది హోమం చేస్తావో, యత్తపస్యసి ఏది ధ్యానిస్తావో, తత్కురుష్వ మదర్పణమ్ దాన్ని నాకే అర్పింపుము.'' సంత్ జ్ఞానాబాయి కూడా ఈ సూత్రాన్ని ఆధారం చేసుకునే జీవితం గడిపింది.

ఓం శ్రీ సాయినాథాయనమః

# కాకడ ఆరతి-13

## (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ)

1. శ్రీ సద్గురు బాబా సాయీ శ్రీసద్గురు బాబా సాయీ
తుజు వాచుని ఆశ్రయ నాహీ, భూతలీ
మీ పాపి పతిత ధీమందా మీ పాపి పతిత ధీమందా
తారణే మలా గురునాథా, జడకారీ॥

2. తు శాంతి క్షమేచామేరూ తు శాంతి క్షమేచామేరూ
తు భవార్ణవీ చే తారూ, గురవరా॥

3. గురు వరా మజసి పామరా అతా ఉద్దరా
త్వరిత లవలాహీ, త్వరిత లవలాహీ
మీ బుడతో భవభయ డోహీ, ఉద్దరా॥
శ్రీ సద్గురుబాబా సాయీ శ్రీ సద్గురుబాబా సాయీ
తుజువాచుని ఆశ్రయ నాహీ, భూతలీ

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. భూతలీ | - | ఈ భూప్రపంచంలో |
| తుజవాచుని | - | మీరు తప్ప |
| ఆశ్రయ నాహీ | - | ఆశ్రయమిచ్చునది ఎవ్వరూ లేరు |
| మీ పాపి పతిత | - | నేను ఒక పాపిని పతితుడను |
| ధీమందా | - | జ్ఞానము లేనివాడను |
| మలా | - | నన్ను |
| జడకరీ | - | తొందరగా |
| తారణే | - | దయచేసి రక్షించండి |
| 2. తు | - | మీరు |
| శాంతి క్షమేచా | - | శాంతికి మరియు క్షమా గుణానికీ |

| | | |
|---|---|---|
| మేరు | - | మేరుపర్వతములాంటివారు |
| తు | - | మీరు |
| భవార్ణవీ చే | - | ఈ సంసార సాగరాన్ని |
| తారు | - | దాటించగల నౌకలాంటివారు |

శ్రీసద్గురు బాబా సాయీ! ఈ భూ ప్రపంచంలో మీరు తప్ప నాకు ఆశ్రయమిచ్చునది ఎవ్వరూ లేరు. నేను ఒక పాపిని, పతితుడను. అంతేకాక జ్ఞానము లేనివాడిని తొందరగా దయచేసి నన్ను కాపాడండి. శాంతి క్షమాగుణాలకు మీరు మేరు పర్వతమువంటివారు. ఇంకా ఈ సంసారసాగరాన్ని దాటించగల నౌకలాంటివారు. గురుదేవా! అందులకే మిమ్ము ప్రార్థిస్తున్నాము.

| | | |
|---|---|---|
| 3. గురువరా | - | ఓ గురుదేవా |
| మజసి పామరా | - | నేను పామరుడను అనగా అజ్ఞానిని |
| అతా ఉద్దరా | - | ఇప్పుడే నన్ను ఉద్దరించండి |
| త్వరిత | - | త్వరత్వరగా వచ్చి |
| లవలాహీ | - | గట్టుకు చేర్చండి |
| డోహీ | - | ఎంతో లోతైన |
| భవ భయ | - | సంసారమనే జలరాశిలో |
| మీ బుడతో | - | నేను మునిగిపోతున్నాను |
| ఉద్దరా | - | దయచేసి రక్షించండి |

ఓ గురుదేవా! నేను ఒక పామరుడను. అనగా అజ్ఞానిని. ఇప్పుడే వచ్చి నన్ను ఉద్దరించండి. త్వరత్వరగా వచ్చి గట్టుకు చేర్చండి. నేను చాలా లోతున్న జలరాశిలో మునిగి పోతున్నాను. దయచేసి రక్షించండి.

*ఓం రాజాదిరాజ యోగిరాజ పరబ్రహ్మ*
*శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై॥*
*కాకడ ఆరతి సమాప్తం*

ఓం శ్రీ సాయినాథాయ నమః

# మధ్యాహ్న ఆరతి-1

## (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ)

**1. ఘే ఉనియా పంచారతీ కరూ బాబాంసీ ఆరతీ కరూ సాయీసీ ఆరతీ॥**

శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ రచించిన ఈ ఆరతిపాట కాకడ ఆరతిలో 5వ ఆరతిగా చేర్చబడింది. అదే తిరిగి మధ్యాహ్న ఆరతిగా మొదటి స్థానాన్ని అలంకరించుకుంది. ఈ ఆరతి పాటకు సంబంధించిన పదవిభాగం తీక తాత్పర్యాలు కాకడ ఆరతిలో విపులంగా చర్చించబడ్డాయి.

ఇక మధ్యాహ్న ఆరతిలో రెండవ ఆరతి పాటను వ్రాసింది శ్రీమాధవరావు అద్‌కర్. ఈ ఆరతిపాట వివరాలన్నీ క్రింద ఇవ్వబడ్డాయి.

ఓం శ్రీ సాయినాథాయ నమః

# మధ్యాహ్న ఆరతి-2

## (శ్రీమాధవరావు అద్‌కర్)

1. ఆరతి సాయిబాబా । సౌఖ్యదాతార జీవ చరణ రజాతలీ ।
ద్యావా దాసాంవిసాంవా । భక్తాంవిసాంవా। ఆరతి సాయిబాబా ।
జాళునియా అనంగ । స్వస్వరూపీ రాహే దంగ ।
ముముక్ష జనాందావీ । నిజడోళా శ్రీరంగ ।
డోళా శ్రీరంగ । ఆరతి సాయిబాబా ।

2. జయామనీ జైసా భావ । తయాతైసా అనుభవ ।
దావిసీ దయాఘనా । ఐసీ తుఝీ హీ మావ ।
తుఝీ హీ మావ । ఆరతి సాయిబాబా ।

3. తుమచే నామ ధ్యాతా । హరే సంస్కృతీ వ్యథా ।
అగాధ తవకరణీ । మార్గదావీసీ అనాథా దావీసీ ।
అనాధ ఆరతి సాయిబాబా ।

4. కలియుగీ అవతార । సగుణ పరబ్రహ్మ సాచార
అవతీర్ణ ఝూ లాసీ । స్వామి దత్త దిగంబర ।
దత్త దిగంబర । ఆరతి సాయిబాబా ।

5. ఆతా దివసా గురువారీ । భక్త కరీతివారీ ।
ప్రభుపద పహావయా । భవభయ నివారీ
భయ నివారీ । ఆరతి సాయిబాబా ।

6. మా ఝూ నిజద్రవ్యదేవా। తవ చరణరజ సేవా।
మాగణే హేచి ఆతా। తుమ్హా దేవాదిదేవ
దేవాదిదేవ। ఆరతి సాయిబాబా।

7. ఇచ్ఛిత దీన చాతక। నిర్మలతోయ నిజసుఖ।
పాజవే మాధవయా। సంభాళ ఆపులీ బాక।
ఆరతి సాయి బాబా। సౌఖ్యదాతార జీవ।
చరణరజతలీ। ద్యావా దాసాంవిసాంవా। భక్తా విసాంవా
ఆరతి సాయిబాబా।

⋆ ⋆ ⋆

| | | | |
|---|---|---|---|
| 1. | ఆరతి సాయిబాబా | - | ఓ సాయినాథా! ఇదే నీకు మేము సమర్పించే ఆరతి |
| | సౌఖ్యదాతార జీవ | - | హెచ్చు తగ్గులను చూడక సుఖ సంతోషాలను పంచి పెట్టే ఓ ఆత్మదేవతా! |
| | చరణరజాతలీ | - | నీ పాదపద్మముల ధూళి చెంత ఉండుటకుగాను |
| | దాసాం | - | నీ యొక్క దాసునకు |
| | భక్తాం | - | నీ యొక్క భక్తునకు |
| | విసాంవా | - | కాస్త చోటును |
| | ద్యావా | - | దయతో కల్పించుము |
| | అనంగ | - | శరీరము లేని కామారిని (మన్మధుని) |

| | | |
|---|---|---|
| జాళునియా | - | భస్మము చేయుడు |
| స్వస్వరూపీ | - | విశ్వచైతన్యమూర్తిగా |
| రాహే దంగే | - | మాయందు ఐక్యమగుము |
| ముముక్షజనా | - | మోక్షమును కోరుకునే భక్తులకు |
| శ్రీరంగ | - | శ్రీరంగనాథుని |
| నిజడోళా | - | నిజరూప దర్శనము |
| దావీ | - | కలుగచేయుము |

ఓ సాయినాథా! ఇదే నీకు మేము సమర్పించే మధ్యాహ్న ఆరతి. హెచ్చు తగ్గులు గమనించక అందరికీ సుఖసంతోషాలను పంచిపెట్టే ఓ ఆత్మదేవతా! ఎల్లప్పుడు నీ పాద పద్మముల ధూళి చెంత ఉండుటకు నీ దాసునకు నీ భక్తునకు కల్పించి బాధపెట్టే కామారిని (మన్మధుని) భస్మము చేయుము. శుద్ధ బుద్ధ ముక్త స్వభావము కల్గిన విశ్వచైతన్యమూర్తిగా మా యందు ఐక్యమగుము. ఎల్లప్పుడూ నిన్ను ప్రార్థించే ముముక్షువులకు అనగా మోక్షమును కోరుకునే భక్తులకు శ్రీరంగనాథుని నిజరూప దర్శనము వారి కంటికి అగుపడునట్లు చేయుము.

| | | |
|---|---|---|
| 2. జయామనీ | - | ఎవరెవరికి వారి వారి మనస్సులలో |
| జైసే భావ | - | ఏఏ భావరూపములు స్ఫురించునో |
| తయా తైసా | - | వారి వారికి ఆయాప్రకారములైన |
| అనుభవ | - | అనుభవములను |
| దావిసీ | - | ప్రత్యక్షముగా దర్శింపజేయుదువు గదా |
| దయాఘనా | - | దయ అనబడే వర్ష భావమును కల్గిన ఓ మేఘుడా! |
| ఐసీ తుఝీ | - | ఇదే నీ యొక్క |
| హీమావ | - | లీలగా మాకు తోచుచున్నది |

ఓ దయాఘనా! మీ భక్తుల మనస్సులలో కలుగుతున్న భావ పరంపరలను గుర్తెరిగి వారి వారికి ఆయా ప్రకారములైన అనుభవములను ప్రత్యక్షముగా దర్శింప చేయుదువు గదా! ఇందతా గమనించిన్నట్లైతే నీ లీలలో భాగమే అనిపిస్తున్నది.

3. తుమచే - మీ యొక్క
నామధ్యాతా - నామమును జపించిన మాత్రము చేతనే
సంస్కృతీవ్యథా - సంసారిక దుఃఖములు
హరే - నశించిపోవుచున్నవి గదా
తవ కరణీ - మీ లీలలు
అగాధ - అంతులేనివి
అనాథా - అనాథులకు, నిస్సహాయకులకు
మార్గ దావీసీ - మార్గదర్శకులు మీరే కదా!

4. కలియుగీ అవతార - ఈ కలియుగములో వెలసిన
సగుణ పరబ్రహ్మా - సగుణరూప పరబ్రహ్మము మీరే కదా!
సాచార - ఇది ముమ్మాటికీ నిజము
అవతీర్ణ ఝాలాసీ - శ్రీ సాయి రూపంలో వెలసిన
స్వామి దిగంబర - భగవాన్ దిగంబరేశ్వరుడవు మీరే కదా!

ఓ సాయినాథా! మీ యొక్క నామము జపించినంత మాత్రమున సంసార దుఃఖములు హరించి పోవుచున్నవి. ఇక మీ లీలలు అనంతములు. అనాధులకు, నిస్సహాయకులకు మార్గ దర్శకులుగా వున్నది మీరే కదా! అంతేకాక ఈ కలియుగంలో అవతరించిన సగుణరూప పరబ్రహ్మము మీరే అయివున్నారు. ఇది ముమ్మాటికి నిజము. శ్రీసాయి రూపంలో వెలసిన భగవాన్ దత్తాత్రేయ స్వామివి మరియు భగవాన్ దిగంబరేశ్వరుడవు మీరే కదా!

5. ఆఠా దివసా గురువారీ - ఎనిమిది రోజులకొకసారి వచ్చు గురువారం నాడు

| | | |
|---|---|---|
| భక్త కరీతి వారీ | - | భక్తులు షిరిడి యాత్రచేసి |
| ప్రభుపద పహావయ | - | భగవాన్ సాయినాథుల పాద దర్శనం చేస్తూ వుంటారు. |
| భవ భయ నివారీ | - | వారి సంసారిక భయాన్ని పోగొట్టుకుంటూ వుంటారు. |

ఓ దేవదేవా! ఎనిమిది రోజులకొకసారి వచ్చే గురువారం ఎంతో శుభప్రదమైనది. ఆరోజున భక్తులు షిరిడియాత్ర చేస్తూవుంటారు. భగవాన్ సాయినాథుల పాద దర్శనం చేసుకుని తరిస్తారు. ఆవిధంగా వారి వారి సంసారిక భయాలను పోగొట్టుకుంటూ వుంటారు.

| | | | |
|---|---|---|---|
| 6. | తవ చరణ రజ సేవా | - | మీ పాద ధూళిని సేవించడమే |
| | మా ఝూ | - | నాకు కల్గిన |
| | నిజ ద్రవ్య తేవా | - | నాభాగ్యము, నా ఐశ్వర్యము |
| | దేవాది దేవా | - | ఓ దేవ దేవా! |
| | మాగణే | - | ఇదే నా వినయ పూర్వక ప్రార్థన |
| | హేచి ఆతా | - | ఇప్పుడు ఈ ప్రకారంగా విన్నవించు కుంటున్నాను. |
| 7. | దీన చాతక | - | బలహీనమైన చాతక పక్షి |
| | ఇచ్ఛిత | - | మేఘాల నుండి జాలువారే వర్షపు నీటి చినుకులను మాత్రమే ఆశించును |
| | నిర్మలతోయ | - | స్వచ్ఛమైన ఆ నీటి బిందువులు మాత్రమే |
| | నిజసుఖ | - | దానికి నిజమైన సుఖాన్ని, ఆనందాన్ని కలుగచేస్తాయి |
| | మాధవ | - | మాధవరావు అద్కర్ అనబడే ఈ రచయితకు కూడా |

| | | |
|---|---|---|
| యా | - | మీ పాదసేవా భాగ్యము అనబడే మధురామృతమును |
| పాజవే | - | సేవించు అదృష్టము కలుగజేయుడు. |
| ఆపులీబాక | - | మీరు ప్రసాదించిన వరాన్ని |
| సంభాళ | - | అదే సఫలం చేయగలదు. |

ఓ దేవదేవా! మీ పాద ధూళిని సేవించడమే నాకు కల్గిన భాగ్యము, ఐశ్వర్యంగా భావిస్తాను. ఇంక నా యొక్క వినయ పూర్వక ప్రార్ధన ఈ ప్రకారంగా విన్నవించుకుంటున్నాను. బలహీనమైన చాతక పక్షి మేఘాల నుండి జాలువారే వర్షపు నీటి చినుకులను మాత్రమే ఆశిస్తుంది. స్వచ్ఛమైన ఆ నీటి బిందువులు దానికి నిజమైన సుఖాన్ని ఆనందాన్ని కలుగజేస్తాయి. ఇప్పుడు మాధవరావు అద్కర్ అనబడే ఈ రచయిత కూడ చాతక పక్షి లాగ మీ పాద సేవా భాగ్యము అనబడే మధురామృతాన్ని ఆశిస్తున్నాడు. కాబట్టి అట్టి అదృష్టము నాకు కలుగజేయుడు. అదే మీరు ప్రసాదించిన వరాన్ని సఫలం చేయగలదు.

మహత్తరమైన 'ఆరతి సాయిబాబా' పాట మాధవరావు అద్కర్ కలం నుండి సాయి అనుగ్రహం వల్లనే బయటకొచ్చింది. మాధవరావు అద్కర్ స్థూలంగా ఒక నాటక రచయిత. అంతేకాక నటనలో కూడ అనుభవం గడించినవాడు. శ్రీదాసగణు మహరాజ్ ద్వారా మొదటి సారిగ బాబా దర్శనం చేసుకున్నాడు. సమాది మందిరం ప్రధాన హాలులో ఆయన ఫోటో పెట్ట బడి వుంది. శ్రీసాయి సచ్చరిత్ర 33వ అధ్యాయంలో ఈ ఆరతిపాట గురించే చర్చించారు. ఈ ఆరతిపాటనే బాబా రాంగిరిబువా ద్వారా నానాసాహెబ్‌చందోర్కర్‌కు పంపించారు. దాంతో బాటు ఊదీని కూడ పంపించారు. అదే సమయంలో నానాసాహెబ్‌చందోర్కర్ కూతురు మైనతాయి పురిటి నొప్పులతో బాధపడుతూంది. ఆ ఇబ్బందిని దివ్యశక్తితో దర్శించిన బాబా వెంటే స్పందించి ఆరతి పాటను పంపించారు. ఈ లీలను అందరూ ప్రత్యేకంగా చెప్పుకుంటూ వుంటారు.

ఓం శ్రీ సాయినాథాయ నమః

# మధ్యాహ్న ఆరతి-3

## (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ)

1. జయదేవ జయదేవ దత్తా అవధూతా సాయి అవధూతా
జోడుని కర తవ చరణీ ఠేవతోన్ మాథా జయదేవ జయదేవ
అవతరసీ తూ యేతా ధర్మాన్ తే గ్లానీ
నాస్తికా నాహీ తూ లావిసి నిజభజనీ
దావీసి నానాలీలా అసంఖ్య రూపానీ
హరిసీ దీనాంచీ తూ సంకట దిన రజనీ
జయదేవ జయదేవ దత్తా అవధూతా సాయి అవధూతా

2. యవన స్వరూపీ ఏక్యా దర్శన త్వాది ధలే
సంశయ నిరసునియా తద్వైతా ఘాలవిలే
గోపీచందా మందా త్వాన్ చీ ఉద్ధరిలే
మోమినవంశీ జన్మని లోకా తారియలె
జయదేవ జయదేవ దత్తా అవధూతా సాయి అవధూతా

3. భేదన తత్త్వీ హిందూ యవనాంచా కాహీ
దావాయాసీ ఝూలా పునరపి నరదేహీ
పాహసి ప్రేమాదే తూ హిందూ యవనాహీ
దావిసి ఆత్మత్వానే వ్యాపక్ హోసాయీ
జయదేవ జయదేవ దత్తా అవధూతా సాయి అవధూతా

4. దేవా సాయినాథా త్వత్పదనత హ్వావే
పరమాయా మోహిత జనమోచన ఝుణిహ్వావే
తత్కృపయా సకలాంచే సంకట నిరసావే
దేశిల తరీ దే త్వద్యశ కృష్ణానేగావే
జయదేవ జయదేవ దత్తా అవధూతా సాయి అవధూతా

| | | |
|---|---|---|
| 1. కరజోడునీ | - | చేతులు జోడించి |
| తేవతోన్ మాథా | - | నా నుదిటి భాగాన్ని |
| తవ చరణీ | - | మీ పాదముల వద్ద నుంచి ప్రార్థించెదను |
| తే దర్మాన్ | - | ధర్మ ప్రవర్తనకు |
| యాతా గ్లానీ | - | నష్టము వాటిల్లినపుడు |
| తూ | - | మీరు |
| అవతరతీ | - | అవతరించెదరు గదా! |
| నాస్తికానాహీ | - | నాస్తిక వాదులను సైతము |
| తూలావిసి | - | మీరు లొంగదీసుకుని |
| నిజభజనీ | - | మీ కీర్తనలు పాడేటట్లు మార్చెదరు కదా! |
| నానాలీలా | - | అనేకములైన లీలను |
| అసంఖ్యరూపాని | - | అసంఖ్యాకములైన రూపాల్లో |
| దావీసి | - | ప్రదర్శించి |
| దీనాంచీ | - | దీనులకు |
| సంకట | - | ఎదురయ్యే ప్రమాదములను |
| తూదిన రజనీ | - | రాత్రనక పగలనక మీరు |
| హరిసీ | - | పోగొట్టుదురు కదా! |

ఓ సాయిదేవా మీకు జయమగుగాక, జయమగుగాక ఆత్మజ్ఞాన నిష్టులైన దత్త అవధూతులకు జయమగు గాక. భగవాన్ శ్రీసాయి అవధూతులకు జయమగుగాక. చేతులు జోడించి నా నుదుటి భాగాన్ని మీ పాదములవద్ద పెట్టి ప్రార్థించెదను.

ధర్మమార్గమునకు గ్లాని కల్గినప్పుడు అనగా నష్టము వాటిల్లినప్పుడు మీరు అవతరించెదరు గదా. అంతేకాక నాస్తికవాదులను సైతము లొందగీసుకుని వారిచే మీ కీర్తనలు పాడించుదురు గదా. మీ లీలలు అనేకములు. అవి వివిధ రూపాల్లో ప్రదర్శింపబడి దీనులకు ఎదురయ్యే ప్రమాదములను పసిగట్టి

రాత్రనక పగలనక తప్పించుదురు గదా. అటువంటి దత్త అవధూతకు జయమగుగాక.

| | | |
|---|---|---|
| 2. యవనస్వరూపీ | - | ముస్లిం రూపంలో |
| ఏక్యాదర్శన | - | కొందరకు దర్శనము |
| త్వా దిదిలె | - | మీరు కలుగజేసి |
| సంశయ | - | తద్వారా వారి సందేహములను |
| నిరసునియా | - | పారద్రోలి |
| తద్వైతా | - | మీ ఎడల వారికి కల్గేద్వైత భావమును |
| ఝూలవిలె | - | నిర్మూలించుదురు గదా |
| గోపీచంద్ | - | గోపీచంద్ అనే మహారాజుకు |
| మందా | - | మందాకిని అనబడే గంగామాతకు |
| త్వాన్చీ | - | మీ యంతట మీరే |
| ఉద్ధరిలే | - | ఉన్నత స్థితిని కల్గించిరి గదా |
| మోమిన | - | అలాగే బట్టలు నేసే సాలివాని |
| వంశీ | - | వంశములో |
| జన్మని | - | జన్మించి |
| లోకాన్ | - | ప్రజలను |
| తారియలె | - | కాపాడింది మీరే గదా! |

ఓ సాయిదేవా మీకు జయమగుగాక, జయమగుగాక. మీరు ముస్లిం రూపంలో కొందరకు దర్శనమిచ్చి, తద్వారా వారి సందేహములను పోగొట్టి, మీ ఎడల వారికి గల ద్వైత భావమును నిర్మూలించిరిగదా. అలాగే గోపిచంద్ అనే మహారాజుకు, మందాకిని అనబడే గంగా మాతకు మీ యంతట మీరే ఉన్నత స్థితిని కల్గించిరిగదా. అలాగే బట్టలు నేసే సాలివాని వంశంలో జన్మించి ప్రజలను కాపాడింది మీరేగదా, అటువంటి దత్త అవధూతకు సాయి అవధూతకు జయమగుగాక

| | | |
|---|---|---|
| 3. హిందూ యవనాంచా | - | హిందువులు ముస్లిముల మధ్య |
| కాహీ | - | నిజానికి ఏ రకమైన |
| భేద | - | భేదము |
| తత్త్వీ | - | ఆత్మ తత్త్వము దృష్ట్యా |
| న | - | కనపడదు |
| దావాయాసీ | - | ఈ సత్యాన్ని చూపడానికి |
| నరదేహీ | - | మానవ దేహాన్ని |
| పునరపి | - | మరల మరల |
| ఝాలా | - | ధరిస్తూ వుంటారు |
| హిందూ యవనాహీ | - | హిందువులను ముస్లిములను |
| తూ | - | మీరు |
| ప్రేమానే | - | ప్రేమతో |
| పాహసి | - | చూస్తూవుంటారు |
| వ్యాపక్ | - | సర్వవ్యాపక స్వభావము కల్గిన |
| హాసాయీ | - | ఈ సాయినాథులు |
| ఆత్మత్వానే | - | తన ఏకాత్మ చైతన్య స్వరూపమును |
| దావిసి | - | చూపెడుతూ వుంటారు |

ఓ సాయిదేవా మీకు జయమగుగాక జయమగుగాక. ఆత్మ తత్త్వము దృష్ట్యా హిందువులు ముస్లిముల మధ్య నిజానికి ఏరకమైన భేదము కనపడదు. ఈ సత్యాన్ని చూపడానికే శ్రీసాయి నాథులు మానవ దేహాన్ని మరల మరల ధరిస్తూ వుంటారు. ఓ సాయినాథా! హిందువులను ముస్లిములను అందుకొరకే ఎంతో ప్రేమతో మీరు చూస్తూవుంటారు. సర్వవ్యాపక స్వభావము కల్గిన ఈ సాయినాథులు తన ఏకాత్మ చైతన్య స్వరూపమును చూపెడుతూ వుంటారు. అటువంటి దత్త అవధూతకు సాయి అవధూతకు జయమగుగాక.

| | | |
|---|---|---|
| **4.** దేవా సాయినాథా | - | ఓ ప్రభో సాయినాథా |
| త్వత్పదనత | - | మీ పాద పద్మముల వద్ద మమ్ము వొంగి నమస్కారము |
| హ్వావే | - | చేయుటకు అనుమతించుడు |
| పరమాయామోహిత | - | ప్రాపంచిక భ్రమల్లో చిక్కుబడిన |
| జనమోచన | - | ప్రజానీకము విడుదల |
| ఝణీ | - | తొందరగా |
| హ్వావే | - | పొందునట్లు దయ చేయుడు |
| తత్కృపయా | - | మీ దయవలన |
| సకలాంచే | - | ప్రతి ఒక్కరి |
| సంకట | - | ఆపదలు |
| నిరసావే | - | తొలగిపోవుగాక |
| దేశిల | - | మీరు నాకు (శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ) ఏదైనా వరం ఇవ్వదలుచుకుంటే |
| తరీదే | - | ఈ వరం ఇవ్వండి |
| త్వద్యశ | - | దానితో మీ మహత్మ్యము |
| కృష్ణానే | - | శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మచే |
| గావే | - | ఎల్లప్పుడూ పాడబడుతూ వుంటుంది. |

ఓ ప్రభో శ్రీసాయినాథా! మీ పాదపద్మముల చెంత మాకు తలవంచి నమస్కారము చేయుటకు అనుమతించుడు. ప్రాపంచిక భ్రమల్లో చిక్కుబడిన ప్రజలందరూ తొందరగా ఆభ్రమను పోగొట్టుకొనునట్లు దయచేయుడు. మీ దయవలన ప్రతి ఒక్కరి ఆపదలు తొలగిపోవు గాక. మీరు నాకు ఏదైనా వరం ఇవ్వదలుచుకుంటే, ఈ వరం ఇవ్వండి. దానివల్ల మీ మహత్మ్యము నాచే ఎల్లప్పుడూ పాడబడుతూ వుంటుంది.

ఇదొక అద్భుతమైన ఆరతిపాట. దీంట్లో శ్రీషిరిడి సాయిబాబా అవతార

రహస్యం, శ్రీసాయి ధర్మమార్గం కనబడుతూ ఉంటుంది. ఎవ్వరైతే బాబాకు సంపూర్ణ శరణాగతులవుతారో వారికి పై రెండు విషయాలు అవగతమవుతూ వుంటాయి. అంతేకాక బాబా మొత్తం జీవిత మంతా ఔపోసన పట్టే అదృష్టం దక్కుతుంది. బాబా ఆశీస్సులు అనబడే ధర్మం ఆయన కృప నుండి ఎక్కడికక్కడ వర్షించబడుతూ అటు ఆధ్యాత్మిక మూలాల్ని స్పృశిస్తూ ఇటు వ్యవహారిక లేక సంసారిక ఇబ్బందుల్ని తొలగించుకుంటూ సాగుతుంది. ద్వంద రూపంలో కనబడే ఈ ధర్మాన్ని అర్థం చేసుకోవాలంటే కొంచం కష్టంగానే వుంటుంది. ఆ కష్టం ఎందుకు కలుగుతోందో దానికి కారణం ఏమిటో బాబాయే ఇలా చమత్కరించారు.

ఇది ఆధ్యాత్మికత, వ్యవహారం అనబడే రెండు భాగాల్ని వేరు చేసే గోడలాంటిది. దీనికి అహంభావం ఇటుకలుగా వున్నాయి. ఇక గోడ అలకడానికి ఉపయోగించిన పదార్థాలుగా జాతి మతం కులం వగైరాలతో బాటు సాంప్రదాయాలు లేక ఆచారవ్యవహారాలు కలిపి ముద్ద చేయబడి ఎక్కడబడితే అక్కడ వాడడానికి సిద్దంగా ఉన్నాయి. వీటన్నింటితో దిట్టమైన గోడ తయారైంది. ఇంత గట్టి గోడ అడ్డుగావుంటే ఇక సత్యానికి మార్గం ఎలా గోచరిస్తుంది? అంతే కాకుండా బాబా నుండి జాలు వారిన కృపావర్షం ప్రవహించకుండా ఈ గోడ అడ్డుతగుల్తోంది. అందుకే బాబా ఏమంటారంటే "ప్రజలారా! ముందు ఆగోడను బ్రద్దలు చేయండి. అది నన్ను మీ నుండి వేరు చేస్తోంది. ఇంకా మీలో మీకే మనస్పర్ధలనబడే దుష్టభావనలను కల్పించి మీ ఐకమత్యాన్ని భంగం చేస్తోంది. ఈ దారుణం మీరు గ్రహించకపోతే ఎంతో నష్టపోతారు." ఇదీ బాబా బోధ.

ఇక బాబా హిందూమతస్థుడా లేక ముస్లిం మతస్థుడా? అన్నది ఒకటి ప్రధాన ప్రశ్నగా నిలిచిపోయింది. బాబాకు ముఖ్య అనుచరుల్లో ఒక్కడైన శ్రీ ఎస్.డి.ధుమాల్ ఏమంటారంటే? బాబా హిందూ ముస్లింల కంటె అతిగొప్ప మత రహిత స్వభావం కల్గిన మహనీయుడు అని చెపుతూ బాబా అనుగ్రహం వల్లనే నేను ఇంతటి మహోన్నతమైన స్వభావాన్ని అర్థం చేసుకోగల్గాను. అని తీర్మానించారు.

ప్రస్తుతం ఈ ఆరతి పాటలో కూడ, శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ బాబాను సంబోధిస్తూ, "దత్తా అవదూత! సాయి అవదూత" అంటారు. దత్తా అనగా సద్గురువుకు పర్యాయ పదంగా వాడబడే దివ్యమైన సంబోధన. అవధూత అనగా ధర్మ, అర్థ, కామ పురుషార్థాలను దాటి ఇక మోక్షపురుషార్థానికి చేరువలో వున్న జీవన్ముక్తుడు. జరిగిన జీవితమంతా ఒక కల, ఇక జరగ బోయేది జీవ బ్రహ్మైక్య స్థితి అని గుర్తెరిగి ప్రకృతి బంధం నుండి విడివడిన మహాపురుషుడు. అయితే మన సాయినాథుల బయటకు కనపడే వ్యవహార్శైలిని చూస్తే వేషధారణలో ముస్లిం ఫకీరుగానే కనబడుతూ వుంటారు. అంతమాత్రం చేత ఆయా మతాలకు చెందినవారని నిర్ధారణ చెయ్యలేము. కారణం వారి మతాతీతమైన ప్రవర్తన మాత్రమే. కబీరు మహాశయుడు గూడ ఇలాగే ఉండేవారు. అందుచేతనే బాబాకు కబీరు అంటే ఎంతో ఇష్టం. కబీరు వ్రాసిన పదాలను 'దోహా' అని పిలిచేవారు. ఆవిధంగా ఒక దోహాలో కబీరు ఇలా అంటారు. "నేను హిందువుని కాను ముసలమానుని అంతకంటే కాను. ఆ రెండు మతాలకు అతీతుడిని."

అలాగే బాబా కూడా, నాది కబీరు మతమే అని చెప్తూ, నేనే క్రిందటి జన్మలో కబీరుగా ఉన్నాను అని తీర్మానం కూడా చేసేవారు. క్రిందటి జన్మలో నేను నూలు వడికేవాడిని. అందుకే ఈ ఆరతి పాటలో శ్రీభీష్మ, కబీరు బాబాగా పుట్టారు అని వ్రాసారు. (దవాయాసీ ఘాలా పునరపి నరదేహా..)

ఈ ఆరతి పాటల సందర్భంలో ఇలాంటి విషయమే ఇంకొకటి గుర్తు తెచ్చుకోవడం అసందర్భమేమీ అని పించుకోదు. అదేమిటంటే సిక్కుల మత గ్రంథమైన 'గురు గ్రంథ సాహెబ్' లో కబీరు చెప్పిన మాటలున్నాయి. "ఏ మనిషైతే అందరి ఎడల సమదృష్టిని కలిగి ఉంటాడో, అతడికి మానసిక ప్రక్షాళన జరిగి పవిత్రుడౌతాడు. అంతేకాక బ్రహ్మసాయుజ్యానికి అర్హత సంపాదిస్తాడు. ఈ దేహ పతనానంతరం నేను తిరిగి ఈ భూమ్మీదకు రావలసిన అవసరం ఏముంది? అటువంటి సాయుజ్య స్థితిని అందుకొనే ఏర్పాటు భగవంతుడే చేసి పెట్టాడు. దాన్నే అనుసరించిన జీవికిక పునర్జన్మ ఉండదు. భగవదైక్యం చేకూరినట్లే లెక్క. అయితే ప్రారబ్ధవశాన ఈ దేహం వున్నంత వరకూ భగవంతుడు అప్పజెప్పిన పనులు సక్రమంగా చేస్తూ వుండడమే నావంతు కర్తవ్యం అయివుంది."

కబీరు లాగే సాయిబాబా కూడా హిందూ ముస్లిం సమైఖ్యతకు కృషి చేసారు. వారిద్దరినీ తన రెండు కళ్ళుగా ఊహించుకొనేవారు. అయినప్పటికీ తనంతతాను వారి వారి స్వభావలకు అంటకుండా దూరంగానేవుంటూ వచ్చారు. కాని జన బాహుళ్యంలో వుండే మాట ఏమిటంటే, బాబా హిందువులు దగ్గర హిందువుగానూ, ముస్లింల దగ్గర ముసల్మాను గాను ప్రవర్తిస్తూ వుంటారు. కాని ఇది నిజం కాదన్నది అప్పుడప్పుడు అయనే ఋజువు చేస్తూవుండేవారు. ఎలాగ? హిందువుల దగ్గర ముస్లింగాను, ముస్లింల దగ్గర హిందువుగాను కనపడటమే. కాని అందరికీ ఆయన చెప్పేది ఏమిటంటే తనను అందరూ ఒక ఫకీరుగా చూడమని. ఇంకా కొంచం ముందుకెళ్ళి తనను ఫకీరు వేషంలో వున్న ఒక బ్రాహ్మణుడుగా కూడా చూడమనేవారు. దీనివల్ల జాతికులమత అడ్డుగోడలు కూల్చవచ్చని ఆయన అభిప్రాయం.

బాబాకు బాగా దగ్గరవారైన భక్త బృంద సభ్యులు, దాసగణు మహరాజ్, నానాసాహెబ్ చందోర్కర్, కాకాసాహెబ్ దీక్షిత్, జి.ఎస్.కపర్దే, ఉపాశినీ మహరాజ్, బడేబాబా, అబ్దుల్‌బాబా, షంషుద్దీన్‌రంగారి, అబ్దుల్లా జాన్ మొదలైనవారంతా తమ తమ ఆచార వ్యవహార స్వభావాల్ని ప్రక్కనబెట్టి బాబా దివ్యత్వానికి దాసులై బాబానే తమ సద్గురువుగా తమ దైవంగా ఎంచుకుని తరించారు. అంతేకాని బాబాని తమ మతస్థుడిగా తమ కులం మనిషిగా ప్రచారం చేసుకునే కపటత్వానికి తావివ్వలేదు. ఎటువంటి పక్షపాత ధోరణులకు తలొగ్గక సత్య సంపదతో కూడిన సాయి భక్తులుగా అందరి మన్ననలు పొందారు.



ఓం శ్రీ సాయినాథాయ నమః

# మధ్యాహ్న ఆరతి-4

**(దాసగణు మహరాజ్)**

1. శిరిడి మాఝే పండరిపుర సాయిబాబా రమావర
బాబా రమావర సాయిబాబా రమావర ॥

2. శుద్ధ భక్తీ చంద్రభాగా భావ పుండలీక జాగా
పుండలీక జాగా భావ పుండలీక జాగా ॥

3. యాహో యాహో అవఘెజన కరబాబాంసీ వందన
సాయిసీ వందన కరబాబాంసీ వందన ॥

4. గణూహ్మణే బాబా సాయీ ద్యావపావ మాఝే ఆ ఈ
పావ మాఝే ఆ ఈ ద్యావసావ మాఝే ఆ ఈ ॥

| | | | |
|---|---|---|---|
| 1. | శిరిడి మాఝే | - | శిరిడియే నాకు |
| | పండరిపుర | - | పండరి పురము |
| | సాయిబాబా | - | శ్రీసాయిబాబాయే |
| | రమావర | - | రమావరుడు అనగా రుక్మిణీపతి అయిన విఠలుడు |
| 2. | శుద్ధ భక్తీ | - | శుద్ధ భక్తి పారవశ్యమే |
| | చంద్రభాగా | - | చంద్రభాగా నదిగా ప్రవహిస్తున్నది |
| | పుండలీక | - | భక్త శిఖామణి పుండలీకుడు |
| | జాగా | - | ఎల్లప్పుడూ జాగరూకుడై విఠోభాను సేవిస్తూ వుంటాడు |
| | భావ | - | అదే అభిప్రాయంతో భక్తులు శిరిడి సాయిని కూడా విస్తూ వుంటారు |

3. హో - ఓ భక్తులారా
యా - రండి
అవఘే - మనమందరము
కర బాబాంసీ - శ్రీసాయినాథులకు
వందన - నమస్కరిద్దాము
కరసాయి సీ వందన - సాయిని కొలుచుకుందాము

4. గణూహ్మణే - దాసగణుమహరాజ్ ఇలా చెప్పుచున్నాడు
బాబా సాయి - ఓ సాయిబాబా!
ద్యావ - పరుగు పరుగున వచ్చి
పావ - కనపడండి
మాఝే ఆ ఈ - నా తల్లిగా ప్రత్యక్షమవండి

శ్రీ దాసగణు మహరాజ్ స్తుతి ఇలా ఉంది. ఓ భక్తులారా శిరిడియే నాకు పండరిపురము. ఇంక శిరిడిలో కొలువైయున్న సాయినాథులు ఎవరో కాదు రమావరుడే. అనగా రుక్మిణీపతి అయిన విఠలుడే. పండరిపురంలో ప్రవహిస్తున్న నది పేరు చంద్రభాగ. అది భక్తులకు విఠలుడిపై గల భక్తి పారవస్యమే. ఇంక భక్తశిఖామణి పుండలీకుడు ఎల్లప్పుడు జాగరూకుడై విఠోభాను సేవిస్తూ వుంటాడు. శిరిడీలో కూడ సాయినాథుని భక్తులందరూ సేవిస్తూవుంటారు. ఓ భక్తులారా! కాబట్టి మనమందరమూ సాయినాథుని కొలుచుటకు పోదాము రండి. ఇంకా దాసగణు మహరాజ్ తన భావనను ఇలా వ్యక్తపరుస్తున్నాడు. ఓ బాబా సాయి మీరు నా తల్లిగా ప్రత్యక్షమవండి అదే నా కోరిక అంటున్నాడు.

ఓం శ్రీ సాయినాథాయ నమః

# మధ్యాహ్న ఆరతి-5

## (పారంపరిక కీర్తన)

1. ఝూలీన లోటాంగణ వందీన చరణ
డోళ్యానీ పాహీన రూప తుఝే
ప్రేమే ఆలింగన ఆనందే పూజిన
భావే ఓవాళీన హ్మణే నామా ॥

2. త్వమేవ మాతాచ పితాత్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ ॥

3. కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్వభావాత్
కరోమి యద్యత్ సకలం పరస్మై:
నారాయణాయేతి సమర్పయామి ॥

4. అచ్యుతం కేశవం రామనారాయణం
కృష్ణ దామోదరం వాసుదేవం హరిం
శ్రీధరం మాధవం గోపికా వల్లభం
జానకీ నాయకం రామ చంద్రం భజే ॥

⋆ ⋆ ⋆

1. నామా - సంత్ నామదేవులు
హ్మణే - ఈ విధంగా చెపుతున్నారు
లోటాంగణ ఘూలీన - నేను అంగ ప్రదక్షణ చేసుకుంటూ వచ్చి
వందీన చరణ - మీ పాదారవిందములను ఆరాదించుదును
డోళ్యానీ పాహీన - నా కన్నులు త్రిప్పకుండా

తు ఝే - సుందరమైన ఆకృతిని దర్శించెందను

ప్రేమే - ప్రేమ పూర్వకంగా

ఆలింగన - మిమ్ములను ఆలింగనము చేసుకొందును

ఆనందే పూజిన - ఆనందంతో పూజచేయుదును

భావ - భక్తి భావంతో

ఓ వాళీన - మంగళహారతి పళ్ళెం త్రిప్పెదను

సంత్ నామదేవులు ఈ విధంగా చెపుతున్నారు. ఓ దేవా! నేను అంగప్రదక్షణ చేసుకుంటూ వచ్చి మీ పాదారవిందములను ఆరాదించెదను. ఇంకనూ నా కన్నులు ఇటూ అటూ త్రిప్పకుండా మీ యొక్క సుందరాకృతిని దర్శించెదను. అంతేకాక మిమ్ములను ప్రేమ పూర్వకంగా ఆలింగనము చేసుకొందును. ఆనందంగా మీ పూజా కార్యక్రమములు నిర్వహించెదను. మంగళహారతి పళ్ళెము త్రిప్పెదను.

2. త్వమేవ మాతాచ - ఓ పరమేశ్వరా! నీవే నాతల్లివి?

పితాత్వమేవ - నీవే నా తండ్రివి

త్వమేవ బంధుశ్చ - నీవే నా బంధువర్గము

సఖాత్వమేవ - నా సన్నిహితుడవు కూడ నీవే

త్వమేవ విద్యా - నా జ్ఞాన స్వరూపము నీవే

ద్రవిణం త్వమేవ - నా కున్న ఐశ్వర్యంమంతా నీవే

త్మమేవ సర్వం - సర్వమూ నీవే

మమదేవ దేవ - నా యొక్క దేవదేవుడవు నీవే

అష్టాదశ పురాణాలలో స్కంధ పురాణం ఒకటి. ఈ మంత్రం స్కంధ పురాణం నుండి గ్రహించబడి ప్రముఖ ప్రార్ధనా మంత్రంగా మారింది. ఈ మంత్రం భక్తుడి శరణాగతి తత్త్వానికి ఒక మచ్చుతునక. ఆధ్యాత్మిక శ్రేయస్సు నిలబడాలంటే శరణాగతి తప్ప వేరు మార్గం లేదు. ఆ కారణం చేతనే శ్రీసాయి ఆరతుల్లో ఇది ప్రత్యేకంగా చేర్చబడింది.

| | | |
|---|---|---|
| 3. కాయేన | - | శరీరంతోనూ |
| వాచా | - | వాక్కుతోనూ |
| మనసా | - | మనస్సుతోనూ |
| ఇంద్రియాః బుద్ధ్యా | - | ఇంద్రియములు, మరియు బుద్ధితోనూ |
| ఆత్మనా | - | శుద్ధ బుద్ధముక్త స్వరూపమైన కేవల చైతన్య భావనతోనూ లేక |
| ప్రకృతే స్వభావః కరోమి యద్యత్ | - | ప్రకృతి స్వభావముననుసరించి కాని |
| సకలం | - | చేసిన కర్మలన్నింటిని |
| పరస్మైః | - | పరమాత్మ స్వరూపుడైన |
| నారాయణాయేతి | - | శ్రీమన్నారాయణునకు |
| సమర్పయామి | - | సమర్పించుచున్నాను. |

భగవంతునికి శరణాగతి చెయ్యడము ఎలాగో ఈ శ్లోకం నేర్పుతున్నాది. ప్రసిద్ధ పురాణమైన శ్రీమద్భాగవతం పదకొండవ స్కంధం రెండవ అధ్యాయంలో ఈ శ్లోకం కనపడుతుంది. విదేహరాజైన జనక మహారాజుకు, అవధూతలుగా తిరుగుతున్న నవ యోగీంద్రులకు మధ్య జరిగిన సంభాషణలో అనేక భాగవత ధర్మాలు చర్చించడం జరిగింది. దాంట్లో సర్వసంకల్ప ములను భగవంతునిపరం చెయ్యడం కన్న ముముక్షువుకు వేరే మార్గంలేదని నిరూపిస్తారు.

| | | |
|---|---|---|
| 4. అచ్యుతం | - | చ్యుతి లేని వాడు అచ్యుతుడు. అనగా నారము లేనివాడు అని అర్థం |
| కేశవం | - | కేశి అన్న పేరు గల రాక్షసుని చంపినవాడు |
| రామనారాయణం | - | శ్రీరామచంద్రుడు, శ్రీమన్నారాయణుడు ఒక్కరే అయినవాడు శ్రీకృష్ణుడే దామోదరుడు |
| వాసుదేవం హరిం | - | వసుదేవుని కొడుకైన శ్రీకృష్ణుడే ఆ శ్రీహరి |
| శ్రీధరంమాధవం | - | లక్ష్మీధరుడు, లక్ష్మీధవుడు |

గోపికావల్లభం - గోపికలకు వల్లభుడు
జానకీనాయకం - సీతాదేవికి భర్త అయిన శ్రీరాముడు
రామచంద్రంభజే - శ్రీరామచంద్ర ప్రభువును భజింతును

ఇది జగద్గురు శంకర భగవత్పాదులచే రచించ బడ్డ 'అచ్యుతాష్టకం' లోని ఒక శ్లోకం. అచ్యుతుడు అనగా తన స్వరూపం నుండి లేశ మాత్రమైనా తప్పనివాడు అని అర్థం. కేశి అన్న రాక్షసుడిని చంపిన వాడు కాబట్టి కేశవుడయ్యాడు. ఇంకా శ్రీరాముడు శ్రీమన్నారాయణుడు ఒక్కరే కాబట్టి రామనారాయణుడయ్యాడు. యశోద చేత త్రాళ్ళతో రోటికి కట్టబడ్డాడు కాబట్టి దామోధరుడు వసుదేవుడి కొడుకు కాబట్టి వాసుదేవుడన్నారు. అద్వైత సిద్ధాంతం ఇంకా లోతుగా పరిశీలిస్తుంది. అంతటా సమంగా వ్యాపించిన పరబ్రహ్మ స్వరూపాన్నే వాసుదేవుడు అంటుంది. దీనికి వ్యుత్పత్తి అర్థం ఏమిటంటే 'వసతి దివ్యవతి ఇతి వాసుదేవ'. అంటే ఆ పరబ్రహ్మస్వరూపం లేక చైతన్యం వసతి అనగా ఉన్నది అని అర్థం. అంతేకాక దివ్యతి అనగా ప్రకాశిస్తున్నది. కాబట్టి వాసుదేవ అయ్యింది. సంధ్యావందన మంత్రం కూడా ఇదే చెప్తుంది. వాసనాత్ వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం! సర్వభూత నివాసోసి శ్రీవాసుదేవ నమోస్తుతే' అంటుంది. అటువంటి వాసుదేవుడే శ్రీహరి రూపంగా కనబడుతున్నాడు. తరువాత శ్రీధరం మాధవం అన్నారు. శ్రీధరుడు అనగా లక్ష్మీదేవిని వక్షస్థలంలో పెట్టుకున్నవాడని, మాధవం లో మా అనగా మహాలక్ష్మి. అట్టి మహాలక్ష్మిని ధవుడు అనగా భరించేవాడు అని అర్థం, గోపికా వల్లభం అనగా ప్రేమ భక్తికి వశమైనవాడు పరమాత్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు. మళ్ళీ శ్రీరామచంద్ర ప్రభువును స్తుతిస్తున్నారు. అందుకే జానకీ నాయకం అన్నారు. కాబట్టి శ్రీరామ చంద్రం భజే అంటూ శ్లోకాన్ని ముగించారు. ఇంత గొప్ప అంతరార్థం శ్రవణమనన నిది ధ్యాసనలతో వొంట పట్టించు కుంటారని శ్రీసాయినాథ ఆరతుల్లో చేర్చారు.

ఓం శ్రీ సాయినాథాయ నమః

## మధ్యాహ్న ఆరతి-6

# (నామస్మరణ)

హరే రామ హరే రామ
రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ
కృష్ణ కృష్ణ హరే హరే

హిందూ ఆధ్యాత్మిక సంస్కృతిలో ఉపనిషత్తుల కాలం అతి ప్రాచీనమైనది. ఉపనిషత్తులన్నవి వేదాలకు చివర్న ఉంటాయి కాబట్టి వీటిని వేదాంతములు అన్నారు. ప్రస్తుతం పరిశీనలకు దొరికేవి 108 ఉపనిషత్తులు. వాటిలో 'కలిసంతరణ ఉపనిషత్తు' ఒకటున్నది. దీంట్లోనే ఈ మహామంత్రం మనకు కనపడుతుంది. దీన్ని మొదట్లో బ్రహ్మదేముడు నారదుడికి ఉపదేశించినట్లు తెలుస్తుంది. కలియుగంలో మానవులను విపత్తుల నుండి రక్షించే మంత్రం ఏదైనా ఉందా అని నారదుడు అడిగితే బ్రహ్మ దీన్ని ఉపదేశిస్తాడు. 16 పదాలు కల్గిన ఈ మంత్రం సులువుగా జపానికి పనికి వస్తుంది. హరే అన్న పదం దైవిక శక్తిని లేదా అనుగ్రహాన్ని తెచ్చిపెడుతుంది. ఇంక రామ కృష్ణ అన్న పదాలు రెండూ భగవంతుని ప్రధాన అవతారాలను జ్ఞప్తికి తేవడమే కాక, మనో బుద్ది అహంకారాలను ప్రక్షాళన చేసి నిర్మలం చేస్తాయి. తద్వారా భౌతిక కష్ట నష్టాల సుడిగుండం నుండి మానవుడు బయటపడి భక్తి మార్గంలో గాని కర్మ మార్గంలో గాని జ్ఞాన మార్గంలో గాని ప్రయాణించి జీవిత లక్ష్యాన్ని సాధించడానికి అర్హుడవుతాడు. అయితే సాధారణంగా సాధకులు కాని వాళ్ళందరూ ప్రత్యేకించి క్రింద చెప్పబడిన అవుసరాల కోసం దీన్ని జపిస్తూ వుంటారు. వాటిలో మానసిక ప్రశాంత కోసం, కార్య దక్షతను పెంపొందించుట కోసం, ఏకాగ్రతను అలవాటు చేసుకోవడం కోసం, చేసే పనుల్లో దుష్టగ్రహాలు అడ్డుపడకుండా దైవశక్తిని ఆవాహన చేసుకోవడం కోసం జపం చేస్తూవుంటారు. ఏదైతేనేమి ఇది కలి కల్మష నాశన మంత్రంగా అందరికీ ఉపయోగపడుతుంది. అందుకే సాయి ఆరతుల్లో దీనికి ప్రత్యేక స్థానం వుంది.

ఓం శ్రీ సాయినాథాయ నమః

## మధ్యాహ్న ఆరతి-7

# (మంత్రపుష్పం)

1. హరిః ఓం యజ్ఞేన యజ్ఞమయ జంత దేవాః
తాని ధర్మాణి ప్రథమా న్యాసన్ । తేహనాకం
మహిమానః సచంతే । యత్రపూర్వే
సాధ్యాస్సంతి దేవాః ॥

2. ఓం రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే
నమో వయం వై శ్రవణాయ కుర్మహే
సమే కామాన్ కామ కామాయ మహ్యం
కామేశ్వరోవై శ్రవణో దదాతు
కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమః

3 ఓం స్వస్తి సామ్రాజ్యం భోజ్యం
స్వారాజ్యం వైరాజ్యం పారమేష్ట్యం రాజ్యం
మహారాజ్యం ఆధిపత్యమయం
సమంత పర్యా ఈః స్యాత్
సార్వ భౌమ సార్వాయుషః
అందాతా పరార్ధాత్ పృధివ్యై
సముద్ర పర్యంతాయా
ఏకరాదితి తదడష్యేష శ్లోకే భవతి మరుతః
పరివేష్టారో మరుత్త స్యావసన్ గృహే ।
అవిక్షి తస్య కామప్యేః విశ్వదేవాః సభాసద ఇతి

**శ్రీ నారాయణ వాసుదేవ సచ్చిదానంద**

**సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై**

1. దేవా - దేవతలు

యజ్ఞేన - యజ్ఞం ద్వారా

| | | |
|---|---|---|
| యజ్ఞమయజంత | - | యజ్ఞమయుడైన పరమేశ్వరుని ఆరాధించారు |
| తాని ధర్మాణి | - | అదే యజ్ఞం ద్వారా ధర్మాన్ని |
| ప్రథమా న్యాసన్ | - | మొట్టమొదటిసారిగ ఆవాహన చేసుకుని విశ్వ క్రమాన్ని స్థాపించారు. |
| తే | - | వారు |
| హ | - | తప్పని సరిగ |
| నాకం | - | స్వర్గ లోకాన్ని |
| మహిమానః | - | దాని గొప్ప దన్నాన్ని |
| సచంతే | - | అనుభవానికి తెచ్చుకున్నారు |
| యత్ర | - | అదే చోటున |
| పూర్వే | - | పురాతనులైన |
| సాధ్యా స్సంతి దేవాః | - | ఋషులు, సిద్ధ దేవతలు పరమేశ్వరుని నివాసంలో ఉంటున్నారు. |

ఓంకార రూపుడైన ఆ శ్రీహరికి ప్రణామములు. దేవతలందరూ యజ్ఞాల ద్వారా యజ్ఞమయుడైన పరమేశ్వరుని ఆరాదిస్తున్నారు. ఆయా యజ్ఞాల ద్వారానే ధర్మాన్ని ఆవాహన చేసుకొని విశ్వక్రమాన్ని లేక సృష్టి క్రమానికి అంకురార్పణ చేసారు. దీనివల్ల వారు స్వర్గలోక మహిమను స్వయంగా అనుభవానికి తెచ్చుకున్నారని అర్థమవుతుంది. పురాతనులైన ఋషులు, సిద్ధ దేవతలు కూడా అక్కడే పరమేశ్వరుని చెంత నివసిస్తున్నారు.

| | | |
|---|---|---|
| 2. ఓం | - | శబ్ద బ్రహ్మ స్వరూపమునకు నమస్సులు |
| రాజాదిరాజాయ | - | అది రాజులందరకూ రాజు వంటిది |
| ప్రసహ్యాసాహినే | - | సృష్టి మొత్తాన్ని కల్పించే శక్తి కలిగింది |
| నమోవయం | - | దానికి ఇవే మా నమోవాకములు |
| వైశ్రవణాయ | - | ధనానికంతకూ అధిపతి అయిన కుబేరునకు నమస్కారములు |

| | | |
|---|---|---|
| కుర్మహే | - | కుబేరునకు పూజ సలుపుదుము |
| సమేకామాన్ | - | సమానంగా అన్ని కామనలు |
| కామ కామాయ | - | కామనలకు కాముడైన భగవాన్ కుబేరుడు |
| మహ్యాం | - | నాకు సమకూర్చుగాక |
| కామేశ్వరః | - | కుబేరుడే కామేశ్వరుడు |
| వైశ్రవణః | - | కుబేరునకు ఇంకొక పేరు |
| దదాతు | - | మా కామనలు తీర్చుగాక |
| కుబేరాయ | - | అట్టి కుబేరునకు నమస్కృతులు |

శబ్ద బ్రహ్మ స్వరూపము ఓంకారము. అది రాజులందరకు మహారాజు వంటిది. సృష్టి మొత్తాన్ని కల్పించే శక్తి దానికున్నది. అదే సృష్టిలో కుబేరుడన్న పేరు కలిగి వుంది. అట్టి ప్రభువైన కుబేరునకు నమస్కారములు. అందరమూ అట్టి ప్రభువునకు నమస్కరిద్దాము. ఆయన మా కోరికలనన్నింటిని నెరవేర్చి, మాకు కావల్సిన ధనాన్ని ప్రసాదించునుగాక.

| | | |
|---|---|---|
| 3. ఓం | - | శబ్ద బ్రహ్మ స్వరూపమునకు నమస్సులు |
| స్వస్థి | - | శుభం కలుగుగాక |
| సామ్రాజ్యం | - | సర్వాధికారము |
| భోజ్యం | - | సర్వసంపదల అనుభవము |
| స్వారాజ్యం | - | సర్వ స్వాతంత్రియము |
| వైరాజ్యం | - | ఆధ్యాత్మిక జ్ఞానంతో కూడిన పాలన |
| పారమేష్ట్యం | - | అనంత స్థితి |
| రాజ్యం | - | సంపదతో కూడిన అభివృద్ధి |
| మహారాజ్యం | - | ఎల్లలు లేని ఐశ్వర్యం |
| ఆధిపత్యమయం | - | తిరుగులేని అధికారం |
| సమంతపర్యా | - | అంతటా వ్యాపించిన |
| ఈస్యాత్ | - | దృష్టికోణం |

| | | |
|---|---|---|
| సార్వభౌమ | - | సార్వభౌమత్వం |
| సార్వాయుషః | - | ప్రాణశక్తి వ్యాపకం |
| అందాతా పరార్థాత్ | - | పరమ సత్యాన్ని గ్రహించని పామరస్థితి నుండి బయటకొచ్చి |
| పృధివ్యైః | - | భూలోకంలో గల |
| సముద్రపర్యంతాయా | - | సముద్ర పర్యంతము |
| ఏకారాదితి | - | ఏక ఛత్రాధిపత్యంగా ఆరాదింపబడు |
| తదడష్యేష | - | పరిపూర్ణమైన తత్వం |
| శ్లోకే భవతి | - | యీ శ్లోకంలో అమరి ఉంది |
| మరుతః | - | మరుత్తులనే దేవతా గణాలు |
| పరివేష్టారః | - | చుట్టుకొని ఉండగా |
| మరుత్తస్యావసన్ గృహే | - | ఆ మరుద్గణ పరివేష్టితమైన గృహంలో |
| అవిక్షితస్యకామప్యేః | - | అవిక్షిత్తు కుమారుడగు మరుత్తుడు కోరికలు తీరినవాడై సభ చేయగా |
| విశ్వేదేవాః | - | సకల దేవతలు |
| సభాసద ఇతి | - | సభా సదులై ఉండగా ఈ శ్లోకములు పఠించబడినవి. |

శబ్ద బ్రహ్మ స్వరూపమునకు నమస్సులు. అందరకూ శుభమగు గాక. ఈ శ్లోకంలో పరిపూర్ణమైన బ్రహ్మతత్త్వం యొక్క గొప్పదనం వర్ణించబడింది. సర్వాధికారం, సర్వసంపదల అనుభవం, సర్వసంపదలతో గూడిన అభివృద్ధి, అంతటనూ పరిశీలిస్తున్న దృష్టికోణం, సార్వ భౌమత్వం, అంతటా ప్రాణశక్తి సంచారం, పరమ సత్యాన్ని గ్రహించని పామరస్థితి నుండి బయటకొచ్చి భూలోకంలో గల సముద్ర పర్యంతం ఏకఛత్రాధిపత్యంగా ఆరాదింపబడు పరిపూర్ణమైన భగవత్ తత్త్వం ఈ శ్లోకంలో అమరి ఉంది. అవిక్షిత్తు అనే చక్రవర్తి కుమారుడైన మరుత్తుడు తన కోరికలన్నీ తీరినవాడై ఒక యజ్ఞము చెయ్యగా, దానికి సకల దేవతలు, మరుద్గ ణములతో సహా వచ్చి సభా సదులయ్యారు. పై స్వస్థి వచనాలతో ఆ మహారాజులు కీర్తించ బడ్డారు.

ఓం శ్రీ సాయినాథాయ నమః

## మధ్యాహ్న ఆరతి-8

# (నమస్కారాష్టకం)

# శ్రీమోహినీరాజ్

1. అనంతా తులాతే కసేరే స్తవావే
అనంతా తులాతే కసేరే నమావే
అనంతా ముఖాచా శిణేశేషగాతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

2. స్మరావే మనీ త్వత్పదా నిత్యభావే
ఉరావే తరీ భక్తి సాఠీ స్వభావే
తరావే జగా తారునీ మాయ తాతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

3. వసే జోసదా దావయా సంతలీలా
దిసే అజ్ఞ లోకాపరీ జో జనాల
పరీ అంతరీజ్ఞాన కైవల్య దాతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

4. భరలాదలా జన్మహా మానవాచా
నరా సార్ధకా సాధనీ భూతసాచా
ధరూ సాయి ప్రేమా గళాయా అహంతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

5. ధరావే కరీసాన అప్పజ్ఞ బాలా
కరావే అహ్మాధన్య చుంభోని గాలా
ముఖీ ఝూల ప్రేమే కరాగ్రాస ఆతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథ ॥

6. సురాదీక జ్యాంచ్యాపదా వందితాతీ
శుకాదీక జయాంతే సమానత్వదేతీ
ప్రయాగాది తీర్థేపదీ నమ్రహోతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

7. తు ఝ్యా జ్యాపదా పాహతా గోపబాలి
సదారంగళీ చిత్ స్వరూపీ మిళాలీ
కరీ రాస క్రీడా సవే కృష్ణనాథా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

8. తులా మాగతోమా గణీ ఏకధ్యావే
కరా జోడితో దీన అత్యంత భావే
భవీ మోహినీ రాజ హాతరీ ఆతా
నమస్కార సాష్టాంగ శ్రీసాయినాథా ॥

⋆ ⋆ ⋆

1. అనంతా తులా - ఆది మధ్యాంతముల లేనివాడు అనంతుడు
తే - ఆకారణం చేత
కసేరే స్తవావే - ఎట్లు స్తుతింపగలము
కసేరే నమావే - ఎట్లు ప్రణతులు అర్పింపగలము
శేష - ఆదిశేషుడు
అనంతా ముఖాచా - అనంతములైన ముఖములు కల్గి వున్నాడు
గాతా - మీ యొక్క స్తోత్ర పాఠాలు పాడుతూ
శిణే - అలసి వున్నాడు
శ్రీసాయినాథా - ఓ శ్రీసాయినాథా!
సాష్టాంగ నమస్కార - మీకు సాష్టాంగ నమస్కారము చేయుచున్నాము

బాబా! మీరు అనంతులు అనగా ఆదిమధ్యాంతములు లేనివారు. ఆ కారణంచేత మిమ్ములను ఎట్లు స్తుతింపగలము. ఎట్లు ప్రణతులు అర్పింపగలము.

ఆదిశేషుడు అనంత ముఖములు కల్గి మీ స్తోత్రపాఠాలు చదువుతూ అలసిపోయి వున్నాడు. ఓసాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

| | | |
|---|---|---|
| 2. భావే | - | ఎవ్వరైనా పవిత్ర భక్తి భావనతో |
| నిత్య | - | ఎల్లప్పుడూ |
| త్వత్పదా | - | మీ పాద పద్మములను |
| స్మరావే | - | స్మరణ చేస్తూ |
| మనీ | - | మనసులో నిలుపుకోవాలి |
| భక్తి సాఠీ | - | ఆ భక్తి భావానికి అనుగుణంగా అప్పుడు |
| తరీ | - | మాత్రమే |
| స్వభావే | - | స్వభావ సిద్దంగా |
| ఉరావే | - | అతడి మనుగడ కొనసాగుతుంది |
| జగా | - | ఈ భౌతిక ప్రపంచంలో |
| మాయతాతా | - | మాయవల్ల ఉత్పన్నమైన ఆందోళనల నుండి |
| తారునీ | - | సులువుగా బయటపడి |
| తరావే | - | రక్షింపబడతాడు |

ఓ సాయినాథా! ఎవ్వరైనా పవిత్ర భక్తిభావనతో ఎల్లప్పుడూ మీ పాదపద్మములను స్మరణ చేస్తూ మనసులో నిలుపుకోవాలి. అప్పుడు మాత్రమే, ఆ భక్తిభావానికి అనుగుణంగా, స్వభావ సిద్ధంగా అతడి మనుగడ కొనసాగుతుంది. ఈ భౌతిక ప్రపంచంలో మాయవల్ల ఉత్పన్నమైన కష్టాల నుండి సులువుగా బయటపడి మీ దయవల్ల రక్షింపబడతాడు. ఓ సాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

| | | |
|---|---|---|
| 3. జో | - | శ్రీసాయినాథులు ఎటువంటి వారంటే |
| వసే | - | భక్తుల హృదయాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకునే వారు |
| సంత్‌లీలా | - | సాధుపుంగవులకు సంబంధించిన లీలలు |

| | | |
|---|---|---|
| సదా | - | ఎల్లప్పుడూ |
| దావయా | - | చూపెట్టేవారు |
| జనాలా | - | బయట జనానికి |
| జో | - | ఒక రకమైన |
| అజ్ఞ | - | తెలివి తక్కువ |
| లోకాపరీ | - | మనిషిగా |
| దిసే | - | కనసడుతూ వుండేవారు |
| పరీ | - | కాని |
| అంతరీ | - | తరచి లోపల చూడ గల్గితే |
| జ్ఞాన | - | జ్ఞానాన్ని |
| కైవల్య | - | బంధ రాహిత్యాన్ని |
| దాతా | - | పంచిపెట్టగల మహాపురుషునిలా కనపడతారు |

శ్రీసాయినాథులు ఎటువంటి వారంటే, భక్తుల హృదయాల్లో స్థిర నివాసం ఏర్పరుచు కొనేవారు, సాధుపుంగవులకు సంబంధించిన లీలలు ఎల్లప్పుడూ చూపెట్టే వారుగా దర్శనమిస్తారు. బయట జనానికి ఆయన ఒక రకమైన తెలివి తక్కువ మనిషిగా కనపడుతూ వుండేవారు. కాని తరిచి లోపల చూడగల్గిన వారికి మాత్రం అసలు విషయం అర్ధమవుతుంది. అప్పుడు ఆయనే జ్ఞానప్రదాతగానూ, బంధరాహిత్య కైవల్య ప్రదాతగాను, ఒక మహాపురుషుని గాను దర్శనమిచ్చేవారు. ఓ సాయిదేవా ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

| | | | |
|---|---|---|---|
| 4. | భరలాదలా | - | అదృష్టం కొద్దీమనకు |
| | హామానవాచా | - | ~~ఈ~~ మానవ |
| | జన్మ | - | జన్మ లభించింది |
| | నరా | - | నర జన్మనెత్తిన ఒక మనిషికి |
| | సార్ధకా | - | తన జన్మ సార్ధకతకు |

సాచా - నిజంగా
సాధనీ భూతా - ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది
అహంతా - అహంకార భావనను
గళాయా - చెదరగొట్టడానికి
సాయి ప్రేమా - శ్రీసాయినాథులను ప్రేమతో
ధరూ - గట్టిగా పట్టుకుని ఉండాలి

ఓ జనులారా! మన అదృష్టం కొద్దీ ఈ మానవ జన్మ లభించింది. నరజన్మ నెత్తిన ఒక మనిషికి తన జన్మ సార్ధకతకు నిజంగా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంకొక విషయం, అహంకారభావన చెదరగొట్టడానికి మనం శ్రీసాయినాథులను గట్టిగా పట్టుకొని వుండాలి. ఓ సాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

5. కరీ - మీ చేతులతో
సాన - ఈ చిన్ని
అల్పజ్ఞ - అల్పజ్ఞానము కల
బాలా - పిల్లవాడిని
ధరావే - పట్టుకొనుడు
కరావే అమ్హా - దయచేసి మమ్ములను
గాలా - బుగ్గలు
చుంభోని - ముద్దాడి
ధన్య - ఆశీర్వదించండి
ఆతా - ఇప్పుడు
కరా - మీ చేతులతో
గ్రాస - అన్నపు ముద్దలను
ప్రేమే - ప్రేమతో

| | | |
|---|---|---|
| ముఖీ | - | మా నోటియందు |
| ఝాల | - | ఉంచెదరుగాక |

ఓ సాయినాథా! మీ పవిత్ర హస్తములతో ఈ చిన్న అల్పజ్ఞానము కల పిల్లవాడిని పట్టుకొనుడు. అంతేకాక దయుంచి మా బుగ్గలు ముద్దాడి ఆశీర్వదించండి. ఇంకనూ మీ చేతులతో అన్నపు ముద్దలను ప్రేమతో మా నోటియందు ఉంచెదరుగాక. ఓ సాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

| | | |
|---|---|---|
| 6. సురాదీక | - | దేవతలు మొదలగువారు |
| జాంచ్యా | - | ఎవరి యొక్క |
| పదా | - | పాదములకు |
| వందితాతీ | - | మ్రొక్కెదరో |
| శుకాదీక | - | శుక మహర్షి మొదలగు సత్పురుషులు |
| జయాంతే | - | ఎవరికి |
| సమానత్వదేతీ | - | సముచిత స్థానాన్ని కల్పించెదరో |
| ప్రయాగాది | - | ప్రయాగ మొదలగు |
| తీర్థే | - | పుణ్య తీర్థములు |
| పదీ | - | ఎవరి పాదముల వద్ద |
| నమ్రహోతా | - | నమ్రతతో వొదిగి వుంటవో |
| 7. గోపబాలీ | - | గోపికా స్త్రీ సమూహమంతా |
| జ్యా | - | కలిసివచ్చి |
| తుఝ్యాపదా | - | మీ దివ్య పాదములను |
| పాహతా | - | దర్శించినవారై |
| సదా | - | ఎల్లప్పుడూ |
| రంగళీ | - | అమిత ఆనందాన్ని పొంది |

| | | |
|---|---|---|
| చిత్ స్వరూపీ | - | ఆ చైతన్య స్ఫూర్తిలో |
| మిళాలీ | - | ఓలలాడి తన్మయులై |
| కృష్ణనాథా! | - | శ్రీకృష్ణమూర్తితో |
| సవే | - | కలిసి |
| రాసక్రీడా | - | రాసలీలా వేడుక |
| కరీ | - | జరిపిన భావనతోనుందురో |

ఓ సాయినాథా! దేవతలు మొదలగువారు ఎవరి పాదములకు మ్రొక్కుచుందురో అలాగే శుకమహర్షి మొదలగు సత్పురుషులు కూడ ఎవరికి సముచిత స్థానాన్ని కల్పించెదరో అలాగే ప్రయాగ మొదలగు పుణ్య తీర్థములు ఎవరి పాదముల వద్ద నమ్రతా భావంతో వొదిగి వుంటవో అలాగే గోపికా స్త్రీ జన సమూహమంతా కలిసివచ్చి మీ దివ్య పాదములను దర్శించి ఎల్లప్పుడూ అమిత ఆనందాన్ని పొంది ఆ చైతన్య స్ఫూర్తిలో ఓలలాడి తన్మయులై సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మతో కలిసి రాసలీలా వేడుక జరిపిన భావనతోనుందురో, అట్టి శ్రీసాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

| | | |
|---|---|---|
| 8. తులా మాగతో | - | తమరితో నేను విన్నవించుకుంటున్నాను |
| మాగణీ | - | ప్రార్థిస్తున్నాను |
| ఏకధావే | - | ఒకే ఒక కోరిక నెరవేర్చండి |
| కరాజోడితో | - | చేతులు జోడించి |
| దీన | - | నిస్సహాయుడనై |
| అత్యంత | - | అత్యంత దీనావస్థలో |
| భావే | - | సత్యమైన నా కోరికను తను ముందు ఉంచుతున్నాను |
| భవీ | - | ఈ ప్రాపంచిక ప్రారబ్ధావస్థ నుండి |
| మొహినీ రాజ్ హా | - | ఈ మోహినీరాజ్ అనే మనిషిని |
| ఆతా తరీ | - | ఇప్పుడే ఉద్ధరించి రక్షింపుడు |

శ్రీసాయినాథా! తమరితో నేను విన్నవించుకుంటున్నాను. ప్రార్థిస్తున్నాను. ఒకే ఒక కోరిక కోరుతున్నాను. అది నెరవేర్చండి. చేతులు జోడించి నిస్సహాయుడనై అత్యంత దీనావస్థలో సత్యమైన నామనోవాంఛను తమ ముందు ఉంచుతున్నాను. ఈ ప్రాపంచిక ప్రారబ్ధావస్థ నుండి ఈ మోహినీరాజ్ అనే మనిషిని ఇప్పుడే ఉద్ధరించి రక్షింపుడు. శ్రీసాయిదేవా! ఇవే మీకు మేము చేయు సాష్టాంగ నమస్కారములు.

ఈ నమస్కారాష్టకం సరళసుందరమైన అష్టపదుల రూపంలో నడుస్తూ భక్తుల్ని సమ్మోహ పరుస్తూ వుంటుంది. మొహినీరాజ్, శ్రీసాయినాథులకు ప్రియమైన భక్తుల్లో ఒకరు. ఈయన నాసిక్ ప్రాంతంలో మమల్తాదారుగా (రెవెన్యూ డిపార్టుమెంటు అధికారి) పని చేసారు.

నిజానికి ఏరకమైన ఆధ్యాత్మిక సాధనైనా దాని లక్ష్యం భక్తుడిని ఆనందపారవస్యంలో ముంచి తేల్చడమే. దానివల్ల ఒనగూడే లాభం? మనిషికి సహజంగా సంక్రమించిన అహంభావ నిర్మూలనమే. సత్య వస్తువును కననుగొననంత వరకూ అహంభావపు ఛాయలు వెంటాడుతూనే వుంటాయి. అయితే పదే పదే భగవన్నామ సంకీర్తన చేయడంవల్ల అహంకారం యొక్క ప్రభావం సన్నగిల్లుతూ వుంటుంది. అంతేకాని పూర్తిగా నశించడానికి అది ఒప్పుకోదు. మనస్సు భగవంతుడి దిశకు మళ్ళుతూ వుంటే ఆహంకారం యొక్క శక్తి క్రమేపీ తగ్గుతూవుంటుంది. కాని దాని మూలాల నుంచి పెళ్ళగించాలంటే పట్టుదలతో కూడిన కృషి అవుసరం ఎంతైనా వుంది. అన్నింటికీ మించి నేను అనబడే స్వస్వరూపం గురించి తెలుసుకుని దాన్ని శ్రవణ మనన నిది ధ్యాసల ద్వారా పట్టుకుందికి ప్రయత్నిస్తే మాత్రం దేహాభిమానమనే ముసుగు కప్పుకున్న అహంకారం ఇక నిలవడానికి నీడలేనిదవడం ఖాయం.

దైవాన్ని అర్చించేటప్పుడు చేసే నమస్కారం యొక్క అసలైన అర్థం అహంకార త్యాగమే. నమమ అనగా నేను ఈ దేహాన్ని కాను అన్నదానికి సూచనే నమస్కారం. సాధారణ ప్రజలు నమస్కారాన్ని గౌరవ సూచకంగా వాడుకోవటం అలవాటు చేసుకుని దాని నిజతత్త్వం గ్రహించటం లేదు. అందుకే సద్గురువును సేవిస్తే ఏది నిజమో ఏది అబద్దమో తెలుస్తుంది. అర్థవంతమైన

నమస్కారం అహాన్ని నిర్మూలిస్తుంది. జీవాత్మ పరమాత్మల సంయోగానికి దారి తీస్తుంది. అదే యోగానికి అసలైన నిర్వచనం. ఇది అపరోక్షానుభూతికి తప్ప ఇతరత్రా సాధనలకు లొంగే విషయం కాదు.

అయితే మోహినీరాజ్ రచించిన నమస్కారాష్టకం శుద్ద నమస్కార భక్తిని ప్రచారం చేస్తోంది అనడంలో ఎటువంటి సందేహంలేదు. అందుకే ఇది నవవిధ భక్తి మార్గాల్లో చేర్చబడింది. ఇక సాష్టాంగ నమస్కారంలో ఎనిమిది విధాలైన అంగవిన్యాసాలతో భగవంతుడికి నమస్కారం సమర్పించడం ప్రధాన విషయంగా పేర్కొంటారు. మనస్సును భగవంతునిపై కేంద్రీకృతం చెయ్యని నమస్కారం ఎందుకూ పనికిరానిదై నామమాత్రంగా మిగిలిపోతూ ఉంటుంది.

శ్రీమోహినీరాజ్ నమస్కారాష్టకం అర్థయుక్తంగా పఠించ గలిగితే మాత్రం సాష్టాంగ నమస్కార ఫలితం దక్కుతుంది.



ఓం శ్రీ సాయినాథాయ నమః

## మధ్యాహ్న ఆరతి-9

# (ప్రార్థన)

1. ఐసా యే ఈ బా సాయీ దిగంబరా
అక్షయరూప అవతార సర్వహి వ్యాపక తూ
శృతిసారా అనసూయాత్రి కుమారా మహరాజే ఈ బా
కాశీ స్నాన జపా ప్రతిదివశి కొల్హాపుర భిక్షసీ
నిర్మలనది తుంగా జలప్రాశీ నిద్రామాహుర దేశీ
ఐసా యే ఈ బా ॥

2. జోళీలో బతసీ వామకరీ త్రిశూల ఢమరూధారీ
భక్తావరద సదా సుఖకారీ దేశీల ముక్తీచారీ
ఐసా యే ఈ బా ॥

3. పాయీ పాదుకా జపమాలా కమండలూ మృగఛాలా
ధారణ కరశీబా నాగజటాముగుట శోభతోమాథా
ఐసా యే ఈ బా ॥

4. తత్పర తుఝ్యాయా జేధ్యానీ అక్షయ త్యాంచే సదనీ
లక్ష్మీవాస కరీ దినరజనీ రక్షసి సంకటవారుని
ఐసా యే ఈ బా ॥

5. యాపరి ధ్యాన తుఝే గురురాయా దృశ్యకరీ నయనాయా
పూర్ణానంద సుఖే హీ కాయా లావిసి హరి గుణగాయా
ఐసా యే ఈ బా సాయి దిగంబరా
అక్షయరూప అవతారా సర్వహి వ్యాపకతూ
శృతిసారా అవసూయాత్రి కుమారా మహరాజే ఈ బా ॥

1. సాయి దిగంబరా - ఓ భగవాన్ సాయినాథా దిగంబరా
ఐసా యేఈతూ - మీరు ఈవిధంగా ఉన్నారు

| | | |
|---|---|---|
| అక్షయ రూప అవతారా | - | క్షయమేలేని అవతార మూర్తులుగా |
| సర్వహి వ్యాపక | - | సర్వవ్యాపక చైతన్యరూపులై నిత్యసత్యమై |
| శృతిసారా | - | వేద స్వరూపులై |
| అనసూయాత్రి కుమారా | - | అత్రి అనసూయలకు కుమారుడిగా |
| ~~ఈ~~బా మహారాజే | - | ఓ బాబా మీరే మా మహారాజు |
| ప్రతిదివసి | - | ప్రతి దినము |
| కాశీ స్నాన జపా | - | కాశీలో గల దివ్యగంగలో స్నాన మాచరించి జపము చేయుదురు |
| కొల్హాపుర బిక్షసీ | - | కొల్హాపురమున బిక్ష స్వీకరింతురు |
| నిర్మలనది తుంగా | - | నిర్మలమైన తుంగానది |
| జలప్రాశీ | - | జలము పానము చేతరు |
| మాహుర దేశీ | - | మహూర దేశమున |
| నిద్రా | - | నిద్రింతురు |

ఓ భగవాన్ సాయినాథా! దిగంబరా! మీరు ఏ విధంగా ఉన్నారంటే, క్షయమేలేని అనగా నాశనమన్నదే లేని అవతార స్వరూపులుగా వున్నారు. అంతేకాక మీరు సర్వవ్యాపక చైతన్య రూపులై నిత్యసత్యమై ప్రకాశిస్తున్నారు. వేదమూర్తులైన అత్రి మహర్షికి అనసూయమ్మకు కుమారులై జన్మించారు. ఓ బాబా మాకు మీరే మహారాజులు. ప్రతి దినము మీరు పవిత్ర గంగా నదిలో స్నానమాచరించి కాశీ క్షేత్రమున జపము చేయుదురు. అలాగే కొల్హాపురమున బిక్షను స్వీకరించెదరు. నిర్మలమైన తుంగానది నీటిని పానము చేయుదురు. చివరగా మహూర దేశమున నిద్రించెదరు.

| | | |
|---|---|---|
| 2. వామకరీ | - | ఎడమ భుజమునకు |
| జోళీ లోంబతసీ | - | జోళీని తగిలించుకుని |
| త్రిశూల డమరు ధారీ | - | త్రిశూలము డమరుకము చేత పట్టుకుని |
| భక్త వరదసదా | - | ఎల్లప్పుడు భక్తలకు వరద హస్తమును చూపెడుతూ |

| | | |
|---|---|---|
| సుఖకారీ | - | వారికి ఆనందాన్ని కల్గించెదరు |
| దేశీల ముక్తీ చారీ | - | నాల్గు రకాలైన ముక్తి మార్గములను అనుగ్రహించెదరు |

ఓ భగవాన్ సాయినాథా! మీరు ఎడమ భుజమునకు జోళీని తగిలించుకుని, త్రిశూలము డమరుకము పట్టుకుని భక్తులకు వరద హస్తము అనగా అభయ హస్తమును చూపెడుతూ వారికి ఎనలేని ఆనందాన్ని కల్గిస్తూ వుంటారు. అంతేకాక భక్తులందరికీ వారి వారి తాహతును బట్టి నాల్గు రకాలైన ముక్తి మార్గములు ఉపదేశిస్తూ ఉంటారు. అవి ఎటువంటివంటే 1) సామీప్యముక్తి అనగా భగవంతునికి అతి సన్నిహితంగా మెలిగే అదృష్టం. 2) సాలోక్య ముక్తి అనగా భగవంతుని సన్నిధానంలోనే నివశించడం. 3) సారూప్యముక్తి అనగా భగవంతుని సగుణరూపం ఎలావుంటుందో ఊహించుకుని అదే ప్రకారం నడుచుకుంటూ ఉండడం. 4) సాయుజ్యముక్తి అనగా ఏకమేవా అద్వితీయం బ్రహ్మ లేక అహం బహ్మోస్మి అనబడే మహావాక్యాల తాత్పర్యాన్ని అవగాహన చేసుకుని ఇటు జీవన్ముక్తునిగా కాని అటు విదేహముక్తునిగా కాని భగవంతునిలో లీనమైపోవడం.

| | | | |
|---|---|---|---|
| 3. | సాయీపాదుకా | - | పాదములకు పాదుకలు |
| | జపమాలా | - | జపమాల |
| | కమండలూ | - | కమండలము |
| | మృగఛాలా | - | మృగ చర్మము |
| | ధారణ | - | ధరించి వున్నారు |
| | బా | - | ఓ ప్రేమమూర్తి సాయినాథా! |
| | నాగజటా | - | జడలు కట్టిన తల వెంట్రుకలు |
| | ముగుట | - | ఆ నాగజట మకుటంగా కన్పడుతోంది |
| | మాథా | - | తలమీద ఆ మకుట దృశ్యం |
| | శోభతో | - | చూపరుల దృష్టికి ఎంతో గొప్పదిగాను అందంగాను కన్పడుతోంది |

ఓ ప్రేమమూర్తి సాయినాథా! మీరు మీ దివ్య పాదములకు పాదుకలు ధరించి వున్నారు. ఇంకా జపమాల కమండలము మృగ చర్మము కూడా

ధరించివున్నారు. జడలు కట్టిన మీ తల వెంట్రుకలు మకుటంగా కనబడుతూ నాగజట అనిపించుకున్నది. తల మీద ఆ మకుట దృశ్యం ఎంతో శోభాయ మానంగా గోచరిస్తోంది.

| | | |
|---|---|---|
| 4. జే | - | ఎవ్వరికైతే |
| తుఝ్యా | - | తమపై |
| తత్పర | - | శ్రద్ధతో కూడిన |
| యా | - | ఈ రకమైన |
| ధ్యానీ | - | ధ్యానం |
| అక్షయ | - | క్రమం తప్పక అంతరాయం లేకుండా కుదురుతుందో |
| త్యాంచీసదనీ | - | వారి వారి ఇండ్లల్లో |
| లక్ష్మీ | - | సంపదలకు నిలయమైన లక్ష్మీదేవి |
| కరీవాస | - | స్థిర నివాసం ఏర్పరుచుకొని |
| దినరజనీ | - | రాత్రనక పగలనక |
| సంకటవారుని | - | అపాయములను పోగొట్టి |
| రక్షసి | - | రక్షిస్తూవుంటుంది |

ఓ సాయినాథా! ఎవరికైతే శ్రద్ధతో కూడిన ధ్యానం తమపై కుదరుతుందో అనగా అంతరాయం లేకుండా ఉంటుందో వారి వారి ఇళ్ళల్లో సంపదలకు నిలయమైన లక్ష్మీదేవి స్థిర నివాసమేర్పరుచుకొని ఉంటుంది. అంతేకాక రాత్రి పగలు వారికి కల్గే ఆపదలను పోగొట్టి రక్షిస్తూ వుంటుంది. ఓ సాయినాథా మీరు ఆక్రియను దగ్గరుండి నడిపిస్తూవుంటారు.

| | | |
|---|---|---|
| 5. గురురాయా | - | ఓ సద్గురు సాయినాథా! |
| యాపరి | - | ఈవిధమైన |
| తుఝే ధ్యాన | - | చూపరుల దృష్టిని ఇట్టే ఆకర్షించగలిగే మీ దర్శన భాగ్యం |

| | | |
|---|---|---|
| దృశ్యకరీ | - | ఎంతో అందంగా కనపడడమే కాక |
| నయనాయా | - | ఇది కనువిందు కల్గిస్తూవుంటుంది |
| పూర్ణానంద సుఖే | - | భగవత్ సంబంధమైన ఆశీర్వాద బలంతోనూ ఆనందంతోనూ నిండిపోయి |
| హీకాయా | - | ఈ శరీరం మొత్తం మనోబుద్దులతో సహా |
| హరిగుణగాయా | - | సాయిరూపంలో వున్న ఆశ్రీహరి యొక్క గుణ గానమును పాడేందుకు |
| లావిసి | - | కారణభూతమైపోతుంది |

ఓ సద్గురు సాయినాథా! ఈ విధమైన చూపరుల దృష్టిని ఇట్టే ఆకర్షించ గలిగే మీ దర్శన భాగ్యం ఎంతో అందంగా కనపడడమే కాక కనువిందు కల్గిస్తూవుంటుంది. అంతేకాక భగవత్ సంబంధమైన మీ ఆశీర్వాద బలంతోనూ ఆనందంతోనూ పూర్తిగా నిండిపోయి మనోబుద్దులతో సహా ఈ శరీరం యావత్తూ శ్రీసాయి రూపంలో వున్న ఆశ్రీహరి యొక్క గుణగానము పాడేందుకు కారణ భూతమైపోతుంది.

ఇది సాంప్రదాయబద్దంగా మలచబడిన శ్రీసాయి ఆరతిపాట. దీన్లో కూడా దత్త అనే పదానికి బదులుగా సాయి అనే పదాన్ని పలుకుతూ శ్రీసాయి ఆరతుల పుస్తకంలో చేర్చారు.



ఓం శ్రీ సాయినాథాయా నమః

## మధ్యాహ్న ఆరతి -10

# శ్రీ సాయినాథ మహిమ్నస్తోత్రం

## (శ్రీ ఉపాసని మహరాజ్)

1. సదాసత్ స్వరూపం చిదానందకందం
జగత్ సంభవస్థాన సంహార హేతుం
స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

2. భవద్వాంత విధ్వంస మార్తాండమీడ్యం
మనోవాగతీతం మునిర్ ధ్యాన గమ్యం
జగత్వ్యాపకం నిర్మలం నిర్గుణం త్వాం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

3. భవాంభోది మగ్నార్థితానాం జనానాం
స్వపాదాశ్రితానాం స్వభక్తి ప్రియాణాం
సముద్ధారణార్థం కలౌ సంభవంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

4. సదానింబవృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్యప్రియంతం
తరుం కల్పవృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

5. సదాకల్పవృక్షస్య తస్యాధిమూలే
భవద్భావ బుద్ధ్యా సపర్యాది సేవాం
నృణాంకుర్వతాం భుక్తిముక్తి ప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

6. అనేకాశృతాతర్క్య లీలావిలాసైః
సమావిష్కృతేశాన భాస్వత్ప్రభావః
అహంభావ హీనం ప్రసన్నాత్మభావం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

7. సతాం విశ్రమారామ మేవాభిరాం
సదా సజ్జనైః సంస్తుతం సన్నమద్భిః
జనామోదదం భక్త భద్రప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

8. అజన్మాద్యమేకం పరబ్రహ్మసాక్షాత్
స్వయం సంభవం రామమేవావతీర్ణం
భవద్దర్శనాత్ సంపునీతః ప్రభోహం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం !!

9. శ్రీసాయినాథ కృపానిధే అఖిలనృణాం సర్వార్థసిద్ధిప్రద
యుష్మత్పాదరజః ప్రభావమతులం ధాతాపి వక్తాక్షమః
సద్భక్త్యా శరణం కృతాంజలి పుటఃసంప్రాప్తి తోస్మిప్రభో
శ్రీమత్సాయి పరేశపాద కమలానాన్యచ్ఛరణ్యం మమ

10. సాయిరూపధర రాఘవోత్తమం
భక్తకామ విబుధద్రుమం ప్రభుం
మాయ యోపహత చిత్తశుద్ధయే
చింతయామ్యహం అహర్నిశం ముదా ॥

11. శరత్ సుధాంశాప్రతిమప్రకాశం
కృపాపాత్ర తవసాయినాథ
త్వదీయ పాదాబ్జ సమాశ్రితానం
స్వచ్ఛాయయా తాపమపాకరోతు ॥

12. ఉపాసనా దైవత సాయినాథ
సవైర్మయోపాస నినాస్తుతస్త్వం

రమేన్మనోమే తవపాదయుగ్నే
భృంగోయధాబ్జే మకరంద లుబ్ధః ॥

13. అనేక జన్మార్జిత పాపసంక్షయో
భవేత్ భవత్పాద సరోజ దర్శనాత్
క్షమస్వ సర్వానపరాధ పుంజకాన్
ప్రసీదసాయీశ సద్గురోదయానిధే ॥

14. శ్రీసాయినాథ చరణామృత పూతచిత్తా
తత్పాద సేవనరతా స్వతతంచ భక్త్యా
సంసార జన్యదురితౌఘ వినిర్గతాస్తే
కైవల్యధామ పరమం సమవాప్నువంతి ॥

15. స్తోత్రమే పఠేత్భక్త్యా యోనరః తన్మనాః సదా
సద్గురోః సాయినాథస్య కృపాపాత్రం భవేత్ ధృవం ॥

* * *

| | | | |
|---|---|---|---|
| 1. | సదాసత్ స్వరూపం | - | ఎల్లవేళలా ఎవరైతే తనయొక్క శుద్ధ చైతన్య స్ఫూర్తిలో మునిగి ఉంటారో |
| | చిదానందకకంద | - | శుద్ధ చైతన్య ఆనందరూపమే కందగడ్డ మాదిరి తయారై |
| | జగత్ సంభవస్థాన | - | జగత్తుగా సృష్టించబడడానికి, స్థితి కల్గి ఉండానికి |
| | సంహారహేతుం | - | చివర్న లయమవడానికి కారణభూతమగుచున్నదో |
| | స్వభక్తేచ్ఛయా | - | తన భక్తుల యొక్క కోరికలు తీర్చుట కొరకు |
| | మానుషం | - | మానవ రూపం ధరించి |
| | దర్శయంతం | - | దర్శనమిస్తున్న |
| | ఈశ్వరం | - | ఈశ్వర స్వరూపులైన |
| | సద్గురుం సాయినాథం | - | సద్గురు సాయినాథులకు |
| | నమామి | - | తలవంచి నమస్కరిస్తున్నాను. |

ఆరతి సాయిబాబా

ఎల్లవేళలా ఎవరైతే తనయొక్క శుద్ధ చైతన్యస్ఫూర్తిలో మునిగి ఉంటారో, కందగడ్డ మాదిరి తయారైన ఆ శుద్ధ చైతన్య ఆనందరూపమే ఈ కనబడుతున్న జగత్తుగా సృష్టించ బడడానికి స్థితి కల్గి ఉండడానికి చివరగా లయమవడానికి కారణభూత మగుచున్నదో, ఇంకనూ ఎవరైతే తన భక్తుల యొక్క కోరికలు తీర్చుటకు మానవరూపం ధరించి దర్శనమిస్తున్నారో అట్టి ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 2. త్వాం | - | మీరు |
| భవ | - | ఈ ప్రాపంచిక |
| ధ్వాంత | - | అంధకారమనే అజ్ఞానాన్ని |
| విధ్వంస | - | నశింపజేసే |
| మీడ్యం | - | ప్రకాశవంతమైన |
| మార్తాండ | - | సూర్యుడు వంటివారు |
| మనోవాగతీతల | - | మనస్సుకు వాక్కులకు అందనివారు |
| మునిర్ ధ్యాన గమ్యం | - | ధ్యానమగ్నులైన మునులకు అందేవారు |
| జగత్ వ్యాపకం | - | జగత్తునంతటనూ వ్యాపించిన వారు |
| నిర్మలం | - | నిర్మలులు |
| నిర్గుణం | - | గుణాతీతులు |

ఈ ప్రాపంచిక అంధకారమనే అజ్ఞానాన్ని నశింపచేసే, ప్రకాశవంతమైన సూర్యుడు వంటివారు. ఇంకా మనస్సుకు వాక్కులకు అందనివారు. కాని ధ్యానముగ్నులైన మునులకు మాత్రం అందుతారు. అంతేకాక మీరు జగత్తునంతటనూ వ్యాపించినవారు, నిర్మలులు, గుణాతీతులు, అనగా మీది, ఇది అని చెప్పబడని గుణాతీతమైన నిర్వికల్పస్థితి. అట్టి ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 3. భవాంభోది | - | ఈ సంసారసాగరంలో |
| మగ్నార్దితానాం | - | మునిగి మనుగడసాగిస్తున్న |

| | | |
|---|---|---|
| జనానాం | - | జనులను |
| స్వపాదాశ్రితానాం | - | మీ పాదములకు ఆశ్రయించినవారిని |
| స్వభక్తి ప్రియాణాం | - | మీ ప్రియ భక్తులను |
| సముద్ధారణార్థం | - | సముద్ధరించుట కొరకై |
| కలౌ | - | ఈ కలియుగంలో |
| సంభవంతం | - | అవతరించిరి గదా। |

భవాంబోది అనబడే ఈ సంసారసాగరంలో పడి మునిగి మనుగడ సాగిస్తున్న జనులను, ఎవ్వరైతే మీ పాదపద్మములను ఆశ్రయించి వున్నారో వారిని, ఇంకా మిమ్మలను సంపూర్ణంగా విశ్వసించి వున్న మీ ప్రియ భక్తులను ఉద్దరించుటకొరకై ఈ కలియుగంలో సాయి అవతార మెత్తిన ఈశ్వర స్వరూపులు శ్రీసద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 4. సదా | - | ఎల్లప్పుడు |
| నింబవృక్షస్య | - | వేపచెట్టును ఆశ్రయంగా చేసుకొని |
| మూలాధివాసాత్ | - | దాని మూలస్థానంలో నివసిస్తూ |
| తం | - | ఆ వేప చెట్టు యొక్క |
| తిక్తమప్యప్రియం | - | చేదుగుణాన్ని అప్రియత్వాన్ని పోగొట్టి |
| సుధాస్రావిణం | - | అమృతతుల్యమైన రుచి కలిగే విధంగా మార్చగలిగి |
| కల్పవృక్షాధికం | - | స్వర్గంలో గల కల్పవృక్షము కంటే మిన్నగా |
| తరం సాధయంతం | - | ఆ వేపచెట్టును సిద్దపరిచిన |

ఎల్లప్పుడూ వేపచెట్టును ఆశ్రయంగా చేసుకొని దానిమూల స్థానంలో నివశిస్తూ, ఆ వేపచెట్టు యొక్క స్వాభావికగుణమైన చేదును అప్రియత్వాన్ని తొలగించి అమృతతుల్యమైన రుచిని పొందేటట్లు మార్చ గలిగి, స్వర్గంలో గల కల్పవృక్షం కంటే ఉన్నతంగా భక్తుల కోర్కెలను తీర్చేవిధంగా వేపవృక్ష దివ్యత్వాన్ని ప్రకాశింపజేసిన ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయి నాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 5. సదా | - | ఎల్లప్పుడూ |
| కల్పవృక్షస్య | - | భూలోక కల్పవృక్షము అనబడే వేపవృక్షము |
| తస్యాధిమూలె | - | అట్టి వేపవృక్షము యొక్క మూలమందు |
| భవద్భావబుద్ధ్యా | - | మనస్సును ఆధ్యాత్మిక చింతనతో నింపి |
| సపర్యాది సేవాం | - | నీ పనులు నువ్వవ చేసుకుంటూ, ఇంకా సమాజసేవలు కూడ చేస్తూ |
| నృణాకుర్వతాం | - | సాయి కృపకు పాత్రులు కాగల్గితే |
| భుక్తిముక్తి ప్రదంతం | - | ఆకృప చేతనే భుక్తిముక్తి కూడా లభ్యమవుతుంది. |

ఎల్లప్పుడూ భూలోక కల్పవృక్షము అనబడే వేప వృక్షము యొక్క మూలస్థానము నందు మనస్సును స్థిరపరచి అనగా ఆధ్యాత్మిక చింతనతో నింపి తన పన్లుతాను చేసుకుంటూ శ్రీసాయి సేవవాకార్యక్రమాలను కూడ చేస్తూ, శ్రీసాయి కృపకు పాత్రులు కాగలిగితే, శ్రీ సాయినాధులే మన ప్రాపంచిక అవుసరాలను తీర్చడమేకాక పారమార్ధికమైన మోక్షాన్ని గూడ ప్రసాదించిన వారవుతారు. అట్టి ఈశ్వర స్వవరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 6. అనేక | - | వివిధరకాలైన |
| అశృతా | - | ఇంతవరకూ విననివి |
| అతర్క్య | - | తర్కము చేత నిరూపించలేనివి లేక ఆలోచనకు కూడా తట్టనివి |
| లీలా విలాసైః | - | మహిమలతో కూడిన ప్రదర్శనలు |
| సమ ఆవిష్కృత | - | సాయి దివ్యత్వాన్ని తెలుపుతూ ఉండేవి. |
| ఈశాన | - | ఇట్టి సాయి ప్రభువులు పాలన |
| తత్ప్రభావం | - | తన స్వయంశక్తి చేత |
| భాస్వత | - | వెలుగుతూ ఉండేది |
| అహంభావహీనం | - | వారి గుణం అహంభావ రాహిత్యం |
| ప్రసన్నాత్మభావం | - | వారికున్నది అంతరంగ నిర్మలత్వం |

శ్రీసాయినాథుల మహిమ వర్ణించబడుతోంది. ఆయన చూపెట్టే లీలలు ఇంతవరకూ విననివి కననివి అయివుంటాయి. ఇంకా అవి మన ఆలోచన్లకు తట్టవు. తర్కంచేత కూడ నిరూపణ చెయ్యలేము. ఇటువంటి అనేక మహిమలతో కూడిన లీలాప్రదర్శనలు సాయి దివ్యత్వాన్ని తెలుపుతూ ఉండేవి. ఈ విధంగా శ్రీసాయి ప్రభువుల పాలన తన స్వయంశక్తి చేత వెలుగుతూ ఉండేది. వారిలో అహంభావమన్నది ఏ కోశాన కనపడదు. అదే అహంభావ రాహిత్యమనే గుణం, ఇంక వారు అంతరంగ నిర్మలులు. పరమపవిత్రమైన ఇట్టి గుణ సంపద కల్గిన ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 7. సతాం | - | ఎవరు భక్తులకొరకై |
| విశ్రమ | - | సత్రములను |
| ఆరామ | - | నివాసములను |
| అభిరామ ఏవ | - | ఆనందధామములను మొదలగు వాటిని ఏర్పరుచు ప్రేమమూర్తులో |
| సదా | - | ఇంకా ఎల్లప్పుడూ |
| సజ్జనైః | - | సజ్జనులచేత |
| సంస్తుతం | - | పూజలందుకుంటూ |
| సన్నం అద్భిః | - | ఆరు పవిత్రనదీ జలములచే అభిషేకించ బడుతున్నారో |
| జనామోదదం | - | భక్తుల అభివృద్ధే ధ్యేయంగా పెట్టుకుని |
| భక్త | - | భక్తుల యొక్క |
| భద్రప్రదంతం | - | భద్రతను కాపాడుచుందురో |
| నమామీశ్వరం | - | అట్టి ఈశ్వర స్వరూపులైన సాయినాథులకు నమస్కారములు |

ఎవరు భక్తులకొరకై సత్రములను, నివాసములను, ఆనందధామములను ఏర్పాటు చేయు ప్రేమమూర్తులో, ఎవరు భక్తులకు సుఖాన్ని ఆనందాన్ని శాంతిని కలుగజేయుచూ సజ్జనులచే పూజలందుకుంటూ, ఆరు పవిత్ర నదీ జలములచే అభిషేకించబడుతున్నారో ఇంకా భక్తుల భద్రత అభివృద్ధిని కాపాడుచుందురో అట్టి ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 8. అజన్మ | - | జన్మలేనివారు |
| ఆద్యం | - | ఆదిపురుషులు |
| ఏకం | - | అంతా తానే అయి ఏకంగా వున్నవారు |
| సాక్షాత్ | - | సాక్షాత్తుగా |
| పరబ్రహ్మ | - | పరబ్రహ్మస్వరూపులు |
| స్వయం సంభవం | - | స్వయంగా అవతారం దాల్చినవారు |
| రామం ఏవ అతీర్ణం | - | శ్రీరామచంద్రుడే అవతరించినట్లుగా వచ్చినవారు |
| ప్రభోహం | - | ఓ ప్రభూ నేను |
| భవత్ దర్శనాత్ | - | మీ యొక్క దర్శనము వలన |
| సంపునీతః | - | సంపూర్ణంగా పునీతుడనయ్యాను. |

జన్మలేని వారు ఆదిపురుషులు అంతా తానే అయి ఏకంగా వున్నవారు సాక్షాత్తుగా పరబ్రహ్మ స్వరూపులు స్వయంగా అవతారం దాల్చినవారు శ్రీరామచంద్రుడే అవతరించినట్లుగా వచ్చి శ్రీసాయిబాబాగా మాకందరకూ దర్శనము ప్రసాదిస్తున్నారు. అట్టి మీ యొక్క దర్శన భాగ్యము వలన ఓ ప్రభూ నేను సంపూర్ణంగా పునీతుడనయ్యాను. అట్టి ఈశ్వర స్వరూపులైన సద్గురు సాయినాథులకు తలవంచి నమస్కరిస్తున్నాను.

| | | |
|---|---|---|
| 9. కృపానిదే | - | దయా సముద్రులైన |
| శ్రీసాయినాథ | - | ఓ సాయినాథ దేవా! |
| అఖిలనృణాం | - | అందరినీ సంతృప్తిపరచుచు |
| సర్వార్థసిద్ధి | - | అన్ని రకముల కోరికలు సిద్ధించుటకై |
| ప్రద | - | వరములిచ్చు సద్గురువులు మీరే కదా! |
| యుష్మత్ | - | మీ యొక్క |
| పాదరజః ప్రభావం | - | పాద ధూళి ప్రభావం |
| అతులం | - | దేనికీ సాటిరానిది |
| వక్త | - | పొగడుటకు |

| | | |
|---|---|---|
| ధాతాపి | - | బ్రహ్మ దేముడు కూడా |
| అక్షమః | - | శక్తుడు కాడు |
| ప్రభో | - | ఓ దేవా |
| అస్మి | - | నేను |
| సద్భక్త్యా | - | గొప్ప భక్తి చేత |
| కృతాంజలిపుటా | - | అంజలిఘటించి |
| శరణం | - | శరణువేడుతూ |
| సంప్రాప్తితః | - | పూజిస్తున్నాను |
| శ్రీమత్ సాయిపరేశ | - | పరమాత్మ తత్త్వమును తెలిపే భగవాన్ సాయినాథా |
| పాద కమలా | - | మీ పాద కమలములను ఆశ్రయించుట తప్ప |
| న అన్యచ్ఛరణం మమ | - | ఇంకొక ఆశ్రయము నాకు దొరకదు |

శ్రీసాయినాథదేవా! మీరు దయాసముద్రులు. అన్ని రకములు కోరికలు సిద్ధించుట కొరకు, అందరినీ సంతృప్తిపరచుట కొరకు వరములిచ్చు సద్గురువులు మీరే కదా! మీ యొక్క పాదధూళి ప్రభావం దేనికీసాటిరానిది. దానికి పొగడుటకు బ్రహ్మదేముడు కూడా శక్తుడు కాడు. ఓ దేవా! గొప్ప భక్తి చేత నేను చేతులు జోడించి శరణు వేడుతూ పూజిస్తున్నాను. పరమాత్మ తత్త్వమును బోధించే శ్రీసాయి భగవాన్, మీ పాద కమలములను ఆశ్రయించుట తప్ప నాకు వేరొక ఆశ్రయము దొరకదు.

| | | |
|---|---|---|
| 10. రాఘవోత్తమం | - | ఆ శ్రీరామచంద్రుడే |
| సాయి రూపధర | - | సాయి రూపంలో కనబడుతున్నాడు |
| భక్తకామ | - | భక్తుల కోరికలు నెరవేర్చుటకై |
| ప్రభుం | - | భగవాన్ సాయినాథులు |
| విభుద ద్రుమం | - | కల్ప వృక్షమైనారు |
| మాయయా | - | మాయాశక్తి చేత |
| ఉపహత | - | కొట్టబడిన లేక అశుద్దికాబడిన |

| | | |
|---|---|---|
| చిత్త | - | మనస్సును |
| శుద్దయే | - | శుద్ధి చేయుట కొరకు |
| అహర్నిశల | - | రాత్రనక పగలనక |
| అహం | - | నేను |
| ముదా | - | ఎంతో ఆనందంతో |
| చింతయామి | - | శ్రీ సాయి ధ్యానంలో ఉంటూ ఉంటాను |

ఆ శ్రీరామచంద్రుడే శ్రీసాయి రూపధరుడై దర్శనమిస్తున్నారు. ఇంకా భక్తుల కోరికలు నెరవేర్చుట కొరకై ఆయన స్వర్గలోక వృక్షము అయినారు. అనగా కల్పవృక్షము వలె ఉన్నారు అని అర్థం. భగవంతుని శక్తే మాయగా లోకంలో ప్రదర్శితమవుతోంది. ఆ మాయచే పెడ దెబ్బలు తింటున్న మనస్సును అనగా అశుద్దికావింపబడిన మనస్సును తిరిగి వెంటనే శుద్ధి చేయుటకై నేను రాత్రనక పగలనక శ్రీసాయినాథ ధ్యానంలో ఎంతో ఆనందంగా గడుపుతూ వుంటాను.

| | | |
|---|---|---|
| 11. తవ సాయినాథ | - | శ్రీసాయిదేవా! మీ యొక్క |
| కృపాపాత్ర | - | దయ అనెది జలాశయం |
| శరత్ సుదాంశ | - | శరత్కాలంలో పున్నమి చంద్రుడువలె |
| అప్రతిమం | - | దేనితోను సాటిరాని |
| ప్రకాశం | - | వెన్నెల వెలుగులాంటిది |
| త్వదీయ | - | మీ యొక్క |
| పాదాబ్జ | - | పాదకమలములను |
| సమాశ్రితానాం | - | ఆశ్రయించిన వారందరికీ |
| స్వచ్ఛాయయా | - | మీ చల్లని నీడలో |
| తాపం | - | దుఃఖమనే తాపాన్ని |
| అపాకరోతు | - | పోగొడుతున్నారు |

ఓ సాయిదేవా! మీ యొక్క దయ అనబడే జలాశయం శరత్కాలంలో పున్నమి చంద్రుడు వలె దేనితోనూ సాటిరాని వెన్నెల వెలుగులాంటిది. మీ

పాదకమలములను ఆశ్రయించిన వారందరికీ మీ చల్లని నీడలో దుఃఖమనే తాపాన్ని పోగొడుతున్నారు.

| | | |
|---|---|---|
| 12. ఉపాసనిన | - | ఈ ఉపాసని అన్న పేరుగల నేను |
| ఉపాసనాదైవత | | |
| సాయినాథ | - | నా యొక్క ఉపాసనా దైవతమగు శ్రీ సాయినాథులను |
| స్తవైర్మయా | - | ఎల్లప్పుడూ స్తుతించువాడనై |
| స్థ్యమ్ | - | అదే స్థితిలో |
| అస్తు | - | ఉండుగాక |
| యదాబ్జే | - | కమలమునందుగల |
| మకరంద | - | తేనెత్రాగుటచే |
| లుబ్ధ | - | మత్తెక్కిన |
| భృంగ | - | ఒక తుమ్మెదవలె |
| తవపాదయుగ్మే | - | మీ పాదముల నాశ్రయించిన |
| మేమనో | - | నా మనస్సు |
| రమేన | - | రమించుగాక |

ఈ ఉపాసని అన్న పేరు గల నేను (ఉపాసనీ మహరాజ్) నా యొక్క ఉపాసనా దైవతమగు శ్రీ సాయినాథులను ఎల్లప్పుడూ స్తుతిస్తూ అదే స్థితిలో ఉండుగాక. కమలంలో గల తేనె త్రాగుటచే మత్తెక్కిన ఒక తుమ్మెదవలె, ఓ సాయినాథా! మీ పాదములను ఆశ్రయించిన నా మనస్సు రమించుగాక.

| | | |
|---|---|---|
| 13. సద్గురో దయానిధే | - | దయ అనెడి నిధి కల్గిన ఓ సద్గురూ |
| ప్రసీద సాయీశ | - | ఈశ్వర స్వరూపులైన ఓ సాయినాథా! నా పట్ల దయచూపుడు |
| అనేక జన్మార్జిత | - | అనేకానేక జన్మల నుండి ప్రోగుపడి |
| పాప | - | పాపరాశి అంతయు |
| భవత్పాద సరోజ | - | మీ పాదకమలములను |

| | | |
|---|---|---|
| దర్శనాత్ | - | దర్శించినంత మాత్రము చేత |
| సంక్షయః భవేత్ | - | పూర్తిగ నిర్మూలించబడినది అగుతున్నది |
| క్షమస్వ | - | దయతో నన్ను క్షమింపుడు |
| సర్వాన్ | - | అన్ని రకముల |
| అపరాదాన్ | - | అపరాదములను |
| పుంజకాన్ | - | మూటగట్టుకొని ఉంటిని |

దయ అనే నిధి కల్గిన ఓ సద్గురూ! ఈశ్వర స్వరూపులైన ఓ సాయినాథా! దయతో నన్ను క్షమింపుడు. అన్ని రకముల అపరాదములను మూటగట్టుకొని వుంటిని. మీ పాద కమలములను దర్శించినంత మాత్రముచేత అనేక జన్మల నుండి ప్రోగుపడిన పాపరాశి అంతా పూర్తిగా నిర్మూలించబడినది అగుతున్నది.

| | | |
|---|---|---|
| 14. శ్రీ సాయినాథ చరణామృత | - | శ్రీసాయినాథపాదామృతంతో |
| పూతచిత్తా | - | పూత పూయబడిన మనస్సుతో |
| సతతంచ భక్త్యా | - | భక్తిని కల్గి ఎల్లప్పుడు |
| తత్పాదసేవనరతా | - | శ్రీసాయిపాద సేవకు ఎవరు అంకితమగుదురో |
| సంసారజన్య | - | సంసారం వల్ల జన్మించిన |
| దురితౌఘ | - | పాప పంకిలం నుండి |
| వినిర్గతాస్తే | - | వారు బయటపడగల్గుదురు |
| కైవల్యధామం | - | మోక్షస్థితి |
| పరమం | - | పరమార్థస్వరూపంగా |
| సమవాప్నువంతి | - | ఆత్మ స్వరూపంగా అనుభవానికి వస్తుంది. |

శ్రీసాయినాథ చరణామృతంతో తడిసిముద్దైన అనగా పవిత్రము చెయ్యబడ్డ మనస్సుతో ఎవరు శ్రీసాయినాథ చరణ సేవకు అంకితమగుదురో వారికి సంసారం వల్ల కల్గిన పాప పంకిలం అనగా బురద చెదర గొట్టబడినది అవుతున్నది. అటువంటి వారికి మోక్షస్థితి పరమార్థ స్వరూపంగా అనగా ఆత్మ స్వరూపంగా అనుభవానికి వస్తుంది.

15. యోనర - ఏమానవులైతే
తన్మనాః - వారి వారి మనస్సులలో
సదా - ఎల్లప్పుడూ
భక్త్యా - భక్తిని నింపుకుని
స్తోత్రమే పఠేత్ - ఈ స్తోత్రమును చదువుదురో
సద్గురోః సాయినాథస్య - శ్రీ సాయినాథ సద్గురువుల యొక్క
కృపాపాత్రం - కృపకు పాత్రులగుట
ధృవం భవేత్ - తప్పక జరుగును. ఇది నిజం.

ఏ మానవులైతే వారి వారి మనస్సులలో ఎల్లప్పుడు భక్తిని నింపుకుని శ్రీసాయినాథుని మహిమ్నసోత్రము చదువుదురో వారు సద్గురుసాయినాథుల యొక్క కృపకు పాత్రులగుట తప్పక జరుగును. ఇది నిజం.

శ్రీ ఉపాసనీ మహరాజ్ 1911వ సంవత్సరంలో షిరిడిలో తపస్సు చేస్తున్నప్పుడు ఈ సంస్కృత స్తోత్రాన్ని రచించారు. శ్రీసాయిబాబా వారి పాదుకల ప్రతిష్ట 15-08-1912న ఒక శ్రావణ పౌర్ణమి రోజున వేపచెట్టు క్రింద జరిగింది. దాన్నే గురుస్థాన్ అని పిలుస్తారు. అయితే ఆ ప్రకారం ప్రతిష్ట చెయ్యబడిన పాదుకలఫలకంపై 'సదానింబ వృక్షస్య మూలాది వాసాత్' అనే శ్లోక పాదాన్ని, 'సదా కల్పవృక్షస్య తస్యాదిమూలే' అనే శ్లోక పాదాన్ని చెక్కించారు.

శ్రీ ఉపాసనీ మహరాజ్‌ను 'సకోరి యోగి' అని కూడా పిలుస్తారు. అటువంటి యోగులందరికీ మహాయోగి అనబడే శ్రీసాయినాథ్ మహరాజును కీర్తిస్తూ వ్రాయబడింది 'శ్రీసాయినాథ్ మహిమ్న స్తోత్రం'. అందుకే ఇక తిరుగులేనిదై శ్రీసాయి ఆరతుల పుస్తకంలో చేర్చబడింది. మొదటి శ్లోకంలోని నాలుగవ పాదమైన 'నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్' అనబడేది మకుటంగా తీసుకుని చదవడం ఒక సాంప్రదాయంగా మారింది. అంతేకాక ఈ పాదంలోని ఈశ్వరం సద్గురుం అనబడే పదాలు సాయినాథులకే వర్తించేటట్లు వుంటాయి.

భగవత్ సంబంధమైన సర్వజ్ఞత్వం సర్వశక్తిమంతం సర్వవ్యాపకత్వం అనబడే అపూరూప గుణాలన్నీ శ్రీ సద్గురు సాయినాథులకు చెందినవిగా

కనపడతాయి. దానివల్లనే ఆయనకు భౌతిక శక్తులపై తిరుగులేని అధికారం సంప్రాప్తించింది. దాన్నే ఈశ్వరత్వంగా పిలుస్తారు. ఇక ఎల్లప్పుడూ పారమార్థిక చింతనలోనే వుంటూ తనకు బాగా దగ్గరైన వారికి కూడా అటువంటి అనుభవ జ్ఞానం కల్గేటట్లుచెయ్యడానికి ప్రయత్నం చేస్తూ వుంటారు. కాబట్టే సద్గురుం అని పిలువబడుతున్నారు.

ఈ కారణం చేతనే ఈశ్వరత్వం సద్గురత్వం అనబడే రెండు ప్రధాన భూమికలు శ్రీసాయినాథులకు చెందినవి అవడం చాలా అపురూపం అని అనవచ్చు. ఈ సందర్భంలో శ్రీమతి తార్కడ్ మాటలు గుర్తు చేసుకోక తప్పదు. ఇది చూస్తే ఆమె ఎంతో లోతుగా పరిశీలన చేసి ఈ మాటలు అన్నారో తెలుస్తుంది. "శ్రీసాయిబాబాకు ఇతర యోగులకు మధ్య గల చెప్పుకోదగ్గ భేదం ఒకటి నేను గమనించాను. ఇతర యోగులు చాలామంది భౌతిక ప్రపంచపు వాసనల నుండి విడివడి సంపూర్ణ సమాధి స్థితిలోనే వుండి తిరిగి బయట ప్రపంచంలోకి వచ్చి వ్యవహార విషయాల్లో కల్గించుకుంటూ ఉంటారు. దాంట్లో భాగంగా తనను కల్సినవారి మనస్సును పసిగట్టి భూత భవిష్యత్ వర్తమానాల గురించి చర్చిస్తూ ఉంటారు. కాని మన సాయినాథులు అలా సమాధి స్థితిలోకి వెళ్ళడం నేనెప్పుడూ చూడలేదు. వారికి లోపల బయట అన్న భేదం లేదు. లోపలి దృష్టి అనగా సమాధిలో కనబడే పారమార్థిక స్థితి, దానితోబాటు బయట కనపడే భౌతిక స్థితి. ఈ రెండూ కూడా జాగ్రదవస్థలోనే పొందుతూ ఉంటారు.''

మొత్తం భౌతికాన్ని పరమార్థంలోకి పరమార్థాన్ని భౌతికంలోకి మార్చుచేసి చూడగల్గే శక్తి ఆయన సొంతం. 'సర్వం ఖల్విదంబ్రహ్మ' అనబడే మహావాక్యం ఆయన పిలిస్తే పలుకుతూ ఉంటుంది. శ్రీమతి తార్కడ్ అందుకే బాబాకు 'ఈశ్వరం సద్గురుం' అన్న పద ప్రయోగం చక్కగా సరిపోతుంది అని అనేవారు. ఈ రెండు స్థితులూ ఎప్పటికప్పుడు ఆయనలో అభివ్యక్తమవుతూ వుంటాయి.

అందువల్లనే నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ అన్న మఖుటపాదం ఒక మహామంత్రంగా మారిపోయి ఎవ్వరైతే అర్థతాత్పర్యాలను మననం చేస్తూ చదువుతారో వారికి ఎనలేని ఆధ్యాత్మిక భౌతిక సంపదలను సమకూరుస్తూ వుంటుంది అనడంలో ఎట్టి సందేహం లేదు.

ఓం శ్రీ సాయినాథాయా నమః

# మధ్యాహ్న ఆరతి -11

## (సాంప్రదాయ శ్లోకం)

1. కరచరణకృతం వా కాయజం కర్మజంవా
శ్రవణ నయనజం వా మానసం వాపరాథమ్
విదితమవిదితం వా సర్వమేతత్ క్షమస్వ
జయ జయ కరుణాబ్దే శ్రీ ప్రభో సాయినాథ ॥

| | | |
|---|---|---|
| కరుణాబ్దే | - | ఓ కరుణాసముద్రుడా |
| ప్రభో శ్రీసాయినాథ | - | శ్రీ సాయినాథ ప్రభువా |
| జయజయ | - | మీకు జయమగుగాక। |
| కర | - | చేతులతోగాని |
| చరణ | - | పాదములతోగాని |
| కృతం | - | చేయబడినవి |
| వాక్కు | - | మాటల వల్లగాని |
| కాయజం | - | శరీరం వల్ల గాని |
| కర్మజం | - | కర్మల వల్లగాని |
| శ్రవణ | - | చెవుల వల్ల గాని |
| నయనజం | - | చూపుల వల్ల గాని |
| మానసం | - | మనస్సు ద్వారా చేసిన |
| అపరాధమ్ | - | అపరాధములను |
| విహితం | - | ఇంకనూ చేయగల్గినవి |
| అవిహితం | - | చేయకూడనివి అయిన |
| సర్వమేతత్ | - | సమస్త క్రియా కలాపములను |
| క్షమస్వ | - | ప్రభో క్షమింపుము |

**ఓం రాజాదిరాజ యోగిరాజ పరబ్రహ్మ శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై**

**మధ్యాహ్న ఆరతి సమాప్తం**

ఓం శ్రీ సాయినాథాయా నమః

# ధూప్ ఆరతి

## (సాయంకాల ఆరతి)

ఈ ధూప్ ఆరతిలో మొత్తం పది పాటలున్నాయి. ఈ పది పాటల్లో తొమ్మిది ఆరతి పాటలు మధ్యాహ్నకాలంలో ఇచ్చే ఆరతి నుండి గ్రహించబడ్డాయి. వాటి వివరాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

ధూప్ ఆరతిలో మొదటిది మధ్యాహ్న ఆరతిలో రెండవదైన 'ఆరతి సాయిబాబా సౌఖ్యదాతార జీవా...' అన్నది. దీన్ని వ్రాసినవారు శ్రీమాధవరావు అద్కర్. ఇక ధూప్ ఆరతిలో రెండవది మధ్యాహ్న ఆరతిలో నాలుగవదైన 'శిరిడి మాఝే పండరిపుర...' అన్నది. దీన్ని వ్రాసిన వారు శ్రీ దాసగణు మహరాజ్. తరువాత ధూప్ ఆరతిలో మూడవది మధ్యాహ్న ఆరతిలో ఐదవదైన 'ఘాలీన లోటాంగణ వందీన చరణ...' అన్నది. ఇది పారంపరిక స్తోత్రం. తరువాత ధూప్ ఆరతిలో నాల్గవది మధ్యాహ్న ఆరతిలో ఆరవదైన 'హరేరామ హరేరామ' అనే నామస్మరణ.

ధూప్ ఆరతిలో ఐదవది మధ్యాహ్న ఆరతిలో ఎనిమిదవదైన. 'అనంతాతులాతే కసేరే స్తవావే' అన్నది. దీన్ని వ్రాసిన వారు శ్రీమోహినీ రాజ్' ఇక ధూప్ ఆరతిలో ఆరవది మధ్యాహ్న ఆరతిలో తొమ్మిదవదైన 'ఐసాయే ఈబా సాయి దిగంబరా' అన్నది. ఇది ఒక ప్రార్థనా గీతం. తరువాత ధూప్ ఆరతిలో ఏడవది మధ్యాహ్న ఆరతిలో పదవదైన 'సదా సత్స్వరూపం చిదానందకందం..' అన్నది. దీన్ని వ్రాసినవారు శ్రీ ఉపాసని మహరాజ్. ఇక ధూప్ ఆరతిలో ఎనిమిదవది 'శ్రీ గురుప్రసాద యాచనా దశకం'. దీన్ని వ్రాసినవారు శ్రీ బి.వి.దేవ్ (శ్రీ బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్) దీని పూర్తి వివరాలన్నీ ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

ధూప్ ఆరతిలో తరువాత వచ్చే తొమ్మిదవది మంత్రపుష్పం. ఇది మధ్యాహ్న ఆరతిలో ఏడవదిగా వుంది. ఇక ధూప్ ఆరతిలో చివర పదవది 'కరచరణ

కృతంవా...' అన్న ప్రార్థనా శ్లోకం. ఇది కూడ మధ్యాహ్న ఆరతిలో పదకొండవదిగా వివరించబడింది.

ఇప్పుడు పైన చెప్పినట్లుగా ధూప్ ఆరతిలో ఎనిమిదవదైన శ్రీ గురు ప్రసాద యాచనా దశకం అమోఘంగా వర్ణించబడినదాన్ని అర్ధతాత్పర్యాలతో సహా చూడవచ్చు.



ఓం శ్రీ సాయినాథాయా నమః

# ధూప్ ఆరతి-8

## శ్రీ గురు ప్రసాద యాచనాదశకం

## (శ్రీ బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్)

1. రుసో మమ ప్రియాంబికా మజవరీ పితాహీ రుసో
రుసో మమ ప్రియాంగనా ప్రియ సుతాత్మజా హీ రుసో
రుసో భగిని బంధుహీ శ్వశుర సాసుబాయీ రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కధీహీ రుసో ॥

2. పుసో న సునబాయి త్యా మజన భ్రాతృ జాయా పుసో
పుసో న ప్రియ సోయరే ప్రియసగే న జాతీ పుసో
పుసో సహృద నా సఖా స్వజన నాప్త బంధూ పుసో
పరీన గురుసాయిమా మజవరీ కధీహీ రుసో ॥

3. పుసో న అబలాములే తరుణ వృద్ధహీనా పుసో
పుసో న గురు థాకుటే మజన థోరసానే పుసో
పుసో న చ భలేబురే సుజన సాధు హీ నా పుసో
పరీన  గురు సాయిమా మజవరీ కధీహీరుసో ॥

4. రుసో చతుర తత్త్వవిత్ విబుధ ప్రాజ్ఞ జ్ఞానీ రుసో
రుసో హి విదుషిస్త్రియా కుశల పండితాహి రుసో
రుసో మహీపతీ యతి భజక తాపసీ హీ రుసో
న పరీన గురు సాయిమా మజవరీ కధీహీ రుసో ॥

5. రుసో కవి ఋషీమునీ అనఘ సిద్ధ యోగీ రుసో
రుసో హి గృహదేవతాని కులగ్రామ దేవీ రుసో
రుసో ఖళ పిశాచ్చహీ మలినఢాకినీ హీ రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కధీహీ రుసో ॥

6. రుసో మృగ ఖగ కృమీ అఖిల జీవ జంతూ రుసో
రుసో విటప ప్రస్తరా అచల ఆపగాబ్ధీ రుసో
రుసో ఖపవనాగ్నివార్ అవని పంచతత్త్వే రుసో
న దత్త గురు సాయిమా మజవరీ కధీహీ రుసో ॥

7. రుసో విమల కిన్నెరా అమల యక్షిణీహీ రుసో
రుసో శశిఖగాదిహీ గగని తారకాహీ రుసో
రుసో అమర రాజహీ అదయ ధర్మరాజా రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కదీహీ రుసో ॥

8. రుసో మన సరస్వతీ చపల చిత్తతేహీ రుసో
రుసోవపు దిశాఖిలా కఠిన కాలతోహీ రుసో
రుసో సకల విశ్వహీ మయితు బ్రహ్మ గోళా రుసో
న దత్తగురు సాయిమా మజవరీ కధీహీ రుసో ॥

9. విమూఢ హ్మణునీ హసో మజన మత్సరాహీ డసో
పదాభిరుచి ఉల్హసో జనన కర్ధ మీ నాఫసో
న దుర్గ ధృతి చా ధసో అశివభావ మాగే ఖసో
ప్రపంచ మనహే రుసో ధృడ విరక్తి చిత్తీరసో ॥

10. కృణాచిహీ ఝృణానసో నచస్పృహ కశాచీ అసో
సదైవ హృదయీ వసో మనసిధ్యాని సాయి వసో
పదీప్రణయ వోరసో నిఖిల దృశ్య బాబాదిసో
నదత్తగురు సాయిమా ఉపరియాచనేలా రుసో ॥

⋆ ⋆ ⋆

| | | |
|---|---|---|
| 1. మమప్రియాంబికా | - | నా ప్రియమైన తల్లి అయినా |
| పితాహి | - | నా తండ్రి అయినా |
| మజవరీ | - | నా పట్ల |
| రుసో | - | ఈసడింపు ధోరణి ప్రదర్శించినా |

| | | |
|---|---|---|
| మమ ప్రియాంగనా | - | నా ప్రియమైన భార్య అయినా |
| ప్రియ సుతాత్మజా | - | నా ప్రియమైన కుమారుడు కాని కుమార్తె గాని |
| రుసో | - | నన్ను బాధపెట్టినా |
| భగిని | - | నా అక్క చెల్లెళ్ళు గాని |
| బంధుహీ | - | అన్నదమ్ములు గాని |
| శ్వసుర | - | మామగారు గాని |
| సాసు బాయీ | - | అత్తగారు గాని |
| రుసో | - | నన్ను అవవమానించినా |
| దత్తగురు సాయిమా | - | నా దత్తగురు సాయితల్లి మాత్రం |
| మజవరీ | - | నా పట్ల |
| కధీహీ | - | ఎన్నటికి |
| రుసో | - | ఏహ్యభావాన్ని |
| న | - | చూపవద్దని వేడుకుంటున్నాను. |

నా దత్తగురు సాయితల్లి! నేను మిమ్ములను కోరుకునేది ఒక్కటే ఎవరు నాపట్ల అలసత్వం చూపినప్పటికీ మీ ప్రేమకు మాత్రం నన్ను దూరం చెయ్యవద్దని నా ప్రార్థన. నా తల్లిదండ్రులు నన్ను ఈసడించుకున్నా, భార్యాపుత్రులు నన్ను బాధపెట్టినా, నా అక్కాచెల్లెళ్ళు అన్నదమ్ములు, అత్తగారు మామగారు నన్ను అవమానించినా సరే నేను బాధపడను. కాని నా సాయితల్లి మాత్రం ఎన్నటికీ నాపై ఏహ్యభావం చూపవద్దని నా మనవి.

| | | |
|---|---|---|
| 2. సునబాయీ | - | గౌరవప్రదమైన నా కోడలు |
| భ్రాతృజాయా | - | వదినగారు |
| త్యామజన | - | నన్ను గురించి గాని నా కొరకు గాని |
| నపుసో | - | పట్టించుకొనకపోయినా |
| ప్రియసోయరే | - | ప్రియమైన దూరపు బంధువులు గాని |
| ప్రియనగే | - | ప్రియమైన దగ్గర బంధువులు గాని |

| | | |
|---|---|---|
| జాతీ | - | నా కులం వారుకాని |
| నపుసో | - | నన్ను గుర్తుంచుకొనకపోయినా |
| సహృద | - | సంక్షేమం కోరేవారు |
| సఖా | - | స్నేహితులు |
| స్వజన | - | బాగా దగ్గర మనుషులు |
| ఆప్తబంధూ | - | బాగా దగ్గర బంధువులు |
| నపుసో | - | నాగురించి, నా క్షేమం గురించి అడుగకపోయినా |
| పరీ | - | బాధలేదు కాని |
| గురు సాయిమా | - | నా గురుసాయి తల్లిమాత్రం |
| కధీహి మజవరీ | - | ఎప్పుడూ నాకు తోడుగా వుంటూ |
| నరుసో | - | నన్ను మరువకోడదు. |

నా గురు సాయితల్లి మాత్రం ఎప్పుడూ నాకు తోడు నీడగా వున్నచో, ఎవ్వరు ఎంత బాధించినా నేను లెక్కచెయ్యను. నాకు గౌరవంగా కనపడే నా కోడలు గాని వదిన గారు గాని నన్ను పట్టించుకొనకపోయినా బాధపడను. అదేవిధంగా దూరపు దగ్గర బంధువర్గం వారు, నా కులం వారు, స్నేహితులు, ఆప్తులు ఎవ్వరైనా సరే నాపట్ల అలసత్వం ప్రదర్శించినా నాకు బాధలేదు. ఎందుకంటే నా సాయితల్లి ప్రేమ నాకు దక్కితే చాలు.

| | | |
|---|---|---|
| 3. అబలా | - | అనాథ స్త్రీలు |
| ములే | - | చిన్న పిల్లలు |
| తరుణ | - | ఆడపిల్లలు |
| వృద్ధహీ | - | ముసలివారు |
| న పుసో | - | నా అవుసరాన్ని గుర్తించకపోయినా |
| గురు | - | గురువులు పెద్దలు |
| ధాకుటే | - | పడుచువారు అనుభవంలేనివారు |
| థోరసానే | - | గొప్పవారు కాని సాధారణ మనుషులు కాని |

| | | |
|---|---|---|
| న పుసో | - | నా సహాయ సహకారాలు కోరకపోయినా |
| భలేబురే | - | గుణవంతులు గుణహీనులు |
| సుజన సాధుహీ | - | సజ్జనులు సాధువులు |
| న పుసో | - | నాకు విలువ నివ్వకపోయినా |
| పరీ | - | బాధలేదుకాని |
| గురుసాయిమా | - | గురుసాయి తల్లి మాత్రం |
| కధీహీ మజవరీ | - | ఎల్లప్పుడూ నన్ను తెలుసుకొనకుండా ఉండకూడదు. |

అనాధ స్త్రీలు, పిల్లలు, ముసలివారు, గురువులు, అనుభవం లేనివారు ఎవ్వరైనా సరే నా నుండి ఏ సహాయము కోరక నన్ను అవమానించినా నాకు బాధలేదు కాని నా గురు సాయితల్లి మాత్రం నన్ను చేరదీసి ఆదరణతో చూస్తే చాలు నా జన్మ ధన్యం అవుతుంది.

| | | |
|---|---|---|
| 4. చతురులు | - | తెలివిగలవారు |
| తత్త్వవిత్ | - | తత్త్వజ్ఞులు |
| విభుద | - | విజ్ఞానులు |
| ప్రాజ్ఞులు | - | వివేకవంతులు |
| జ్ఞానీ | - | జ్ఞానులు |
| రుసో | - | నన్ను తక్కువచేసినా |
| విదుషీ స్త్రియా | - | యోగినులు |
| కుశలపండితాహి | - | ఆత్మజ్ఞాననిష్ణాతులు |
| మహీపతి | - | దేశాన్ని ఏలే రాజులు |
| యతీ | - | యతులు |
| భజక | - | భగవంతుడిని భజనతో జపించేవారు |
| తాపసీహీ | - | తాపసులతో సహా |
| రుసో | - | నన్ను విశేషించి సంతోష పెట్టకపోయినా సరే |

| | | |
|---|---|---|
| గురుసాయిమా | - | గురు సాయితల్లి మాత్రం |
| మజవరీ | - | నాపై |
| కథీహీ రుసో | - | ఎల్లప్పుడూ ఆదరణ చూపుగాక |

ఒక ప్రత్యేకతను సంపాదించుకున్న తెలివిగలవారు తత్వాన్ని ఔపోసన పట్టినవారు. జ్ఞాన పరిపాకాన్ని ఆచరణలో పెట్టే విజ్ఞానులు, అవివేకాన్ని దూరం చేసి వివేకంతో ప్రవర్తించే వారు, ఆత్మను అర్థం చేసుకున్న జ్ఞానులు, యోగినులు, మహారాజులు, యతులు, భగవద్భజనలో తరించేవారు, తపస్సును ఆచరించుటలో నిష్ణాతులు వీరందరూ నన్ను ఆదరించకపోయినా నేను బాధపడను. కాని నా గురు సాయితల్లి మాత్రం ఎల్లప్పుడూ నన్ను ఆదరించుగాక అని వేడుకుంటున్నాను.

| | | |
|---|---|---|
| 5. కవీ ఋషీ మునీ | - | కవులు ఋషులు మునులు |
| అనఘు | - | పాపరహితులు |
| సిద్దయోగీ | - | సిద్ధులైన యోగి పుంగవులు |
| గృహదేవతాని | - | కులదేవతలు |
| కులగ్రామదేవీ | - | అన్ని కులములకు దేవి అయిన గ్రామదేవత |
| ఖళపిశాచ్ఛహీ | - | దుష్ట పిశాచగణాలు |
| మలిన | - | దుర్వాసనలతో కూడిన |
| ఢాకినీ హీ | - | శాకినీ ఢాకినీ మొదలైన స్త్రీ భూతాలు |
| రుసో | - | వీరందరి ప్రభావం నాపై పడినా పడకపోయినా |
| దత్తగురు సాయిమా | - | నా తల్లి దత్తగురుసాయి |
| మజవరీ కథీహీ రుసో | - | ప్రభావం ఎప్పుడూ నన్ను వీడకుండుగాక. |

ఓ దత్తగురు సాయిమా! నా ప్రార్థన ఆలకించండి. మీ దయ ఎల్లప్పుడూ నన్ను వీడకుండుగాక. ఇక ఏ ఇతర ప్రభావాలైన అవి మంచికోరేవిగాని చెడు చేసేవిగాని వాటి గుణగణాలు ఏవైనప్పటికీ వాటి ప్రభావానికి నేను దూరంగా ఉండడానికే ఇష్టపడతాను. ఆ కోవకు చెందిన గుణవంతులే కవులు ఋషులు

మునులు మొదలైనవారు. అంతేకాక సిద్ధులైన యోగిపుంగవులు కులదేవతలు, గ్రామ దేవతలు కూడా మంచిని పెంచేవారే. ఇక వ్యతిరేక ప్రభావాన్ని చూపెట్టే దుష్ట పిశాచ గణాలు దుర్వాసనా భరితమైన శాకినీ ఢాకినీ మొదలగు స్త్రీ భూతాలు వున్నారు. మీ దయవల్ల వీటి ప్రభావం నన్ను తాకదు.

6. మృగ ఖగ కృమీ - జంతువులు పక్షులు క్రిములు

అఖిల జీవజంతూ - అన్ని రకములు జీవజాలములు

విటప ప్రస్తరా - వృక్షాలు రాళ్ళు రప్పలు మొదలైన

అచల ఆపగాబ్ధీ - చలించని జీవనిర్జీవములు ఇంకా నదులు సముద్రములు

ఖ పవన అగ్నివార్ - ఆకాశము గాలి అగ్ని నీరు

అవని పంచతత్త్వే - భూమి పంచభూతములు

రుసో - ఇవన్నీ నన్ను భయపెట్టినా లేక సంతోషాన్ని కల్గించినా, విషమ పరిస్థితి దాపురించినా నేను బాధపడను.

సృష్టియావత్తూ పంచభూతమయం. వీటి ప్రభావం ప్రతి జీవరాశిపై తప్పక పడుతూనే ఉంటుంది. అట్టి పరిస్థితిలో మనిషి ఈ ప్రభావానికి గురికాకుండా ఉండే మార్గం ఏదైనా ఉందా అంటే అది సద్గురు కృప మాత్రమే అంటారు పెద్దలు. దీన్నే కవి ఇలా వర్ణిస్తున్నాడు. ఓ గురుదేవా! జంతువులు పక్షులు క్రిమికీటకాలు వృక్షాలు రాళ్ళు రప్పలు ఇంకా అచలాలు చలాలు అయినా జీవరాశులు, సముద్రాలు నదులు మొదలగు వాటి ప్రభావం నన్ను తాకినా తాకకపోయినా మీ కృపా ప్రభావం నన్ను రక్షించుగాక.

7. విమల కిన్నెరా - పవిత్రమైన కిన్నెర దేవతాసమూహం

అమల యక్షిణీహీ - మధ్యస్థంగా ఉండే యక్షిణీ సమూహం

శశి ఖగాది హీ - సూర్య చంద్ర మండలాలు

గగని తారకాహీ - ఆకాశము నక్షత్ర సమూహామూ

| | | |
|---|---|---|
| అమర రాజహీ | - | దేవేంద్రుడు మొదలగు దేవతా సమూహం |
| అదయ ధర్మరాజా | - | దయ చూపని యమధర్మరాజు |
| రుసో | - | మంచిగాని చెడుగాని కల్పించే వీరి శక్తులకు నేను గురికాకపోయినా సరే |

దేవతలలో పవిత్రులు కిన్నెరులు. ఇక యక్షిణులు ఇటు దేవతల యొక్క అటు రాక్షసుల యొక్క స్వభావాల్ని కలుపుకొని వుంటారు. వీరిని అర్ధదైవిక జాతులవారని అంటారు. వీరిలో కొంతమందికి రాక్షస స్వభావం వుంటుంది. వీరి రాజు కుబేరుడు. సృష్టిలో సంపదకు అనగా ముఖ్యంగా ధనసంపదకు కుబేరుడు అధిపతి. రచయిత వీరిని అమల అన్న విశేషణంతో సంభోదించడంలో వీరిలో కిన్నెరులకున్నంత పవిత్రత గాని ఉన్నత స్థానంగాని లేకపోవచ్చు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక మనస్సుకు బుద్ధికి ప్రత్యక్ష ప్రతీకలైన చంద్రుడు సూర్యుడు, ఖాళీకి (రాజ్ఞుఖివ) ప్రత్యక్ష ప్రమాణమైన ఆకాశం, కనువిందుకు ప్రత్యక్ష ప్రమాణమైన నక్షత్ర సమూహం యొక్క ప్రభావం అందరూ అనుభవిస్తున్నదే. అలాగే దేవేంద్రుడు, యముడు కూడా ఇక్కడ ప్రభావితులుగా ఉన్నారని రచయిత అభిప్రాయపడుతూ, పై వాటన్నింటి కంటె మిన్నగా మీ దయను నేను కోరుతున్నాని సాయితల్లిని ప్రార్థిస్తున్నాడు.

| | | | |
|---|---|---|---|
| **8.** | మన సరస్వతీ | - | మనస్సు, వాగ్దేవి (మాట్లాడేశక్తి) |
| | చపల చిత్తతేహీ | - | బుద్దిమాంద్యత కూడా |
| | రుసో | - | చికాకుపరచినా |
| | వపుదిశాఖిలా | - | ఈ శరీరము, అన్ని దిక్కులు |
| | కఠినకాలతోహీ | - | కఠినమైన కాలప్రభావమూ |
| | రుసో | - | నాకు అనుకూలించకపోయినా సరే |
| | సకల విశ్వహీ | - | కనపడే ఈ విశ్వమంతా |
| | మయితుబ్రహ్మగోళా | - | ఇంకా నా లోపల దాగివున్న అండాండమంతా కూడా |
| | రుసో | - | నాకు వ్యతిరేకమయినప్పటికీ |

ఓ దత్తగురు సాయితల్లీ! ఈ ప్రపంచమూ, ఈ విశ్వమంతా మీరెరుగనిది కాదు. అంతటా సమానంగా వ్యాపించిన పరబ్రహ్మ స్వరూపా నా మాట వినుడు. నా మనస్సు మరియు నా యొక్క వాక్ శక్తి, నా బుద్ధిమాంద్యత నన్ను ఎంత చికాకుపరచినా, దానితో బాటు నా శరీరము, కఠినమైన కాలప్రభావము నాకు ఎంత అనుకూలించకపోయినా, కనపడే ఈ విశ్వమంతా మరియు నాలో అంతర్లీనంగా వుండే అండాండమంతా నాకు వ్యతిరేకంగా మారినప్పటికీ, నా సాయితల్లి మాత్రం నాకు ఎప్పుడూ అనుకూలమనే నా విశ్వాసం ఇంకా ఇంకా గట్టిపరుచమని వేడుకుంటున్నాను.

9. విమూఢహ్మాణునీ - తెలివి తక్కువ వాడనని నన్ను పిలిచినా
హసో - నవ్వినా
మత్సరా హీ - ద్వేషభావము
మజన డసో - నన్ను కాటువేయదు
పదాభిరుచి - తమ పాదపద్మములపై నాకున్న అభిరుచి
ఉల్హాసో - నాకు మరింత ఆనందాన్ని కల్గిస్తూనే ఉంటుంది
జనన కర్ధమీ - జన్మపరంపర అనబడే సంసారపు బురదలో
న ఫసో - నేను పడకుండా తప్పించుకుంటే చాలు
దృతి చా - నిజాయితీతో కూడిన ప్రవర్తన అనబడే
దుర్గం - కోట
న దసో - చితికిపోకుండా వుంటే చాలు
అశివిభావ - అమంగళకరమైన భావములు
మాగే ఖసో - వెనుకబడి నశించుగాక
ప్రపంచమనోహేరుసో - సంసారతాపత్రయంలో మనస్సు చిక్కుబడకుండా ఉండుగాక
దృఢ - గట్టిగా
విరక్తి - వైరాగ్య భావము
చిత్తీ - మనస్సునందు
ఠసో - చెరగని ముద్రవేయుగాక

| | | |
|---|---|---|
| 10. కృణాచిహీ | - | ఎవరిపట్లా |
| ఘృణానసో | - | ద్వేష భావము కలుగకుండుగాక |
| కశాచీ | - | దేనికొరకు గాని |
| స్పృహచ | - | నాలో ఇచ్ఛ (కోరిక) |
| న అసో | - | జనించకుండా ఉండుగాక |
| సాయీ | - | శ్రీ సాయిబాబా |
| హృదయీ | - | నా హృదయంలో |
| సదైవ | - | ఎల్లప్పుడూ |
| వసో | - | నివశించుగాక |
| మనసి ధ్యాని | - | నా మనస్సులోనూ నా ధ్యానంలోనూ |
| వసో | - | నివశించుగాక |
| పదీప్రణయ | - | నాకు సాయిపాదములపై గల ప్రేమ ప్రవాహము |
| వొరసో | - | ఆగకుండా ప్రవహించుగాక |
| నిఖిల దృశ్య | - | నాకు కనపడే ప్రతి దృశ్యమునందు |
| బాబాదిసో | - | బాబా ప్రత్యక్షమగుగాక |
| దత్తగురుసాయిమా | - | దత్తగురు సాయితల్లి |
| ఉపరి యాచనేలా | - | పైన పేర్కొనబడిన వినతులన్నీ |
| నరుసో | - | నెరవేర్చకుండా ఉండరుగాక (అనగా నెరవేర్చెదరుగాక అని అర్థం) |

ఓ దత్తగురు సాయితల్లి! మీ ముందు నేను అనేక విన్నపములు ఉంచితిని. అవిగాక ఇంకనూ నాలో మీపైగల ప్రేమ భక్తి ఎన్నటికీ తగ్గకుండా ఉండుట కొరకై చివరి వినతులచిట్టా మీకు సమర్పిస్తూన్నాను. దయతో ఇది గ్రహించుదురుగాక.

తెలివి తక్కువ వాడనని నన్ను ఎవ్వరైనా పిలిచినప్పటికీ లేదా చూసి ఎవ్వరైనా నవ్వినా, నన్ను ద్వేషభావము కాటు వెయ్యదు. కారణం, తమ

పాదపద్మములపై నాకున్న అభిరుచి అహంకారాన్ని నిర్మూలించి నాకు మరింత ఆనందాన్ని కల్గిస్తూ ఉండడమే. జన్మ పరంపర అనబడే సంసారపు బురదలో నేను పడకుండా తప్పించుకుంటే చాలు. నిజాయితీతో కూడిన ప్రవర్తన అనబడే నా కోట ఎన్నటికీ చిదికిపోకుండా వుంటే చాలు.

ఇంకనూ అమంగళకరమైన భావనలు నన్ను పట్టుకొనక వెనకకు మరలి నశించు గాక. సంసార తాపత్రయంలో నా మనసు చిక్కుబడకుండా వుండుగాక, వైరాగ్య భావము గట్టిగా నా మనస్సునందు చెరగని ముద్రవేయుగాక, ఇంకనూ ఎవరిపట్ల నాకు ద్వేషభావం కలుగకుండా వుండుగాక. దేనికొరకు గూడ నాలో కించిత్ ఇచ్ఛ (కోరిక) జనించకుండా వుండుగాక. శ్రీసాయిబాబా ఎల్లప్పుడూ నాలో నివసించుగాక. నా మనస్సులోనూ, నా ధ్యానం లోనూ ప్రత్యక్షమగుతూ వుండుగాక. నాకు సాయి పాదములపై గల ప్రేమ ప్రవాహము ఆగకుండా ప్రవహించుగాక. నాకు కనపడే ప్రతి దృశ్యము నందు బాబా ప్రత్యక్షమగుగాక. దత్తగురు సాయితల్లి ఎన్నటికీ పైన పేర్కొనబడిన వినతులన్నీ నెరవేర్చకుండా ఉండరుగాక. (అనగా నెరవేర్చెదరు గాక అని అర్ధం).

శ్రీ బాలకృష్ణ విశ్వనాథ్ దేవ్ రచించిన ఈ గురుప్రసాద యాచనా దశకం చక్కటి సంగీత పరమైన బాణీతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషమే మిటంటే ఈ పాటను **1940**లో వ్రాయగా, అంటే బాబా మహాసమాధి చెందిన **22** సంవత్సరాల తరువాత ఇది ఆరతి పుస్తకంలో చోటు చేసుకుంది. శ్రీ బి.వి.దేవ్ షిరిడి సంస్థానానికి ఎనలేని సేవ చేసి తరించారు. సంస్థానం వ్యవస్థాపక బృందంలో ఒకరైనారు. అంతేకాక మరాఠీ భాషలో వెలువడే శ్రీసాయిలీలా పత్రికకు ఎన్నో వ్యాసాలు వ్రాసి పేరు తెచ్చుకున్నారు. ఆయన కలం పేరు ‘బాబాంచెబాల్’ అనగా ‘బాబా బిడ్డ’ అని అర్ధం వస్తుంది. శ్రీ సాయి సచ్చరిత్రను వ్రాసింది శ్రీ హేమందిపంత్ అనబడే అన్నా సాహెబ్ దబోల్కర్ అని అందరకూ తెలుసు. కాని అంతటి మహత్తరమైన గ్రంథరాజం ఇంకా సంపూర్ణం అవకుండానే, **1929**లో శ్రీ హేమాదిపంత్ మరణించడం జరిగింది. అప్పుడు శ్రీసాయి సచ్చరిత్రను పూర్తిచేసే బాధ్యత బి.వి.దేవ్‌పై పడింది. బాబా అనుగ్రహంతో బి.వి.దేవ్, సచ్చరిత్రలోని చివరి **52,53**

అధ్యాయాలను పూర్తిచేసి శ్రీ హేమాదిపంత్‌కు ఆత్మశాంతి కల్గించిన వారయ్యారు.

"రుసోమమ ప్రియాంబికా, మజవరీ పితాహీ రుసో" అనబడే ఈ అద్భుతమైన గురుప్రసాదయాచన చాలా ఉద్రేకపూరితంగా నడుస్తూ వుంటుంది. ఇక్కడ ఉద్రేకపూరితమనే కంటే ఆవేదనాభరితంగా నడుస్తూ వుంటుంది అనడంలో లోతైన అర్థం స్ఫురిస్తుంది. 'అమ్మా అన్నం పెట్టు' అన్న కేకలో ఆకలి బాధ ఎలా స్ఫురిస్తున్నదో, అలాగే 'యాచన' అన్న మాట కూడా స్ఫురిస్తూ వుంటుంది. మన వాడుక భాషలో 'అమ్మ అయినా అడగందే అన్నం పెట్టదు' అని సామెతున్నది. అంటే అమ్మా అని యాచించాలి. అలాగే గురువును కూడా 'సద్గురూ...' అని యాచించాలి. అప్పుడే జ్ఞానమనే అన్నం దొరుకుతుంది. దాన్నే గురు ప్రసాదంగా స్వీకరించాలి. ఎందుకు? దానివల్లనే ప్రాపంచిక లేక భౌతిక బంధాల నుండి విముక్తి కోసం అని సమాధానం వస్తుంది. ఆ గురుప్రసాద మహిమ వల్ల సూక్ష్మాతి సూక్ష్మమైన అవరోధాలు తొలగిపోయి నిజమైన 'నేను అనబడే ఆత్మతత్త్వం మబ్బులు తొలిగితే బయటపడ్డ చందమామలా ప్రకాశించడానికి సిద్ధంగా వుంటుంది. అంతవరకూ మనసును ఆడించిన మాయాశక్తి స్వరూపమైన దేహభావం (నఖిలీ'నేను') నిర్వీర్యమై నిజమైన 'నేను'లో ప్రవిలాపనం చెందుతుంది. ఇదొక అద్భుతమైన అద్వైత సిద్ధాంత ప్రణాళిక.

'రుసోమమ ప్రియాంబికా మజవరీ పితాహీ రుసో' పాటలోని లయబద్ధమైన పద గమనం, శ్రవణానందకరంగా, జ్ఞానమూలాల్ని కదిల్చేదిగా, అలంకారిక భాషా సొగసుల్ని మూటగట్టుకొని అర్థయుక్తమైన ధ్వనిని అనుకరిస్తూ ముందుకు సాగుతుంది. ఇటువంటి శబ్ద పదగమనం, పాడేవారి హృదయాల్నే గాక వినే వారి శ్రవణేంద్రియాల్ని కూడా చల్లబరచి ఆధ్యాత్మిక పారవశ్యతను అనుభవానికి తీసుకు వస్తుంది. దీనికి భాషాజ్ఞానం వుండవల్సిన పనిలేదు.

**ఓం రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ**

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజ్‌కీ జై**

**ధూప్ ఆరతి సమాప్తం.**

ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 1

## (సంత్ తుకారం)

1. ఓ వాళూ ఆరతీ మా ఝ్యా సద్గురునాథా మాఝ్యా
సాయినాథా! పాంచాహీ తత్త్వాంచా దీపలావిలా ఆతా
నిర్గుణా చీ స్థితీ కైసీ ఆకారా ఆలీ బాబా ఆకారా ఆలీ
సర్వాఘటీ భరూని ఉరలీ సాయి మాఉలీ ॥

2. రజ తమసత్త్వ తిఘేమాయా ప్రసవళీ బాబా మాయా ప్రసవళీ
మాయా చియే పోటీ కైసీ మాయా ఉద్భవళీ ॥

3. సప్తసాగరీ కైసా ఖేల్ మాండీలా బాబా ఖేళ్ మాండీలా
ఖేలూనియా ఖేల్ అవఘా విస్తార కేలా ॥

4. బ్రహ్మాండీ చీరచనా కైసీ దాఖవిలీ డోళా
బాబా దాఖవిలీ డోళా ॥

5. తుకాహ్మణే మాఝూ స్వామీ కృపాళూ భోళా
ఓ వాళూ ఆరతీమా ఝ్యా సద్గురునాథా మా ఝ్యా
సాయినాథా! పాంచాహీ తత్త్వాంచీ దీపలావిలా ఆతా॥

☆ ☆ ☆

1. సద్గురు నాథా - ప్రియమైన సాయి సద్గురో
మాఝ్యా - మాచేత
ఓవాళూ ఆరతీ - ఆరతి సమర్పణకు అనుమతివ్వండి
పాంచా హి తత్త్వాంచా - ఐదు భూతములే ఐదు వత్తులుగా మారినవని భావిస్తూ
దీపలావిలా ఆతా - ఇప్పుడు ఈ ఆరతి దీపములు వెలిగించబడినవి
నిర్గుణాచీ స్థితి - ఏ గుణములు లేనటువంటి స్థితి
కైసీ ఆకారా ఆలీ - ఒక ఆకారము దాల్చి ఎట్లు కనపడుతున్నది
బాబా ఆకారా ఆలీ - అదే బాబా ఆకారంగా రూపుదిద్దుకుంది

| | | |
|---|---|---|
| సర్వాఘ టీ భరూని | - | ఆ స్థితి ఈ విశ్వాన్నంతటినీ నిండివున్నప్పట్టికీ |
| సాయిమా ఉలీ | - | సాయి తల్లిగా మాత్రమే |
| ఉరలీ | - | మనకందరకూ కనబడుతున్నది. |

ప్రియమైన ఓ సాయి సద్గురో! మా ద్వారా ఆరతి సమర్పణ జరుగుటకు దయచేసి అనుమతి ప్రసాదించండి. ఇది ఐదు వత్తులతో కూడిన పంచారతి. ఈ ఐదు వత్తులను పంచ భూతములుగా మేము భావిస్తున్నాము. పంచభూతములు అనగా భూమి జలము అగ్ని వాయువు ఆకాశము. ఇప్పుడు ఈ ఆరతి దీపము ఆ ఐదు వత్తులతో వెలిగించబడింది. గుణ రహితమైన ఒక అనిర్వచనీయ స్థితి ఇప్పుడు బాబా ఆకారంతో మాకు దర్శనమిస్తున్నది. ఈ మార్పు ఎట్లు జరుగుతున్నదో మాకు అంతుపట్టటం లేదు. అదే స్థితి ఈ విశ్వాన్నంతటినీ నిండివున్నప్పటికీ మనకందరకూ సాయి తల్లిగా మాత్రమే కనపడుతున్నది.

| | | |
|---|---|---|
| 2. రజ తమ సత్త్వ | - | రజస్సు తమస్సు సత్త్వము అనే |
| తిఘే | - | మూడు గుణాలు |
| మాయా ప్రసవళీ | - | మాయ అనబడే ప్రకృతి శక్తి నుండి ఉద్భవించినవి |
| మాయాచియే పోటీ | - | మాయ యొక్క గర్భంలో |
| కైసీ | - | ఏ విధంగా |
| మాయా | - | మాయ అనిపించే ఈ నామ రూప ప్రపంచం |
| ఉర్భవళీ | - | ఆవిర్భవించింది |

రజస్సు తమస్సు సత్త్వము అనబడే మూడు గుణాలు సృష్టి ఏర్పడడానికి కారణాలుగా వుంటున్నాయి. వీటినే ప్రకృతి గుణాలంటారు. అనగా మాయ అనబడే ప్రకృతి శక్తి నుండి ఉద్భవించాయి. మాయ యొక్క గర్భంలో ఇవి అవ్యక్తంగా దాగి ఉండి పరమాత్మ లీలా సంకల్పం వల్ల బయటపడి ఈ కనపడుతున్న నామ రూప ప్రపంచంగా ఆవిర్భవించాయి. ఇదే అంతుపట్టని రహస్యం.

| | | |
|---|---|---|
| 3. సప్తసాగరీ | - | సప్తసముద్రాలు |
| కైసాఖేల్ మాండీలా | - | ఏ విధంగా ఆటమొదలు పెట్టాయి |

| | | |
|---|---|---|
| ఖేలునియా ఖేల్ | - | ఈ విధంగా మాయ తన నాటకాలన్ని ఆడుతూ |
| అవగా విస్తారా | - | సమస్త విశ్వాన్ని |
| కేలా | - | తన ప్రభావం చేత ముంచెత్తింది |

ఇక్కడ కవి సప్తసముద్రాలు అని చెప్పిన మాట మన భూమ్మీద వుండే సముద్రాలని కాదు. పరమాత్మ సంకల్పం చేత మాయ తన నాటకాన్ని ఆడుతూ ఈ సమస్త విశ్వాన్ని మాయా ప్రభావం చేతముంచెత్తింది. సమస్త విశ్వమంటే, వ్యక్తమై కనపడుతున్న అండ పిండ బ్రహ్మాండాలన్నీ దానిలో కలిసే వుంటాయి.

ఇంక సప్తసాగరీ అన్నమాట గురించి విశ్లేషిస్తే, ఆ సాగరాలు ఏడు విధాలుగా ఉంటాయని

కవి భావన. 1) మహత్తు అని వర్ణించిన ప్రజ్ఞాన ఘనసాగరం 2) అహంకారం అనబడే ప్రకృతి వాసనా బలం రెండవ సాగరం 3) మనస్సు మూడవ సాగరం 4) జ్ఞానేంద్రియ శక్తులన్నీ కల్పివుంచినది నాలుగవ సాగరం 5) ప్రకృతికి వశమై మనుగడ కొనసాగిస్తున్న కర్మేంద్రియ సాగరం ఐదవది 6) శబ్ద స్పర్శ రూప రస గంధాలనబడే తన్మాత్రపంచకం ఆరవ సాగరం 7) స్థూల భూత పంచకమనబడే ఏడవ సాగరం. దీంట్లోనే భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం సృష్టిలోని జీవుల దేహాలు ఏర్పడ్డానికి దోహదం చేస్తూవుంటాయి. సప్త సాగరీకైసా ఖేలీ మాండిలా అన్న వాక్యంలో ఇంత అంతరార్థం దాగివుంది.

| | | |
|---|---|---|
| 4. బ్రహ్మాండీ చీ రచనా | - | అండపిండ బ్రహ్మాండములు కల్గిన ఈ విశ్వం యొక్క రచనా వైచిత్ర్యం |
| కైసీ | - | ఏవిధంగా వున్నదో |
| దాఖవిలీ డోళా | - | నాకంటికి అగుపడునట్లు చూపెడుతున్నారు |

నా సద్గురువులు, ఈ అండ పిండ బ్రహ్మాండములు కల్గిన విశ్వం యొక్క రచనా వైచిత్ర్యం ఏవిధంగా వున్నదో నాకంటికి అగుపడునట్లు చూపెడుతున్నారు.

| | | |
|---|---|---|
| 5. తుకాహ్మణే | - | సంత్ తుకారాం మహరాజ్ చెపుతున్నాడు |
| మాఝూ స్వామీ | - | నాసద్గురువులు |
| కృపాళూ | - | ఎంతో దయామయులు |

బోళా - ఇంకా ఎంతో అమాయకులు

సంత్ తుకారాం మహరాజ్ తన సద్గురువు యొక్క లక్షణాల్ని ఈవిధంగా వర్ణిస్తున్నాడు. నా సద్గురువులు ఎంతో దయామయులు. అంతేకాక ఆయన అమాయకులు కూడ. ప్రియమైన ఓ సద్గురూ! మా ద్వారా ఆరతి సమర్పణ జరుగుటకు అనుమతించుడు. ఈ ఆరతి సాయి నాథుల పరంగా కూడా పాడుతూ ఆరతి సమర్పణ ఒక ఆనవాయితీగా స్థిరపడిపోయింది. పంచభూతములే ఐదువత్తులుగా మారినవని భావిస్తూ ఇప్పుడు ఈ ఆరతి దీపములు వెలిగించ బడినవని ప్రార్ధన చేస్తున్నారు.

షిరిడి ఆరతుల జాబితాలో చేరి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని దక్కించుకున్న సంత్‌తుకారం మహరాజ్ అభంగం ఇది. విశ్వసృష్టి రహస్యాలను ఛేదించడానికి కవీశ్వరుడు పడే తపన ఇందులో కనపడుతుంది. సంత్‌తుకారాం ఇతర మహరాష్ట్ర సంత్‌ల కోవకు చెందిన అద్వైత సిద్ధాంత ప్రణాళికలకు కొంత మేరకే కట్టుబడిన మహానుభావుడు. అందుకే సాంఖ్యము యోగము కలయికలతో కూడుకున్న చైతన్య తత్త్వంపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ వుండేవాడు.

అద్వైత సిద్ధాంతం మాయావాదాన్ని ఒప్పుకుని తీరాలంటుంది. ఎందుకంటె కల్మ షరహితమైన బ్రహ్మ పదార్ధం మాయా శక్తి ప్రేరణ చేత ప్రపంచంగా ప్రదర్శితమవుతోందని అనగా ఆభాసగా (వీవతీవ ఖజాజామఖతీవఅఆవ) కనపడుతోందని హేతు దృష్టాంతాలతో నిరూపిస్తుంది. అందుచేత ఈ ప్రపంచం తాత్కాలికంగా ఆరోపితమైనదే తప్ప, వాస్తవికం కాదని దాని వాదన. మరి మన కంటికి ప్రత్యక్షంగా కనపడుతున్నది కదా! అని అడిగితే, అది కేవలం అజ్ఞానం చేత మాత్రమే అంటుంది.

అయితే మాయావాదాన్ని తుకారాం సంపూర్ణంగా అంగీకరించకపోవడం వల్లనే తన అభంగాల్లో ప్రపంచం వాస్తవమా? కాదా? అన్న విషయంలో సగం నిజం వుందని ప్రస్తావిస్తూ వున్నారు. ఇక ప్రస్తుత అభంగ విషయానికొస్తే తుకారం మాయను ప్రకృతికి పర్యాయపదంగా పేర్కొన్నారు. ప్రకృతి అంటే ప్రత్యక్షంగా అనుభవానికి వచ్చే ప్రధాన ద్రవ్యరాశి. తుకారాం చేసిన ఈ వివరణ వేదాంతపరమైన సిద్ధాంతాలకు పెద్ద వ్యతిరేకమేమీ కాదు. ఎందుకంటే

శ్వేతాశ్వతర ఉపనిషత్తులో కూడ 'మాయాంతు ప్రకృతిం విద్ధి' అని ఉంది. అనగా అద్వైతం చెప్పే మాయే ఈ కనబడుతున్న ప్రకృతి అని అర్థం వస్తుంది. ఇంకా ఈ మాయ లేక ప్రకృతికి మూల కారణం ఆ పరబ్రహ్మ స్వరూపం లేక పరమాత్మయే అని చెప్తుంది.

సాంఖ్యమత సిద్ధాంతం మాత్రం ప్రకృతికే పెద్దపీట వేస్తుంది. ప్రకృతి గుణాలైన సత్త్వం రజస్సు తమస్సుల సమతుల్యత వల్ల, ప్రకృతి బ్రహ్మ పదార్థంతో ఎడబాటు చెందక నిశ్చలంగా ఉండగల్గిందని, కాని ఆ సమతుల్యతకు భగం ఏర్పడిన కారణంగా నిరపేక్షమైన బ్రహ్మ పదార్థంలో (Absolute) కొంత భాగం సాపేక్షంగా (Relative) మారి అనగా బ్రహ్మాండం లేక మహత్తుగా మారి తదుపరి అనేక పిండాండాలుగా చెదిరి ప్రపంచ రూపాన్ని సంతరించుకున్నదని చెప్తుంది. ఈ రకమైన సాంఖ్య సిద్ధాంతానికి ఒక రూపకల్పన చేసి తుకారం మహాశయుడు ప్రస్తుత అభంగంలో ఇదంతా పరమాత్మ ఆడిన ఒక నాటకంగాను, ఒక లీలగాను అభివర్ణించాడు.

ఆధ్యాత్మికానికి గురుతుగా పంచ భూతాల్లోని జలరాశి లేక మహా సముద్రాన్ని చూపెడుతూ వుంటారు. ఇప్పుడు తుకారాం ఆ జలరాశిని వ్యవహారంలో చెప్పుకునే సప్త సముద్రాలుగా పేర్కొంటున్నాడు. ఇవే భగవంతుడి చేత ఆడబడే విశ్వసృష్టి అనబడే నాటక రంగానికి సప్త సముద్రాలు సప్తవేదికలుగా వర్ణించాడు.

ఇప్పుడు సృష్టి క్రమం ఎక్కడ నుంచి ఎక్కడకు మారింది? ప్రధాన రంగస్థలమైన ప్రకృతి ఒడి నుండి క్రిందకు జారి ఏడు వేదికలను ఏర్పాటు చేసుకుంది. సాంఖ్య మతాన్ననుసరించి సృష్టిక్రమంలోని ఏడు భూమికలను ఇలా వర్ణించారు. 1) మహత్తు 2) అహంకారం 3) మనస్సు 4) పంచజ్ఞానేంద్రియాలు 5) పంచకర్మేంద్రియాలు 6) పంచభూతాలైన ఆకాశం వాయువు అగ్ని నీరు భూమి. 7) పంచతన్మాత్రలైన శబ్ద స్పర్శరూప రస గంధాలు. నిరాకారమైన విశ్వచైతన్యం నుండి నామ రూపాత్మకమైన ఈ సృష్టి ఏవిధంగా ఏర్పడిందో తుకారం చెపుతున్నాడు. తంత్ర పూరితమైన చిక్కుముడితో ఏర్పడ్డ సృష్టి క్రమమంతా పరమాత్మ యొక్క లీలా విశేషం. అత్యంతంత ఆకర్షణీయంగా కనపడుతున్న ఈ సృష్టిని ప్రతి వారూ విచారణ చేయవల్సివుంది. కాని భగవంతుణ్ని తగు విధంగా ప్రార్థించి అనుగ్రహం సంపాదించి మాత్రమే ఇది సాధ్యపడు తుందని తుకారాం భావనలోని అంతరార్థం.

ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 2

## (ఆరతి జ్ఞాన రాయాచీ)

## శ్రీరామ జనార్ధన స్వామి

1. ఆరతి జ్ఞానరాజా మహా కైవల్య తేజా
సేవితి సాధుసంతా మను వేధలా మాఝూ
లోపలే జ్ఞాన జగీ హిత నేణతీ కోణీ
అవతార పాండురంగ నామతేవిలా జ్ఞానీ
ఆరతి జ్ఞానరాజా మహాకైవల్య తేజా
సేవితి సాధుసంతా మను వేధలా మాఝూ ॥

2. కనకాచే తాటకరీ ఉభ్యా గోపికా నారీ
నారద తుంబురహో సామ గాయన కరీ
ఆరతి జ్ఞానరాజా మహా కైవల్య తేజా
సేవితి సాధుసంతా మనువేధలా మాఝూ ॥

3. ప్రగట గుహ్యాబోలే విశ్వబ్రహ్మేచి కే లే
రామ జనార్ధనీ పాయీ మస్తకఠేవిలా
ఆరతి జ్ఞానరాజా మహా కైవల్యతేజా
సేవితి సాధుసంతా మను వేధలా మాఝూ ॥

⋆ ⋆ ⋆

| | | |
|---|---|---|
| 1. ఆరతి జ్ఞానరాజా | - | మూర్తీభవించిన జ్ఞాన స్వరూపుడా సంత్ జ్ఞానేశ్వర్ మహరాజా । మీ కొరకై ఈ ఆరతి సమర్పించుకొనుచున్నాను. |
| మహాకైవల్యతేజా | - | మోక్ష సామ్రాజ్యమును అధిష్టించినవారా |
| సేవితి సాధుసంతా | - | మహాపురుషులైన సంత్‌లు సాధువులు మిమ్ములను సేవించెదరుగదా |

| | | |
|---|---|---|
| మనువేధలామార్ఝా | - | నా యొక్క మనస్సును ఆద్యంతము ఆక్రమించుకొని మీ పాలనలో కొనసాగేటట్లు చేసితిరిగదా! |
| లోపలే జ్ఞానజగీ | - | ఈ లోకంలో ఆధ్యాత్మిక జ్ఞానం అడుగంటి పోయినది |
| హితనేణతీకోణీ | - | ఎవరూ దాని అవుసరాన్ని గుర్తించటం లేదు. |
| అవతార పాండురంగ | - | ఆ పరిస్థితుల్లో భగవాన్ పాండురంగడే అవతరించి |
| నామతేవిలా జ్ఞానీ | - | జ్ఞానేశ్వర్‌గా నామాన్ని పెట్టుకున్నాడు. |

| | | | |
|---|---|---|---|
| 2. | గోపికా నారీ | - | గోపికా స్త్రీ జనమంతా |
| | కరీ | - | వారి వారి చేతుల్లో |
| | కనకా చేతాట | - | బంగారు పాత్రలు పట్టుకుని |
| | ఉభ్యా | - | మిమ్ములను పూజించుటకొరకై నిలుచుని ఉన్నాను. |
| | నారదతుంబురహో | - | నారద తుంబురులు |
| | సామ గాయన కరీ | - | సామ గానము చేయుచున్నారు. |

మూర్తీభవించిన జ్ఞానస్వరూపుడా! సంత్ జ్ఞానేశ్వర్ మహారాజా! మీ కొరకై ఈ ఆరతి సమర్పణ జరుగుతున్నది. మీరు మోక్ష సామ్రాజ్యమును అధిష్ఠించిన మహాపురుషులు. ఎందరో సాధుసంత్ మహానుభావులు మిమ్ములను సేవించుచుందురు గదా. తమ ప్రజ్ఞా విశేషముచే మా మనస్సులను ఆద్యంతము ఆక్రమించుకొని మీ పాలనలో కొనసాగేటట్లు చేసితిరి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆధ్యాత్మిక జ్ఞానం లోకంలో అడుగంటి ఉన్నది. కాబట్టే భగవాన్ పాండు రంగడే స్వయంగా అవతరించి జ్ఞానేశ్వర్‌గా పేరు పెట్టుకున్నాడని మేము విశ్వసిస్తున్నాము. గోపగోపికా జనమంతా బంగారుపాత్రలు చేతుల్లో పట్టుకుని మీ పూజ కొరకు నిలుచుని ఉన్నారు. ఇక దేవ గంధర్వ గాయకులైన నారదతుంబురులు మిమ్ము పొగడుతూ సామగానము ఆలపిస్తున్నారు.

| | | | |
|---|---|---|---|
| 3. | ప్రగట | - | దృష్టికి జగత్తుగా తోచుచున్న |
| | గుహ్యా | - | అత్యంత రహస్యమైన విషయమును |

| | | |
|---|---|---|
| బోలే | - | జ్ఞానస్వరూపులైన మీరు జనులకు వివరించగల్గిరి |
| విశ్వ | - | ఈ జగత్ స్వరూపమును |
| బ్రహ్మేచి | - | బ్రహ్మాత్మ స్వరూపమును |
| కేలే | - | స్వయంగా అనుభవానికి తెచ్చుకున్న మీకు |
| రామ జనార్ధనీ | - | శ్రీరామ జనార్థన్ అను పేరు గల నేను |
| పాయీ | - | తమ పాదములపై |
| మస్తకఠేవిలా | - | నా నుదిటిని పెట్టుచున్నాను. |

జ్ఞానస్వరూపులైన ఓ జ్ఞానేశ్వర్ మహారాజ్! వివర్తమానమైన లేక వ్యక్తమగుచున్న లేక దృష్టికి గోచరించుచున్న అత్యంత రహస్యమైన సృష్టి విషయమును జనులకు అతి సులువుగా చెప్పగల్గిన మీరు అవతార పురుషులు. మీరు ఈ జగత్తు స్వరూపమును, ఇంకనూ త్రిపుటిని తనలో కరిగించుకున్న బ్రహ్మాత్మ స్వరూపమును స్వయముగా అనుభవమునకు తెచ్చుకున్నవారు. శ్రీరామ జనార్థన్ అను పేరుగల నేను తమ దయకుపాత్రుడనగుట కొరకై నా నుదిటిని తమ పాదపద్మముల వద్ద పెట్టి నమస్కరించుచున్నాను.

సంత్ జ్ఞానేశ్వర్ మహారాజు **1275-1296** మధ్య కాలంనాటి మహాయోగీశ్వరులు. మహారాష్ట్ర దేశం మొత్తం మీద మహాఖ్యాతి గడించిన సంత్ మహాశయుల్లో ఇంతటివారు ఇక లేరనే చెప్పుకోవాలి. మహారాష్ట్రలోని ప్రముఖమైన వారకారీ ఉద్యమానికి జ్ఞానేశ్వర్ ఆది గురువుగా ఎంచబడతారు. కాబట్టి వారకారీ సంత్‌లందరూ జ్ఞానేశ్వర్ మహారాజ్‌కు ఎప్పుడూ నివాళు లర్పిస్తూ వుండేవారు. అదే క్రమాన్ని శ్రీసాయినాథ్‌లు కూడా ఆచరించడం ఇక్కడ గమనించదగిన విషయం. శ్రీసాయినాథులు దేహధారులై ఉండగా సంత్‌తుకారాం, సంత్ జ్ఞానేశ్వరులు పేరు మీద ఆరతి సమర్పణ చేసేటప్పుడు బహు వినమ్రులై ముఖుళిత హస్తాలతో కనపడేవారని చెపుతూ వుంటారు. దీనివల్ల ఆ పరమ భాగవతోత్తముల పట్ల బాబాకున్న అత్యంత భక్తి గౌరవాలు ఎంతపాటో అర్థమవుతుంది. ఈ ఆరతి పాటను వ్రాసిన శ్రీరామజనార్థన స్వామి పరమ భక్తాగ్రేసరులైన సంత్ జనార్థనస్వామి **(1504-1575)** ప్రముఖులైన

ముగ్గురు శిష్య వర్గంలో మొదటివారు.  మిగతా శిష్యుల్లో ఒకరు శ్రీ ఏక జనార్ధని (ఈయనే బాగా పేరు పొందిన ఏకనాథ్ మహరాజ్). రెండవ వారు శ్రీ జ్ఞాని జనార్ధని. ఈ ముగ్గురు శిష్యులు వారివారి పేర్లను తమ గురునామంతో కలుపుకుని పెట్టుకున్నారు. వారందరూ చేసే రచనా వ్యాసంగ మంతా వారిది కాదని, వారి గురువు చేసిందేనని చెప్పేవారుట. అంతేకాక గురువు చేతిలో తాము పనిముట్లు వంటి వారమని చెప్పి గురువుపై తమకున్న భక్తి విశ్వాసాల్ని, గౌరవ ప్రపత్తులను వెల్లడించేవారు.



ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 3

## (తుకారాం ఆరతి)

## శ్రీ రామేశ్వర భట్

1. ఆరతి తుకారామా స్వామీ సద్గురు ధామా
సచ్చిదానందమూర్తి పాయ దాఖవీ ఆహ్మా
రాఘవే సాగరాత జైసే పాషాణ తారిలే
తైసే హే తుకోబాచే అభంగ ఉదకీ రక్షిలే ॥
ఆరతి తుకారామా స్వామీ సద్గురు ధామా
సచ్చిదానందమూర్తి పాయ దాఖవీ ఆహ్మా ॥

2. తుకితా తులేనేసీ బ్రహ్మతుకాసి ఆలే
హ్మణోని రామేశ్వరే చరణీ మస్తకఠేవిలే
ఆరతి తుకారామా స్వామీ సద్గురుధామా
సచ్చిదానందమూర్తి పాయ దాఖవీ ఆహ్మా ॥

⋆ ⋆ ⋆

1. స్వామీ సద్గురుధామా - ఓ సద్గురు వర్యా! సద్గురువులందరికీ కేంద్ర స్థానమా!

తుకారామా - ఓ సంత్ తుకారాం మహారాజ్

సచ్చిదానందమూర్తి - మీరు సచ్చిదానంద స్వరూపులై వున్నారు

పాయ దాఖవీ ఆహ్మా - తమ పాద దర్శనము కలుగజేయుడు

ఆరతి - ఈ ఆరతి తమకు సమర్పించుతున్నాము

ఓ సంత్తుకారాం మహరాజ్! ఓ సద్గురువర్యా! ఈ ఆరతి తమకు సమర్పించు కొనుచు న్నాము. తమరు సద్గురువులందరికీ కేంద్ర స్థానముగా వున్నారు. ఇంకనూ మీరు సచ్చిదానంద స్వరూపులు అనగా పరబ్రహ్మ స్వరూప

లక్షణాలను కల్గిన సత్ చిత్ ఆనంద స్వరూపులు. దయచేసి మాకు తమ యొక్క పాదారవిందముల దర్శనము కలుగజేయుము.

| | | |
|---|---|---|
| రాఘవే | - | శ్రీరామచంద్రుడు |
| సాగరాత | - | మహాసముద్రంలో |
| జైసే | - | ఏవిధంగా |
| పాషాణతారిలే | - | శిలలను పైకి తేలునట్లు చేసెనో |
| తైసే | - | ఆవిధంగానే |
| తుకోబాచే | - | సంత్ తుకారాం మహరాజ్ కూడా |
| హే అభంగ | - | వారి అభంగములను |
| ఉదకీ రక్షిలే | - | నది నీటిలో మునగకుండా రక్షించెను |

సంత్ తుకారాం మహరాజ్ యొక్క గొప్ప దనాన్ని వర్ణిస్తూ శ్రీరామేశ్వర భట్, శ్రీరాముడు వానర సైన్యంతో కలిసి సముద్రానికి వారధి కట్టడం గుర్తు తెచ్చుకుంటున్నాడు. శ్రీరాముడు మహాసముద్రంలో ఏవిధంగా శిలలను పైకి తేలునట్లు చేసెనో అదే విధంగా సంత్తుకారాం మహరాజ్ కూడ వారు వ్రాసిన అభంగ కవిత్వపు తాళపత్ర గ్రంధాలన్నింటినీ నది నీటిలో మునిగి పోకుండా రక్షించగలిగాడని కథ చెపుతున్నాడు. ఈ విషయం మరింత విపులంగా తరువాయి పేజీల్లో వస్తుంది.

| | | |
|---|---|---|
| 2. బ్రహ్మే | - | పరబ్రహ్మ స్వరూపమును |
| తుకాసి | - | సంత్ తుకారాం మహరాజుతో |
| తుకితా | - | పోల్చి చూసినచో |
| తులనేసీ | - | ఆ పోలికను నిజం చేయుటకై |
| ఆలే | - | ఆ పరబ్రహ్మమే తుకారాం స్థాయికి దిగిరావల్సి ఉండునేమో! |
| హ్మణోని | - | అందువల్లనే |
| రామేశ్వరే | - | రామేశ్వర భట్ |

| | | |
|---|---|---|
| చరణీ | - | తుకారాం మహరాజ్ పాదములకు |
| మస్తక | - | తన నుదుటి భాగాన్ని |
| ఠేవిలే | - | ఆనించిపెట్టి నమస్కరిస్తున్నాడు |

ఇప్పుడు కవి శ్రీరామేశ్వర భట్‌కు సచ్చిదానంద స్వరూపమై వెలుగొందే ఆత్మతత్త్వము గుర్తుకొచ్చింది. దాన్నే పరమాత్మ అనీ పరబ్రహ్మ స్వరూపమనీ కీర్తిస్తారు. తనకు సద్గురు వైన సంత్ తుకారాం మహరాజ్‌ను పరబ్రహ్మ స్వరూపంతో పోల్చి చూద్దామన్న ఆలోచన తట్టింది. అది నిజం కావాలంటే సాక్షాత్తు పరబ్రహ్మమే తుకారాం స్థాయికి దిగిరావల్సి ఉండునేమో! అనుకుని వెంటనే సద్గురు పాదకమలాలకు తన నుదుటి భాగం ఆనించి పెట్టి నమస్కరించాడు. ఓ సంత్ తుకారాం మహరాజ్ ! ఓ సద్గురువర్యా! ఈ ఆరతి మీకు సమర్పించుకుంటున్నాను అని స్తుతిస్తూ ఆరతి సమర్పణ గావించాడు.

ఈ సందర్భంలో శ్రీరామేశ్వరభట్ జీవిత విశేషాలు తెలుసుకుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఈ మహనీయుడు తుకారాం శిష్యవర్గంలో ప్రముఖుడు. ఇతని వంశీకులు కర్ణాటక రాష్ట్రం నుండి వలసపోయి మహారాష్ట్రలోని పూనేకు దగ్గరలోవున్న వఘోలీ అనే ప్రాంతంలో స్థిరపడ్డారు. రామేశ్వరభట్ గొప్ప వేదపండితుడు. గొప్ప శివోపాసకుడు. వారి కులదైవం వ్యాఘ్రేశ్వరుడు. శివుడికి వ్యాఘ్రేశ్వరుడు అని పేరు ఎందుకు వచ్చిందో తెలపడానికి మన తెలుగునాట ఒక కథ ఉంది. పూర్వం అభయారణ్య ప్రాంతమైన తూర్పు గోదావరి తీర ప్రాంతంలో శివభక్తుడైన ఒక బ్రాహ్మణుడిని ఒక పులి (వ్యాఘ్రం) వెంట తరిమింది. అతడు భయంతో అక్కడే వున్న బిల్వవృక్షం (మారేడు చెట్టు) ఎక్కి కూర్చున్నాడు. ఆ పులి కూడా ఆ చెట్టు క్రిందే తిష్టవేసింది. బ్రాహ్మణుడు ఆ రాత్రంతా 'ఓం నమశ్శివాయ' అని జపం చేస్తూ మారేడు దళాలు తెంపి క్రింద పడవేస్తూ కాలక్షేపం చేసాడు.

తెల్లవారి చూస్తే ఆ మారేడు దళాల కుప్ప కింద పులి కప్పడినట్లు గమనించి, అది కదలక నిద్రపోతోందేమోనని నెమ్మదిగా చెట్టు దిగి ఊర్లోకి పారిపోయాడు. బ్రాహ్మణుడు చెప్పిన విషయం విని గ్రామస్థులందరూ పులిని

చంపడానికి కర్రలు కత్తులు తీసుకుని గుంపులుగా బయలుదేరారు. తీరాచూస్తే మారేడు దళాల కుప్పక్రింద పులికి బదులు ఒక శివలింగం దర్శనమిచ్చింది. ఒక పులి శివలింగంగా మారిన ప్రాంతం కాబట్టి దానికి వ్యాఘ్రే శ్వరం అనీ, పులిని వేటాడిన ఊరు కాబట్టి పులివేట ఊరు అని పేరు వచ్చింది. కాలక్రమేణా ఆ పులివేట ఊరే పుల్లేటికుర్రుగా రూపాంతరం చెందింది. అక్కడ ప్రధాన దైవాన్ని వ్యాఘ్రేశ్వర స్వామి అంటారు. ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలంలో వున్న పుల్లేటికుర్రులో వుంది.

ఇంక ప్రస్తుతాంశానికి వస్తే సంత్‌తుకారాం కాలం నాటికి జాతి మత కుల వివక్షత బాగా వేళ్ళూనుకుని వుంది. వేద సాంప్రదాయం అన్నది బ్రాహ్మణులకు తప్ప వేరెవ్వరికీ చెందవన్న నియమాలు నడుస్తూ వుండేవి. ఆ నియమాల్ని భంగపరిస్తే దైవద్రోహం క్రింద పరిగణించేవారు. ఆ పరిస్థితుల్లో శూద్రకులానికి చెందిన తుకారాం తన అభంగ రచనలతో దర్మోపదేశ కవితా ఝురిని వర్షంలా కురిపించి బ్రాహ్మణులందరూ ఆశ్చర్యపోయేటట్లు చేశాడు. అచిరకాలంలోనే భక్తి ప్రచారకుడిగా పేరు తెచ్చుకున్నాడు. కళ్ళు కుట్టుకున్న సనాతన ధర్మ పరాయణులనిపించు కున్న వారందరూ తిరగపడదామని ప్రయత్నించారు. వారి ధోరణికి అడ్డుకట్ట వేస్తూ తుకారాం తన శిష్య వర్గంలో బ్రాహ్మణులను కూడా చేర్చుకున్నాడు. ఆ పరిస్థితి చూసిన బ్రాహ్మణులకు కోపం మరింత ఎక్కువయ్యింది. తుకారాం బ్రాహ్మణ శిష్యుల్లో ఒకరైన బహునీ బాయి ఇలా వ్రాసుకొచ్చారు. "తుకోబా (సంత్ తుకారాం) కీర్తనలు తక్కువ రకమేమీ కాదు. అంతరార్థం గ్రహించగలిగితే మాత్రం అవన్నీ వేదాలకు తాత్పర్యాలే అని రూఢి అవుతుంది. కాబట్టి బ్రాహ్మణులమని విర్రవీగే వాళ్ళందరూ తుకోబా పాదాలను ఆశ్రయించవలసి వుంటుంది". ఇదంతా విపరీతపరిణామని గగ్గోలు పెట్టిన బ్రాహ్మణ పెద్దలు కొందరు పూనేలో ఉన్న బ్రాహ్మణ సభాధ్యక్షుల వారికి ఫిర్యాదు చేశారు. రామేశ్వర్ భట్ కూడా అప్పటికి బ్రాహ్మణ దృక్పదం మేరకే నడుచుకోవాలని నిర్ణయానికొచ్చాడు. ఇంతలో బ్రాహ్మణ సభవారు తమ తీర్మానాన్ని వెలువరించారు. తుకారాం రచనలన్నీ వేదసాంప్రదాయానికి విరుద్ధమని, కాబట్టి స్వయంగా తుకారామే తన చేతుల్తో అభంగ గ్రంథాలను తీసుకువెళ్ళి దగ్గరలో వున్న నదిలో పారవేయాలని శాశించారు. ఆ రోజుల్లో అదే పెద్ద తీర్పుగా నిలిచింది.

ఇక చేసేది లేక బ్రద్దలైన హృదయంతో తుకారాం అభంగ గ్రంథాలనన్నింటిని నెత్తిన పెట్టుకుని దగ్గరలో వున్న ఇంద్రాణి నదిలో పారవేసి వచ్చి నది ఒడ్డునే అన్నపానాలు మాని భగవంతుణ్ని ధ్యానిస్తూ కూర్చున్నాడు. అలా పన్నెండు రోజులు గడిచాయి. పదమూడవ రోజున ప్రజలందరూ చూస్తూ వుండగానే నదీ గర్భం నుండి అభంగ గ్రంథరాశి మొత్తం యధాతదంగా నీటి మీద తేలుతూ ఒడ్డుకు తడి ఏ మాత్రం లేకుండా పొడిగా చేరింది. ప్రజలందరూ జయ జయ ధ్వానాలు చేస్తూ తుకారాం ముందుకు వచ్చి చేరారు. ఇది బ్రాహ్మణ తీర్పుని తుడిచిపెట్టేసి తుకారాం అభంగాలు సత్యమైనవన్న భగవంతుని తీర్పును నిరూపణ చేసి చూపెట్టింది. ఇదొక్కటే కాక తుకారాం గొప్పతనాన్ని ఇంకెన్నో విచిత్ర సంఘటనలు కూడా ఋజువు చేసాయి. అప్పుడు రామేశ్వభట్‌కు కనువిప్పు కలిగింది. తుకారాం పట్ల తనకున్న అభిప్రాయాలను మార్చుకుని శిష్యుడయ్యాడు. ఇంద్రాణి నదిలో తుకారాం అభంగాలు పైకి తేలే అద్భుత దృశ్యాన్ని తన ఆరతి పాటలో పొందుపరచాడు.

ప్రస్తుత తుకారాం ఆరతి పాట పైకి చూడటానికి ఒక సాధారణ పాటలా కనపడినా అంతకంతకు లోనికి తరచి చూడగా చాలా విషయాలను అర్థయుక్తంగా స్ఫురింపచేస్తుంది. తుకారాం ప్రధానంగా 'చైతన్య' అన్న పేరుతో కూడిన సాంప్రదాయానికి చెందిన మహానుభావుడు హిందూదేశంలో ప్రధానమైన ధార్మిక సంప్రదాయాలన్నీ దత్తాత్రేయ బీజ నామంతో అభివృద్ధి చెందాయి. అయితే చైతన్య సాంప్రదాయస్థులు కూడ దత్తాత్రేయుడిని తమ ఆది గురువుగా పరిగణిస్తారు. కాబట్టే గురుపరంపర విధాన ప్రకారం చూస్తే ప్రధాన సాంప్రదాయాలన్నీ కూడ ఈ వరుసక్రమంలో దేనితోనైనా సంబంధం కలిగి వుంటాయి. అవి ఏమిటంటే దత్తాత్రేయ, శివచైతన్య, రాఘవ చైతన్య, కేశవ లేక బాబాజీ చైతన్య.

తుకారాం గురువు కూడ చైతన్య సాంప్రదాయానికి చెందినవారైనప్పటికీ, తుకారాం మాత్రం వారకరీ సాంప్రదాయానికి చెందిన వారిగ కనపడుతూ వుంటారు. ఆ సాంప్రదాయంలో మనకు కనపడే ముఖ్యులు జ్ఞానేశ్వర్ మహరాజ్, సచ్చిదానంద బాబా విశ్వంభర్, రాఘవ చైతన్య, కేశవ చైతన్య, బాబాజీ చైతన్య మరియు తుకారాం మహరాజ్.

భక్తిమార్గంలో నిష్ణాతుడైన భక్తుడు ప్రతి సమయంలోనూ తన గురు పరంపరను తులచుకుంటూ వుంటాడు. అందుకే ప్రస్తుత ఆరతి పాట కవి శ్రీ రామేశ్వరభట్ కూడ ఒక భక్త శిఖామణి కాబట్టి తన గురుపరంపరను అతి నేర్పరితనంగా చక్కటి కథా రూపంలో వివరి స్తున్నాడు. తన గురువును కలవడానికి బయలుదేరిన ఈ భక్తుడు ముందుగా సద్గురు ధామంలో ప్రవేశించాడు. ఆయన గురువు సంత్ తుకారం కాబట్టి గురు పూజకు సిద్ధమయ్యాడు. కానీ అక్కడ చూస్తే తుకారాంతోబాటు పూర్వ గురుపరంపర అంతా అక్కడే వున్నారు. కాబట్టి అక్కడున్న వారందరికీ ముందు నమస్కారాలు చేయ సంకల్పించి ముందుగా భగవాన్ దత్తాత్రేయుల వారికి వంగి నమస్కరించాడు. భగవాన్ దత్తాత్రేయులు భారత ఆధ్యాత్మిక ప్రపంచానికంతకూ సద్గురువుగా వున్నారు. ఆయన దత్తనామం కూడ సద్గురువుకు ప్రత్యామ్నాయంగా వాడబడు తోంది. ముఖ్యంగా మహారాష్ట్ర దేశంలో వెలసిన సద్గురువులందరూ భగవాన్ దత్తాత్రేయుల పూర్ణావతారాలుగా గాని, అంశావతారాలుగా గాని పేరుపొంది వున్నవారే. ఆ తరువాత సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్ కనపడ్డారు. సద్గురుణవమ అన్న పేరు వాడుకలో వున్నటువంటి సంత్ (వారకరీ) పురాణ సాహిత్యం లేక కవిత్వంలో 'శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్'కు సంబంధించినదిగా వుంది. ఆ విధంగా జ్ఞానేశ్వర్ మహరాజ్‌కు నమస్కరించిన తరువాత రామేశ్వరభట్‌కు కనపడిన వారు శ్రీ సచ్చిదానంద బాబా. ఈయన సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్‌కు శిష్యులు. సచ్చిదానంద బాబానే సచ్చిదానంద మూర్తీ అని సంభోదిస్తున్నాడు. అటు తరువాత వారి శిష్యులైన శ్రీ రాఘవ చైతన్యకు నమస్కరించాడు. వీరినే 'రాఘవసాగ రాత' అని పిలుస్తున్నాడు. తరువాత తన గురువైన పరమ గురువు బాబాజీ చైతన్య వారిని బాచే అని గౌరవంగా పిలుస్తూ, తన గురువు తుకారాంను కూడా తుకా అని పిలుస్తున్నాడు.

ఈ సందర్భంలోనే శ్రీరామాయణంలో సేతువు నిర్మించడం గురించి గుర్తు చేస్తున్నాడు. శ్రీరామనామ మహత్యం వల్ల పెద్దపెద్ద బండరాళ్ళు సైతం నీట మునగకుండా తేలిపోయి బయటకొచ్చేసాయి. ఈ సంసారసాగరంలో మనందరం మునిగిపోకుండా అభంగాలనే శ్రీరామ శిలలు వారధి వలె మనను రక్షిస్తాయని కవి చమత్కరిస్తున్నాడు. తుకారాం మహరాజ్ కూడ తమ అభంగాల్లో

ఒక చోట ఇదే రకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. "ఓ ప్రజలారా! రండి రండి. పెద్దలూ పిల్లలూ అందరూ రండి. స్త్రీలు పురుషులు అందరూ రండి. మీరు ఇక నుండి వేరువేరు మార్గాలు వెతకనవుసరం లేదు. నేను మిమ్మల్ని అందరినీ ఆవలి తీరానికి చేరుస్తాను. ఇందుకోసం గాను భగవంతుని అనుజ్ఞ దొరికింది. భగవన్నామమనే కాగడా పట్టుకుని మీ కొరకై సిద్ధపడి ఎదురు చూస్తున్నాను."

మొదట్లో పెద్ద కులస్థులందరూ తుకారాం అభంగాలను నమ్మలేదు. ఆ కారణం చేత రకరకాల ఆరోపణలు చేసి అభంగరాశిని జల సమాధి చేద్దామని కుట్ర పన్నారు. ప్రస్తుత ఆరతిపాట వ్రాసిన కవి పుంగవుడు రామేశ్వర భట్ కూడ తుకారాంను మొదట నమ్మనివాడే. భగవంతుని కృప వల్ల అభంగ కవిత్వమంతా చెక్కు చెదరక ఇంద్రాణి నది నుండి బయట కొచ్చింది. దాంతో రామేశ్వరభట్‌కు కనువిప్పు కలిగింది. తుకారాం కాళ్ళ మీద పడి క్షమాపణ వేడుకున్నాడు. తరువాత ఇలా తీర్మానం చేసాడు. "తుకారాం శూద్రుడు కాదు. నిజమైన బ్రాహ్మణుడు. భగవంతుడే తుకారాంను మనకు ప్రసాదించాడు. అతడు పరబ్రహ్మ స్వరూపుడే అని చెప్పటానికి నేను ఏ మాత్రం సంకోచించను."

ఒక సాహితీ విమర్శకుడు కవిత్వపోకడలు గురించి మాట్లాడుతూ, ఏదైనా గద్య కవిత్వంలో మాటలకు పలు అర్థాలు వస్తే అది మంచి కవిత్వం అనిపించుకోదు. అదేవిధంగా పద్య కవిత్వంలో మాత్రం పదాలకు పలురకాల అర్థాలు రాకపోతే అది కూడ మంచి కవిత్వం అనిపించుకోదు. అయితే, 'ఆరతి తుకారామా చీ' అన్న ఆరతి పాటలో రామేశ్వరభట్ ప్రదర్శించిన పలు పదాల చతురత ఎన్నో రకాల అర్థాలతో, కథలతో ఆకట్టుకోవడం ఆయన కవితారీతికి హారతి పడుతున్నాదని చెప్పక తప్పదు అన్నాడు.

ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 4

## (శ్రీ కృష్ణ జోగేశ్వర్ భీష్మ)

1. జయజయ సాయినాథ ఆతా  పహుడావే మందిరీహో
ఆళవితో సప్రేమే తుజలా ఆరతిఘే ఉని కరీహో
రంజవిసీ తూ మధుర బోలునీ మాయ జశీనిజ ములాహో
భోగిసి వ్యాధీ తూచ హరునియా నిజసేవక దుఃఖాలాహో
ధావుని భక్తవ్యవస హరిసీ దర్శనదేసీ త్యాలాహో
ఝూలే అసతీల కష్ట అతిశయ తుమ చేయాదేహాలాహో
జయజయ సాయినాథ ఆతా పహుడావే మండరీహో
ఆళవితో సప్రేమే తుజలా ఆరతిఘే ఉని కరీహో ॥

2. క్షమాశయన సుందరహీ శోభా సుమన శేజ త్యావరీహో
ఝ్యావీ థోడీ భక్త జనాంచి పూజనాది చా కరీహో
ఓవాళూ పంచప్రాణ జ్యోతి సుమతి కరీహో
సేవాకింకర భక్త ప్రీతీ అత్తర పరిమళ వారీహో
జయజయ సాయినాథ ఆతా పహుడావే మందిరీహో
ఆళవితో సప్రేమే తుజలా ఆరతి ఘేఉని కరీహో ॥

3. సోడుని జాయా దుఃఖవాటతే సాయి త్వచ్చరణాసీహో
ఆజ్ఞేస్తవ తవ ఆశిరప్రసాద ఘేఉని నిజసదనాసీ హో
జాతో ఆతా యే ఊ పునరపి త్వచ్చరణా చే పాశీ హో
ఉఠవూ తుజలా సాయిమా ఉలీ నిజహిత సాధాయాసీహో
జయజయ సాయినాథ ఆతా పహుడావే మందిరీహో
ఆళవితో నప్రేమే తుజలా ఆరతి ఘేఉని కరీహో ॥

| | | |
|---|---|---|
| 1. జయజయ సాయినాథా | - | శ్రీసాయినాథ ప్రభువులకు జయము జయము |
| ఆతా | - | మీరు ఇప్పుడే |

| | | |
|---|---|---|
| మందిరీహో | - | తమ మందిరంలో |
| పహుడావే | - | శయనింపుడు |
| కరీహో | - | ఓ సాయిప్రభో ! మా చేతులతో |
| ఆరతిఘేఉని | - | ఆరతి పళ్ళెము పట్టుకుని |
| తుజలా | - | మిమ్ములను |
| సప్రేమే | - | ప్రేమతో |
| ఆళవితో | - | బ్రతిమలాడుతున్నాము |
| మాయ | | |
| జశీనిజములాహో | - | ఓ సాయిప్రభూ! ఒక తల్లి తన స్వంత బిడ్డలతో ఎట్లు |
| బోలునీ | - | మాట్లాడునో |
| తూ | - | మీరు గూడ అట్లే |
| మధుర | - | మధురమైన వాక్కులతో |
| రంజవిసీ | - | మమ్మందరినీ దయతో లాలింపుడు |

శ్రీసాయినాథ ప్రభువులకు జయము జయము. ఓ సాయిప్రభో! మా చేతులతో ఆరతి పళ్ళెము పట్టుకుని మిమ్ము ప్రేమతో బ్రతిమలాడు కుంటున్నాము. ఒక తల్లి తన స్వంత బిడ్డలను ఎట్లు ప్రేమగా లాలించి మాట్లాడునో మీరు గూడ అట్లే మధురమైన వాక్కులతో మమ్మందరినీ దయతోలాలింపుడు. మీరు ఇప్పుడే తమ మందిరంలో శయనింపుడు.

| | | |
|---|---|---|
| భోగిసీ వ్యాధీ | - | బాధలవల్ల రుగ్మతల వల్ల |
| నిజసేవక | - | మీ పాదదాసులకు |
| దుఃఖాలా | - | కల్గిన దుఃఖములను |
| తూచహో | - | ఓ సాయిప్రభో! మీరొక్కరు మాత్రమే |
| హరునియా | - | పోగొట్టగలరు |
| ధావుని హో | - | ఓ సాయినాథా! మీరు పరుగున వచ్చి |
| దర్శశన దేసీత్యాలా | - | మీ దివ్యదర్శనము భక్తులకు కలుగుచేసి |

| | | |
|---|---|---|
| భక్తవ్యసన | - | వారి ఆపదలను |
| హరిసీ | - | తొలగించుదురు |

ఓ సాయిప్రభో ! మీ పాదదాసులందరికీ వారివారి ప్రారబ్ధముల వల్ల కల్గిన బాధలను రుగ్మతలను మీరే సహించి పోగొట్టుతున్నారు కదా! ఎప్పుడు పిలిస్తే అప్పుడు మీరు పరుగు పరుగున వచ్చి మీ దివ్య దర్శనము వారికి కలుగజేసి వారి ఆపదలను తప్పిస్తున్నారు కదా!

| | | |
|---|---|---|
| హో | - | ఓ సాయిప్రభో మీ భక్త రక్షణా కర్తవ్యం వల్ల |
| తుమచేయా దేహాలా | - | మీ భౌతిక దేహానికి |
| అతిశయ కష్ట | - | చాలా శ్రమ |
| ఝాలే అసతీల | - | కలిగి ఉండవచ్చు |

ఓ సాయిప్రభో మీ భక్త రక్షణా కర్తవ్యము ఎన్నటికీ మరువలేము. మీ కర్తవ్యదీక్ష వల్ల మీ భౌతిక దేహము ఎంతో కష్టమును ఓర్చుకొనుచున్నది. అందులకే శ్రీసాయినాథ ప్రభువులకు జయము కలుగుగాక అని ప్రార్థిస్తున్నాము. మీరు ఇప్పుడే మందిరములో శయనింపుడు.

| | | |
|---|---|---|
| 2. హో | - | ఓ సాయిప్రభో |
| క్షమా | - | తమ యొక్క క్షమాగుణమునే |
| సుందరశయన | - | అందమైన శయ్యగా చేసుకొని ఉన్నారు కదా! |
| హీ శోభా | - | ఇది ఒక మనోహరమైన, అద్భుతమైన దృశ్య భావన |
| సుమన శేజ | - | పూలతో అలంకరించడిన ఆ శయ్య |
| త్యావరీ | - | అతి సుందరమై, సద్గురు సంపద కల్గిన తమ మనస్సుగా ప్రతిబింబిస్తున్నది |
| భక్త జనాంచీ | - | మీ భక్తుల యొక్క |
| థోడీ పూజనాది | - | కొద్దిపాటి పూజాధికములను |
| చాకరీహో | - | ఓ సాయిప్రభో! ఇతరములైన వారి సేవలను |
| ఘ్యావీ | - | దయతో అనుమతించుడు |

ఓ సాయిప్రభో! అద్భుతమైన తమ క్షమాగుణమే అందమైన ఒక శయ్యగా చేసుకుని ఉన్నారు కదా! ఇది మనోహరమైన అద్భుతమైన దృశ్య భావనగా కనపడుచున్నది. అందమైన పూలతో అలంకరించబడిన ఆ శయ్య, అతి సుందరమై సద్గుణ సంపద కల్గిన తమ మనస్సుగా ప్రతిబింభిస్తున్నది. దయవుంచి మీ భక్తులు సమర్పించు కొద్దిపాటి పూజాధికములను, ఇతర సేవలను అనుమతించుడు.

| | | |
|---|---|---|
| హో | - | ఓ సాయిప్రభో |
| పంచప్రాణ | - | పంచప్రాణములే పంచ వత్తులుగా చేసి |
| జ్యోతి | - | ఆరతి దీపంగా వెలిగించి |
| సుమతి | - | సద్గుణ సంపద అనబడే మనస్సుతో |
| కరీ | - | ఆరతి పళ్ళెము చేతపట్టుకుని |
| ఓవాళూ | - | ఆరతి త్రిప్పుతూ సమర్పిస్తున్నాము. |
| అత్తర పరిమళ | - | గులాబిపూలతో నిండిన పరిమళ ద్రవ్యం |
| వారీ | - | శ్రేష్ఠమైన సువాసనలు వెదజల్లుతుండగా |
| కింకర భక్త | - | మీ సేవక బృందము |
| ప్రీతీ | - | ప్రేమతో |
| సేవా | - | సేవలు చేస్తున్నారు. |

శ్రీ సాయినాథ ప్రభువులకు జయము జయము. ఓసాయి ప్రభూ! మా పంచప్రాణములను అనగా ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానమనే పంచప్రాణములను పంచ వత్తులుగా చేసి ఆరతి దీపము వెలిగించితిమి. సద్గుణ సంపద అనబడే మనస్సును స్వాధీనమునందుంచుకొని ఆరతి పళ్ళెము త్రిప్పుతూ ఈ ఆరతి సమర్పణ జరుగుతున్నది. గులాబి పూలతో నిండిన పరిమళ ద్రవ్యం శ్రేష్ఠమైన సువాసనలు వెదజల్లుతుండగా మీ సేవక బృందము ప్రేమతో సేవలు చేస్తున్నారు.

| | | | |
|---|---|---|---|
| 3. | సాయీ | - | ఓ సాయిబాబా ! |
| | త్వచ్చరణాసీ | - | మీ పాదారవిందములను |

| | | |
|---|---|---|
| సోడుని జాయా | - | వదలి వెళ్ళుటకు |
| వాటతే | - | మా మనస్సు |
| దుఃఖ | - | అంగీకరించుటలేదు |
| హో | - | ఓ సాయినాథా ! |
| ఆజ్ఞేస్తవ | - | మీరు ఆజ్ఞాపించినట్లుగా |
| ఘే ఉని | - | తీసుకుని |
| నిజసదనాసీ | - | మా నివాసములకు తిరిగి వెళుతున్నాము |
| జాతో ఆతా | - | ఇప్పుడు మేము వెళ్తున్నప్పటికీ |
| యే ఊ పునరపి | - | తిరిగి వచ్చి మరొకసారి |
| త్వచ్చరణా చేపాశీ | - | మీ పాద పద్మముల వద్ద చేరుతాము |
| ఉఠవూ తుజలా | - | మిమ్ములను మేలుకొలుపుతాము |
| సాయిమా ఉలీ | - | శ్రీసాయితల్లి |
| నిజహిత | - | మాకు మేలు కలుగుటకొరకై |
| సాధాయాసీ | - | ఈ ప్రయత్నము జరుగుతున్నదని గ్రహించండి |

ఓ సాయిబాబా! శ్రీ సాయితల్లి! మీ పాదములను విడిచిపెట్టి వెళ్ళుటకు మా మనస్సు ఇష్టపడుటలేదు. మీరు ఆజ్ఞాపించినట్లుగానే, మీ ఆశీస్సులను అందుకుని, మీ ఊదీ ప్రసాదమును కూడా స్వీకరించి, మా ఇండ్లకు తిరిగి వెళుతున్నాము. కాని ఓ ప్రభూ! ఒక్కమాట ఆలకించండి. ఇప్పుడు మేము వెళ్తున్నప్పటికీ, మరొకసారి తిరిగి వస్తాము. ఎందుకంటే, ఉదయాన్నే మిమ్ములను మేలుకొలపటానికి. శ్రీ సాయితల్లి! ఈ ప్రయత్నమంతా మాకు మంచి జరుగుట కొరకేనని గ్రహించగలరు. శ్రీసాయినాథ ప్రభువులకు జయము జయము. మీరు ఇప్పుడు తమ మందిరములో శయనింపుడు. ఆరతి పళ్ళెము పట్టుకుని త్రిప్పుతూ మిమ్ము ప్రేమతో బ్రతిమ లాడుతున్నాము.

ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 5

## (శ్రీ కృష్ణ జోగేశ్వర్ భీష్మ)

1. ఆతా స్వామీ సుఖే నిద్రా కరా అవధూతా బాబా కరా సాయినాథా
చిన్మయ హే సుఖధామ జాఉని పహుడా ఏకాంతా ॥
వైరాగ్యాచా కుంచాఘేఉని చౌక ఝాడిలా బాబా
చౌకా ఝాడిలా తయావరీ సుప్రేమాచా శిడికావా దిధలా ॥

2. పాయఘుడ్యా ఘాతల్యా సుందర నవవిదా భక్తీ బాబా
నవవిధా భక్తీ జ్ఞానాంచ్యా సమయా లావవుని ఉజళల్యా జ్యోతీ ॥

3. భావార్థాచా మంచక హృదయాకాశీ టాంగిలా
హృదయాకాశీ టాంగిలా మనాచీ సుమనే కరునీ కేలే శేజేలా ॥

4. ద్వైతాచే కపాటలావుని ఏకత్రకేలే బాబా ఏకత్రకేలే
దుర్బుద్దీచ్యా గాంఠిసోడుని పడదే సోడిలా

5. ఆశా తృష్ణా కల్పనేచా సోడునీ గలబలా
బాబా సోడుని గలబలా
దయాక్షమా శాంతి దాసి ఉభ్యా సేవేలా ॥

6. అలక్ష్య ఉన్మనీ ఘేవుని నాజుక దుశ్శాలా
బాబానాజుక దుశ్శాలా
నిరంజన సద్గురు స్వామీ నిజవీలే శేజేలా ॥

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. సాయినాథా | - | ప్రియమైన శ్రీసాయినాథా ! |
| బాబా | - | సాయిబాబా ! |
| అవధూతా | - | ఆత్మజ్ఞాన నిష్ఠయందు స్థితులైనయున్న పరమేశ్వరా! |

| | | |
|---|---|---|
| స్వామీ | - | ఓ సద్గురువర్యా ! |
| ఆతా | - | ఇప్పుడిక |
| సుఖేనిద్రాకరా | - | స్వాత్మానందము అనుభవించుచూ నిదురపొండి |
| చిన్మయ హే | | |
| సుఖధామ | - | శుద్ధ చైతన్య స్వరూపమైన ఆనందధామమునకు |
| జాఉని | - | చేరి |
| ఏకాంతా | - | మీరొక్కరే |
| పహుడా | - | విశ్రాంతి చెందండి |
| వైరాగ్యాచా | - | వైరాగ్యమనే |
| కుంచా ఘేఉని | - | నెమలి ఈకల చీపురు పట్టుకుని |
| బాబా | - | మా ప్రియమైన సాయిబాబా! |
| చౌక | - | మీ పడకగదిని |
| ఝాడిలా | - | శుభ్రముగా తుడిచితిమి |
| తయావరీ | - | ఆ తరువాత |
| సుప్రేమాచా | - | అనంతమైన ప్రేమను |
| శిడికావా దిధలా | - | చిలకరించి పెట్టాము |

ప్రియమైన శ్రీ సాయినాథా! తమరు అవధూతలు. అనగా ఆత్మజ్ఞాన నిష్ఠయందు స్థితులైన పరమయోగీశ్వరులు ఇప్పుడు స్వాత్మానందము అనుభవించుచూ నిదురపొండి. అదే తమరి తురీయావస్థ అయివున్నది. అనగా జాగ్రత్తు స్వప్న సుషుప్తి అనే మూడు దశల కావల నిలకడగావున్నట్టి పరమాత్మస్థితి. అట్టి శుద్ధ చైతన్య స్వరూపమైన ఆనంద ధామమునకు చేరి ఒంటరిగా విశ్రాంతి చెందండి. తమ సేవ కొరకు మేము వైరాగ్యమనే నెమలి ఈకల చీపురు పట్టుకుని మీ పడక గదిని శుభ్రముగా తుడిచితిమి. ఇంకనూ మాకు మీపై గల అనంతప్రేమను చిలకరించి పెట్టితిమి.

| | | |
|---|---|---|
| 2. బాబా | - | శ్రీసాయిబాబా |
| సుందర నవవిధాభక్తీ | - | అందమైన తొమ్మిది విధాలైన భక్తిమార్గాలనే |
| పాయఘడ్యా | - | ఎర్రని తివాచీలను |

| | | |
|---|---|---|
| ఘాతల్యా | - | పరచివుంచాము |
| జ్యానాంచ్యా | - | ఆధ్యాత్మిక జ్ఞానమనే |
| సమయాలావుని | - | దీపాలను వెలిగించాము |
| జ్యోతీ | - | ఆ దీపాలన్నీ |
| ఉజళల్యా | - | దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి |
| 3. బావార్థాచా | - | విశ్వాసమనే |
| మంచక | - | పడకబల్లను |
| హృదయాకాశీ | - | మా హృదయమనే కొక్కెమునకు |
| టాంగిలా | - | తగిలించి వ్రేలాడగట్టాము |
| మనాచీ సుమనే | - | గుణవంతమైన ఆలోచనలు అనే పుష్పాలను మనస్సు అనే నేలలో పెంచి |
| కరునీ కేలే | - | అందమైన ఆ పుష్పాలతో |
| శేజేలా | - | తమ శయనపానుపును తయారు చేసితిమి |

శ్రీ సాయిబాబా! తమ కోసం అందమైన తొమ్మిది భక్తి మార్గాలనే ఎర్రని తివాచీలను పరచి వుంచాము. ఇంకనూ ఆధ్యాత్మిక జ్ఞానమనే దీపాలను కూడా వెలిగించాము. ఆ దీపాలన్నీ దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. విశ్వాసమనే పడక బల్లను మా హృదయమనే కొక్కెమునకు తగిలించి వ్రేలాడగట్టాము. గుణవంతమైన ఆలోచనలు అనే పుష్పములను మా మనస్సు అనే నేలలో పెంచి, ఆ పుష్పాలతో తమ శయన పానుపును తయారు చేసాము. (బాబా మశీదులో గడిపే రోజుల్లో చెక్క బల్లను మశీదు దూలానికి వ్రేలాడదీసి పడుకుంటూ వుండేవారు. ఆ ఘటనను రచయిత గుర్తు తెచ్చుకుని ఈ పాటను వ్రాసినట్టు కనపడుతోంది)

| | | |
|---|---|---|
| 4. ద్వైతాచే | - | ద్వైత భావము అనబడే |
| కపాట | - | కవాటమును |
| లావుని | - | మూసివుంచితిమి |

| | | |
|---|---|---|
| ఏకత్ర కేలే అనబడే | - | దానివల్ల అంతా ఒక్కటే వేరు వేరు కాదు అద్వైత భావము స్థిరపడినది |
| దుర్బుద్ధీచ్యా | - | దుర్బుద్ధి కలిగిన ఆలోచనలు అనే |
| గాంఠి | - | ముడులను |
| సోడుని | - | విప్పివేసి |
| పడదే సోడిలా | - | పరదాలను (దోమ తెరలను) దించితిమి |
| 5. ఆశా తృష్ణా | - | సంకల్పాలు, కోరికలు తీర్చుకునేపాట్లు |
| కల్పనేచా | - | ఇంకా ఇతర మనోకల్పనలు |
| సోడుని | - | వదిలిపోయినవి |
| గలబలా | - | వాటి గడబిడలు ఇకలేవు |
| దయాక్షమ శాంతి | - | దయాగుణము క్షమాగుణము శాంతము మొదలగు |
| దాసి | - | మీ యొక్క సేవక గణం |
| సేవేలా | - | మీ సేవల నిమిత్తం మీ ఆజ్ఞను పాటించడానికి |
| ఉభ్యా | - | నిలబడి వున్నవి. |

శ్రీ సాయినాథా! తమ దయవల్ల మాకు సద్గుణములు అబ్బినవి. ఆకారణంచేత ద్వైత భావము అనబడే కవాటమును మూయ కల్గితిమి. సత్యము తెలిసినది. అంతా ఒక్కటే తప్ప వేరు వేరు కాదు అనబడే అద్వైత భావము స్థిరపడినది. దుర్బుద్ధితోకూడిన ఆలోచనలు అనే ముడులను విప్పివేసితిమి. తమరు శయనించుటకు పరదాలను దించగల్గితిమి. అనేక సంకల్పాలు, కోరికలు సాధనకై పడే పాట్లు, ఇతర మనోకల్పము వదిలిపోయినది. ఇక వాటి గడ బిడలు మమ్ము బాధించవు. మీ సేవక గణమైన దయ క్షమశాంతి మొదలగునవి మీ ఆజ్ఞలను పాటించడానికి సిద్ధముగా నిలబడి వున్నవి.

| | | |
|---|---|---|
| 6. సద్గురు స్వామీ | - | మాకు రక్షకులుగానున్న సద్గురువర్యా! |
| బాబా | - | సాయిబాబా! |

| | | |
|---|---|---|
| అలక్ష్య | - | మీది కంటికి అగుపించని నిరాకార స్థితి |
| ఉన్మని | - | మనస్సు అనే ఉపాదిని గూడ అతిక్రమించిన స్థితి |
| నాజుక దుశ్శాలా | - | నాజూకైన జంట శాలువల కలయిక అనబడే అత్యున్నత స్థితిని |
| ఘే ఉని | - | అవలీలగా పోషిస్తున్న మీరు |
| నిరంజన | - | నిరంజనులు అనగా అజ్ఞానమనే చీకటి అంటనివారు |
| శేజేలా | - | నిద్రకు |
| నిజవీలే | - | ఉపక్రమించండి |

ఓ సద్గురువర్యా! సాయిబాబా! మీది కంటికి అగుపించని నిరాకార స్థితి. అది మనస్సనే ఉపాదిని గూడ అతిక్రమించినది. అట్టి స్థితిని నాజూకైన దుశ్శాలువతో పోల్చవచ్చు. దుశ్శాలువ అనగా రెండు శాలువుల కలయిక. ఇది జాగ్రత్తు, స్వప్న, సుషుప్తి, తురీయా వస్థలను దాటి చివరగా మనస్సును గూడ నిర్వికల్ప స్థితియందు ఉంచగల్గిన అత్యున్నత స్థితి. అట్టి స్థితిని అవలీలగా పోషిస్తున్న వారు మన సద్గురు సాయినాథులు. వారు నిరంజనులు అనగా అజ్ఞానమనే చీకటిని అంటనివారు. ఓ సాయిశా! అట్టి మిమ్ము్మలను మా అల్పజ్ఞానముతో పవళింపుమని కోరుట లేక పవళింపు చేయుచున్నామని ఆనందపడుట ఏ పాటిది. కాని స్వామీ! మా అల్ప సంతోషము కొరకు నిద్రకు ఉపక్రమించండని కోరుతున్నాము.

ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 6

## (సంత్ తుకారాం)

## (ప్రసాదము తీసుకొనుటకు)

1. పాహె ప్రసాదాచీ వాట ద్యావే ధువోనియా తాటా
శేషఘేవునీ జాఈన తుమచే ఝాలియా భోజన
2. ఝాలో ఏకసవా తుహ్మా ఆళవోనీ దేవా
శేష ఘేవునీ జాఈన తుమచే ఝాలియా భోజన
3. తుకా హ్మణే చిత్త కరుని రాహిలో నివంత
శేష ఘేవునీ జాఈన తుమచే ఝాలియా భోజన

⋆ ⋆ ⋆

| | | |
|---|---|---|
| 1. ద్యావే | - | దయచేసి ఇవ్వండి |
| ధువోనియా | - | శుభ్రపరచిన |
| తాటా | - | పళ్ళెమును |
| ప్రసాదాచీ | - | ప్రసాదము కొరకై |
| పాహె | - | ఎదురుచూస్తూ |
| వాట | - | వేచివున్నాను |
| తుమచే | - | మీరు |
| ఝాలియా | - | భుజించగా |
| భోజనశేష | - | మిగిలిన భోజన పదార్థమును |
| ఘేవునీ జాఈన | - | పట్టుకుని వెళ్ళెదను |
| దేవా | - | ఓ ప్రభూ |
| ఆళవోనీ తుమ్హా | - | మీకు విన్నవించుకుంటున్నాను |
| ఝాలో ఏకసవా | - | మీ యందు నేను ఏకమైవున్నాను |

| | | |
|---|---|---|
| తుకాహ్మణే | - | తుకారాం ఈవిధంగా చెపుతున్నాడు |
| చిత్త | - | నా మనస్సు మరియు బుద్ధి |
| నివంత | - | ప్రశాంతతను |
| కరునిరాహిలో | - | పొందివున్నవి |

ఓ ప్రభో! అని సంభోదిస్తూ సంత్ తుకారాం మహరాజ్ ఈవిధంగా చెపుతు న్నాడు. దేవా! నా మాట వినండి. మీ యందు నేను ఏకమై వున్నాను. అందువల్లనే నా మనస్సు బుద్ధి ఎంతో ప్రశాంతతను పొంది వున్నాయి. భక్తులారా! భగవంతుని ప్రసాదము కొరకై నేను ఎదురు చూస్తూ వేచి వున్నాను. దయచేసి శుభ్రపరచిన పళ్ళెము నాకు ఇవ్వండి. మీరందరూ భుచించగా మిగిలిన భోజన పదార్ధమును పట్టుకొని వెళ్ళెదను.



ఓం శ్రీ సాయినాథాయా నమః

# శేజా ఆరతి - 7

## (సంత్ తుకారాం)

## (ప్రసాదము తీసుకొన్న తరువాత)

1. పావలా ప్రసాద ఆతా విఠోనిజావే బాబా ఆతా నిజావే
ఆపలాతో శ్రమకళో యేతసే భావే ॥

2. ఆతాస్వామీ సుఖే నిద్రా కరా గోపాళా
బాబా సాయీ దయాళా
పురలే మనోరథ జాతో ఆపుల్యా స్థళా ॥

3. తుహ్మాసీ జాగవూ ఆహ్మీ ఆపుల్యా చాడా
శుభాశుభ కర్మే దోష హరావయా పీడా

4. తుకాహ్మణే దిథలే ఉచ్చిష్టా చేభోజన్ ఉచ్చిష్టాచే భోజన్
నాహీ నివడిలే ఆహ్మా ఆపుల్యా భిన్న

⭑ ⭑ ⭑

| | | |
|---|---|---|
| 1. ఆతా | - | ఇప్పుడిక |
| ప్రసాద | - | తమ ప్రసాదము |
| పావలా | - | అందినది |
| విఠో | - | భగవాన్ పాండురంగ విఠలా! |
| నిజావే | - | దయచేసి పవళించుడు |
| బాబా | - | ఓ సాయిదేవా |
| ఆతా నిజావే | - | మీరు కూడా దయచేసి పవళించుడు |
| ఆపలా తో శ్రమ | - | మా కొరకై మీరు పడిన శ్రమ విషయంలో |
| భావే | - | మా అంతరంగ భావనచే |
| కళోయేతసే | - | ఒక నిశ్చయానికి వచ్చితిమి |

భగవాన్ పాండురంగ విఠలా! ఓ సాయిదేవా! తమ ప్రసాదము మాకు అందినది. దయచేసి ఇప్పుడిక పవళింపుడు. మా కొరకై మీరు పడిన శ్రమను, మా అంతరంగ భావనచే అర్ధము చేసుకొనగలిగితిమి.

| | | |
|---|---|---|
| 2. గోపాళా | - | గోపాలుడైన ఓ శ్రీకృష్ణా (పాండురంగ విఠలా) |
| స్వామీ | - | మమ్ము కాపాడువాడా! ప్రభో! |
| ఆతా | - | ఇప్పుడు |
| సుఖేనిద్రాకరా | - | సుఖముగా పవళించుడు |
| మనోరధ | - | మా ఆశయములన్నీ |
| పురలే | - | నెరవేరినవి |
| ఆపుల్యా స్థళా | - | మా ఇండ్లకు |
| జాతో | - | మేము వెళ్ళెదము |

గోపాలుడైన ఓ శ్రీకృష్ణా! ఓ పాండురంగ విఠలా! ప్రభో! ఇప్పుడిక సుఖముగా పవళించుడు. మా ఆశయములన్నీ నెరవేరినవి. మీ అనుమతితో మేము మా ఇండ్లకు వెళ్ళి వచ్చెదము.

| | | |
|---|---|---|
| 3. తుమ్హాసీ | - | మిమ్ములను |
| జాగవూ | - | మరునాడు మేలుకొలిపెదము |
| ఆపుల్యాచాడా | - | మా మేలు కొరకై |
| ఆహ్మె | - | మేము ఈ పని చేయుచున్నాము |
| శుభాశుభ | - | మాచే గావించబడిన శుభ అశుభ |
| కర్మే | - | కర్మలవల్ల కలిగిన |
| దోష | - | దోషములను |
| పీడా | - | బాధలను |
| హరావయా | - | పోగొట్టుకొనుటకు, తగ్గించుకొనుటకు |
| ఆహ్మె | - | మేము ఈ పని చేయుచున్నాము. |

ఓ ప్రభో! మరునాడు మేము తిరిగివచ్చి మిమ్ములను యథాప్రకారంగా మేలుకొలి పెదము. ఈ పని మా మేలు కొరకే చేయుచున్నామని గ్రహించవలెను. మాచే చేయబడ్డ శుభ అశుభ కర్మలవల్ల కల్గిన దోషములను, బాధలను పోగొట్టుకొనుటకే మిమ్ములను ఆరతిపాటలతో ఆరాధించుట అని గ్రహించవలెను.

| | | |
|---|---|---|
| 4. తుకాహ్మణే | - | తుకారాం ఈ విధంగా చెపుతున్నారు |
| ఉచ్ఛిష్ఠాచే | - | మీరు భుజించగా మిగిలిన |
| భోజన్ | - | భోజన పదార్థములను |
| దిధలే | - | మాకు ప్రసాదించిరి |
| ఆహ్మా | - | మమ్ములను |
| ఆపుల్యాభిన్న | - | వేరుగా చూడక |
| నివఢిలే నాహీ | - | భేదమును ప్రదర్శించకవున్నారు. |

సంత్ తుకారాం మహరాజ్ ఈ విధంగా చెపుతున్నారు. ఓ ప్రభూ! మీరు మమ్ములను వేరుగా చూడక కరుణించుట మా భాగ్యముగానున్నది. దీనికి నిదర్శనము తమరు భుజించగా మిగిలిన శేషపదార్థములను ప్రసాదముగా మాకిచ్చుటయే. మీరు మమ్ములను వేరు చేయక మీలో కలుపుకుని చూచుట నిజముగా సర్వాత్మ భావమును ప్రదర్శించుటయే అని చెప్పవచ్చు.

**ఓం రాజాదిరాజ యోగిరాజ పరబ్రహ్మ**

**శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై**

**శేజా ఆరతి సమాప్తం**